జ్యోతి నవలల పోటీ

ప్రథమ బహుమతి : రు 2000/-
ద్వితీయ బహుమతి : రు 1000/-
తృతీయ బహుమతి : రు 750/-

పోటీలో పాల్గొను రచయితలు పాటించవలసిన నిబంధనలు :

1. నవలలు 'జ్యోతి నవలానుబంధం' సైజులో 128 పేజీలకు మించకుండా 96 పేజీలకు తగ్గకుండా (ముద్రణలో) ఉండాలి.
2. స్వీయరచనలే పంపాలి. అనువాదాలు, అనుకరణలూ అంగీకరింపబడవు. రచన స్వీయమేననీ, అనువాదంగానీ,అనుసరణగానీకాదని హామీపత్రం జతపరచాలి.
3. కాగితానికి ఒకేవైపు రాయాలి.
4. రచనలు తిప్పిపంపగోరువారు తగినన్ని పోస్టల్ స్టాంపులు అతికించిన స్వంత చిరునామా గల కవరు జతపరచాలి.
5. **నవలలు మాకు చేరవలసిన ఆఖరుతేది 20, సెప్టెంబర్, 1978**
6. కలం పేర్లతో రచనలు పంపినా రచయితలు తమ పేర్లను విధిగా తెలియ జేయాలి.
7. రచనలు పంపే కవర్లపై 'నవలల పోటీకి' అని తప్పక రాయాలి.

గమనించండి!

* బహుమతులు పొందని నవలలలో ప్రచురణార్హమైన వాటిని జ్యోతిలో సాధారణ ప్రచురణకు ఎన్నుకొనే హక్కు మాకుంటుంది.
* ఎన్నుకోబడిన నవలలు 'జ్యోతి నవలానుబంధం'లో ప్రచురింపబడుతాయి.
* ప్రచురణ సౌలభ్యం కోసం అవసరమైన మేరకు నవలను సంక్షిప్తీకరించే హక్కు మాకుంటుంది.
* పోటీకి సంబంధించి 'జ్యోతి' సంపాదకులదే తుది నిర్ణయంగా ఉంటుంది.

ఈ పోటీలో రచయితలు వైవిధ్యమున్న రచనలతో పాల్గొని సహకరిస్తారని ఆశిస్తున్నాము

—ఎడిటర్

సంస్థాపకులు
కీ॥ శే॥ వి.వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

సచిత్రమాసపత్రిక

సెప్టెంబరు 1978

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 16 | సంచిక 8

విషయసూచిక


ఇంకా కవితలూ, మినీకథలూ, కార్టూన్లూ, జోకులూ మరియూ జయదేవ్ '(వి)చిత్ర విజ్ఞానం'

నవలానుబంధం :

జీవితానికో మలుపు—కె [illegible]

ముఖచిత్రం: 'పదహారేళ్ళ వయసు[illegible]' శ్రీదేవి

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, P. B. నెం. 2[illegible] మద్రాసు-600 02[illegible].
ఫోన్: 423123. సంవత్సర చందా (ప్రత్యేక సం[illegible] [illegible]/-)


శోభన్‌బాబు
నట జీవితంలో
మరో మలుపు!
సమతా ఆర్ట్స్
మల్లెపూవు
నిర్మాతలు:
వి.ఆర్. యాచేంద్ర. కె. చటర్జి
దర్శకత్వం:
వి. మధుసూదనరావు
శ్రీ ఫిలింస్
VEEKAY

తొలిమాట

కథలపోటీలో ప్రత్యేక ప్రశంస పొందినకథలు రెండు ఈ సంచికలో ప్రచురించబడ్డాయి. లేటెంటు హీటూ—ధర్మామీటరూ (రచన: వసుంధర), సీతాలు గుడిసె మారింది (రచన: కె. కె. మీనన్) ఆ రెండు కథలూ. రచయితల వివరాలు కథల పేజీలలోనే ఇచ్చాము.

* * *

పాఠకులకు అమితాసక్తిని కలిగించే వార్త ఈ సంచికలో వుంది. త్వరలో ప్రారంభించబోయే కొత్త సీరియల్ ప్రకటన అది.

* * *


జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక ఎప్పటిలానే ఆకర్షణీయంగా తయారవుతోంది. దీపావళి సంచిక గురించికూడా ప్రత్యేక ప్రకటన లోపల పేజీలలో వుంది.


* * *

జ్యోతి నవలల పోటీ గురించి గత సంచికలోనే ప్రకటించాము. ఈ సంచికలో కూడా నవలలపోటీ వివరాలు చూడగలరు. నవలలు మాకు చేరవలసిన చివరితేదీ సెప్టెంబర్ 20 గా ప్రకటించి వున్నాము. ఈ గడువు తేదీ విషయంగా గత సంవత్సరం కొందరు అనుమానాలు వ్యక్త పరచారు. 'ఆ గడువు తేదీకి నవలలు మీకు చేరాలా, లేక ఆ తేదీలోపు మేం పోస్ట్ చేస్తే చాలా' అని. నిబంధనల ప్రకారం సెప్టెంబరు 20 తేదీ లోపు మాకు నవలలు చేరాలి. కాని సహజంగా గడువు తేదీ తర్వాత నాలుగైదు రోజుల లోపు వచ్చే నవలలుకూడా పోటీకి తీసుకో బడతాయి (పోస్టల్ డిలేలు దృష్టిలో నుంచుకొని).

* * *

అందంగా ఉండటమేగాక సువాసనతో మత్తెక్కించేవి పూలు. ఆ పూల వెనుకగల అనూహ్యమైన ఓ కథ 41 వ పేజీలో వుంది చూడండి.


గొల్లు వెంకన్న అండ్ కో.
హోల్ సేల్
ఫోన్: 580
రిటైల్ షాప్
ఫోన్: 274
నివాసము
ఫోన్: 577
మఫత్‌లాల్ గ్రూప్ ఆఫ్ మిల్స్
కట్ పీసెస్ క్లాత్ మర్చంట్స్
భీమవరం - 2
మేము నిర్ణయించిన ధరలకే అమ్మే మా స్టాకిస్టులు
1. శ్రీనివాసా కట్‌పీసెస్ ఎంపోరియం, తణుకు, ఫోన్: 4
2. మఫత్‌లాల్ కట్ పీసెస్, ఏలూరు, ఫోన్: 663
3. మఫత్‌లాల్ క్లాత్ సెంటర్,
మెయిన్ బజార్, నిడదవోలు, ఫోన్ 41
4. గోపాల్ కట్‌పీసెస్
బస్ స్టాండ్ రోడ్, పాలకొల్లు.
5. లక్ష్మీ క్లాత్ షోరూమ్
మెయిన్ బజార్, గణపవరం.
మఫత్‌లాల్ గ్రూప్ ఆఫ్ మిల్స్ వారి
అన్నిరకముల కట్‌పీసెస్ వస్త్రములు,
వివాహాది శుభకార్యములకు
కావలసిన అన్నిరకముల పట్టు చీరలు,
చేనేత వస్త్రములు, వూలివ్వాలి,
వివి వివా, ఆర్గంజా, అమెరికన్ జార్జెట్,
స్విస్ వాయిల్స్, చినాన్ సిఫాన్ ఇతర
అన్నిరకముల ఫేన్సీ చీరలు,
డబుల్ నెట్టెడ్ పేంటుపీసులు,
నెట్టెడ్ 100% పోలియస్టర్ షర్టుపీసులు
సరికొత్త రకములలో
సరసమైన ధరలకు
టోకుగాను, చిల్లరగాను
సప్లయి చేయుట మా ధ్యేయం!


యమ్.బాలయ్య సమర్పించు అమృతా ఫిలింస్
తప్పక చూడండి!
ప్రేమ పగ
ఈస్ట్మన్ కలర్
దర్శకత్వం బి.వి.ప్రసాద్ నిర్మాతలు అలపర్తి సూర్యనారాయణ, మున్నవ వెంకట్రావు
శ్రీ ఫిలింస్
VEEKAY

ఉత్తరాలు

జూలై సంచికలో రామసంజీవిగారు పోష్టల్ మరియు టెలిఫోన్స్ శాఖలమీద కొన్ని విమర్శలు చేసారు. సరిపడు చిల్లర తెచ్చుకొనుట ప్రజల బాధ్యతకాదా? చిల్లర లేకపోవటానికి ఆ క్లర్కు ఎంతవరకు బాధ్యుడు!

పోతే టెలిఫోన్ డిపార్టుమెంటుమీద ఆయన చేసిన విమర్శ హాస్యాస్పదమైనది. స్పెషల్ సర్వీసు (180. 181, 183, 197, 199 etc) ఎంగేజ్ అయినా ఫోను వాడకందారునకు ఎంగేజ్ టోన్ రాదు. రింగ్ అయినట్లువస్తుంది. సెంట్రల్ ఫోన్స్ అంటే ఎక్కువ సంఖ్యలో ఫోన్స్ వుంటాయి. డయల్ చేసిన సమయాన్నిబట్టి 'క్యూ' సిస్టమ్ ప్రారంభమవుతుంది. ఒక్కొక్కరికే ఆపరేటరు ఆన్సరుచేయాలి. కొన్ని వేల ఫోన్స్‌ని కొద్దిమంది మాత్రమే ఆన్సరు చేస్తారు.

డైరెక్టరీ ఎంక్వైరీలో సరియైన పేరు, అడ్రసు చెప్తే నెంబరు చెప్పడానికి వీలవుతుంది. వాడుకునేది ఒకరు మరి ఫోను మరొకరిపేరు మీద వుంటుంది. అప్పుడు వాడుకొనే వారి పేరు చెప్తే ఆ పేరుమీద ఫోను వుండదు. దీనికి కూడ డిపార్టుమెంటుని నిందిస్తే ప్రయోజన మేమిటి?

విమర్శలు వ్రాయవచ్చు. కాని వ్రాసేముందు వస్తు పరిజ్ఞానము, ఆత్మ విమర్శ అవసరము. అయితే డిపార్టుమెంట్‌లో లోపాలు ఉండవని కాదు. వానిని అర్థముచేసికొని లోపాలను చెప్ప వచ్చు.

ఆపరేటర్స్‌కి బాయ్‌ఫ్రెండ్స్, గర్ల్‌ఫ్రెండ్స్ వుండవచ్చు కాని డ్యూటీ టైమ్‌లో పక్కవారితో మాట్లాడటానికికూడ టైముండదు. పేరుశనక్కా యలు (డ్యూటీలో) తినే హీనస్థితిలో టెలిఫోన్ శాఖ లేదు. జ్యోతి వంటి ఆదర్శ పత్రికలో ఇటువంటి చౌకబారు విమర్శలకు తావు వుండ దని ఆశిస్తాను.

—ఒక ఆపరేటర్, గుంటూరు.

ఆగస్టు నెల జ్యోతి వచ్చిన వెనువెంటనే అచ్యుతవల్లిగారి సీరియల్ "పూలు-ముళ్ళు" చదువకుండ వుండలేకపోయాము. సెప్టెంబర్ సంచికకై ఆతురతగా ఎదురుచూసేలా చేసింది. పోల్కంపల్లి శాంతాదేవిగారి "పాకుడు బండ"లో రచయిత్రిగారు ప్రస్తుతము "త్రాగుడు" గూర్చి ఇతివృత్తము తీసుకొని చక్కగా వివ రించారు. ఇకపోతే సదానంద్ శారదగారి "పలుపు" కథానిక మాకెంతో నచ్చింది. మా అభిమాన రచయిత్రి యద్దనపూడి సులోచనా రాణిగారి అమూల్యమైన సీరియల్ కొరకు ఎదురు చూస్తుంటాము.

—అజీజ్‌బాబు, శంకర్, భువనగిరి.

మీ ఆగస్టు సంచికలో ప్రచురించిన 'పలుపు' కథ చాల బాగుంది. సున్నితమైన ఎలిమెంట్‌ను తీసుకుని కథ అల్లిన రచయిత అభినంద నీయుడు... కాకపోతే—'గేదె-దూడ' సిమిలీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం మూలంగా కథా పటుత్వం తగ్గిందనిపిస్తుంది. ముగింపుకూడా కాస్త పేలవంగా వుంది. ఏమైనా వెరైటి కథ రాసిన సదానంద్ శారద అభినందనీయుడు.

—పమ్మి వీరభద్రరావ్, హైదరాబాద్.

వాణిశ్రీ ముఖచిత్రంతో ముస్తాబై వచ్చిన ఆగస్టు నెల జ్యోతిలోని ధర్మధార నవల నా మనస్సు నాకట్టుకున్నది అడమనస్సు పుట్టలోని చెదలు అనే కథలు నాకు నచ్చినవి. ఇకపోతే జయదేవ్‌గారి (వి)చిత్రవిజ్ఞానం అద్భుతం కార్టూన్లుకడుపుబ్బ నవ్వించేస్తున్నాయి.

—నందిగామ మణిమోహన్ కృష్ణ,
హైదరాబాద్-1.

కొంత కాలంనుంచీ చూస్తున్నాను కదా, ఆరుద్రకి కవిగా రాణించాలనే తపనకన్న పండితుడిగా భాసించాలనే తాపత్రయం ఎక్కువయిపోతున్నట్టు కనబడుతోంది. లేకుంటే చిన్నయసూరిమీద తగని భరోసా పెట్టుకుని హల్లూ, పొల్లూ అంటూ గొల్లుమనడం దేనికి? లకారపు గుణం లాత్వం. మానవత్వం, దానవత్వం, ఆరుద్రత్వం అన్నట్టు. "ల్"లో మనకి కనిపించేది లాత్వం. ఇంతకూ నన్నయగారే అన్నారు "సిద్ధిర్లోకాల్" అని నా పాఠకలోకం నన్ను సమర్థిస్తున్నదనే నా విశ్వాసం.

ఇకపోతే తెలుగులో మొట్టమొదటి క్రాస్వర్డు పజిల్ "భారతి"లో "శిష్టాక్షర పదబంధం" అంటూ వెలువడింది. దానికి అర్థం, పర్థంగాని, రైమూ, రీజనూగాని లేకపోయినందువల్ల రెండు సంచికలతో ఆగిపోయింది.

ఆ తర్వాత నేను చక్రపాణిగారి మాసపత్రికలో ఈ పదబంధాన్ని ప్రహేళికపేర ప్రారంభించాను. నెలనెలా పదేసి సిరిసిరి మువ్వ శతక పద్యాలూ, ఒక పజిలూ ఇస్తూండేవాణ్ణి. అందుకు నాకు ఇరవ్వయ్యేసి రూపాయల పారితోషికం లభించేది. ఆ రోజుల్లో అక్కడా, ఇక్కడా ఇలాగే తండులాన్వేషణ చేసుకుంటూ బతికేవాణ్ణి. అప్పుడు, పెళ్ళాన్ని వదిలేసిన మా నారాయణబాబూ, అప్పటికింకా పెళ్ళి పెటాకులూ లేని ఆరుద్రా అప్పుడప్పుడు మా యింటికి వచ్చి ఇన్ని మెతుకులు తిని, పోతూ వుండేవాళ్ళు. ఒకటి రెండుసార్లు మా ఆవిడ నారాయణబాబుమీద విసుక్కుందికూడా. ఆ రోజుల్లోనే ఆరుద్ర చాలా మంచి కవితలు రాశాడు. ("త్వమేవాహం" లాంటివి)

కవిత్వంలోనూ పజిల్సులోనూ దొరికిపోకుండా దొంగిలించే గొప్పగుణం ఆరుద్రదగ్గర వుంది. ఒక పజిల్‌లో నేను "దుడు" అనే అర్థంలేని మాటకు "ఒకడు, ఇంకొకడు" అని క్లూ యిచ్చాను. దరిమిలాను దీన్ని "ఒకరు, ఇంకొకరు" అని ఆరుద్ర సొంతం చేసుకున్నాడు.

అనుప్రాసలు వెయ్యడంలో ఆరుద్రది అందె వేసిన చెయ్యి అని సినీ జగతులో అతనికి మంచి పేరుంది. కాని, దాని వెనకనే పరాభి అదృశ్య హస్తం వుందన్న సంగతి కొందరికి మాత్రమే తెలుసు.

—శ్రీశ్రీ, మద్రాసు.

చిత్రాలు కథకు సంబంధించినవే వేస్తున్నా మరీ అంత అసహ్యంగా వేయవద్దని చంద్ర గార్కి విన్నవించుకుంటున్నాము.

—లాల్‌కోట విజయకుమార్,
మహబూబ్ నగర్.

ఆగస్టు 78 జ్యోతి చదివాను. ఈతడవ ముఖ్యంగా కథలన్నీ పోటీపడి రాసినట్టుగా వున్నాయి. రామసంజీవిగారి మయసభ 'మెత్తని చెప్పుదెబ్బ.' ధర్మధార నవల ఉపాధ్యాయులకి ఆదర్శంగా వుంది.

25 వ పేజిలో ఒక కార్టూను మాత్రం ఈ కాలంనాటిది గాదు. ఇప్పుడు అంతటా డబుల్ లైన్లు పడ్డాయి. క్రాసింగ్ సమస్యేకాదు.

—కె. రామారావు, హైదరాబాద్.

'జ్యోతి' సంచిక రాంగానే మొదటిపేజీ నుండి చివరిపేజీ వరకు చదివేవరకు వదలబుద్ధి పుట్టదు. 'క్రోటను మొక్కలు' కథ చాలా బాగుంది. 'మహిళా జ్యోతి' శీర్షికలో ఆడదాన్ని దక్కువచేసి చూసిన సంఘటనలు ఆదినుండి విపులీకరించి వేసినారు. (ఆగస్టు సంచికలో) కానీ, జరిగినది జరిగిపోయినది నెమరువేయటం వలన ప్రయోజనము లేదు. ప్రమద ప్రతిమ కాదు ప్రతిభ కలదే అని నిరూపించే వ్యాసాలు, యథార్థములు ప్రచురిస్తే బాగుంటుంది.

—పి. శ్రీదేవి, కడప.

ఆగస్టు "జ్యోతి" సంచికలో నన్ను అత్యం

తగా ఆకర్షించిన కథ "పలుపు". ఆ తరువాత "ఆడ మనసు." శ్రీశ్రీగారి పదబంధ ప్రహేళి కను కొందరు విమర్శిస్తారు కానీ, మెదడుకు మేతలాగ, విజ్ఞానము అభివృద్ధి అవుతున్నది. పారితోషికము కొరకు కాకపోయినా, విజ్ఞానాని కైనా పూరించి సరిచూచికుంటున్నాను. 'మయసభ', కార్టూన్లు మరి అన్ని శీర్షికలు ఒకదాన్ని మించి ఒకటి వుండి మొదటి పేజీ నుండి చివరి పేజీదాకా విడువకుండా చదవాలనిపించే ఉత్సాహము కల్గిస్తున్న (మీ) 'మా' జ్యోతికివే నా కృతజ్ఞతలు. సినిమా శీర్షిక ఇంక కాస్త పెంచ మని మనవి.


—పైడిమర్రి ఆంజనేయులు, కడప.

వాణిశ్రీ ముఖచిత్రంతో వెలువడిన ఈ నెల (ఆగస్టు) జ్యోతి చదివాను. కథలన్నీ బాగా వున్నాయి. "ఆడమనసు" కథ మమ్మల్ని ఎంతో ఆకట్టుకొంది. "పూలు - ముళ్ళూ"; "పడమటి సంధ్యారాగం" సీరియల్స్ బాగా నడుస్తూ, మమ్మల్ని ఆనందింపజేస్తుంది. ఇక పోతే కార్టూనులు మమ్మల్ని కడుపుబ్బ నవ్వించాయి. చెల్లూరిసీతారాజేశ్వరరావుగారినవల"ధర్మ ధార" మాకు అంతగా నచ్చకపోయినా చదువుటకు ఇంటరెస్టుగా వుంది. మొత్తంమీద ఈనెల "జ్యోతి" అందంగా, ఆనందం కలిగించి నందుకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.—సదాశివుని శేఖరబాబు,

—బెహరా ప్రసాదరావు, ఖుర్దారోడ్.

"ఈ నెల "జ్యోతి" చదివాను. "ధర్మధార" నవలానుబంధం చక్కగా వుంది. ఒక ఆదర్శ ఉపాధ్యాయుని జీవిత చిత్రం ఆ నవల. సీతా రాజేశ్వరరావుగారు అభివందనీయులు. కథలలో "ఆడమనసు" చాలా బాగుంది. తరతరాలుగా భారత స్త్రీల మనసులో జీర్ణించిన పాపపుణ్యాల భయం, స్త్రీ యొక్క మనోవాంఛలను ధైర్యంగా బహిర్గతం చేయలేక తనలోతనే కుమిలిపోయేటట్లు చేస్తుంది. ఆడమనసు ఆడమనసులకి అద్దం పట్టింది. "పలుపు" కథ బానిసత్వానికి అలవాటుపడ్డ అమాయిక అయిలయ్యాల కథ నాకెంతో నచ్చింది. "సారా" గారి కార్టూనులు బాగున్నాయి. నాదొక చిన్న సలహా. "జ్యోతి" ముఖచిత్రం సినిమా తారలవికాక చక్కటి ప్రకృతి దృశ్యాలవి వేస్తే యింకా బాగుంటుం దని నా అభిప్రాయం.

—కె. సత్యవతి, సికింద్రాబాద్.



మయసభ

అదొక పీడకలలాటి సంఘటన.

నాలుగేళ్ళ క్రిందట జరిగినా ఇప్పటికీ, తలచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది.

అబ్బా—ఇంత భయంకరమైన మనుషులుంటారా అన్పిస్తుంది.

ధూర్తాయణం

ఆనాడు—

అదెవరో కళాత్మకమయిన సినిమాలు తీసినాయన వర్ధంతిట! (కళాత్మకం అంటే పెట్టిన డబ్బులు కూడా రాలనిదన్నమాట. అలాటివి రెండు తీసినవాడు తప్పకుండా గుండె ఆగి ఛస్తాడు, అంచేత ఈ కళా స్రష్టలకు, పాపం! వర్ధంతులే మిగులుతాయి — ద్విశతదినోత్సవాలూ అవీ వాళ్ళ డిక్షనరీల్లో వుండవు—)

ఆ వర్ధంతి సభలో కలెక్టరుగారు, మరో ఇద్దరు ముగ్గురు పెద్ద మనుషులూ ఒక నపలిత్రీ మాట్లాడారు, ఏదో బాగానేవుందనుకోండి. చివరకు ఒకతన్ని మాట్లాడమన్నారు, అతనెవరో చాల పెద్ద మేధావిట ఆయన్ను వినేదాక మేధావి అంటే పిచ్చాసుపత్రి ఇన్‌పేషెంటని నాకు తెలియదు సుమండీ.

తీరా ఆయన ఏమన్నాడూ—అంటే—?

ఆ పోయిన పెద్ద మనిషి గురించి ఏవో నాలుగు మంచి ముక్కలు చెప్పాక—ఇహ దుయ్యబట్టడం మొదలుపెట్టాడు. తెలుగు వారిని, వారి పుస్తకాలను, పత్రికలను, సినిమాలను, రాజకీయాలను చెడామడా తిట్టాడు.

ఇద్దరు ముగ్గురు ఎం. ఎల్. ఏ లతో సహా వెయ్యిమందివున్న ఆ సభతో ఒక్కరయినా లేచి, అతగాడి నోట్లో గడ్డిపెట్టరా అని ఆశపడ్డాను, కాని నా ఆశ అడియాసే అయింది. అమోనియం నైట్రేటుతో పండించిన అన్నం తినే జాతి ఇలాగే నిర్వీర్యమయిపోతుంది కదా అనిపించింది. చాల సాడ్‌గా ఫీలయ్యాను. అతగాడు ఫ్రేటేగిపోయాడు. 'రే' అన్నాడు; రా అన్నాడు; 'బెర్గ్‌మన్' అన్నాడు; దుర్గ్రహారం అన్నాడు. ఇలా పేలిపేలి చివరకు ఆటంబాంబు లాంటి మాటొక్కటి అన్నాడండీ!

"ఒక్క అయిదేళ్ళపాటు తెలుగు సినిమాలను తెలుగువార మాసపత్రికలనూ పూర్తిగా నిషేధించాలండీ! అప్పుడు తెలుగు వాళ్ళ బుర్రల్లో పేరుకు పోయిన కళ్మలం అంతా క్రమంగా తొలగిపోతుంది. అపుడిహ ఆ జాగాలో, ఫినైలు పెట్రోలుపోసి శుభ్రంగా కడిగేయాలి. ఆ తర్వాత మనం—అందులో సజీవ సాహిత్యపు రంగవల్లులు దిద్దవచ్చు; ఆ వాకిట మనం సచేతనమయిన సినిమాల తోరణాలు కట్టవచ్చు; ఈ మనుషులు తోలుబొమ్మలుగా కాక, మనుషులుగా తిరిగేలా చేయవచ్చు—" అంటూ ఏదో పేలాడు ఆ వాచాలుడు.

ఎ. రామసంజీవి

విలన్ విలయ తాండవం

"అహో! ఆంధ్రభూమీ, ఫెళ్ళున చీలిపోయి ఆ దుర్మార్గుడిని, దుందుభిని, కాళయుక్తిని నీ లోలోపలికి లాక్కెళ్ళిపోలేవమ్మా" అని విలవిలకొట్టుకుంది నా మనసు.

అరవై యేళ్ళనుండి నా అభిమాన హీరోగా వున్న ఆ సర్వసౌందర్యాలమూర్తి అక్కడికక్కడ చూరులోంచి వూడి పడి ఈ పేడిమూతిగాడి వీపు చితగ్గొట్టి, వీడి నా హాల్లో పంకాకు కట్టేసిపోడా, అని నా అంతరాత్మ సంక్షోభించింది.

ఎవడీ కోన్ కిస్కా? ఎవడీ ఆషాడభూతి? ఎవడా పోల్చుకోలేని విలన్?

కోట్లాది ప్రజల్ని—అను నిత్యమూ అలరించే ఆ పవిత్ర దేవతా మూర్తుల గురించి—వారు! 'మరే మరే' సంభవించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణచేసే ఆ కళాక్ అండాలను గురించి 1944లో అందాల తార వైదేహితో 62లో వైదేహి కూతురుతో, 77లో వైదేహి మనుమరాలితో పాటలు పాడి, ఆటలు ఆడి మన మనసుల్లో ఎప్పటి కప్పుడు నవజీనన బృందావనాల్ని సృష్టిస్తున్నారే ఆ సతతహాలిత మూర్తుల్ని గురించి—అవాకులాడే హక్కు ఈ ఆవారాగాడి కెవడిచ్చాడు—అని నా హృదయం రగిలిపోయింది. నా అభిమాన రచయిత 'పచ్చిమిరియం గోంగూరత' రాసిన . . "కన్నీళ్ళు! ఆగిపోండి?"లో నాయిక వెంకటేశ్వరి హృదయంలా "మూగవీణ"పై మోగాలి నా మానసం.

ఆ తర్వాత వారం రోజులపాటు అన్నం సయించలేదనుకోండి; ఆ వారం రోజుల్లో మూడు సీరియల్స్ రెండు కొత్త సినిమాలు మిస్సయి పోయాను; ఆఫీసుకు సిక్ లీవ్ పెట్టేశాను.

ఎవరు? ఎలా?

మనవి చచ్చు జీవితాలు; మన సంఘం పుచ్చుది; మన దేశం దరిద్రగొట్టుది; అలాటి మనకు ఎలా బతకాలి, ఎలాటి బట్ట లేసు కోవాలి, ఎలాటి కార్లలో షికార్లెలా వెళ్ళాలి, కాబరే డాన్సులు ఎలా వుంటాయి, ఎంత వచ్చి దొంగ వెధవనయినా సరే మూడు గంటల వ్యవధిలో ఎలా మార్చేయాలి—వంటి గొప్ప అత్యల్ప విషయాలను మన్న వలలు మన్నిమాలు కాకపోతే ఇంకెవరు చెబుతారండీ! అమ్మా నాన్న చెబుతారా? బడిలో అయ్యవారు చెబుతారా? మొరార్జిభాయి చెబుతారా?

హృదయం అంటే గుండెకాయ, దానిలో ఎంచక్కా గాద్రెజ్ అల్మారాలా పైన రెండు, కింద రెండు అరలుంటాయి కదా. . అందుకనే ప్రతి హృదయంలో మగాడయినా, ఆడదయినా నలుగురికి చోటివ్వవచ్చునే .. . ఆ వైశాల్యం మన సాహిత్యం చదవనిదే ఎలా వస్తుంది?

అసలు "వార మాసాలు" చదవనిదే జీవితం చీకటయిపోదూ? పొద్దున్న లేవగానే ఏం పెట్టి పళ్ళు తోముకోవాలో చెప్పేది పత్రికల్లో ప్రకటనలు కావ్వటండీ? ఏ కాఫీ తాగాలి? ఏ సబ్బెట్టి తోముకోవాలి? ఏ తువ్వాలులో సౌందర్యముండును? చంద్రుకు దారేవిటి? "నోటి దుర్వాసనా! వినికిడి సమస్యా? నరాల బలహీనతా?—" వాటన్నిటి పరిష్కార మార్గాలేవిటి? ఆ యా డాక్టర్లు ఏ హోటళ్ళలో ఏ తారీకుల్లో దిగుతారు?—ఈ వివరాలన్నీ మనకు చెప్పే దెవరంటే మన్పత్రికలు కావూ?

మనకింగ్లీషు రాదాయె. వచ్చినా—ఆ భాష పుస్తకాలు చదివే తీరిక లేదాయె ......మరి అదెవరో ఈనిడ్ బ్లైటన్కూ, హెరాల్డు రాబిన్సు-వగైరాలను పుంభానా పుంభాలుగా మనకు తెలుగులో అందించిన ఘనత మన సాహిత్య కారుల్ది కాదండీ.

చరిత్ర అంటే

కేవలం దేశసేవ తప్ప మరో దురుద్దేశం లేని పుణ్యమూర్తులు ఆ సినిర్మాతలు వేటపాలెం వెళ్ళినా, చాటపర్రు చేరినా వాళ్ళ వెంటపడి, అష్టకష్టాలనుభవించి—అక్కడి ఆ సినిమా షూటింగ్ వివరాలను సేకరించి ఇంచక్కా ఫోటోల్తో వారం వారం అందించేవి ఆ పత్రికలు కావుటండీ... గూబశ్రీ గుబగుబలాడినా, వేణుగోపాల్ మరమరాలు తిన్నా మూర్తిరాజు చెట్టు మీంచి పడ్డా. . ఈ చరిత్రాత్మక వివరాలను కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడే మెగస్తనీసులను, ఫాహియాన్లనూ పూజించని ఈ సమాజం ఓక సమాజమే! ఇసీ!!

మన సాహిత్యమూ, మన సినిమాలు జోడెద్దుల్లా మన సంఘం బండిని లాక్కెళుతున్నాయి అన్న ప్రాథమికమైన 'అవగాహన'లేని ఆ మేధావి ఎవడండీ.. అవి రెండూ రాధా మాధవులవలె, శివ పార్వతులవలె, వాగర్థాలవలె, హీరో—రోయిన్లవలె సలీమ్ — జావేద్లవలె—కలిసిపోయి, జంటగా, ఎంతందంగా వున్నాయండీ! ఎంత సేవచేస్తున్నాయండీ!. ..

సాహిత్యం పగలయితే, సినిమాలు రాత్రి.
సినిమాలు పగలయితే, ఆ డబ్బు రాత్రి.
ప్రారంభోత్సవం పగలయితే, ముగింపోత్సవం బాగా రాత్రి.

ఇలాగ తరచి చూచిన కొద్ది తరగని గని వలె బోలెడన్ని నవజీవన సూత్రాలనిచ్చే ఈ రెండూ లేకపోతే మనం బతగ్గలమూ?— అమ్మో దేశాన్ని ఊపిరాడకుండా చంపేయాలని వేసిన ఎత్తుకాదండీ ఇది?

మన శబ్ద సంపద, మన భాషా పరిజ్ఞానం, మన జనరల్ నాలెడ్జి నానాటికి అభివృద్ధి చెందాలంటే పత్రికలు సినిమాలు వినా వేరే దారిలేదే.

ఇంతెందుకు—'కమతం' అన్న పదానికి 'భూమి' అని కాకుండా ఇంకో అర్థం వుందని నా అభిమాన మాసపత్రిక సీరియల్ చెప్పే దాక నాకు తెలియదు సుమండీ!

'పిల్లా జాగ్రత్త! ఆ రెండూ జాగ్రత్త' అని బధిరకవి భాస్కరం రాసేదాక నాకు అనాటమీకి సాంఖ్యశాస్త్రానికి వున్న సంబంధం తెలీదే....అలాటి అద్భుతమైన పాటలురాసిన నా అభిమాన కవికి టింబక్టూ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ఇచ్చి గౌరవించిన నాడు

నా హృదయం ఆనంద తరంగాల డోలికయి మోహినీ రూపమయింది; స్వీట్ కాట్స్‌ల కోయిల గానంతో నా ఎద వేయి కొవ్వొత్తులై వెలిగింది .!! సినిమాలు లేనిదే ఇదంతా సాధ్యమా?

జన్మజన్మల బంధం

ఎంతమంది వచ్చి మీదపడినా చలించని ధీరత్వం. వారందరినీ చితకబాది వదిలే అసమాన శూరత్వం, మట్టిలోపడి పొర్లాడినా మరకలు కాని ఆ బట్టల ధావళ్యం, వెండి తెర అదిరిపోయేంత చప్పుళ్ళతో దెబ్బలుతిన్నా ఇంత పిసరయినా గాయం తగలని ఆ శరీరం.. ఇవన్నీ తెలుగు సినిమాలు చూడకపోతే నేను నమ్మివుండే వాడినా? కంటితో చూడని వాటిని నమ్మనుగాక నమ్మను అనే నాలాటి హేతువాదికి అనుక్షణం ప్రత్యక్ష సాక్ష్యాలను సమకూర్చే ఈ సినిమాలకు ఏమిస్తే నా ఋణం తీరుతుంది? వచ్చే జన్మలో స్టుడియో ఫ్లోర్‌లో వేయివాట్ల బల్బై వెలగనా? ఇనప్పెట్టెగాపుట్టి నిర్మాత సంపదను నా ఎదలో దాచి వుంచనా? నగరం నడిబొడ్డుమీద హోర్డింగయి నిలబడి సినిమా పోస్టర్లను మోయనా? 'మన' చలన చిత్ర విలేఖరిగా పుట్టి మీ అందరిని అలరించనా?

ఆహా! చూచారా ఈ కళామ తల్లికి అంకితమయిన జీవికి ఎన్ని సువర్ణావకాశాలో! చావంటే భయం పోగొట్టే సంజీవని లాంటివి ఇవి. ఈ పవిత్ర మూర్తులనా తుచ్ఛుడెన్ని దుర్భాషలాడాడు! అందురనే మన దేశానికి వాక్ స్వాతంత్ర్యం పనికి రాదండీ ...ఆ విషయం నాకు తెలుసు; ఇందిరా గాంధీకి తెలుసు; కొంతమంది దిన పత్రికల వాళ్ళకు తెలుసు.

"సంగమమ్! త్రివేణీ సంగమమ్"

పత్రికల్లో కథల్స్, నవల్స్ అచ్చవుతాయి. సంపాదకులెన్నుకున్నవి, సందేశాలిచ్చేవి, సంచలనాత్మకమయినవి—అయిన ఈ సాహిత్యాన్ని చూచి, తూచి, కొని, రుబ్బి, వడపోసి, సిన్మాలు తీస్తారు, పెద్దలు. సిన్మాలో విలన్ను చూచి కాలేజి కుర్రాడి చూపు 'రేపు' మీద వుంటుంది. బ్యాంకినుండి రాత్రివేళ డబ్బు తెస్తాడు! దాన్తో హీరోయిన్‌లా బీచిలకువెళ్ళి, తోటలకుపోయి చివరకు మెటర్నిటీ వార్డులోచేరి మాతృత్వంలో ఆనందం అనుభవిస్తుంది అవివాహిత; వాళ్ళందరినీ చూచి మనందరం బట్టలు కుట్టించుకుంటాం; చీరలు జారుస్తుంటాం, వాళ్ళ జోకులే్న బజార్లో, బస్సుల్లో, బొగ్గుగనుల్లో వింటుంటాం . అనగా జీవితం సాహిత్యానికీ సినిమాకూ ప్రతిబింబం అన్నమాట... హిందీ సినిమాచూచి సెల్లూరెటర్ "రై రో" అని కూచుంటాడు; సీరియల్ నవలని కంటాడు. నవల సినిమా అవుతుంది; సినిమా జీవితం అవుతుంది; నిండు జీవితం, పచ్చ జీవితం, కుటుంబ జీవితం, వారి జీవితం, మన జీవితం—ఇవన్నీ వాటి ఫలితమే!

ఇలాగ సాహిత్యం—సినిమా—జీవితం ముప్పేటగా కలిసిపోయి, గొలుసులయి మనందరినీ బంధించి ముందుకు ముమ్ముందుకు, పైకి పైపైకి లాక్కెళ్ళిపోతుంటే ఆ ఐకమత్యం, ఆ పచ్చదనం చూచి కళ్ళల్లో నిప్పులు పోసుకునే ఆ కుహనా మేధావిని ఏ మనవలెనో— అలనాడు తెనాలి రామకృష్ణుడు చెప్పేవున్నాడు. "ఎద్దనవలె, మొద్దనవలె గ్రద్దనవలె—" దట్సిట్! □

---

* వెలుగు నివ్వాలంటే రెండు మార్గాలున్నాయి. వెలుగునిచ్చే దీపానివైనా కావచ్చు లేదా ఆ వెలుగును ప్రతిఫలించే అద్దానివైనా కావచ్చు, —ఎడిత్ వార్టన్
* అణుకువతో కూడిన మౌనం, సంభాషించేందుకు గొప్ప ఉపకరణం. —మాం టేంగ్
* విజ్ఞాని పుస్తకాలను మాత్రమేకాక జీవితాన్ని కూడా చదువుతాడు. —లిన్ యుటాంగ్
* అహంభావి ఎల్లప్పుడూ తాను ప్రేమించేవారిని బాధిస్తూనే ఉంటాడు. —బి. పి.

అక్షర పరిహాస యోగం

అక్షరాలకి మాత్రం అక్కర్లేదా స్వతంత్రం?

* ఉన్నచోట ఉంటూనే నూతన స్పృహద్యోతకాలు
  కొన్ని చిలిపి అక్షరాలు నెరజాణల కనుసైగలు

'మహిమం', 'మహత్యం' ఇలాంటివి ఉన్నాయా లేదా?

* .. అని నువ్వూ నేనూ కొట్టుకు చావడం అనవసరం
  సరిగా చూస్తే ఆ పదాలలోనే నిజానిజాలు విదితం
  కాస్త సైన్స్ వేడి తగిలిస్తే మొదటిది 'హిమం'లా ఎడిపోతుంది
  సత్యం అనేదానికి నిత్యం 'హత్య' జరిగే చోటు రెండవది

'నమస్కారమండి'

* .. అంటే ఇది పొరపాటున సైకిలు దిగి ఎవడైనా
  అంతటి పులకింత తగదు తమరెంతటి ఘనులైనా
  చెయిను ఊడి దిగనాడో చేబదులుకి పెట్టుబడో
  'మస్కా', 'మండీ' కలసిన మర్యాదని తెలుసుకో

'ఈ విద్యుచ్ఛక్తి స్కీముతో సత్వరమే నవశకం'

* .. అన్నారొక మంత్రిగారు; అవును వెలుగు వారిదే
  కునుకుతున్న గుడిసెలలో గుడ్డిప్రమిద చాలులే
  పెద్దలకో? పైకి చూడు 'విస్కీ' వాసన లేదా?
  విద్యుత్తుకు లోటేమిటి 'మేనక' తోడుండగా!

'చిన్న పెట్టుబడితో గొప్పవాళ్ళయే వీలు'


  అను ప్రకటన మాయలలో నడిబతుకులు పడ్డపాట్లు
  పదిమందిని కన్నందుకు ప్రతినిత్యం బుగ్గపోట్లు
  చీటీలూ లాటరీలు ఏజెన్సీ అడ్డరోడ్లు
  చివరికి చేతికి దక్కేడు? వాక్యంలోవే, 'చిప్పలు!'

అల్లరివీ పుల్లనివీ అక్షరాలు కొన్ని
హాస్యం రుచి తెలిసిందో ఆద్యంతం ఫన్నీ!

* అందమైన 'పలకరింపు' అంతరాన అసలు 'కంపు'
  'నిరంకుశపు' పాలనలో నీతి జంకు నిజం 'రంకు'
  'గోకుల విభుడు'ంటే ఆ గోకులమే 'గోకుడు'
  మన 'నాయకుడు'న్నచోట జనసర్వం 'నాకుడు!'

సీ రి య ల్

ప్రేమా-మమత్వ



ఐ.వి.యస్. అచ్యుతవల్లి

"ఏమిటి సంగతి!" అంది సుమన.

"మనం వచ్చేవారం మళ్ళీ కమిటీ మీటింగ్ వేయాలి."

"ఎందుకు."

"ఇరవయి ముప్పయి మంది పిల్లలు చదువు కుందుకు ఇంటరస్ట్ చూపించుతున్నారు. వోణీలు

వేసుకునే ఆడపిల్లలు ఊరిబయట చెరువు గట్టు మీదవున్న తాటాకు పాక స్కూలుకి వెళ్ళి నాలుగో క్లాసూ, అయిదో క్లాసూ చదవాలంటే వాళ్ళకి చిన్నతనంగా వుంటుంది. అంచేత మనం ట్యుటోరియల్ స్కూల్ ఓపెన్‌చేద్దాం. నెలకి ఇంత అని వాళ్ళు ఇస్తే మనం ఆ జీతం అంతా పోగుచేసి ఇద్దరు ముగ్గురు టీచర్స్‌ని ట్రయినింగ్ అయి ఖాళీగావున్న వాళ్ళని కాని, రిటయిర్ అయిన వాళ్ళని కాని అప్పాయింట్ చేయవచ్చును. ఎలా వుంది ఐడియా!" అంది నళిని.

"బాగానే వుంది. కాని జీతం ఇమ్మంటే చదువుకుందుకు పంపించరేమో! వూరికే కూర్చున్నారు కదా అని వస్తున్నారేమో!"

"అందుకనే పెద్ద వాళ్ళని పిలిచి ఒక కమిటీగా ఏర్పాటు చేద్దాము. వాళ్ళు ఒప్పుకుంటేనే మనం ట్రయిన్డు టీచర్స్‌ని వేసుకుందాము."

"హరి జనుల ఆడవాళ్ళు కూడా చదువు కుంటా మంటున్నారు. వాళ్ళని కూడా చేర్చు కుందా మంటారా!" అంది సుమన.

"ఇంక ఇప్పుడు కూడా కులాల ప్రసక్తి వద్దు. జీతం కట్టే మాట అయితే ఎవర్నయినా చేర్చుకుందాము" అంది నళిని.

చాలా రాత్రి దాకా స్కూల్ నిర్వహణ విషయాలు మాట్లాడుతూ కూర్చున్నారు. వూళ్లో చాలామందికి తమ వూరు కదలకుండా చదువు కోవచ్చును అంటే ఉత్సాహంగానే వుంది.

"చాలా రాత్రి అయింది. ఇంత చీకటి పడ్డాకా ఒంటరిగా అంతదూరం వెళ్ళక పోతేనేం భోజనంచేసి పడుకోకూడదా" అంది నళిని. సుమన కొంచెం బెదురుగా చూసింది నళిని వెంపు. జగన్నాధం సుమన వెంపు చూసేడు. అతను కళ్ళతో సైగ చేయటం సుమన గుర్తించింది.

"ఎందుకండీ. వెళ్ళగలను. నాకు అలవాటు అయిన వూరే కదా!" అంది సుమన. వీళ్ళు ఇల్లా తర్జనభర్జనచేస్తూ వుండగానే రామనాధం గారి పాలేరు వెంకడు టార్చిలైటుతో వచ్చేడు

"సుమనగారూ అమ్మగారు తీసుకురమ్మ న్నారు" అంటూనూ. వెంకడుతో బయలు దేరింది సుమన.

"ఎల్లాగయినా శాంతగారికి సుమన ఇల్లా నలుగురితో కలిసి మెలిసి తిరగటం ఇష్టం వుండదు అనుకుంటాను" అంది నళిని.

"ఏం!"

"నేను నాలుగయిదుసార్లు వాళ్ళింటికి వెళ్ళాను. ఏదో తప్పనిసరి తద్దినం అన్నట్లు ముభావంగా మాట్లాడుతుంది. ఈ వూళ్లోనే కాదు. నేను ఎక్కడికి వెళ్ళినా, నేను వాళ్ళ మెట్లు ఎక్కటంవల్ల వాళ్ళ జన్మలు చరితార్ధ మయినట్లు అగ్గగిలాడుతారట. శాంతగారు నన్ను దేనికీ విలువలేని చింకిగుడ్డలా చూస్తుంది. అంచేత నాకు వాళ్ళ ఇంటికి వెళ్ళ బుద్ధవదు" అంది నళిని.

"ఆవిడకు ముందునించి గొప్ప వాళ్ళంటే ఎలర్జీ! తన భర్త గొప్ప వకీలో జడ్జీయో అవ్వాలని ఆశపెట్టుకుంది. ఆయన పొలాలు చూసుకుందుకు ఇక్కడ మకాం పెట్టటం ఆమెకు సుతరామూ ఇష్టంలేదుట. ఎప్పుడూ అత్తగారికీ ఈమెకూ క్షణమయినా పడేది కాదుట. అత్తగారు ఎప్పుడూ కూతుళ్ళ ఇళ్ళమ్మటే కాలం గడిపేదిట. మా అక్కయ్యలు చెప్పేవారు." అన్నాడు జగన్నాధం.

"అది వాళ్ళ స్వవిషయం. వాళ్ళ కూతుర్ని నేనేదో పాడు చేస్తున్నట్లు మాట్లాడుతోంది. పెళ్ళి పేరంటంలేదు. చదువుకుందుకు పైకి పంపటంలేదు. ఐడిల్‌గా కూర్చోపెట్టటం ఎందు కని నేను పని చెప్పాను. ఈ డబ్బు ఇచ్చే మాటయితే పేపరులో అడ్వర్‌టయిజ్‌చేస్తే వేలకొలది అప్లికేషన్స్ వస్తాయి. ఏమం టావు!" అంది నళిని.

జగన్నాధం గతుక్కుమన్నాడు. ఏదో ఈ సంస్థ వంకన తరచు తనూ, సుమనా కలుసుకుంటున్నారు. నళిని హర్ట్ అయినట్లుంది. నిజంగానే సుమన ప్రేమలో ఇంకెవరినైనా చూసుకుంటే! సుమన తల్లికీ నళినికీ వాగానే వుంటుంది. కాని తను ఇద్దరి పనే ఇరకాటంలో బడుతుంది.

జరిగిన కథ :

★ రామనాథం భూములు చూసుకొనేందుకు లాయర్ ప్రాక్టీస్‌కూడా వదులుకొని పల్లెటూళ్లో స్థిరపడ్డాడు. రామనాథం కూతురు సుమన ఆ వూళ్ళోని మరో రైతు జగన్నాథరావు వైపు ఆకర్షితురాలయింది. జగన్నాథరావు భార్యకూ, సుమనకూ స్నేహం కలిగింది. పరస్పరం ఆకర్షింపబడ్డ జగన్నాథరావు, సుమన లభించిన అనుకూల పరిస్థితులలో శారీరకంగాకూడా దగ్గరయ్యారు. ★

"చూడు. ఆవిడ గొడవ మనకెందుకు! మనకి కావల్సినది సుమన పని. నువ్వు వాళ్ళ ఇంటికి వెళ్ళే అవసరం ఏముంది! సుమనకి వూరు కదలకుండా ఉద్యోగం కావాలంటే మన మిచ్చిన అవకాశం కంటే మించినదిలేదు. ఒక సంస్థకు కరస్పాండెంట్ అయితే గౌరవంగానే ధ్వనించుతుంది. ఈ వూళ్లో అంతకన్న మంచి ఉద్యోగం ఏమివుంది!" అన్నాడు జగన్నాథం.

"నేనూ అందుకనే పట్టించుకోకుండా వూరుకున్నాను. నేను వనితా మండలి పెట్టుతాము. మీరు కూడా మెంబరుగా చేరండి అంటే ఆమె ఏమందో తెలుసా? మీలాగ నాకు ఎల్లా ఉడుకుతుంది. ఎల్లా జెల్లావున్నదాన్ని. సుమనని తిప్పుతున్నారుగా ఇంక నేను కూడా ఎందుకు?" అంది. ఇష్టంవస్తే చేరవచ్చును. ఇష్టం లేకపోతే మానవచ్చును. అంతే కాని అకటా వికటం మాటలెందుకు చెప్పండి!"

"ఒకొక్కళ్ళ స్వభావమే అంత. ఎదుటి వాళ్ళని నొప్పించకుండా మాట్లాడటం ఒక కళ నళినీ! వర్తకులున్నారు. చూడు మనం ఉల్లిపాయలున్నాయా! అని అడుగుతాము. వుండవు అనుకోమనమయితే లేవు అనేస్తాము, నిజమయిన వర్తకుడు అల్లా అనడు. కొత్తరకం సబ్బులు వచ్చాయి కావాలా. బెల్లం తెల్లనిది వచ్చింది. ఈనెల మీరు తీసుకోలేదేం! అంటూ తనవద్దనున్న కొత్తగావచ్చిన సరుకుల లిస్టు అంతా చెప్పి ఎంతో నేర్పుగా తన వద్ద వున్న ఏదో వక సరుకు మనచేత కొనిపించుతాడు. మనలో పూర్వకాలం వాళ్ళు బిచ్చమెత్తే వాళ్ళని చెయ్యి ఏటులేదురా అబ్బీ? అనేవారు కాని పోరాపో నీకు ముష్టి కావాలా ఎటూ కాని వేళ? అని విదిలించేవారు కాదు." అన్నాడు. జగన్నాథం.

"మాట్లాడటం అనేది నిజమయిన కళే!" అంది నళిని.

"అంతేకాదు. మాటలు పొదుపు కూడా నేర్చుకోవాలి."

"అదేమిటండోయ్! మాటలు పొదుపేమిటి డబ్బు పొదుపులాగ"

"మనభావం తెలపటానికేగా మాట్లాడుతూంటా! అందులోనే మనం పొదుపుగా వాక్యాలు పలకటం నేర్చుకోవాలి."

"ఉదాహరణ చెప్పండి!"

"అంత వాక్యం అక్కర్లేదు. మచ్చు చూపండి. అనవచ్చును. మూడు అక్షరాలు పొదుపు అయ్యేయి. భోజనం అయ్యిందా అని అడుగుతారనుకో!"

"ఆఁ. అనవచ్చును లేకపోతే లేదు. అనవచ్చును, కదూ!"

"భేష్! చిటికలో గ్రహించేవు."

"నాకు అన్ని క్షణంలోనే గ్రహించే సూక్ష్మదృష్టిని ప్రసాదించేడు భగవంతుడు" అంది నళిని.

జగన్నాథరావుగారు. "వైజ్ మవున్!" అన్నాడు ప్రశంసాపూర్వకంగా.

* * *

వనితా మండలి వూరిలో వాళ్ళ ప్రోత్సాహంతో బాగా అభివృద్ధి పొందింది. స్కూల్ గూడా బాగా రన్ అవుతోంది. లైబ్రరీని, రీడింగు రూంని ఇంకా ఇంకా చాలా పుస్తకా

లతో నింపేస్తున్నారు. చాలా బీరువాలు కొన్నారు. మునుపు పెద్ద తోటలో మామిడి చెట్లు వేపచెట్లు నిద్ర గన్నేరు చెట్లు నిండి దూరంగా ఎక్కడో సుద్ద చుక్కలా కన పడేది జగన్నాథం మేడ. ఇప్పుడు పెద్దపెద్ద చెట్లు అన్ని చాలా మటుకు కొట్టించేసారు. రకారకాల అరటిచెట్లు పాతి అరటి తోటలా పెంచారు. మేడకు వెనక వెంపు నాలుగయిదు పోర్షన్స్‌గా అస్బెస్టాస్ రేకులతో కట్టిన ఇళ్ళు న్నాయి. వాటిల్లో స్కూల్‌లో పనిచేసే టీచర్స్ వుంటున్నారు. ఇళ్ళ ముంగిట రకరకాల మెట్ట తామర మొక్కలు సీజనల్ ఫ్లవర్స్ వేసారు. తోటంతా మునుపు నిశ్శబ్దంగావుండేది. ఇప్పుడు వచ్చే పోయే వాళ్ళతో సందడిగా వుంటోంది. ఎక్కువ భాగం జగన్నాథంగారి డబ్బే ఖర్చు అవుతున్నా దానికి ఆయన ఏమీ చింతపడటం లేదు. నళినికి సరేసరి, డబ్బు ఖర్చు అవు తుందన్న బెంగ ఏకోశాన్నాలేదు. ఆమెకి కాలం సద్దాగా గోళ్లుగిల్లుకుంటూ కూర్చోకుండా ఎన్ని విమర్శలు రానీ! విమర్శలకు భయపడ కుండా తన కాలం తను సద్వినియోగం చేసు కుంటూంది అన్న ఆత్మవిశ్వాసం పెంచుకుంది.

వినోద ఆ సెలవలకు వచ్చింది. శ్రీకాంత్, జనక్‌రాం కూడా వచ్చేరు. వాళ్ళు ఈసారి సుమనతో కంటే నళినితో ఎక్కువ భాగం గడుపుతున్నారు. నళిని స్నేహితురాళ్లు సమ్మర్ గడపటం కోసం వచ్చేరు. వాళ్ళల్లో ఇద్దరు పెళ్ళిళ్ళ అయిన వాళ్ళున్నారు. ఒకామె అవి వాహిత. పేరు నయన. పార్వతి, మంజు పెళ్లి అయిన వాళ్ళు, నయన ఢిల్లీలో ఉద్యోగంలో వుంది. ఆమెకూడా ఎం. ఎ. ప్యాసు అయింది. శ్రీకాంత్ జనక్‌రాం, మంజు భర్త మాధవ. పార్వతి భర్త రవి వీళ్ళంతా కలిసి చుట్టు పక్కలవున్న పల్లెలనూ పట్నాలనూ తిరిగ్గా చూస్తున్నారు. ఆడవాళ్లు తమ చిన్నప్పటి ముచ్చట్లు కలబోసుకుంటూ వూరంతా తిరు గుతూ కాలక్షేపం చేస్తున్నారు. సుమన వినోద స్కూల్ లైబ్రరీ అవీ చూసుకుంటూ తమ లోకంలో తామున్నారు. నిత్యవసంతోత్సవంలా జగన్నాధరావుగారి మేడ కాక వూరుకూడా కలకల్లాడ సాగింది.

"సుమనా! కొంచెం నీ స్థానం గట్టిచేసుకో! నయన నడివయస్సులో వుంది. జగన్నాధరావు గారు ప్రలోభంలో పడతారేమో!" అంది వినోద.

నయన నళినికంటె ఒకటి రెండేళ్ళు పెద్దయి వుంటుంది. బాగా చదువుకున్నదీ మగవారి హాజం—లేనిదీ కనుక. ఒకటికి రెండు సార్లు జగన్నాధం ఆమె మాట్లాడుకుంటూ కనిపిం చారు. నయన బెంగాలీపిల్ల. సన్నగా నాజూగ్గా వుంటుంది. నడుంవరకు, జుట్టువున్నా రోజూ తెల్లవారిగట్ల స్నానంచేసి తలతుడుచుకుని జడ అల్లకుండా వదిలేస్తూ వుంటుంది. వీపంతా జుట్టు పరుచుకుని, ఎగుర్తూ వుంటుంది.


"రోజల్లా అలా జుట్టు అల్లకుండా వదిలే స్తారు! మీకెలా తోస్తుంది?" అన్నాడు ఒకరోజు జగన్నాధం. అందరూ వింతగా చూసేరు జగ-న్నాధంవైపు. సహజంగా జగన్నాధం మందలో కలవడు. కొంచెం రిజర్వుడుగా వుంటాడు. అల్లాంటిది ఈ వేళ నయన జుత్తుమీద ప్రసంగం మొదలుపెట్టేసరికి జగన్నాధంకికూడా నాగరి కత వంటపట్టిందే అనుకున్నారు అందరూ.

"నన్ను ప్రత్యేకంగా గమనిస్తున్నారా!" అంది నయన తమాషాగా నవ్వుతూ.

"నువ్వు ప్రత్యేకంగా జుట్టు విరబోసుకుని తిరుగుతున్నావు. ఆయన వేరేగా నిన్ను గమ నించటం అనవసరం. అందరిలాగా నువ్వూ జడ అల్లుకుంటె నిన్ను గుర్తించరు అనేగా నీ తాపత్రయం!" అంది నళిని.

"నాకేదో గుర్తింపుకోసం ఇదొక అలం కరణ విధానం క్రింద జుట్టు విరబోసుకుని తిరుగుతున్నాననుకున్నావా! నాకు ఇలా వుంటే ఎంతో హాయిగా వుంటుంది. జాబ్‌కి వెళ్ళే టప్పుడు హెయిర్‌స్టయిల్స్ ఎలాగూ తప్పదు. అప్పుడు తలంతా దిమ్ముగా వుండేది. కణతలు లాగుకుపోయేవి. ఎన్ని మాత్రలు వేసుకున్నా తగ్గేదికాదు. ఇల్లా వుంటే నాకు ఈజీగా వుంటుంది."

"కాని మీకు సహజంగా నప్పింది. మీజుట్టు



వాకా మెత్తగా పట్టులాగా వుంది. అంచేత ఇల్లా గది వదిలెయ్యడమే చాలా బాగుంది." అన్నాడు జగన్నాథం.

"కాని ఆంధ్రలో ఎవరూ జుట్టు విరబోసుకుని తిరగరు. ఎందుకో తెలుసా!" అంది వినోద.

"తెలీదు! ఎందుకని?"

"అందులో ఎండవేళప్పుడు అసలు తిరగకూడదు. జుట్టు విరబోసుకున్నా ముద్దమందార పువ్వు తలలో ముడుచుకున్నా దయ్యాలు పడతాయంటారు." అంది సుమన.

"నిజం!" మగాళ్ళు ఆడాళ్ళు ఒకేసారి సంభ్రమంగా అన్నారు.

"అలాపట్టిన వాళ్ళెవరయినా కనపడ్డారా!" అంది.

"ఏమో! పదుగురూ అనుకున్న మాటలు చెప్పాము. నయనా, అయినా మీరు ప్రయత్నించి చూడండి" అంది వినోద.

"దేనికి ప్రయత్నం?" ఆశ్చర్యంగా అన్నది మంజు.

"దయ్యం పట్టించుకోవడం!" అన్నాడు రవి.

"మైగాడ్!" అంది నయన. అందరూ నవ్వారు.

"రేపు మనమంతా పిక్నిక్ కు వెళ్దాం" ప్రతిపాదించాడు జనక్ రాం

"ఎక్కడికి"

"అదే సస్పెన్స్! మనం బయలుదేరుతాం ఎవరికి ఎక్కడ దిగాలనుంటె అక్కడే దిగిపోవచ్చును. ముందరిదాకా వెళ్ళిన వాళ్ళు వచ్చేప్పుడు ఒక్కొక్కరినే పికప్ చేసుకుని వస్తారు."

"బాగుంది. ఒకొక్కరు ఒకొక్క చోటదికిపోయేమాట అయితే అందరూ కలిసి వెళ్ళటం ఎందుకు! నాదొక ప్రపోజలుంది." అంది నళిని.

"ఏమిటి!" అన్నట్లు చూశారంతా.

"రేపు ఎక్కడికీ వెళ్ళద్దు. రేపు సాయంత్రం మా ఇంటిలో పార్టీ వుంది."

"పార్టీయా! అన్నాడు జగన్నాథం.

"అవును" అంది. నళిని.

"ఏమి కథ!" అంది పార్వతి.

"పుట్టినరోజు." అంది నళిని.

"అదేమిటి నీ పుట్టినరోజు నవంబరులో వస్తుందికదే ఇప్పుడెందుకు జ్ఞాపకానికి వచ్చింది! మా దగ్గర ప్రజెంట్సు ఏమన్నా లాగాలనా!" అంది మంజు.

"నాదికాదే బాబూ!" అంది నళిని.

"నాకు పుట్టినరోజులు చేసుకునే అలవాటు లేదు. పల్లెటూరి వాడిని!" అన్నాడు జగన్నాథం.

"మీదికాదు. మీది ఆగస్టులో వస్తుంది."

అంది నళిని.

"మరెవరికి చేస్తున్నావేంటి బాబూ! ఏమన్న ప్రజంట్స్ కొనాలా!" అంది మంజు దిగులుగా.

"మరీ దిగులుపడకు వున్నదేదో ఖర్చు పెడదాము. వెళ్ళేప్పుడు ట్రయిన్ ఛార్జీలు జగన్నాధంగారే పెట్టుతారు." అన్నాడు రవి.

"మీకు ట్రయిన్ ఛార్జీలు ఇచ్చేకన్న ప్రజంట్స్ మేమేకొనుక్కొంటే నయంకాదూ!" అన్నాడు జగన్నాధంగారు.

"ఇంతకీ ఎవరిది?" అన్నాడు జనక్‌రాం.

"అన్నట్లు మీ పాటకచేరీ ఏర్పాటుచేసాం. మీకు చిన్న సన్మానంకూడా ఏర్పాటుచేసాను." అంది నళిని.

"అబ్బబ్బ! ఏమి సస్పెన్స్ క్రియేట్ చేస్తున్నారు నళినీ! మీరు ఈ ధర్మసంస్థలు నడపడం మానేసి సినిమా లైన్‌కు నడవకూడదూ! డైరెక్టు చేసాపంటె ప్రేక్షకులు ఊపిరి బిగపట్టవల్సిందే! గొప్ప ఏస్ డైరక్టరు ఔతావు!" శ్రీకాంత్ అన్నాడు.

"ఇంతకీ ఎవరికి పుట్టినరోజు చేస్తున్నావు?" అన్నాడు జగన్నాధం.

"ఎవరిదయినా కావచ్చును. రాజమ్మకానీ, వెంకన్నకానీ, వీరమల్లుకానీ మన క్వార్టర్స్‌లో వున్న పంతులమ్మదికానీ వనితా మండలి సభ్యులలో ఎవరిదయినా కానీ ఎవరిదో ఒకరిది. రేపు పుట్టినరోజు అయి తీరుతుంది. అందుకని నేను పార్టీ ఇస్తున్నాను రేపు సాయంకాలం. జనక్‌రాం పాటకచ్చేరీ వుంటుంది."

"మొత్తంలో ఎవరిదీ కాకపోతే!" అన్నాడు మాధవ్.

"అందరిదీ అవుతుంది. వూరిలో ఎవరో ఒకరు రేపు పుట్టివున్న వాళ్ళు వుండకపోరు." అంది నళిని.

"ఎవరిదో ఎందుకు! రేపు నిజంగా సుమన పుట్టినరోజు!" అంది వినోద.

"నిజంగా" అన్నారంతా.

"నిజమే! ఇంగ్లీషుతారీకు ప్రకారం కాకుండా నక్షత్రం ప్రకారం అయితే రేపే అవుతుంది." అంది సుమన.


"ఇంకేం! ప్రోగ్రాం గ్రాండ్‌సక్సెస్! కేంద్రం బడ్జెట్‌ని ఈజీగా గ్రాంట్ చేస్తుంది!" అంది నళిని నవ్వుతూ. సుమన కళ్ళల్లో నీలినీడలు కదిలాయి. జగన్నాధం ముల్లుగుచ్చుకున్నట్లు ముఖంపెట్టాడు. రాత్రి మేడమీద నళిని వంటరిగా తన గదిలో ఏదో ఆలోచిస్తూ కూర్చున్నప్పుడు జగన్నాధరావుగారు వచ్చేరు.

"సాయంత్రం నలుగురిలో అల్లా అనటంలోనే ఉద్దేశ్యం!" అన్నాడు. ముఖమంతా గంటు పెట్టుకున్నట్లుంది.

"ఏమన్నాను?" అతని కోపంకు మూలం ఏమిటో నళిని ఊహకు అందటంలేదు.

"కేంద్రం బడ్జెట్‌ని యీజీగా గ్రాంట్ చేస్తుంది అన్నావుగా! సుమన పుట్టినరోజు అయితే నాకేమన్నా ఒరిగిపోతుందనుకున్నావా! ఏదో నీకూ వూరికే తోచదు. కాలక్షేపంవుండాలి. అని స్కూలన్నా, మండలి అన్నా తలూపాను. ఇప్పుడు నువ్వు నన్ను నలుగురిముందు దోషిగా నిలబెట్టాలని పన్నాగాలు పన్నుతున్నావు. సుమన ముఖం ఎల్లా వుందోకూడా నేను సరిగ్గా చూడను" అన్నాడు.

నళిని కొంచెంసేపు జగన్నాధరావు ముఖంలోనికి చూసింది. గుమ్మడికాయల దొంగా అంటే భుజాలు తడుముకున్నట్లు వుంది. నిజానికి తనకు మర్నాడు ఎక్కడికి వెళ్ళాలనిపించక 'పార్టీ' అని నోటికి వచ్చినట్లు అనేసింది. కాకతాళీయంగా సుమన పుట్టినరోజు అయింది. ఎవరిదీ లేకుండా పుట్టినరోజు పార్టీ చేయకుండా నిజంగా ఎవరిదో వకరిది కావటం తనకి సరదా కలిగించింది. ఆ హుషారుకొద్దీ కేంద్రం బడ్జెట్ ఆమోదం ఈజీగా వస్తుంది అంది. ఈయన ఇంత రగాదాకు రావల్సిన అవసరం ఏమిటి! అన్నట్లు సుమనకూడా ముఖం చిన్నబుచ్చుకున్నట్లు కనిపించింది. మామూలుగా అయితే ఎవరూ అంత బాధపడాల్సినంత చెడ్డమాట కాదు. కాని ఇద్దరికిద్దరూ ఆ మాటకు దెబ్బ తిన్నట్లు ఫీలయ్యారు. వాళ్ళిద్దరిమధ్యా. 'దేర్ మస్ట్‌బీ సంథింగ్!' నేను అనాలోచితంగా అన్నాను. కాని ఒక నిజం బయటకు వచ్చింది.



అనుకుంది నళిని.

"నేను అంతదూరం ఆలోచించలేదు. ఏదో అల్లా వచ్చేసింది. క్షమించండి!" అంది భర్తతో.

"వస్తుంది. వస్తుంది. ఎందుకురాదూ! ఆడింది అల్లా ఆట పాడిందిపాట చేస్తూంటే ఎందుకు రాదూ! నాకు అంత మదమెక్కి వుంటే నాకున్న డబ్బుకి ఎంత అయినా జల్సాచేసే వాడ్ని. మరీ అంత ఆడపిచ్చి వున్నట్లు నీవు శ్రమపడి నిరూపించాల్సిన అవసరం ఏం వుండేదికాదు." అన్నాడు జగన్నాధరావుగారు.

నళినికి శరీరం అంతా సలసల మరగ సాగింది. ఇదేమిటి ఇతగాడు! ఏదో అన్నా నని పాపం పెట్టుకు పిసుక్కున్నాడు! తను పతి ప్రతాధర్మం నెరవేర్చాలనీ ఎప్పుడయినా గీటు గీసిందా! జల్సాచేయలేదుట. ధైర్యం వుంటే జల్సాలు చేసుకుంటూంటే ఎవరొద్దంటారు మనోధర్మం దృఢంగా వుంటే ఒకరు వద్దన్న పని చేయటం మానేస్తారా. ఎవరిష్టం వారిది. అదేదో తన మంచి తనం క్రింద వర్ణించు కోవటం ఎందుకు? తనకు గౌరవం కావాలి. పెద్ద మనిషి తనం కావాలి. మర్యాద కావాలి. ఆరోగ్యం కావాలి. కావాలి. కావాలి. ఇన్ని కావాల్సి వున్నప్పుడు. ఆడవాళ్ళ విషయంలో వాళ్ళంతట వాళ్లే దూరంగా వుంటారు. తను మరీ అంత వివేకం లేకుండా మాట్లాడే దానిని క్రింద జమచేసారు. తను మూర్ఖురాలా?

"నేను మిమ్మల్ని చెడ్డవాడిగా శ్రమపడి నిరూపించితే నాకు వచ్చేలాభం ఏమిటి! ఫలానా వాళ్ళమ్మాయి, భర్తతో అమెరికా వెళ్ళింది. అనో, రవ్వల దుద్దులు కొనుక్కుందనో, ఇల్లు కట్టుకున్నాడనో నలుగురి ముందూ చెప్పుకుంటే గర్వకారణంగా వుంటుంది. అంతే కాని ఫలానా నళిని భర్త జల్సాలుచేసి ఆస్తి పాడు చేసాడనో, స్త్రీలోలుడయి అనారోగ్యం పాల య్యాడనో చెప్పుకుంటే ఈ ప్రపంచంలో నా స్థానం ఎక్కడుంటుందో నాకు బాగా తెల్సును. ఏ స్త్రీ కూడా తన భర్త ఎంత దుర్మా ర్గుడయినా అతని దుర్మార్గాలని పైకి రాకుండా, తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది. కాని అతనిలోని దుర్గుణాలని ఎక్స్ప్లాయిట్ చేయ టానికి సాహసించదు. దానివల్ల ఆమెకి మిగి లేది సంఘంయొక్క దమ్మిడీ విలువచేయని సానుభూతి! దొంగాడి భార్య అయినా దొర సానిలా కనపడాలని చేసే వ్యర్ధ ప్రయత్నం లోని రహస్యం ఇదే!" అంది నళిని కొంచెం తీవ్రంగా.

జగన్నాధం నళిని స్వరంలోని తీవ్రతకు

జడుసుకున్నాడు. అనవసరంగా బయటపడ్డానా అని మథనపడ్డాడు.

*   *   *

"సుమనా! నళినికి మీ సంగతి తెలిసినట్లుంది ఇంక ముసుగులో గుద్దులాట ఎందుకు! నీ స్థానం ఏమిటో రావుగార్ని అడుగు" అంది. వినోద.

"నాకు ఒక అనుమానం వస్తూంది." అంది. సుమన.

"ఏమిటి?"

"ఇంకెవ్వరికీ చెప్పకేం!" అంది సుమన భయంగా.

"నేనా! నీ విషయం. ఎవ్వరితోనైనా ఎందుకు అంటాను? అసలు నా స్నేహితులకు నువ్వెవరివో తెలియవు. ఇంక నీ విషయాలు సేకరించటానికి ఆసక్తి ఎందుకు వుంటుంది!" అంది వినోద.

"రెండేళ్ళనించీ అతనూ నేనూ భార్యాభర్తల్లాగ గడుపుతున్నాం. కాని " సుమన ముఖం ఎర్రబడింది.

"కానీ ఏమిటి? ఓహో! అదా! నీకు నెల తప్పలేదంటావు. అంతేనా!" అంది వినోద.

వినోద తనకన్నా చాలా చిన్నది. అయినా ఎన్ని విషయాలు తెలుసును.

"అదృష్టవంతురాలివే సుమనా! నాకు ఎవరితో నయినా కొంచెం సరదాగా గడపానంటే మాత్రలు మింగాల్సిందే! ఒకసారి మర్చిపోయేను. ట్రీమంత్స్ వచ్చేసాయి. మమ్మీ తెగ తిట్టింది. పెళ్ళి పేరంటం అక్కర్లేదా! అంటూనూ. చాలా జాగ్రత్తగా పద్యంచేయాల్సి వచ్చింది. ఈ విషయంలో నీది గుడ్ లక్!"

"నిజంగా!" అంది సుమన కళ్ళు పెద్దవి చేసి!

"అప్పుడే! రెండుసార్లు అల్లాంటి ఇబ్బందిలో చిక్కుకున్నాను. మమ్మీ డాడీకి తెలియకుండా జాగ్రత్తగా చూసింది. లేకపోతే ఇంకేమన్నావుందా!"

"నయం. మా అమ్మ ఐతే బావిలో దూకు తాను" అంటుంది అంది సుమన.

"మా మమ్మీ అల్లా అనదు. సెక్స్ విషయాలు అందరికీ తెలియాలి అంటుంది. మా డాడీ సోషల్ గేదరింగ్స్‌లో ఎప్పుడయినా తనకి నచ్చిన గర్ల్ ఐతే ఎంజాయ్ చేస్తాడు. తనకి వయస్సులోకూడా గర్ల్స్‌ని ఎంజాయ్ చేయాలని వుంటే ప్రతీదీతెలుసుకోవాలన్న వికసించే వయస్సులో ఆత్రుత వుండటంలో అసహజం ఏముంది! శ్రీనీ, నన్నూకూడా ఏమీ రిస్ట్రిక్షన్స్‌లు పెట్టదు. 'ప్రతీదీ అనుభవించండి. అనుభవంతో జీవితం ఎదుగుతుంది. కష్టం సుఖం అన్నీ భరించాల్సిన గుండె నిబ్బరం పిల్లలకు కలగాలంటె, జీవితంలో వాళ్ళకేది కావాలో తెలుసుకోవాలంటె, పిల్లలకి ప్రతి విషయంలోనూ స్వేచ్ఛ వుండాలి. పూలతోట వేస్తాము. పూలు అన్నీ వికసిస్తాయి. పూలు ఎవరూ దొంగిలించకుండా ముళ్ళకంచె వేస్తాము. ముళ్ళకంచెకు పూలతీగ తెలియకుండా అల్లుకున్నప్పుడు జాగ్రత్తగా కంచెకు తగిలి పూలకు ముళ్ళు గుచ్చుకుని పూలరేకులు నేలరాలకుండా నేర్పుగా, పూలతీగను తప్పించి రక్షించటమే— మనం చేయాల్సిన పని' అంటుంది. "మొగవాళ్ళు ముళ్ళల్లాంటివాళ్ళు. ముళ్ళకంచె పూలతోటకు రక్షణగా వుంటుంది. మీదపడితే పూలరేకులు ముళ్ళు గుచ్చుకుని చీలిపోతాయి. వాడిపోతాయి. రేకులు వాడి నేలరాలి పోతాయి. తగుమాత్రం దూరంలో వుంచేసుకుంటే ఇతర జంతువులు ఏమీ పూలతోటను పాడుచేయకుండా రక్షణనిస్తాయి. మనం ఉపయోగించుకోవటంలో వుంది అంటుంది మా మమ్మీ!" అంది వినోద.

సుమన ఆలోచించింది. పిల్లల పెంపకంలో ఏ విధానం మంచిది? తన తల్లి ప్రతీదానికి గోరంతలు కొండంతలుచేసి పెద్దగా నోరు పెట్టుకుని రభసచేసేది. అయినా తమకేం ఒరిగింది! సావిత్రి అక్క భర్త దానిని రోగిష్ఠిదనీ గొడ్రాలుదనీ రాచిరంపాన పెట్టున్నాడుట! రాధ భర్త గంగిగోవులాంటివాడు. అత్త మధ్యా భార్యమధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని,



రాధ పెద్దవాళ్ళని గౌరవించిందని అతనికి మనస్సులో బాధ. గట్టిగా మామూలు మగ వాళ్ళల్లా దండించటానికి మనస్సు ఒప్పదు. అంచేత వీలయినంత మటుకు ఇంటికి దూరంగా వుండటానికి ప్రయత్నించుతాడు. దానికి రాధ సాధించి పోస్తూ వుంటుందిట. రాధ అత్తగారు "ఆ తల్లి పెంపకం తీరు. అదీ! డబ్బున్న దన్న గర్వం కొద్దీ పిల్లలను గడేకార్లులాగ పెంచింది. మాటలు నేర్చిన కుక్క ఇస్కొ అంటె ఇస్కొ అన్నాదిట. అల్లా వుంది. అంటూ సాధించుతూ వుంటుందిట. మధ్య వర్తులు చెప్పారు.

ఇంక తన మాటకూడా పైకివస్తే కుటుంబం బాగానే ముందుకు వస్తుంది. వినత ఏమీ తెలియని అమాయకురాలు. దాని భవిష్యత్తుకూడా దెబ్బ తింటుంది. ఒక్కనివల్ల వనమంతా కాలింది అంటూంటారు. ఒక కుటుంబం ఒకొక్కళ్ళవల్ల ఆర్థికంగా, సాంఘికంగా వున్నత వర్గాలలోనికి వెళుతుంది. ఒకొక్కళ్ళ వల్ల అన్నిటా అధః పాతాళానికి అణగద్రొక్క పడుతుంది. వ్యక్తులు తమ మంచి చెడులకు ఫలితం తామే అనుభవిస్తాము అనే ధైర్యంతో తమకు తోచిన పనులుచేస్తూ వున్నా కుటుంబ పరంగా సాంఘికంగా ఆ పనులయొక్క మంచి చెడ్డల ఫలితాల నీడలు పడక తప్పదు.

వినోదకు వచ్చే మాత్రల అవసరము తనకు ఈ రెండు సంవత్సరాలలోనూ రాలేదు. తాను పైకి చెప్పకపోయినా లోపల్లోపల ఆ సంఘటన కోసరం ఎదురుచూసింది. తన అంశ ఫలించినందుకు జగన్నాథరావు తప్పక తనని భార్యగా ఆదరిస్తాడు. ఆదరించక తప్పదు. అటు నళినికా పన్నెండేళ్ళయినా పిల్లలు లేరు. జగన్నాథరావుని పూర్తిగా తనవాడ్ని చేసుకోవాలంటె తను తల్లి కావాలనే వాంఛించింది. తను తల్లి అయితే నళిని వున్నా తను ధైర్యంగా ఆ ఇంట్లో తలెత్తుకుని గర్వంగా తిరగగలదు! కాని భగవంతుడు తను కోరినట్లు జగన్నాథరావు ప్రేమ ఇచ్చినాడు కాని పిల్లలని ఇయ్యలేదు. ఇప్పుడు తన బ్రతుకు ముళ్ళ డొంకమీద పడిన పట్టుచీరలా వుంది. ముళ్ళు గుచ్చుకున్నా ఆనవాలు దొరకకుండా చీరని దక్కించుకోవాలంటే ఏమి చేయాలి! ఎన్నాళ్ళు తనలోని క్షణికావేశాన్ని జగన్నాథరావు కోరికకు బలిచేస్తూ గడపాలి! లేక జగన్నాథరావునే తనని పెళ్ళి చేసుకొమ్మంటే! నలుగురిలో ఎల్లా ధైర్యంగా తలెత్తుకుని తిరగగలదు? అసలు ఏ వంకతో నళినికి విడాకులిచ్చి తనని సర్వ జనాంగీకారంగా పెళ్ళిచేసుకుంటాడు! నళినికన్న

తను ఎందులో ఎక్కువ: అందం, చదువు, సంస్కారం, మంచితనం, ధనం అన్నీ నళినికే ఎక్కువ వున్నాయి. ఇంక తనకి మిగిలినది నళినికి లేనిది ఒక్కటే: అదే మాతృత్వం: ఆ ఆసరాతో తను జగన్నాధరావుకి ఇల్లాలు అవాలని వాంఛించింది. కాని వెలయాలు అయింది. ప్చ్: వళ్ళు జలదరించింది. అవును. నిజమే: తనకి వెలయాలు. తేడా ఏమిటి: తను అతనికి శరీరం ఇచ్చినందుకే నెలకు నాలుగువందల జీతం ఇప్పిస్తున్నాడు. అందరికీ అంతలేసి జీతాలు ఎందుకు ఇస్తారు: పెళ్ళికొడుకులు వస్తున్నారు. వెళ్తున్నారు. ఉద్యోగం చేయని పిల్లకే ముప్ఫయ్‌వేలు కట్నం ఇచ్చారు. నెలకు నాలుగు వందలు సంపాదిస్తోంది. నలభయ్‌వేలు అన్నా ఇవ్వవద్దా: అంటున్నారు. ముద్దు ముద్దుగా ముప్ఫయ్ ఏళ్ళు వస్తున్నాయి. అక్క మాట వినివుంటే రాజేష్‌కీ తనకీ ఈపాటికి ఇద్దరు పిల్లలుందురు'' అనుకుంది.

''ఏమిటే దీర్ఘాలోచన:'' అంది వినోద.

''నువ్వు నన్ను అదృష్టవంతురాలని అన్నావు. ఎందుకు:''

''నీకు ఆనందం అనుభవించినప్పుడు మాత్రల అవసరం రానందుకు:''

"అదే నన్ను దురదృష్టవంతురాల్ని చేస్తోంది వినోదా:''

"అదేం:''

"నేను కనుక నెలతప్పానంటె మహారాణి భోగాలను అనుభవిస్తాను. ఇంక అప్పుడు నళిని వున్నా నా స్థానం చాలా గౌరవంగా పవిత్రంగా వుంటుంది. ఇప్పుడేమి వుంది. జగన్నాధరావుని వప్పించటం తేలికే: కాని అంతా నన్నే ఒక నీచురాలిక్రింద జమచేస్తారు. స్నేహం నటించి కుటుంబాన్నే నాశనంచేసింది అంటారు. నాన్నగారి పొలం పోయినందుకు జగన్నాధాన్ని పట్టి ఆ కొరత తీర్చుకుంటున్నారంటారు. లోకంలో అన్ని విధాలా లోకువ అయిపోతాను. అదే గర్భవతి అయినానంటే 'నళిని గొడ్రాలు కనుక మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు తప్పేముంది:' అంటారు. 'ఒకిల్లు నిలబెట్టింది' అంటారు. 'జగన్నాధరావు వంశం నిలబడింది. అసలు ఆ ఇంటిపిల్లని మొదటే చేసుకుంటే ఈపాటికి జగన్నాధరావుగారిల్లు పిల్లా పాపలతో కలకల్లాడును. అప్పుడు పెద్ద సంబంధం కావాలని వీళ్ళ సంబంధం కాదని అన్నాడు. అయినా గౌరవ కుటుంబీకుడు కనుక రామనాధం అతని మీదున్న అభిమానంకొద్దీ పిల్లనిచ్చాడు: అంటారు. తేడా చూసేవా:'' అంది సుమన.

"ఇంతగా ఆలోచించకూడదు. ఆలోచించి ఆలోచించి చేసే పనులు గోతుల్లో దింపుతాయి. ఎదయినా అదృష్టమయినా, దురదృష్టమయినా యాదృచ్ఛికంగానే జరుగుతాయి. నువ్వేం చేయదల్చుకున్నావ్?'' అంది వినోద.

"నాన్నగారు ఏవో సంబంధాలు చూస్తూనే వున్నారు. ఎవరికి నేను నచ్చినా తలవంచేస్తాను. ఒకవేళ ఎవరికీ నేను నచ్చననుకో, అప్పుడు జగన్నాధరావుగారి పంచకే చేర్తాను. నన్ను కాదనే ధైర్యం ఆయనకి లేదులే:'' అంది.


"యీ బ్రేవ్ వుమన్: రెండు పడవలమీద చెరివక కాలూవేసి ప్రయాణించుతున్నావు. ఏ పడవ దూరం జరిగినా ఏటిలో మునిగిపోతావు. జాగ్రత్త ఎప్పటి కప్పుడు ఆలోచించి చూసుకో. నీ పొజిషన్:'' అంది వినోద.

"ఆదే చూస్తూన్నాను.'' అంది సుమన.

* * *

'సావిత్రికి జబ్బుగా వుందని వైర్ వచ్చింది. శాంతమ్మ ఈ మధ్య కుటుంబం చితికిపోవటంతో ఎక్కడికయినా వెళ్ళటం అంటే ప్రాణ గండంగా భావించుతోంది. దూరభారం ప్రయాణం ఒక్కర్తీ వెళ్ళలేదు. రామనాధం రాత్రిం బవళ్ళు పొలంమీదనే వుంటున్నాడు. అయినా మగవాడు వెళ్ళి ఏమిచేస్తాడు తల్లి దగ్గర వుండాలి: ఎల్లాగంటే ఎల్లాగ అనుకున్నారు. వినతని తీసుకుని వెళ్ళి దానిని అవసరం వుంటే వుంచి రమ్మన్నారు సుమనని. వీలుంటే సావిత్రిని కూడా తీసుకురమ్మన్నారు.

సుమన ప్రయాణం సంగతి నళినితో చెప్పింది. దానికేం వెళ్ళిరా' స్కూల్ పను



లేమన్నావుంటే నేను చూసుకుంటానులే" అంది నళిని.

మర్నాడు కారులో దగ్గరలో వున్న స్టేషన్‌కు దింపటానికి బయలుదేరింది నళిని. సుమనతో ఏదో చెప్పాలన్న ఆరాటం—నళిని వుండటంవల్ల వీలుపడక తహతహ లాడి పోయేడు జగన్నాధం. అంచేత ఏమీ తెలియనట్టుగా.

"ఎక్కడికి బయలుదేరావు?" అన్నాడు.

"రామనాధంగారి అమ్మాయిలు వూరు వెళ్తున్నారుట స్టేషన్‌లో దింపివస్తాను." అంది నళిని.

"నువ్వు వక్కర్తివే ఎందుకు! నేను కూడా వస్తాను. సినిమాచూసి వద్దాము" అన్నాడు జగన్నాధం. నళిని కొంచెం ఉక్కిరి బిక్కిరి అయ్యింది. జగన్నాధరావు ఎప్పుడూ సినిమాలకు ఎగబడి వెళ్లేవాడుకాదు. నళిని చుట్టాలయినా, స్నేహితులయినా వస్తే, వాళ్ళతో సరదాకు వెళ్లేది. జగన్నాధరావు ఎప్పుడూ పొలం పనులు, లేకపోతే మేడమీద తన గదిలో ఏదో ఒక పుస్తకం పట్టుకుని చదువుకుంటూ కూర్చునేవాడు. నళినితో కూడా ఎక్కువగా మాటలాడేవాడుకాదు. వంటరిగా ఆయనకు ఎల్లా తోస్తుందబ్బా! అనుకునేది. అల్లాంటిది ఇప్పుడు నలుగురితో కలిసి మెలిసి వుంటున్నారు. నయన అంది కూడా "నళినీ! మీ ఆయన మనుషుల్లో పడ్డాడే!" అని.

కాలం ఎవరినైనా మార్చుతుంది. మారలేని కాలం కాలమేకాదు అనుకుంది. కాలగమనంలో రాయైనా అరుగుతుంది. ఇంక మనుష్యులనగా ఎంత! అయితే జగన్నాధరావులో వచ్చిన మార్పు నళినికి సంతోషదాయకమే అయ్యింది. నళిని మనస్సులో ఏదో జరిగింది. ఏదో జరిగింది అని అనుకుంటునేవుంది. మళ్ళీ ఏదయితే నీకెందుకు' నీ జీవితం ఆడింది ఆటగా పాడింది పాటగా జరిగిపోతోంది. ఎందుకీ మనస్సంతా అలజడి పెంచుకోవటం! హాయిగా గడిపేయక అని విసుక్కునేది తనమీద తానే. జగన్నాధరావుకూడా స్టేషన్‌కి వస్తాననటంతో నళినికి ఊపిరి తిరిగినట్లు అయింది. ఇంక రాజమ్మకి ఏయే వంటలు చేయాలో చెప్పి కారులో రామనాధం గారింటికి వెళ్ళారు. ఇన్నిరోజులుగా నళిని అయిదారుసార్లు ఏదో వంకన రామనాధం ఇంటికి వెళ్లినా జగన్నాధరావు మటుకు ఎప్పుడూ వెళ్ళలేదు. వెళ్ళక పోవటానికి పెద్ద వైరమేమీలేదు. రామనాధంగారింట్లో జగన్నాధరావుతోటి యువకులు ఎవరూలేరు శ్రీనివాస్ మరీ చిన్నవాడు. రామనాధం యాభయిదాటిన

వాడు. ఒకరంటే ఒకరికి గౌరవం వుంది. వయస్సులో పెద్దవాడు కదా అని రామనాథం అంటే జగన్నాథరావుకి గురివుంది. వూరికల్లా పెద్ద మొఖాసాదారు కదా అని రామనాథంగారికి జగన్నాథరావంటే గౌరవం వుంది. అనుకోకుండా కారులో దంపతులిద్దరూ రావటంతో రామనాథం కాళ్ళూ చేతులూ విరగద్రొక్కుకున్నంత పనిచేశాడు.

"రండి రండి," అంటూ ఆహ్వానించేడు. సుమని అప్పటికే సూట్‌కేస్ బెడ్డింగ్ మంచి నీళ్ళ చెంబూ భోజనం కారియర్ అన్నీ సర్ది ముండువాలో పెట్టింది. శాంతమ్మ వంటింట్లోంచి హడావిడిగా వచ్చి జగన్నాధరావుని చూసి లోపలి గుమ్మంలో నిలబడిపోయింది.

వినత ట్రేలో కాఫీ కప్పులు బిస్కట్సున్న సాసర్లూ తీసుకువచ్చింది.

"ఇప్పుడెందుకు ఇవన్నీ' మిమ్మల్ని స్టేషన్‌లో దింపి మేము సినిమాకు పోదామనుకుంటున్నాం. బయల్దేరండి." అంది నళిని.

"ఫరవాలేదు. తీసుకోండి. కాఫీయే కదా!" అంది సుమన.

"మా పిల్లని రోజూ మీ ఇంటి చుట్టూ కుక్కలు తిప్పుకుంటున్నారు. మా ఇంట్లో కాఫీయేనా తాగకూడదా!" అంది శాంతమ్మ.


నళిని ముఖం కందగడ్డలా అయ్యింది. సుమన తల్లి అనవసర ప్రసంగానికి ముఖం చిట్లించింది. జగన్నాధరావు ఒక చిన్న దగ్గు దగ్గిగొంతు సవరించుకుని ఏదో అనేలోగానే రామనాథం "మన పిల్ల ఊరికే తిరుగుతోందా! వాళ్ళ ధర్మమా అని వున్నవూరు కనుక మన పిల్ల మనకళ్ళకు ఎదురుగా కనపడుతోంది. పరాయి వూరు అయినా ఉద్యోగం అన్నాక వెళ్ళవలసిందే కదా! వారు మంచి మనస్సుతో ఒక సంస్థ అంటూ పెట్టి, సుమనకు ఉద్యోగం ఇచ్చేరు. అది చాల్దా" అన్నాడు.

"ఆడపిల్ల అన్నాక ఇల్లు కనిపెట్టుకుని వుంటుందా! ఆడపిల్ల అంటేనే అక్కడపిల్ల అని అర్థం. ఉద్యోగం అయినా పెళ్ళి అయినా పొరుగూరు వెళ్ళవలసినదే కదా! మీ చాదస్తం కాని." అంది శాంతమ్మ మౌనంగా కాఫీలు ముగించి అందరితోనూ చెప్పి బయలుదేరారు. నళిని మనస్సు కుంచించుకుపోయింది. ఏమిటి శాంతమ్మ ఆంతర్యం! సుమనని కుక్కలా తిప్పుకుంటా! తమ ఇంటి చుట్టూ నాలుగు వందలూ ఇస్తానంటే సుమనలాంటి గ్రాడ్యుయేట్లు వెయ్యిమంది తిరుగుతారు. లోకజ్ఞానం లేదు. అహం భావం జాస్తి! దర్జాగా ఉద్యోగస్థురాలు అయిన కూతుర్ని, కుక్క నక్క అనటానికి నోరు ఎల్లా వచ్చిందో!' అనుకుంది. జగన్నాధరావు ఏకాగ్రతగా డ్రైవ్ చేస్తున్నాడు. వినత జగన్నాధరావు తెల్లటి లాల్చీలోంచి పచ్చగా కనపడుతున్న అతని వీపు బొద్దుగా దృఢంగావున్న అతని కంఠం, కంఠంమీంద మెట్లు మెట్లుగా వత్తుగావున్న జుట్టూ చూస్తూ కూర్చుంది. సుమన ఎటు చూడకుండా మౌనంగా తలవంచుకుంది. మనస్సులో జగన్నాధరావు ఎందుకు వచ్చేడు! నళినికి కారు డ్రైవింగ్ వచ్చును కదా! తను రావల్సిన అవసరం ఏముంది?

ఒకవేళతనూ తన పెళ్ళాం జోస్తీ తన ముందు ప్రదర్శించటానికా! వారిద్దరూ సినిమాకు వెళ్ళటానికి ముహూర్తం ఇవ్వాళే కుదిరిందా! కారులో తనని దిగబెట్టాలని వుంటే డ్రైవరుని పంపవచ్చు కదా! నళినికే మీ పనీ పాటూ లేదు. ఎక్కడికంటే అక్కడికి తయారు అవుతుంది. తను రాకపోతేనేం జగన్నాధరావుని ఎవరైనా కొరుక్కు తింటారా?' అనుకుంది.

స్టేషన్ వచ్చింది. అంతా హడావిడిగా దిగారు. వినత సూటుకేస్ పట్టుకుంది. బెడ్డింగ్ జగన్నాధరావు పుచ్చుకున్నాడు. టిఫిన్ కారియర్, మంచినీళ్ళచెంబూ సుమన తీసుకుంది. అంతా ప్లాటుఫారంమీదికి నడిచారు. ట్రయిన్ వచ్చింది. స్లీపర్‌లో తననెంబర్సు వెతికి సామాన్లు అక్కడ సర్దారు. నళిని క్రిందకు దిగింది. వెంటనే జాగ్రత్తగా జేరినదీ లేనిదీ జాబ్రువాయమందామని కిటికీ దగ్గరగా వచ్చింది. జగన్నాథం గుప్పిటతో వందరూపాయిల నోట్లుతీసి సుమన చేతిలో పెట్టి గుప్పిట మూస్తున్నాడు. మెరుపు

(వి)చిత్ర విజ్ఞానం



రక్తకణాలు మూడు రకాలు. క్రిమి సంహారణ గావించే తెల్ల కణాలు. ప్రాణవాయువు నందించే ఎర్ర కణాలు, రక్తస్రావాన్ని అరికట్టే "ప్లేట్‌లెట్" కణాలు. ఇవన్నీ ఎముకల మజ్జలో వుండే "స్టెమ్" కణాల నుండి ఏర్పడతాయి! ఒకే రకపు "స్టెమ్" కణాలనుండి, యీ మూడు విధాలయిన రక్తకణాలు ఏ విధంగా ఏర్పడతాయన్న సంగతి జీవశాస్త్రజ్ఞులకు అంతుపట్టలేదు! ఇది తెలుసుకోడానికి మజ్జను సన్నటి రంధ్రాలు గల ఒక ప్లాస్టిక్ డబ్బాలో వుంచి దాన్ని ఎలుక దేహంలో ప్రవేశపెట్టారు! ఇప్పుడు "స్టెమ్" కణాలనుండి రక్తకణోత్పత్తి ఎలా జరిగేది తెలుసుకోవడం సాధ్యమైంది!!

కొట్టినట్లు అయ్యింది నళినికి. ఇద్దరి మధ్యా ఏదోవుంది. ఏదోవుంది!' అనిపించిన నళినికి వళ్ళు జలదరించింది. కడుపులో పేగులు ఉప్పచుట్టుకుపోయి వికారంపుట్టింది. ట్రయిన్ కూతవేసింది. జగన్నాధరావుకూడా దిగాడు. నళినికి సుమన ముఖం చూడ బుద్ధికాలేదు. నీచురాలు! ద్రోహి! ఎంత వంచన! తన భర్త మటుకే!

"ఏమలావున్నావు!" అన్నాడు కారు స్టార్టు చేస్తూ.

"ఎలావున్నాను!" అంది నీరసంగా.

"చాలా నీరసంగా వున్నావు." అన్నాడు జగన్నాధరావు.

"అవును. హఠాత్తుగా గుండె దడదడలాడింది నా ప్రాణాన్ని ఎవరో పగ్గాలువేసి లాక్కుపోతున్నట్లు అనిపించింది." అంది. పెద్ద హోటల్‌ముందు కారు ఆపాడు. "ఎందుకిక్కడికి!" అంది నళిని.

ముఖం గాడ్పుకొట్టినట్లుగా వుంది. కొంచెం రిలాక్స్ అవుదువుగాని" అంటూ ఎయిర్‌కండిషన్ రూంలోనికి తీసుకువెళ్ళాడు.

స్పెషల్ కాఫీ ఆర్డర్ చేస్తూనే "టిఫిన్ ఏమయినా కావాలా?" అన్నాడు.

"వద్దు. వద్దు." అంది. జగన్నాదరావు గుండెలు తీసిన బంటు. తనని సంతోషపెట్టటానికి సినిమా ప్రోగ్రాం వేశాడు. కాని మనస్సులో 'సుమన దూరం వెళ్ళిపోతోంది. దానికేమయినా ముట్టచెప్పాలి' అనిపించి బయలుదేరాడు. తను చూడలేదు అనుకున్నాడు. పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగుతూ తనని ఎవరూ గమనించటం లేదు అనుకుంటుందిట. కామాతురులూ అంతే! ఈ మధ్య ఇతని కలుపుగోరుతనం, తన మాటకు ఎదురు తిరగకపోవటం అవి అన్నీ సుమన పొందుకోసమా! శాంతమ్మ భయంగా అంది 'కుక్క' అని. నిజంగా ఆమె మనస్సుకి కూతురు ఉద్యోగం చేయటంఇష్టంలేనంటే మాన్పించేయకూడదూ! "కుక్క"లా ఇళ్ళ చుట్టూ తిప్పకపోతే ఇంట్లో చిలకలా పంజరంలో వేసి ఉంచుకోకూడదూ! కుక్కట కుక్క! కుక్కకే అవమానం, కుక్కకున్న విశ్వాసం మనుష్యులకుందా! కుక్కని నీచోపమానం క్రింద ఎందుకు ఉదహరిస్తారు! కుక్కకున్న విశ్వాసం వుంటే నమ్మిన స్నేహితురాలి భర్తనే, తను వలలో వేసుకుంటుందా! ఛీ ఛీ! అయినా పరాయి పిల్లనెందుకు అనుకోవడం. మన బంగారం మంచిదికాదు.

కంసాలి నెందుకు నిందించటం?


"సినిమాకు వెళదామా అన్నాడు జగన్నాధ రావు కాఫీలయాక.

"ఏ సినిమా?" అంది.

"పరువు ప్రతిష్ఠ." కొత్త సినిమా! ఈరోజే విడుదల అయ్యిందిట" అన్నాడు.

నవ్వువచ్చింది. నళినికి. "పరువు ప్రతిష్ఠ. సినిమాచూసినంత మాత్రాన్న వాట్ల విలువ తెలుస్తుందా? 'కామాతురాణాంన భయం నలజ్జా' అన్నారు, పెద్దవాళ్ళు. సిగ్గు, భయంవున్నవాళ్ళు ఇల్లాంటి పనులకు తలపడరు. పరువు ప్రతిష్ఠ కావాలనుకున్నవాళ్ళు ఇల్లాంటి అవకతవక పనులు చేయరు. గౌరవం, దర్జా; కావాలంటే నలుగురిలో ఆమెను కూడా స్వీకరించి వేరే వుంచాలి. డబ్బు కలవాడు. "సిరిగలవాడికి చెల్లును" అన్నారు. అంతే కాని చాటుమాటు వ్యవహారాలు ఎందుకు?

నళినికి బుర్ర తిరుగుతోంది. ఒక ఆలోచనా స్థిరంగా నిలవటంలేదు. కాస్సేపు జగన్నాధ మీద కోపం. కాస్సేపు సుమనమీద అసహ్యం కసి. కాస్సేపు సుమన తల్లితండ్రులమీద కోపం. ముప్ఫయే ఏళ్లువచ్చి వాళ్ళల్లోని కోర్కెలన్నీ ఎండిపోయేదాకా పెళ్ళిళ్లు చేయకపోతే వాళ్ళు మటుకు ఏం చేస్తారు? "యవ్వనం కాటేసింది" లాంటి సినిమా కథలు వూరికే వ్రాసి పారేసారా రచయితలు? పిల్లలు ఏం చేస్తారు? ఎవరికి దొరికిన దోవ వాళ్ళు వెతుక్కుంటారు. వాళ్ళదేం తప్పు? పెద్దవాళ్ళు ఒకదారి ఏర్పరిస్తేనే ఆదారి నచ్చక పెడదారి పడతారు. తన భర్తలాంటి వాళ్ళు ఏదారీ ఏర్పరచకుండా వుంటే ముళ్ళ దారి అయినా, డొంక దారి అయినా నడవక తప్పదు. నడవక ఏంచేస్తారు? నడక వచ్చిన పిల్లలకు మంచి దారిచూపించి, 'ఈ దారిని నడవమ్మా? నీకు చీకూ చింతా వుండదు. ముళ్ళూ గోతులూ వుండవు. రాళ్ళూ రప్పలూ తగలవు' అని చెప్పవలసిన బాధ్యత



కనిపించిన వాళ్ళది కాదా! అనుకుంది నళిని.

"తల నెప్పిగావుంది. ఇంటికి పోదాం" అంది.

"సరేలే!" అన్నాడు జగన్నాథరావు.

* * *

ట్రయిన్ బయలుదేరింది. 'వినత' జట్టీదానిలా వుంటుంది కాని గ్రహింపుశక్తి లేనిదికాదు. జగన్నాథరావుగారు వూరిలో పలుకుబడికల మనిషి అనీ పెద్ద ధనవంతుడనీ తెలుసును. చిన్నప్పుడంతా తోటపిల్లలతో కలిసి మామిడి పిందెలు, లావ ఉసిరికాయలు పెద్ద ఉసిరికాయిలూ ఏరుకుని వాళ్ళ తోటలోనే ఇసుకలో కప్పెట్టేవారు. ఒకొక్కళ్ళు ఒకొక్క జాగా ఆనవాలు పెట్టుకునేవారు. రెండుమూడు రోజులు పోయాక వచ్చి ఆ కాయలు ఇసుకలోంచి తీసి ఇసుక దులుపుకుని పండాయి పండాయి అనుకుంటూ తినేవారు.

జగన్నాథరావుగారి తోట వెనకభాగానికి ఆనుకుని పెద్ద పొడువుగా కాలిబాట వుంది. అది ఏటి గట్టుకి తీసుకువెళ్తుంది. ఏటిగట్టు పెద్ద ఇసుకమేట వేసివుంటుంది. గట్టు పొడుగునా సరుగుడు మొక్కలు ఆకాశం అంటేంత ఎత్తులో వుంటాయి. ఇసుక నిండా సరుగుడు సుల్లలు చిన్నచిన్నవి కూరుకుపోయి వుంటాయి. ఇసుకకదా అని పిల్లలంతా పరుగులుపెట్టేవారు. కాళ్ళల్లో ముళ్ళల్లా గుచ్చుకునేవి సన్నటి సరుగుడు ముళ్ళు. వూరిలో పిల్లలకంతా జగన్నాథరావుగారి తోట ఆటస్థలం క్రింద వుండేది. మేడ ముందరి భాగమంతా నౌకర్లు చాకర్లు పిల్లగాంగుని చేరనీయకుండా వేయికళ్ళతో కనిపెట్టి వుండేవారు. అంచేత పిల్లలంతా మేడ వెనుకనించి తోటలో జేరేవారు. ఎవళ్ళన్నా చూసి అదిలిస్తే పాలోమంటూ ఏటిగట్టు వెంపు పరుగులు పెట్టేవారు.

పెద్ద పడవకారు వస్తోంటే పిల్లలంతా చుట్టూ వున్న తీగల్లోనూ డొంకల్లోనూ దాగిపోయేవారు. కారులోంచి షేర్వానీకోటు చేతిలో అందమైన చిన్న హేండ్‌స్టిక్ పట్టుకుని దర్జాగా దిగేవాడు జగన్నాథరావుగారు. ఎక్కడో పెద్ద బస్తీలో చదువుతున్నాడని చెప్పుకునేవారు. ఎప్పుడో

చిన్నప్పుడు ఒకటిరెండుసార్లు దూరాన్నించి కుతూహలంగా చూడటమేకాని ఇంత దగ్గిరగా చూడలేదు. పెద్దదయిన తర్వాత ఇంటిపట్టున వుంటూ గుమ్మం కదలటం అంటే ఇష్టపడేది కాదు. తల్లి కేవలపక్షం, భూదేవి కేవలపక్షం అంటారు. శాంతమ్మకూడా వినతని ఆ పనీ ఈ పనీ చెప్పి అస్తమానూ రాచిరంపాన పెట్టుంది. పూర్వం ఆమెకి అత్తవారింటికి వెళ్ళిపోయిన సావిత్రి, అందాల అపరంజి రాధ. అంటే అపురూపంగా వుండేది. ఇంక శ్రీనివాస్ ఆ ఇంటికి యువరాజే! చదువు సంధ్యారాదని రామనాధానికి వినతఅంటే ఒక వాసిచిన్నచూపే! శ్రీనివాస్ అయితే ఎప్పుడూ వినతని అక్కా అని పిలవడు. 'మొద్దూ' అనో 'ఇడ్లీ' అనో పిలుస్తాడు. వినత ఇంటిపట్టున వుండుటచేత బొద్దుగా కాస్త పొట్టిగా వుంటుంది. చామన చాయముఖం గుండ్రనికళ్ళు. రాగిరంగుగావున్న వత్తయిన పెద్ద జుట్టు. బాగాపట్టి పట్టిచూస్తే అందంగానే వుంటుంది. జగన్నాధరావుగారు అక్క దగ్గిరగా నించోటం చూసింది. చేతిలో డబ్బు చూసింది. అతను ఇవ్వటం కూడా చూసింది.

"ఎందుకక్కా' నళినిగారు చూడకుండా ఇచ్చేరు డబ్బు!" అంది వినత. సుమన గతుక్కుమంది. గుప్పెట విప్పుకుని చూసించి. అయిదు వందల రూపాయలున్నాయి. చిన్నచీటీ "దూరం వెళుతున్నావు. నీకు నచ్చినవేమన్నా కొనుక్కో! వేగం రావటానికి ప్రయత్నించు. నీ జగం!" అని వుంది, అతని ఉదారస్వభావానికి నీరు కారి పోయింది సుమన.

"ఆమె చూడకుండా ఇవ్వలేదు. జీతం ఒక నెలది ఇచ్చారు." అంది ఉలికిపాటును సర్దుకుంటూ.

ఆడది అబద్ధం ఆడితే గోడకట్టినట్లుంటుంది. అని ఎవరో మగవాళ్లు వ్రాసివుంటారు. ఎంచేతంటే—సుమన ఆడిన అబద్ధం అమాయకురాలయిన వినతను నమ్మించలేకపోయింది. ఆ రోజు పన్నెండో తారీకు! మూడో తారీకునే నెల జీతం తీసుకువచ్చింది. అయిదో తారీకున సావిత్రివద్దనించి జాబు వచ్చింది. ఇంట్లో తర్జన భర్జన లవుతూండగానే వైర్ వచ్చింది. ఇంక ప్రయాణం ఏర్పాటులన్నీ సుమన జీతం డబ్బుతోనే చేసారు. ఇంకా నెల కాకుండానే నెల జీతం ఇస్తారా! పైగా యీ నెల పనిచేయదు. సెలవు పెట్టింది కూడా! తిరిగి ఎన్ని రోజులకు వస్తారో! నాలుగు రోజుల పనికి అయిదువందలు ఇస్తారా? అయినా సుమనజీతం, నాలుగువందలు అయితే అయిదు వందలు నోట్లున్నాయి. ఎందుకు ఇచ్చినట్లు!

అక్క తన దగ్గర ఏదో దాస్తూంది. తను చెల్లెలుకదా? తననొక పనిపిల్లక్రింద చూస్తారు తప్ప కష్టం సుఖం మాట్లాడుకునే తోడబుట్టిన తోడు క్రిందచూడరు. ఎంచేత! చదువుకోకపోవటమా! చదువుకుని ఏమి చేయాలి! పెద్ద బ్రహ్మాండం బద్దలుకొట్టి పన్నెండేళ్ళప్పట్నించీ పట్నంవెళ్ళి చదువుకుని వచ్చింది సుమన. ఎం వరిగింది! రాధక్క చదువుకోకపోయినా పెళ్ళి అయింది. సావిత్రికి [illegible] గత్తెనని గర్వం! సావిత్రికి పెద్ద ఉద్యోగస్థుడి భార్యనని గర్వం! సుమనకు చదువుకున్నానని గర్వం! శ్రీనివాస్‌కి మగపిల్లవాడినని గర్వం! తల్లికీ తండ్రికీ అందరు పిల్లల్లోనూ ఏదో ఒక ప్రత్యేకత కనపడుతూ వుంటుంది-తనకొక్కతెకే! సుమన ఎంత చదువుకున్నా ఎవళ్ళయినా పెళ్ళి చేసుకుందుకు ముందుకు వస్తున్నారా! రాధక్కకంటే ఎక్కువ కట్నం అడుగుతున్నారు. దీని ధర్మమా అంటూ తనకీ ఇరవయినాలుగేళ్లు వచ్చేయి. సుమనకి పెళ్ళి అయ్యేదెప్పుడు! తనకి చూసేదెప్పుడు! వినత బుద్ధి పదును ఎక్కింది. ఆలోచించసాగింది.

(ఇంకా వుంది)

వారం..వారం..

పవని నిర్మలప్రభావతి

"వినా"తో ఓ మాట చెప్పాలనుకుంటున్నాను!" అంది సీత మెల్లిగా. ఆఫీసుకు వెళ్ళబోతున్న గోపాలరావు ఆగి, భార్యవేపుచూస్తూ "ఒకమాటే గదా? అయితే చెప్పు!" అన్నాడు నవ్వుతూ.

"ఓ పేద కుర్రాడు మన రాము క్లాస్ అంటే ఇంటర్ లో చేరాడట తండ్రి లేడట తల్లివుందిట కానీ, ఆమె పల్లెలో వుంటుందట. అక్కడ ఓ గేదెను మేపుకుంటూ పాలమ్ముకుని జీవిస్తుంటుందట. పిల్లవాడిని బస్తీలోపెట్టి చదువుకూ భోజనానికీ వసతి కల్పించే అవకాశం లేదట బంధువులెవరో కుర్రాణ్ణి చేరదీసి, చదువుకయ్యే ఖర్చు మాత్రం భరిస్తామన్నారట భోజనందొక్కటే వాడికి సమస్యట ఆ కుర్రాడిపేరు కృష్ణ!" సీత ఇంతా చెప్పుకుపోతుండగా గోపాలరావు అడ్డొచ్చాడు

"సీతా! ప్లీజ్! అసలు పాయింటు వదిలేసి ఎటో వెళ్ళిపోతున్నావు నువ్వు చెబుతానన్న "ఓ మాట"కు ఉపోద్ఘాతమే ఇదైతే ఇక ఆ మాటొక్కటీ ఎంత పెద్దోనని హడలు పుట్టుకొస్తోంది "వాచీకేసి చూచుకుంటూ అన్నాడు నవ్వుతూ.

సీతకూ నవ్వొచ్చింది నవ్వాపుకుంటూ అంది. "వారానికో రోజు మనింట్లో భోజనం పెడదామనుకున్నాను. మిగతా వారాలలో మనకు తెలిసిన వాళ్ళకుగానీ. ఫ్రెండ్సుకుగానీ చెప్పి, ఏర్పాటు చేయించవచ్చు. మన రాముకూడా ఎంతో సంతోషిస్తాడు. ఏమంటారు?"

గోపాలరావు క్షణకాలం ఏదో ఆలోచించి అన్నాడు. "వారానికి ఒక్కరోజు. నెలకు నాలుగు రోజులే కదా! తప్పకుండా పెట్టు. మిగతా వారాల విషయం మనకొద్దు. మనం ఎవరికేనా చెప్పబోయినా, లేనిపోని సమస్యేదో తమనెత్తిన మనం పెట్టామని విసుక్కుంటారు మన కెందుకు సీతా! మిగతా వారాలు ఏర్పాటు వాడే చూచుకొంటాడు నువ్వు పెట్టదల్చుకున్న ఒక్కరోజూ పెట్టెయ్!" అంటూనే స్కూటర్ స్టార్ట్ చేశాడు అంతలోనే ఏదో గుర్తొచ్చిన వాడిలా సీతకేసి చూస్తూ అన్నాడు "నేనో మాట చెప్పనా సీతా!"

తనను అనుకరిస్తూ వెక్కిరిస్తున్నాడని తెలిసి సీత నవ్వింది. "చెప్పండి." అంది మెల్లిగా.

"ఏ పనైనా మొదలెట్టకూడదు. మొదలెట్టాక సాంతం అన్నిరోజులూ ఒక్కలా జరిగేలా చూడాలి " అతిగాడి మాటలు పూర్తికాకుండానే, భావం అర్థం చేసుకున్న దానిలా నవ్వేసింది సీత "మీకా భయం అవసరంలేదు కృష్ణను మధ్యలో తరిమేస్తానేమోనని కాదూ మీ భయం?అలా చెయ్యను లెండి. మన పిల్లలిద్దరూ అదనంగా ఓ ముద్ద తిన్నారనుకుంటాను నేను పూజించే దేవుడు సజీవంగా వచ్చి ఆహారం స్వీకరించాడను

★ ఉదయాన్నే పని మొదలైనప్పుడు కాదు కష్టం తెలిసేది. ఎండ వేడి పెరుగుతున్న కొద్దీ తెలుస్తుంది కష్టం. పనికిముందు ఆలోచనలకూ, పని మొదలయ్యేక ఆచరణలకూ మధ్య చాలాదూరమే ఉంటుంది. ★

కుంటాను " ఇంకా ఏదో చెప్పబోతున్న సీత మాటలకు అడ్డొస్తూ నవ్వాడు గోపాలరావు.

"ఇంకెన్నైనా అనుకుంటారు మీ ఆడ వాళ్ళు మూడ్ బాగున్నంతవరకూ! చూద్దాం! ఆ కృష్ణ అదృష్టం. మా భాగ్యం! వెండి తెరమీద చూద్దాం!"

స్కూటర్ వెళ్ళిపోయింది. సీత ఇంట్లోకి వచ్చింది. అందాకా పెరట్లో కూర్చోబెట్టివచ్చిన కృష్ణను, మరోసారి ఆప్యాయంగా, వాత్సల్యం నిండిన చూపులతో చూచింది. పదహారేళ్ళుంటా యేమో! ఇంకా తక్కువో! తన రెండో కొడుకు రాముకంటే, కాస్తపొట్టిగావున్నాడు. తెల్లగా వున్నాడు. వినయంగా వున్నాడు ఇలా ప్రతి ఇల్లాలినీ తన అన్నం కోసం అడగ వలసి రావటంవల్లో ఏమో అణువణువునా అభిమానంతో దహించుకు పోతున్నట్లున్నాడు.

"చదువుపట్ల ఎంత ఆసక్తి లేకపోతే ఇంతటి పట్టుదలతో, స్వాభిమానాన్ని కూడా చంపుక, వారాలు చేసుకోందుకు సిద్ధపడతాడు? అనిపించింది సీతకు. రాము "అమ్మా! ఓ రోజు మనం పెడదామా?" అని అడిగినప్పుడే అనిపించింది తనకు. ఆ పూటే తీసుకు రావల సిందని—

"బాబుగారు ఒప్పుకోలేదా అమ్మా?" అన్నాడు కృష్ణ సీత తనకేసి అలాగేచూస్తూ నిల్చుండి పోవటం చూచి, ఇబ్బందిగా అటూ ఇటూ చూస్తూ. సీత త్రుళ్ళిపడ్డట్లుగా అంది "అబ్బే' ఒప్పుకున్నారు కృష్ణా. ఈ రోజు ఎలాగూవచ్చావు, తిధికూడా మంచిది. అన్నం తినిపో! ఈసారినుంచి ఆదివారం వస్తుండు. ఆదివారమైతే పిల్లలిద్దరికీ కాలేజీకీ, స్కూలుకూ శలవు. బాబుగారూ ఇంటి దగ్గరే వుంటారు! నాకూ తీరుబడిగా వుంటుంది!" అంది సీత.

వెంటనే, ఆకులో అన్నం, కూర, పచ్చడి వేసుక తెచ్చి, వంట గది ముందున్న వరం డాలో పీటవాల్చి పెట్టింది. ఓ కప్పుతో సాంబారు, మరో కప్పుతో పెరుగు తెచ్చి దగ్గర వుంచింది. వంట ఇంటి గడపమీద కూర్చుని. "మరి కాస్త కూర వెయ్యనా! ఇంకాస్త పులుసువేసుకో! మజ్జిగ కావలిస్తే అడుగు మొహమాటపడకు. భయపడకు మీ అమ్మనే అనుకో!" అంటూ కొసరికొసరి వడ్డించి తినిపించింది. కృష్ణ వెళ్ళిపోయాక ఎంతో గొప్ప పనేదో తను సాధించినట్లు తృప్తి పడింది సీత.

ఆదివారం గోపాలరావూ, సీనియర్ ఇంటర్ చదువుతున్న రవి, ఇంటర్ చదువుతున్న రాము, ఇంటి దగ్గరే వుంటారు. గోపాలరావుకు స్వీటు ఇష్టం. పిల్లలిద్దరికీ "హాట్" ఇష్టం. అంచేత ఆదివారం ఓ స్వీటు హాటూ, వంటతోబాటే తప్పని సరిగా చేస్తుంది సీత.

"కృష్ణకూడా కాస్త స్వీటూ, హాటూ ఇద్దాం అమ్మా!" అన్నాడు రవి తల్లి ఏమం టుందో ననుకుంటూ.

సీత నవ్వింది. "అలాగే రవీ! మీరంతా ఏం తింటారో అదే వాడికీ పెడతాను. మీతో బాటే వాడూను! వారాలకొచ్చే కుర్రాళ్ళను, కొందరు ఇల్లాళ్ళు చాలానీచంగా చూస్తారట! మిగిలిపోయిన చద్దెన్నమూ, చద్ది కూరలూ వేస్తారట ఏదో కుక్కకో . గేదెకో వేస్తు న్నట్లు అలా నేను చెయ్యను!" అంది. రవి కొంగిపోయాడు.

అప్పుడే వచ్చిన కృష్ణకు, వేడివేడి అన్నం, కూర, సాంబారు, పచ్చడి, పెరుగు, స్వీటు, హాటుతో భోజనం అమర్చింది సీత.

నెల తిరిగింది. నెలలో నాలుగు సార్లు వచ్చాడు కృష్ణ, ఈ నాలుగు వారాలలో వాడు రాముకూ,రవికీకూడా బాగా స్నేహితుడయ్యాడు. అన్నం తిన్నాక వాళ్ళతో కేరమ్స్ ఆడు కుంటాడు కాస్సేపు మరో రెండిళ్ళలో మాత్రమే వారాలు కుదిరాయట! మిగతా నాలుగు రోజులూ, ఇంటి దగ్గర్నుంచి తల్లి పంపగలిగే కొద్దిపాటి బియ్యం, రోజూ కొద్ది కొద్దిగా వండుకుని కాలక్షేపం చేస్తున్నాడట— అలా కబుర్లు చెబుతుంటాడు. ఆ రెండిళ్ళలో నయినా ఆ గృహిణులిద్దరూ ఆ గృహస్థుల భయానికి మాత్రమే పెడుతున్నారట అన్నం

తనకి! ఆ విసుగంతా వడ్డనలో చూపిస్తారట!

"మీ అమ్మగారంతటి మంచి తల్లిని నేనెక్కడా చూళ్లేదు రామూ!" అంటుంటాడు తరచూ!

అలాటప్పుడు సీతకు ఎంతో గర్వం కలుగుతుంది. తనమీద తన త్యాగంమీద గొప్ప "కాన్ఫిడెన్స్" ఏర్పడింది!

మరోనెల గిర్రున తిరిగింది. "కృష్ణ తమ ఇంటికి రావటం మొదలెట్టి ఇది ఎనిమిదో వారం! పిల్లాడి కళ్ళల్లోకి కొత్త కళవచ్చింది. ఒంట్లోకి కూడా బలం వస్తోంది'" అనుకుంది సీత తృప్తిగా: ఆ మాటే అంది గోపాలరావుతో.


"ఇంకా నయం. వాడతో అనకు. లోపల నవ్వుకుంటాడు'మనం వాడికి పెడుతున్నదల్లా వారానికి ఒక్కరోజు! ఒకేఒక రోజు! అంతలోకే వాడు తెగబలిసి పోతున్నాడని నువ్వు భ్రమపడితే . అంతటిఆత్మవంచన మరోటిలేదు. నీ లెక్క ప్రకారం, నీచేతిభోజనం రోజూచేస్తున్న నేనూ, పిల్లలూ, భారత దేశంలోనే మూప సరిపోలని వస్తాదులమయ్యేవాళ్ళం " అన్నాడు పకపకా నవ్వుతూ.

సీతక్కూడా నవ్వొచ్చింది. గోపాలరావూ రవీ, రామూ సన్నగా, పొడుగా వుంటారు.

"మీ శరీర తత్వమే అంత! ఏంతిన్నాలావు కారు!" అంది.

"తెలుసుకున్నావు కదా! అలాగే కృష్ణ కూడా! ఏం తినకున్నా, నిండుగా కనిపిస్తాడు! ఖర్మకొద్దీ వాడు నీ చేతి భోజనంవల్లే తెగ లావెక్కి పోతున్నాడని-తగ్గించేవు!" అన్నాడు గోపాలరావు.

మూడోనెల జరుగుతోంది! గోపాలరావు నెలసరి ఖర్చులకని సీతచేతి కిచ్చేస్తాడు డబ్బంతా. ఇంటికొక్కవలసిన అన్ని వస్తువులూ ఒనరులూ చూచుకోవటం ఆమెవంతే!



ఈనెల బడ్జెటులో ఎంచేతో కొద్దిగా లోటు కనిపించింది సీతకు. ప్రతినెలా పాతికపైగా ఆదాచేయగలిగేది.

వస్తువులలో పప్పులూ, నూనె, నెయ్యి, పాలు అన్నీ అదనంగా తెప్పించవలసి వస్తోంది! ఎందుకని? అదనపు మెంబరు కృష్ణ కోసం! వారానికొక్క రోజేగదా? అయితేనేం' అనుకోకూడదుగానీ వాడు తిండి పుష్టిగల పిల్లాడు! రవి, రాము, ఇద్దరూ కలిసి తినే దానికంటే ఓ ముద్ద ఎక్కువగానే తింటాడు ఒక్కడూ! అలాగే స్వీటు అంటే చాలా ఇష్టమేమో మొదట్లో తను "మరి కాస్త వేసుకోరా! ఏమిటా తిండి! చేదా?" అంటూ ఆప్యాయంగా వడ్డించేది. ఇప్పుడు బాగా చనువు వచ్చింది. కాబట్టి, "అమ్మా! మరి కాస్త స్వీటు వెయ్యి! ఈ వారం భలేబావుంది! పకోడీలు కూడా మరోపది వెయ్యి నోట్లో వేసుకుంటేనే కరిగిపోతున్నాయి!" అంటూ అడిగి మరీ వేయించుకుంటాడు. "మాకు గేదె వుందని పేరేగానీ, మజ్జిగకూడా నోచుకోలేదమ్మా నేనూ, మా అమ్మా! పాలుచుక్క మిగలకుండా అమ్మేస్తాం! ఇంత మంచి పెరుగు ఎక్కడ తింటాం!" అంటాడు పెరుగన్నం కలుపుకుని' గాజు గ్లాసు నిండుగా మజ్జిగ పోయించుకొని తాగుతూ "అదో! సోమవారం (పెట్టె) వారింట్లో మూడు రోజుల నాటివో ఏమో! పులిసిపోయిన మజ్జిగ పోసేస్తారు! ఓ రకంగా వాసన కూడా వస్తాయి!" అంటాడు! ఆప్యాయతగా వాడు "అమ్మా!" అని కబుర్లు చెబుతుంటే బావుందిగానీ, వాడి తిండే భయం పుట్టిస్తోంది!

జోసీ ఆదివారం ఒక్కపూట అని ఒప్పుకుంటే బావుండేదేమో! ఆదివారమంతా అనే సరికి . రెండో పూటా ఇలాగే—స్వీటు హాటు మినహా అన్ని సాదకాలు ఎక్కువెక్కువ చేయాల్సి వస్తోంది!

"అమ్మా!" గుమ్మంలో కృష్ణ పిలుపువిని ఆలోచనలు కట్టిపెట్టింది సీత. "రాము, రవి అన్నయ్య ఏరమ్మా? నాన్నగారు కూడా కన్పించలేదే!" అన్నాడు వాడు లోపలికొస్తూ సీత కాస్త చిరాకనిపించింది. అది లోలోపలే అణుచుకుంటూ చిరునవ్వు అరువు తెచ్చుకుంటూ అంది "ఉదయం తొమ్మిదిన్నరకేదో మంచి ఇంగ్లీషు పిక్చరుందని వెళ్ళారు రా కృష్ణా! బహుశ ఓ అరగంటలో రావొచ్చు! నువ్వు కాళ్ళు చేతులు కడుక్కునిరా! నీకు అన్నం పెట్టేస్తాను " అంది.

"ఎందుకమ్మా! అరగంటేగా! వాళ్ళొచ్చే వరకూ ఆగుతాలే!" అన్నాడు.


"ఊహూ! ఒద్దులే! తొమ్మిది గంటలకి టిఫిన్ తినివెళ్ళారు. ఏ ఒంటిగంటకో రెండింటికో భోజనం చేస్తారిక వచ్చాక! అందాకా నువ్వు కనిపెట్టుకు వుండటం దేనికి! రా వడ్డిం చేస్తాను!" అంది వంట ఇంటికేసి వెళ్తూ.

"సరే అయితే!" కృష్ణ కాళ్ళు కడుక్కుని కూర్చున్నాడు అన్నం, కొద్దిగా కూర, పచ్చడి, కప్పుతో సాంబారు గ్లాసులో మజ్జిగ తెచ్చి పెట్టింది సీత.

'ఈ రోజేమిటో ఒంట్లో [illegible] కృష్ణా! స్వీటు, హాటు [illegible] " అంది. ఆమె [illegible] ఎందుకో [illegible] నాలుక పిడచకట్టింది [illegible].

కృష్ణ గాభరాగా [illegible] ఆమె [illegible]
"జ్వరం వచ్చిందేమిటమ్మా! డాక్టరు దగ్గరికి వెళ్ళలేక పోయారా! పోనీ టాబ్లెట్ ఏదేనా వేసుకోకూడదా? నువ్వు పదిమాట్లు తినక్కర. నాక్కావల్సిందేదో అడుగుతాలే! ఇవన్నీ చాలు—అసలు ఒళ్ళు బాగాలేదని తెలిస్తే, ఇంటి దగ్గరే కాసిన్ని బియ్యం వండేసుకునే వాణ్ణి!" అన్నాడు. వాడి కళ్ళనిండుగా మమత పొంగి పొరలుతున్నట్లనిపించిన సీత గతుక్కుమంది. కూర, సాంబారే, మరోమారు అడిగి వేయించుక తిని లేచి వెళ్ళాడు కృష్ణ పిల్లలొచ్చేవరకూ వుంటానంటాడేమో వాళ్ళు స్వీటు తింటుంటే భయపడింది సీత. కానీ కృష్ణ వెళ్ళిపోయాడు.

మరుసటి ఆదివారం, మరింత త్వరగా వచ్చినట్లనిపించింది సీతకు. కృష్ణను చూడగానే



పైకే చిరాకు పొంగుకు వచ్చిందామెకు! వీడు నిజంగా ఇతరుల ఇళ్ళలో వారాలకు ప్రయత్నించాడా? ఇంత సిటీలో ఏడుమంది గృహ[illegible], గృహిణులుగానీ వాడికి కలకో [illegible] అన్నం పెట్టడానికి అంగీకరించలేదంటే [illegible] కాదూ! అందుకే! [illegible] మంది [illegible] నే పెద్ద [illegible] పెద్ద [illegible] అని మురిసి పోయిందిగానీ, అది తన తెలివి తక్కువ తనమేమో! దాన్ని, వాడు బాగా ఉపయోగించుకొంటున్నాడేమో!

"కృష్ణకు అన్నంపెట్టి పంపి, మీకేర్పాటు చేస్తాను!" అంది సీత, భోజనాలకు సిద్ధమౌతున్న, గోపాలరావుతో, పిల్లలతో!

"ఎందుకూ రెండుమార్లు తిరగటం? అందరికీ వడ్డిస్తే పోలా?" అన్నారు ముగ్గురూ ముక్త కంఠాలతో!

సీతకు చికాకనిపించింది. వీళ్ళ కెలా చెప్పాలి? చెప్పినా అర్థంగాదేమో

"ఆదివారమైనా, మనందరం సరదాగా కూర్చుని కబుర్లాడుకుంటూ అన్నం తినటం లేదీ మధ్య! మీరోసారి, నేనోసారి .. రోజూలా!" అంది పెరట్లో కాళ్ళుచేతులు కడుక్కుంటున్న కృష్ణకేసి చిరాగ్గా చూస్తూ.

"పోనీ, నువ్వూ కూర్చోవమ్మా ..అందరం తిందాం!" అన్నాడు రవి.

"నీ మొహం! ఎడంచేత్తో కుడిచేత్తో అలా ఎవరంటే వాళ్ళు ముట్టు కుంటే నాకు తిన్నట్లే వుండదు!" అంది కరుగ్గా.

"ఇంత క్రితం అలాగే కాదా తింటున్నాం!" అనుకున్నాడు రాము లోలోపల! సీతకేసి నిదానంగా చూసిన గోపాలరావు మెల్లిగా పిల్లలతో అన్నాడు "పోన్లే! అమ్మకెలాదాపుంటే అలాగే చెయ్యనీ!" అని. కృష్ణ గాభరాగా అన్నాడు. "వాళ్ళందరినీ వదిలి నాకొక్కడికీ ఎందుకమ్మా!"

"కూర్చో కృష్ణా! వాళ్ళు కాస్సేపు ఆగుతారటలే!" అంది విసుగ్గా.

కృష్ణ కూర్చున్నాడు. ఆ చికాకులో సాంబారు మారు అడగలేదు. కూరా వెయ్యలేదు మరోసారి మజ్జిగ ఆకులోనే పోసింది. కృష్ణ తిని వెళ్ళిపోయాడు

"కృష్ణ కీరోజు స్వీటు, హాటు వెయ్యలేదేమిటమ్మా!" అన్నాడు రాము.

"మర్చిపోయావా?" అని కూడా అడిగాడు.

"నూనె, నెయ్యి ఎలామండి పోతున్నాయో తెలుసా? ఆమాటకొస్తే పప్పు దినుసులు. బియ్యం ఒకటేమిటి? మరి కొన్నాళ్ళలో మనందరం కూడా ఓ పచ్చడితో సరిపెట్టుకోవాల్సి వస్తుందేమో ననిపిస్తోంది!" అంది విసురుగా.

గోపాలరావు మెల్లగా అన్నాడు "అమ్మకేదో చికాకుగా వుందిరా రాము! ఈ మధ్య ఒంట్లో హుషారుగా వుండటం లేదంటోంది. విసిగించక భోజనాలు కానివ్వండి!"

"ఈ రోజుల్లో వస్తువులెలా మండిపోతున్నయో నీకు తెలుసుగా కృష్ణా! రాత్రి అన్నం మిగిలిపోయింది! ఉదయం పనిమనిషికిపెట్టాక కూడా మిగిలిపోయిందింకా! పారేసుకుంటామా ఏమిటి? సాంబారు కొద్దిగానే చేశాను అది కాస్తా పిల్లలకూ, ఆయనకూ సరిపోయిందీ రోజు కూర కిలో మూడు రూపాయలకేదీ తగ్గటంలేదు " అంది ఆ ఆదివారం సీత. కృష్ణకు ఆకులో చద్ది అన్నం, కాస్తంతపచ్చడి, మజ్జిగ ఇస్తూ

"ఏదో ఒకటిలే అమ్మా! చద్దెన్నం మిగిలిపోతే, మా అమ్మ ఆ అన్నంలో నిండుగా నీళ్లుపోసి వుంచుతుంది. రెండో పూటవున్నా మెతుకులు మెత్త బడవట అలా అయితే!" అంటూ తిన్నాడు కృష్ణ ఈవారం కృష్ణ వచ్చేలోగానే పిల్లలరూ భర్తకూ అన్నాలు పెట్టేసింది సీత! కృష్ణ వెళ్ళాక, గోపాలరావు సీతతో అన్నాడు.

"చద్దెన్నం మిగిలిపోతే మనం తింటే మాత్రం తప్పేమిటి సీతా! పదార్థం పారేసుకుంటామా? నాకూ కాస్త పెడితే సరిపోక పోయిందా!"

గంయిమంది సీత. "ఇంకా నయం! మీకు పెట్టాలీ చల్లగా చద్దెన్నం! కాస్తంత చల్లారినా, మీరూ పిల్లలూ ముట్టుకోరు. నాకూ సయించదు మరేం చెయ్యను " ఆమె మాటలు ఆమెకే ఏదోగా తోచాయి ఆక్షణంలో!

"ఏమిటో పరిస్థితులు మారిపోతున్నాయి!" అంది ఏదో ఆలోచిస్తున్నట్లు.

"పరిస్థితులు మారాయా? నువ్వు మారుతున్నావా?" అన్నాడు గోపాలరావు, పరీక్షగా సీతకేసి చూస్తూ.

"ఏమో బాబూ!ఈ కృష్ణగాడిదో పెద్ద ఖర్చై కూర్చుంది." అంది విసుగ్గాలేస్తూ సీత. గోపాలరావు చాలాసేపు అలాగే కూర్చుండిపోయాడు తీవ్రంగా ఆలోచిస్తూ. తర్వాత ఏదో నిశ్చయాని కొచ్చినట్లు, గబగబ డ్రెస్ చేసుకుని బయటకు వెళ్ళాడు.

ఆరోజు ఉగాది. పిల్లలకూ, భర్తకూ ఇష్టమైన వంటలూ పిండి వంటలూ చేయటంలో క్షణం తీరిక లేకుండావుంది సీత. ఏదో పని మీద ఆ వీధిలోనుంచి వెళ్తున్న కృష్ణ రవితో, రాముతో కాస్సేపు కబుర్లు చెప్పుకుందామని వచ్చాడు. వీధి వరండాలో రవి, రాముల గొంతుకల తోబాటు, కృష్ణ గొంతుక కూడా వినిపించటంతో సీతరో కోపం కట్టలు తెంచుకుంది.

ఈ రోజు ఉగాది! శనివారమని తెలుసు! అయినా కృష్ణవచ్చాడు, అదీ భోజనాలవేళ కాబోతుండగా! అంటే అర్థమేమిటి? ఈ రోజు పండగ స్పెషల్స్ ఏవో చేస్తానని వాడికి తెలుసు! పండగ పూటా ఇంటికి భోజనం వేళలో వస్తే, వెళ్ళమని చెప్పరని హాచా తెల్సు! అంటే? ఇంక ప్రతి పండగకూ ఇలా వస్తుంటాడా? కాదని చెప్పేందుకు వీలుపడదు. ఇక అదో "హక్కు"గా మార్చుకుంటాడేమో! ఆదివారాలలానే ఇదీ అలవాటుగా మారుతుందేమో! తను అనవసరంగా "జాలి" చూపటంతో వచ్చిందీ చిక్కంతా! తనేదో శాశ్వతంగా కావేశంతో మాటంది . అంతేగాని జీవితాంతం ఇలా వీణ్ణి పోషిస్తానని "బాండ్" రాసివ్వలేదు. అట్టు గారెలు కాలుస్తున్న పిండి చేతులతోనే, ఒక్క విసురుగా వరండాలోకి వచ్చింది సీత.

"కృష్ణా! ఇదేరా నీలాటి వాళ్ళతో వచ్చిన చిక్కు! ఆదివారాలంటే సరే! పండగరోజుల్లో కూడానా! శనివారమని తెలీదా ఈ రోజు."

రవి, రాములతోబాటు కృష్ణ నిర్ఘాంతపోయాడు. తల్లి మీద వచ్చిన కోపాన్ని

అక్కడ ప్రదర్శించలేక. రవి, రాము లోపలికి వెళ్ళిపోయారు. కృష్ణ తెల్లని మొహం, అవమానంతో, బాధతో జేవురించిందొక్క సారిగా.

"భోజనం కోసం రాలేదమ్మా! ఇటుగా వెళ్తుంటే, రవి అన్నయ్య వాకిట్లో కనిపిస్తే వూరికే పలకరించి పోదామని వచ్చానంతే! అదీగాక, రేపు ఆదివారంనుంచీ రానని చెప్పటానికి. ఎలాగూ ఇటే వెళ్తున్నాను కదా, మీతో ఆ సంగతి ముందుగా చెబితే నా కోసం వంట చెయ్యరని—వచ్చాను ."

గబగబ మెట్లుదిగి వెళ్ళిపోయాడు కృష్ణ. నిర్ఘాంతపోయింది సీత!

గోపాలరావు విసురుగా గదిలోనుంచి బయటకు వచ్చాడు! తప్పు చేసినదానిలా తల వంచుక నిల్చునివున్న సీతను చూస్తుంటే, అందాకా అతగాడిలో పెల్లుబికిన కోపం జాలిగా మారింది

"ఏమిటో ధరలు పెరిగాయని ఆదివారాలు సాయంత్రాలు మీతో కలసి సినిమాకో, షికారుకో రావాలన్నా వీలుగావటంలేదని..."

ఏమీ చెప్పలేకపోయిన సీత నోట్లోంచి మాటలు రావటంలేదు కళ్ళ నిండుగ నీళ్ళు మాత్రం నిలిచాయి.

"పోన్లే! జరిగిందేదో జరిగిపోయింది. కానీ ఈ రోజు నీకో కబురు చెబుదామనుకున్నాను. భోజనాల టైంలో సరదాగా రవి, రాము, నువ్వు అందరూ వుండగా చెబుదామనుకున్నాను. ఈలోగా కృష్ణ వస్తాడనిగానీ, నువ్వింత తొందర పడతావనిగానీ, వూహించుకోలేదు సీతా!"

సీత మాట్లాడలేదు.

"సీతా! చెప్తున్నాననుకోకు — నిన్ను గురించి నువ్వు తెలుసుకున్నావీరోజు ధరలు పెరగడమే కాదు, నీలో వాడిపట్ల దయ కూడా తరిగిందీ ఆరునెలల్లో! నీ బిడ్డల భవిష్యత్తు నేదోవాడు తినేస్తున్నాడన్న ఆరాటం పెరిగింది నీలో! మరో పరాయి తల్లి కన్న బిడ్డ ఆకలి వారంలో ఒకే ఒకరోజు తీర్చ గలిగే మాతృ మమత తగ్గిపోయింది. వారం వారం అన్నం కంటే ఎక్కువగా, నీ మనసు వాడికి శాపనార్థాలే ఎక్కువగా పెడ్తోందని నాకు తెలుసు. ఈ సమస్యకు పరిష్కారం ఎలాగా అని నేనూ చాలా రోజులుగా ఆలోచిస్తున్నాను. నిన్ననే ఓ నిర్ణయానికి వచ్చాను.

నా డాక్టర్ ఫ్రెండొకతనితో మాట్లాడాను ఈ విషయమై! నెలపొడుగూతా ఎవరో ఒకరు విసుక్కుంటూ పెట్టే అన్నం తినవలసివస్తే, ఇక కృష్ణలాటి చురుకైన విద్యార్థిలో "కాన్ఫిడెన్స్" ఎలా వుంటుంది? చదువుపట్ల ఆసక్తి ఎలా నిలుస్తుంది? వాడిలో ఆ అన్నం బలం కంటే ఎక్కువగా "సెల్ఫ్‌పిటీ"ని ఎక్కువ చేస్తే అదో భయంకరమైన మానసిక రుగ్మతగా పరిణమించవచ్చు నేనూ, ఆ డాక్టరూ కలిసి, ప్రతినెలా కృష్ణకు ఓ హోటల్‌లో "మీల్స్ టికెట్ల బుక్స్" కొనిస్తాం. నీకూ, ఆ డాక్టరుగారి భార్యకిగానీ, మరే గృహిణికిగానీ చికాకుండదీ పద్ధతయితే! డాక్టరసలు తన భార్యకీ విషయం తెలియవలసిన అవసరంగానీ తెలిపే అవకాశంగానీ వద్దన్నారు. నీలో కొంత సంస్కారం .. వుంది కాబట్టి, నీకు చెబుతున్నాను నిన్ను తప్పు పట్టడంలేదు నేనిప్పుడు. ఇకా విషయం వదిలెయ్! పద పద! లోపల వంటెలా వుందో చూడు!" అన్నాడు గోపాలరావు మామూలుగా.

సీత అలాగే నిల్చుండి పోయింది ఓ నిముషంపాటు! ఇతర గృహిణులందరికీ భిన్నంగా తనలో గొప్పగా వుందనుకున్న కొండంత సంస్కారం త్యాగం ఈ క్షణంలో దూది పింజంత పరిమాణానికి దిగిపోయిందని తెలిసిపోయింది తనకే!

పండగ రోజు సరదాగా పిల్లలతో కబుర్లాడుదామని వచ్చిన కృష్ణ అనవసరంగా చీవాట్లుతిని వుసూరుమంటూ వెళ్ళిపోయాడు... రవినీ, రామునీ బ్రతిమాలి, కృష్ణను పిల్చుకు రమ్మని పంపింది సీత. వేడివేడి గారెలూ, స్వీటూ, పప్పు, నెయ్యి, కూర, సాంబారు, పెరుగుతో కృష్ణ తమందరితోబాటు కూర్చుని సరదాగా కబుర్లాడుకుంటూ భోజనం చేశాకగానీ, సీతకు మరో పని తోచలేదు మరి! ☐

పూలు

టి. విమల

"సుజీ! ఏమిటి చూస్తున్నావ్?"

బాల్కనీలో కూర్చొని, వీధివైపు పరీక్షగాచూస్తోన్న శ్రీమతికి ఎదురుగ్గా కుర్చీ లాక్కొని, కూర్చుంటూ అడిగాను.

"రంగడు వొస్తాడేమోనని" సమాధానం చెప్పింది సుజాత.

సుజాతకు తెలియకపోవచ్చు. కాని, నాకు తెల్సు—ఇక రంగడు రాడని.

"వాడు చాలా రోజుల నుంచీ రావడం లేదండీ. వొంట్లో సుస్తీ చేసిందో ఏమో! పాపం దిక్కులేనోడు" సుజాతే మళ్ళీ దిగులుగా అంది.

అవును మరి! వాడికీ సుజాతకూ మధ్యవున్న అనుబంధం అటువంటిది.

నాకెందుకో నిజం చెప్పేయాలనిపించింది. కాని చెప్పలేకపోయాను.

సుజాత ఇంకా వీధివైపు చూస్తూనే వుంది.

నా ఆలోచనలు మాత్రం రంగడి చుట్టూ తిరుగుతూనే వున్నాయి.

రంగడు ఇసుకతో బ్రిడ్జీలు కట్టలేదు. చీకటి వ్యాపారం చెయ్యలేదు. దొంగతనాలూ, దోపిడీలూ చెయ్యలేదు.

అధికారాన్ని అరచేతిలో వుంచుకొని, అందినంతవరకు జేబులు నింపుకొని ఆస్తిపాస్తులు సంపాదించుకోలేదు. కామాంధకారంతో కన్నెపిల్లల శీలాన్ని దోచుకోలేదు.

పదవి చేజిక్కించుకోగానే, వేదికమీద ఉపన్యాసాలూ, ఎన్నికల వాగ్దానాలూ, ఓట్లుకోసం వొంగి వొంగి చేసిన దొంగ నమస్కారాలూ, ఓటువేసిన ప్రజల కష్టసుఖాలూ మరచిపోయి, ఎయిర్ కండిషన్డు గదుల్లో, నియోన్ లైట్ కాంతుల్లో, పట్టుపరుపుల మీద పవళించి, దేశాన్ని ఏ విధంగా కొల్లగొట్టాలో అని ఆలోచించే వినా(శ)యకుడు అంతకంటే కాదు.

ఈ దేశంలో—ఈ పవిత్ర భారత దేశంలో-

'అన్నమో రామచంద్రా'—అని ఎంతమంది అభాగ్యులో ఆర్తనాదాలు చేస్తున్నప్పటికీ అన్నపూర్ణగా వాసికెక్కిన ఈ దేశంలో—

'కోటి విద్యలూ కూటికొరకే' అని భావించి ఎంతమందో పొట్టపోసుకుంటున్న ఈ దేశంలో-

• జానెడు పొట్టకోసం కోటి విద్యల్లో ఓ విద్యని తాత్కాలికంగా జీవనాధారం చేసుకొని బ్రతికే ఒక దిక్కులేనివాడు—రంగడు.

వాడు ఒక పూలవాడు.

పూలమ్ముకొని బ్రతికే ఒక నిర్భాగ్యుడు.

కాని—ఆఖరిసారిగా వాడ్ని నేను చూచినప్పుడు వాడిమీద చెప్పలేనంత అసహ్యం కలిగింది. ఏహ్యభావం జనించింది. నిజంగా నా చూపులకి ఎదుటివ్యక్తి మాడి మసి అయ్యే శక్తిగానీ, మహిమగానీ వున్నట్లయితే రంగడు మాడి మసయ్యేవాడే! అలా వున్నాయి అప్పుడు నా చూపులు.

కాని—ఇప్పుడు వాడిమీద జాలి, సానుభూతీ మినహాయించి మరే భావమూ లేదు. అందుకే అప్పుడప్పుడూ రంగడ్ని గురించి బాధపడుతూ వుంటాను.

అసలు రంగడితో నాకు ఎలా పరిచయ

★ అందాన్ని రెట్టింపుచేసేవీ, ఆనందానికి ఆలంబనగా ఉండేవీ, చూడగానే ఆకర్షించేవీ పూలు. అయితే ఆ పూల వెనక హృదయం కదిల్చే కథలూ ఉండొచ్చు. ఆ కథ తెలిసినవాడు.... ★

మయ్యిందీ?

*　　　*　　　*

ఆ రోజు—

ఆ రోజూ ఇలాగే సాయంత్రం నీరెండలో, కుర్చీలు వేసుకొని బాల్కనీలో కూర్చొని, సిగరెట్టు పొగలతో మేఘాలు సృష్టిస్తూ, పడమటి కొండల్లో అంతిమ శ్వాస వొదులుతూన్న సూర్యుడ్ని చూస్తున్న తరుణంలో, వీదిలో అరుపులు వినిపించాయి.

నా దృష్టి పడమర కొండలమీది నుండి త్రుటికాలంలో వీధిలో అరుస్తూన్న ఆ మనిషి మీదికి మళ్ళింది.

అలా అరుస్తున్నవాడు—సుమారు ఏడెనిమిది సంవత్సరాల పసివాడు.

మాసిన చొక్కా—మాసిన నిక్కరూ—తైల సంస్కారంలేని జుట్టూ—జుట్టుమీద మేదర బుట్టా—బుట్టలో రకరకాల పూలూ—ఇదీ నాకు కనిపించిన ఆ పిల్లవాడి వాలకం.

పూలూ　పూలోయమ్మ పూలూ
ఘుమ ఘుమ గుబాళించే గుండుమల్లెలూ
తాజా పువ్వులూ. రోజా పువ్వులూ
సంపెంగలూ　సన్న జాజులూ
బొండు మల్లెలూ　చామంతులూ

—అరుస్తున్నాడు పూలవాడు. కాదు కాదు.. రిధమిక్‌గా పాటలా పాడుతున్నాడు.

నిజానికి వాడి నెత్తిమీద వున్న బుట్టలో అన్ని రకాల పూలు వున్నాయో లేదో నాకు తెలియదుగాని, పాటకోసం అనువుగా అలా పాడుతున్నాడని ఆ క్షణంలో నేను అభిప్రాయ పడ్డాను.

అంత చిన్న వయసులో, ఇప్పటినుంచే జీవిత పోరాటానికి సిద్ధమైన ఆ కుర్రాడిమీద నాకెందుకో సానుభూతి ఏర్పడింది.

వాడ్ని చూస్తూ అలాగే వుండిపోయాను, చాలసేపు.

"ఏమండీ! ఆ పూలవాడ్ని పిలవరూ" సుజాత నా వెనగ్గా నిలబడి అడుగుతోంది. అసలు ఆమె అక్కడికి ఎప్పుడు వచ్చిందో కూడా నేను గమనించలేదు.

మరుక్షణంలోనే వాడిని పిలిచాను.

సుజాతకు సన్నజాజులంటే ప్రాణం! అవే తీసుకుంది. డబ్బులిచ్చి పంపించేశాను పూలవాడిని.

వాడు వెళ్ళిపోయిన తర్వాత సుజాత కుర్చీలాక్కుని నా ఎదురుగ్గా కూర్చుంది.

"పూలు చూడండి—ఎంత బావున్నాయో. మంచులో తడిసిన ముత్యాల్లా వున్నాయికదూ" అంది సుజాత—సన్నజాజుల్ని ముక్కు దగ్గర వుంచుకొని, ఆ పరిమళాన్ని తనివితీరా ఆస్వాదిస్తూ.

"పూలు కొన్నది వాసన చూడ్డానికా? తలలో ముడుచుకోడానికా?" అన్నాను చిలిపిగా, సుజాత కళ్ళల్లోకి చూస్తూ.

"ఊఁహుఁ　తలలో　రాత్రికి" అంది సుజాత—సిగ్గుతో ముడుచుకుపోతూ—మధుర స్మృతులు మనసుని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే.

నేను కొంచెంసేపు మౌనంగా వుండిపోయాను. తర్వాత మరో సిగరెట్టు వెలిగించి పొగలు వొదులుతూ, ఆలోచిస్తూ వుండిపోయాను.

నిశ్శబ్దంగా నిముషాలు దొర్లిపోతున్నాయి.

"ఏమిటోనండీ! వాడ్ని చూస్తుంటే జాలేస్తుంది నాకు. అందుకే నేనెప్పుడూ వాడిదగ్గరే పూలు కొంటుంటాను"—ఉన్నట్లుండి సుజాత నోటినుండి వెలువడిన మాటలకు, ఆలోచనల నుండి తేరుకొని, క్షణకాలం సుజాత ముఖంలోకి చూశాను ఆశ్చర్యంగా.

"ఏవిటి సుజీ! ఆ పూలవాడు నీకు ఇంతకు ముందే తెలుసేమిటీ?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆహాఁ. రోజూ నేను కురుల్లో తురుముకొనే పూలూ—రోజూ తమరు పడగ్గదిలో నా తల్లోని పూలవాసనల్ని ఆస్వాదిస్తూ సుజీ డియర్! ఈ పూలెంత బావున్నాయ్! ఎంతటి పరిమళాల్ని వెదజల్లుతున్నాయ్! ఆహాఁ . ఓహో అని మీరు మెచ్చుకొనే పూలూ—నాకెక్కడి నుండి వొస్తున్నాయనుకొన్నారు? ఆ కుర్రాడు తెచ్చేవా గదా!" అంది సుజాత కాస్త ఎక్కిరింపుగా, కాస్త డ్రెమెటిక్‌గా.



'ఇంకేం మొగుడికోసం పూలవాడ్ని మంచి చేసుకొన్నావన్నమాట! ఇంతకీ నేను రోజూ పూలు తీసుకురావడం లేదనేగదా ఈ వెక్కిరింపంతా. అది కాదోయ్! నీకు తెల్సుగదా నా సంగతి. నీమీద నాకు పూలు తెచ్చేంత ప్రేమ కూడా లేక కాదు. మతిమరుపు అంతే!" అన్నాను శ్రీమతిని వుడికించాలనే ఉద్దేశంతో.

సుజాత నవ్వి వూరుకుంది.

ఆ తర్వాత సుజాత చెప్పిన కధనాన్నిబట్టి ఆ పూలవాడి పుట్టు పూర్వోత్తరాలు యివి—

వాడి పేరు రంగడు.

వాడికి తల్లెవరో, తండ్రెవరో తెలీదు. అసలు ఎక్కడ పుట్టాడో, ఎప్పుడు పుట్టాడో కూడా తెలీదు. వాడికి ఊహ తెలిసేనాటికి ఈ ఊరి వీధుల్లో తిరుగుతున్నాడు. వాడి చేతుల్లో చిల్లులు పడిన ఎనామిల్ గిన్నె వుంది. దానిలో చిల్లర డబ్బులున్నాయి. అంతే! వాడికి అర్థమయి పోయింది తనెలా బ్రతుకుతున్నాడో. అంటే తను అడుక్కు తింటున్నాడన్నమాట! అలా అడుక్కుతినడం వాడికి అవమానంగా తోచింది. అంతేకాదు తన జీవితం మీద రోతకూడా పుట్టింది. కాని ఏమి చెయ్యగలడు తను? కష్టించి పనిచెయ్యలేని పసితనం. అందుకే విధి లేక కొంతకాలంవరకూ పాతజీవితంలోనే బ్రతి

కాదు. ఆ తర్వాత—సోమరిపోతులా ఒకరి దయాదాక్షిణ్యాల మీద బ్రతగ్గూడదని నిశ్చయించుకున్నాడు. అంతే! ఆ ఆలోచన రావడమే తడవుగా అడుక్కు తినడానికి స్వస్తి చెప్పాడు. వాడి చిన్న బుర్రలో ఎన్నో ఆలోచనలు బొంగరంలా గిరగిరా తిరిగాయి—ఎలా బ్రతకాలి? ఎలా బ్రతకాలి? అని. ఆఖరుకి ఓ ఆలోచన వచ్చింది. అదే వాడికి నచ్చింది. అది తప్పో వొప్పో ఆలోచించుకొనే పరిపక్వ దశలో వాడి మెదడుగానీ, ఆలోచనా విధానంగానీ వాడికి లేకపోయింది. అందుకే పూలమ్ముకొనే వాడిగా రంగంలో ప్రవేశించాడు. అలా వచ్చిన డబ్బులతో ఎలాగో వాడి పొట్టను వాడు పోషించుకుంటున్నాడు.—ఇదీ రంగడ్ని గురించి సుజాత చెప్పిన కథా సారాంశం.

నాకెందుకో వాడి కథ విన్న తర్వాత రంగడి మీద చెప్పలేనంత అభిమానం ఏర్పడిపోయింది.

విచక్షణా జ్ఞానంలేని ఏ పుణ్యాత్ములో చేసిన చీకటి తప్పుకు ప్రతిఫలంగా వాడు భూమ్మీదపడి కళ్ళు తెరిచాడు. పుట్టినందుకు విధినీ, జన్మనిచ్చి, నిర్దాక్షిణ్యంగా గాలికి వొదిలేసిన కసాయి తల్లిదండ్రుల్నీ తిట్టుకుంటూ, సోమరిపోతులా వాడు బ్రతకాలనుకో లేదు. కష్టించి పొట్టనింపుకోవాలనే విచక్షణా జ్ఞానం వాడిలో కలిగినందుకు నిజంగా రంగడ్ని మనసులోనే అభినందించాను.

అది మొదలుకొని రంగడు రోజూ మా ఇంటికి వస్తూనే వున్నాడు. రోజూ సుజాతకు పూలు యిస్తూనే వున్నాడు.

కొద్ది రోజుల్లోనే సుజాతకీ రంగడికీ ఓ విధమైన బంధం ఏర్పడిపోయింది. వాడిని పిలిచి అప్పుడప్పుడూ ఏ కాఫీనో, టీనో యిస్తుండేది. కొన్ని కొన్ని సమయాల్లో అన్నంకూడా పెడుతూండేది. వీలుపడినప్పుడల్లా నాతోనూ సుజాతతోనూ గంటల తరబడి లోకాభిరామాయణం మాట్లాడుతూ మా ఇంట్లోనే కాలం గడిపేవాడు రంగడు.

నాకు రంగడిమీద ఏర్పడిన సదభిప్రాయానికి చిహ్నంగా ఒకటీ రెండు సందర్భాలలో నేను వాడికి కొత్తబట్టలు కూడా తీసిచ్చాను. అంతేకాదు. వీలుచూచుకొని ఎప్పుడో ఒకసారి రంగడ్ని నేను పనిచేసే కంపెనీలోనే ఏదో ఒక చిన్న పనిలో నియమించాలనికూడా నేనూ సుజాతా ఎన్నోసార్లు అనుకున్నాము.

కాని, నా ఆలోచనలు తారుమారయ్యాయి. నేను రంగడిమీద ఏర్పరచుకున్న సదభిప్రాయం ఒక్కసారిగా నేల పాలయిన పన్నీరయిపోయింది.

ఆ రోజు ఆ క్షణం నేను రంగడ్ని చూచిన క్షణం వాడూ భయం భయంగా నన్ను చూచిన క్షణం వాడి చూపులూ నా చూపులూ ఒకేక్షణం 'ఢీ'కొన్న క్షణం వాడు చేస్తున్న పని నీచాతి నీచమైన పని నాలో పెనుతుఫాను సృష్టించిన క్షణం వొద్దు వొద్దు ఆ ఆలోచనే అతి భయంకరం

ఆ సంఘటన తలుచుకున్నప్పుడల్లా నా ఒళ్లు జలదరిస్తుంది. నాలో రంగడిమీద వున్న సానుభూతి, జాలి పటాపంచలయిపోతుంది నాలో కోపం కట్టలు తెంచుకొంటుంది.

దీనికి కారణం ఎమిటి? ఎందుకు రంగడిమీద ఇంత అసహ్యాన్నీ ఏహ్యభావాన్నీ ఏర్పరచుకున్నాను? .

* * *

ఆ రోజు—

ఆదివారం. ఆఫీసు లేదు.

శనివారం రాత్రి స్నేహితులతో సెకండుషో సినిమా చూచి, రాత్రి ఆలస్యంగా ఇంటికి వొచ్చి, ఆలస్యంగా నిద్రపోవడంవల్ల, నిద్ర మత్తు వొదలక, బారెడు పొద్దెక్కినా ఇంకా ముసుగుతన్ని పడుకునే వున్నాను.


"ఏవండీ! ఏవండోయ్! మిమ్మల్నే"

ఎవరో నన్ను తట్టి పిలుస్తుంటే, ఉలిక్కిపడి, దుప్పటి ముఖంమీది నుండి క్రిందికి జరిపి, కళ్ళు నులుముకుంటూ చూశాను.

ఎదురుగా సుజాత!

"ఏమిటి సుజీ! ఈ అకాల బలాత్కారం?" అన్నాను ఆవలిస్తూ వొళ్ళు విరుచుకుంటూ.

"పాపం అయ్యగారికి తెల్లవారకపోయినా,



పొద్దెక్కి చాలా సేపయింది. లేవండి. మీకోసం మీ ఆఫీసు ప్యూనట ఎవరో వచ్చాడు." అని "నా పని నేను చేశాను. ఇక మీ ఇష్టం. నాకు అవతల వంటింట్లో తాళింపు మాడిపోతోంది" అంటూ నా సమాధానంకోసంకూడా ఎదురు చూడకుండా గబగబా వంటింట్లోకి వెళ్ళి పోయింది సుజాత.

నేను ఆలోచనలో పడిపోయాను.

ఆదివారంకూడా ఆఫీసు ప్యూను ఎందుకు ఊగలబడ్డాడు? ఏదైనా కొంప మునిగిపోలేదు గదా! అని కొండంత ఆశ్చర్యపోయాను. ఆ తర్వాత మా ప్యూనుగాడ్ని మనసులోనే కసి తీరా తిట్టుకొని, ఆ నోటితోనే బంగారంలాంటి నిద్ర పాడుచేసినందుకు మా శ్రీమతినీ తిట్టు కొని, విధిలేక, అసలు విషయం తెలుసుకోవా లనే ఉద్దేశంతో, మంచంమీదినుండి క్రిందికి దిగి, భారంగా అడుగులేసుకుంటూ బయటికి నడిచాను.

నేనూహించినట్టుగానే నిజంగానే కొంప మునిగింది.

వెంకన్న చెప్పిన వార్త విని కాసేపు కాళ్ళూ చేతులూ ఆడలేదు.

ప్రొద్దున్నే ఎంత విషాదకరమైన వార్త!

నా స్నేహితుడు శంకరం అకస్మాత్తుగా గుండె ఆగిపోయి ప్రొద్దున్నే చనిపోయాడట!!

శంకరం నాకు చాలా కావలసిన వాడు. చిన్నప్పటినుండి ఒకేచోట చదువుకున్నాం. ఒకే జట్టుగా ఆడుకొన్నాం. కలిసికట్టుగా ఎన్నో అల్లరి చిల్లరి పనులు చేశాం. కలిసి ఇదే ఊళ్ళో ఇదే వీధుల్లో చెప్పులు అరిగిపోయేలా, కాళ్ళు నొప్పులు పుట్టేలా తిరిగాం. చిన్నప్పుడు అమ్మా నాన్నలకు తెలీకుండా ఇంట్లోంచి డబ్బులు దొంగిలించి, స్కూలుకు ఎగనామం పెట్టేసి, దొంగ చాటుగా సినిమాలకి చెక్కేసే వాళ్ళం. ఆఖరుకు ఒకే ఊళ్ళో ఒకే ఆఫీ సులో ఓ మాదిరి ఉద్యోగాల్లో స్థిరపడిపోయాం.

అటువంటిది మా ఇద్దరి పరిచయం.

శంకరం, నేనూ కలిసి నిన్న ఆఫీసు వొదిలిన తరువాత నాయర్ హోటల్లో మిరప కాయ బజ్జీలు కూడా తిన్నాం. నవ్వుతూ, కబుర్లు చెప్పుకుంటూ రాత్రి స్నేహితులతో సెకండు షో సినిమా కూడా చూశాం.

కాని ఎంతలో ఎంత ఘోరం జరిగిపోయింది!

నిన్న ఉన్న శంకరం ఈ రోజూ లేడనే నిజాన్ని తలుచుకుంటుంటేనే నా గుండె చెరువై పోతోంది.

గబగబా ఈ వార్తని సుజాత చెవిలోపడేసి, ఆలస్యం చెయ్యకుండా బట్టలు వేసుకొని వీధిలో పడ్డాను.

నేను వెళ్ళేసరికి శంకరానికి నీళ్ళుపోసి, పాడెమీద పడుకోబెట్టారు. ఆఖరిసారిగా వాడి ముఖాన్ని చూసే అదృష్టంకూడా నాకు కలగలేదు. ముఖమూ, ఒళ్ళూ కనిపించకుండా నిండుగా తాజా పూలతో కప్పేసి వుంది.

వాడిని కడసారిగా చూసుకోడానికి కూడా నోచుకోని నా దురదృష్టానికి లోపల్లోపలే కుమిలిపోతూ, శవాన్ని అనుసరించి స్మశానానికి బయలుదేరాను. అక్కడ స్మశానం తతంగం పూర్తి అయేసరికి పన్నెండు గంటలు దాటిపోయింది. ఆఖరి నిట్టూర్పులు వొదిలి అందరూ తిరుగు ముఖం పట్టారు.

నెత్తిమీద సూర్యుడు నిప్పులు చెరగుతున్నాడు.

స్మశానం నుండి వొచ్చేస్తూ, స్మశానం ఎంట్రెన్స్‌కి లోపల, దారికి ఒక ప్రక్కన వున్న బావి దగ్గర, అందరితోపాటు నేనూ కాళ్ళూ చేతులూ కడుక్కుంటూ, కడసారిగా శంకరాన్ని సమాధిచేసిన స్థలం వైపు దృష్టిని మళ్ళించాను.

ఆశ్చర్యం!

నా శరీరం మంచులా గడ్డ కట్టిపోతోంది.

అక్కడ.

పదీ, పది సంవత్సరాలలోపు వయస్సున్న ముగ్గురు పిల్లలు ఎంగిలి విస్తరాకు దగ్గర కాట్లాడుకునే కుక్కల్లా కొట్లాడుకుంటున్నారు.

నాలో ఏదో అనుమానం!

నా అనుమానాన్ని నివృత్తి చేసుకోడానికి, కళ్ళు నులుముకొని మరోసారి పరీక్షగా చూశాను. సందేహంలేదు. ఆ ముగ్గురు పిల్లల్లో రంగడూ వున్నాడు.

ఇక్కడ వాడెందుకు వున్నట్లు? ఇక్కడ వాడికేమిటిపని? ఎందుకు మిగతా ఇద్దరు పిల్లలతో కొట్లాడుతున్నాడు?

ఎన్నో ప్రశ్నలు. ఎన్నో అనుమానాలు.

చాలాసేపు అర్థం కాలేదు.

ఆలోచనలు కుమ్మరిపురుగుల్లా బుర్రని తొలిచేస్తున్నాయి.

ఆలోచిస్తూ అలాగే నిలబడిపోయాను.

ఒకటీ రెండూ మూడూ....నిముషాలు భారంగా, బాధాకరంగా దొర్లిపోతున్నాయి.

నేను చూస్తున్నంతలోనే రంగడు ఎంట్రెన్స్ వైపు వేగంగా పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. ఏదో విజయం సాధించిన గర్వం, తృప్తి వాడి కళ్ళల్లో

నేను కావాలనే రోడ్డుకు అడ్డంగా నిలబడ్డాను.

పరుగెత్తు కొస్తున్న రంగడు ఠక్కున ఆగిపోయాడు.

అప్పటి క్షణంవరకూ వాడి కళ్ళలో వున్న ఆనందం, తృప్తి విజయగర్వం మరుక్షణంలో మాయమై పోయాయి. నన్ను యింతకు ముందే చూచి వున్నట్లయితే అసలు రంగడు యింత త్వరగా యిటువేపు వచ్చివుండేవాడు కాదేమో!

అది వాడి గ్రహపాటా? లేక నేను వాడి దృష్టిలో పడటం నేను చేసిన పొరపాటా? ఏమో? ఏది ఏమైనా నేను వాడ్ని చూడ్డం తటస్థించింది. వాడూ నన్ను చూశాడు. అంతే!

నా చూపులూ, వాడి చూపులూ క్షణకాలం కలుసుకొన్నాయి. ఆ తరువాత విడిపోయాయి.

వాడిలో—దొంగతనం చేస్తూ పట్టుబడిపోయిన వాడి నిస్సహాయత, వాడి వ్యాపార రహస్యం నాకు తెలిసిపోయిందనే భయం, వాడిమీద నాకు ఏర్పడిన అభిమానం, సదభిప్రాయం, ఈ క్షణం నుంచి మంట కలిసిపోతుందనే బాధ, బ్రతుకు తెరువు బండపాలయిందనే వ్యధ, దుఃఖం, నిస్పృహ.

నాలో—వాడిమీద, వాడు బ్రతుకుతున్న నీచమైన బ్రతుకుమీదా చెప్పలేనంత రోత; ఇంతకాలం నమ్మించి గొంతుకోశాడనే కోపం; ఛీ! ఛీ! నీదీ ఒక బ్రతుకేనా? నువ్వూ వొక మనిషివేనా? — అనే ఏహ్యాభావం. అసహ్యం, ఛీదరింపు.

నా వొంటిమీద తేళ్ళూ, జెర్రులూ ప్రాకి

నట్టు వొళ్ళంతా కంపరమెత్తి పోతోంది.

ఆ క్షణంలోనే గత స్మృతులు జ్ఞప్తి కొస్తున్నాయ్.

ఇంతకాలం సుజాత కురుల నలంకరించిన పూల అందాలూ—

పడగ్గదిలో నేనింతకాలం ఆస్వాదించిన పూల పరిమళాలూ—

రంగడు సమాదుల మీద దొంగిలించిన పూలవా?!

ఛీ! ఛీ! నాలో కోపం కట్టలు తెంచుకొంది.

నా కళ్ళనుండి నిప్పులు రాలుతున్నాయి.

"రంగా!"—నా గొంతు నాకే ఆశ్చర్యంగా, కోపంగా వుంది.

రంగడు పెనుతుపాను తాకిడికి తట్టుకోలేక కదిలిపోయే చెట్టులా గజగజ వొణికిపోతున్నాడు.

అంతసేపూ భద్రంగా రంగడి దోసిట్లోవున్న పూల గుత్తులు గుబుక్కున నేలమీద పడిపోయాయి.

నా తీక్షణ వీక్షణాల బారినుండి తప్పించుకోవాని కన్నట్టుగా రంగడు గుబుక్కున వెనక్కి తిరిగాడు.

కాళ్ళకు పని కొద్దీ పరుగులంకించుకున్నాడు.

అంతే!

ఆరోజు మొదలుకొని ఇంతవరకూ రంగడు మరి నాకు కనిపించలేదు. కాని రంగడు నా కెప్పుడూ జ్ఞాపక మొస్తూనే వుంటాడు. జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా, వాడి బ్రతుకు బాటలో చిచ్చు రగిల్చిన వాడిని నేనేననీ, వాడి చిన్నారి మనసును ఎంతగా బాధించి వుంటానో గదాని, నా మనసు చివుక్కుమంటూనే వుంది.

ఇప్పుడు ఆలోచిస్తుంటే, ఈ దేశంలో ఎంతో మంది ఎన్నో మోసాలుచేస్తూ పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్నప్పుడు, అప్పరాల్ ఒక దిక్కులేనివాడు, తెలిసీ తెలియని వయసులో వున్నవాడు, ఏదో బ్రతుకు తెరువుకోసం సమాధులమీది పూలను దొంగిలించి, అమ్ముకోడం అదేమంత మోసం కాదేమో ననిపిస్తుంది నాకు. అందుకే వాడు ఎప్పుడైనా నాకు తటస్థపడితే వాడిని మంచిగా అనునయించి, సక్రమంగా బ్రతకటానికి ఏదో ఒక మార్గం చూపెట్టాలని కూడా అనుకొంటూ వుంటాను.

కాని నా మనసు నాకు చెప్తూ వుంటుంది. రంగడు యిక నీకు కనిపించడు. ఇక ఎవరికీ కనిపించడు - అని.


అయినా - ఇప్పటికీ సుజాత వాడికోసం ఆశగా నిరీక్షిస్తూనేవుంది, అసలు నిజం తెలియక.

కాని - నాకు నిజం తెలిసినా సుజాతకు చెప్పలేను. చెప్పి సుజాతకు రంగడిమీదవున్న సానుభూతినీ, సదభిప్రాయాన్నీ వమ్ము చెయ్యలేను. ఈ నిజాన్ని నాలోనే గరళంలా దాచుకొంటాను.

అంతే! అంతే!!

□

(వి)చిత్ర విజ్ఞానం



ఎక్కువసేపు నమిలి తినగల పదార్థాలను మనం ఆహారంగా వాడితే ఒళ్ళు అనవసరంగా లావెక్కదు అంటున్నారు బ్రిస్టల్ (ఇంగ్లాండు) లోని డా॥ హీటన్! పీచు, నార కలిగిన కూరగాయలను వాడితే, వాటిని ఎక్కువసేపు నమలాల్సిన స్థితి ఏర్పడ్డంవల్ల, ఉదరంలో కొన్ని రసాలు స్రవింపబడి, అవి కడుపునిండిన తృప్తిని కలుగజేస్తాయి. అందువల్ల ఎక్కువ ఆహారం తినబుద్ధికాదు. ఈ మితభోజనం ఒళ్లు లావెక్కకుండా కాపాడుతుంది. "స్లిమ్"గా వుండాలనుకున్న వాళ్ళు తీపి పదార్థాలకు దూరంగా వుండాలి.

లేటెంటు హీటూ-థర్మామీటరూ

'వసుంధర'

"నీటిని వేడిచేస్తే ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఆ ఉష్ణోగ్రతను థర్మామీటరుతో కొలవచ్చు. మామూలుగా నీటి ఉష్ణోగ్రత ముప్ఫై డిగ్రీల ప్రాంతంలో వుంటుంది. వేడిచేయడం మొదలుపెట్టాక క్రమంగా పెరుగుతూవచ్చి—నీరు మరగడం ప్రారంభించేసరికి వంద డిగ్రీలవుతుంది. ఆ తర్వాత థర్మామీటర్లో రీడింగు పెరగదు. అంటే నీటిని వేడిచేయడం ఆపేశామని అర్థంకాదు. థర్మామీటరు ఉష్ణోగ్రతనే కాని ఉష్ణాన్ని కొలిచే సాధనంకాదు. ఉష్ణోగ్రత వంద డిగ్రీలకు చేరుకున్నాక—నీటికి సరఫరా చేసిన ఉష్ణం నీటిలో గుప్తంగా వుండిపోతుంది. దాన్ని ఇంగ్లీషులో లేటెంట్ హీట్ అంటారు. ఈ గుప్తోష్ణంవల్లనే ఎక్కువసేపు మరిగిన నీరు ఆలస్యంగా చల్లారుతుంది "

తమ్ముడికి లేటెంట్ హీట్ గురించి చాలా కష్టపడి వివరించానుకానీ వాడిని ఒక సందేహం పట్టుకు పీడిస్తూనే వుంది. ఉష్ణంవల్ల నీటి ఉష్ణోగ్రత పెరుగుతోంది. బాగానే వుంది. కానీ అలా కొంతసేపే ఎందుకు జరగాలి? వందడిగ్రీలు దాటేకకూడా నీటి ఉష్ణోగ్రత ఎందుకు పెరగదు?

అందుకనేక కారణాలున్నాయనీ — ద్రవపదార్థాలన్నింటికీ కూడా లేటెంట్ హీట్ వుంటుందనీ, ఏ ద్రవపదార్థానికైనా మరిగేస్థాయి చేరుకున్నాక—మరి ఉష్ణోగ్రత పెరగదనీ—కొన్ని ఎనభై డిగ్రీలదగ్గర మరిగితే, మరికొన్ని మూడువందల డిగ్రీలవద్ద మసుగుతాయనీ చెప్పాను. ఇంకా పైక్లాసులోకి వెడితే ఆ వివరాలన్నీ అర్థమయేలా చెబుతారనికూడా చెప్పాను. వాడు అసంతృప్తిగా వెళ్ళిపోయాడు.

అసంతృప్తి వాడికే కాదు. నాకూ కలిగింది. సైన్సుకు సంబంధించినంతవరకూ ఈ విషయం పరిపాలేదు. కానీ మనిషికీ, మానవప్రవృత్తికీ, కూడా ఇటువంటిదే ఒక సమస్య ఉందని నాకు అనిపించింది. అదేమిటో ఆ క్షణంలో నాకు తెలియలేదు. కానీ ఏదో వుందనిమాత్రం స్ఫురించింది. ఎంత తన్నుకున్నా అదేమిటో తెలియలేదు. కానీ ఎందుకో రంగారావు మాత్రం గుర్తుకు వచ్చాడు

రంగారావు చాలా అమాయకంగా మాట్లాడుతాడు. కాని ఎంతో తెలివిగా మాట్లాడేననుకుంటాడు. అందువల్లనే నేనతన్ని అమాయకుల్లో జమవేశాను. అతనితో కొంతకాలం పరిచయం తర్వాత అతను నిజంగానే అమాయకుడని గ్రహించాను. ఎందుకంటే అతను నన్నొక అమాయకుడుగా లెక్కవేశాడు.

మానవ మనస్తత్వ పరిశీలన నాకు హాబీ. నాకు తెలిసినంతవరకూ రంగారావుది ప్రత్యేక

★ లేటెంటు హీటు (గుప్తోష్ణం) ద్రవపదార్థాల కుంటుందని సైన్సు చెబుతుంది. ఆ లేటెంట్ హీటు మానవ ప్రకృతికీ వుంటుందని (కామన్) సెన్సు చెబుతుంది. ★

మైన వ్యక్తిత్వమేమీకాదు అయినా నేనతనితో పరిచయం పెంపొందించుకున్నాను. నా అమాయకత్వాన్ని రంగారావానందిస్తాడు. అతనలా చేయడం నాకానందం. ఇదొక విచిత్ర తత్వం. ఇందులోని ఆనందం అనుభవంలోకి వస్తేకాని తెలియదు. ఇంతకీ రంగారావు ఆఫీసులో నా కొలీగ్ అని చెప్పడం మరిచిపోయాను. ఆరునెల్లక్రితమే ట్రాన్స్‌ఫర్ మీద అతనీ ఊరు వచ్చాడు.

వచ్చినరోజున రంగారావు ఫుల్ సూట్లో వచ్చాడు. మేముండే ప్రాంతంలో ఎండలు జాస్తి. అప్పుడు వేసవికాలం కాకపోయినా ఎండలు బాగా కాస్తున్నాయి. మా ఆఫీసులో మొత్తం ఎనమండుగురం ఆఫీసర్లమున్నా—ఎవరూ ఆ రోజుల్లో ఫుల్ సూట్లో రాము. ఎందుకంటే—డ్రస్సుకి కంఫర్టు కూడా ముఖ్యం కదా!

తొమ్మిదో ఆఫీసరు రంగారావు ఫుల్ సూట్లో రాగానే అందరిమధ్యా అతనొక విచిత్రవ్యక్తిలా కనబడ్డాడు. అయిదారు గురతన్ని పలకరించి అతని సూటును ప్రత్యేకంగా కాంప్లిమెంట్ చేశారు. అందులోని వ్యంగ్యం తెలియని రంగారావు నా దగ్గరకు వచ్చి—"అంతా నా సూటు మెచ్చుకునేవారే. ఇక్కడ మంచి టైలర్స్ లేరా?" అనడిగాడు.

నేను నవ్వి—"ఇంత ఎండలో సూటు వేసుకువస్తే ఒళ్ళంతా చెమటలు కారిపోవుటండీ — అందరికీ మీకులాంటి ఎయిర్ కండిషన్డు సూట్లుంటాయా?" అన్నాడు.

"ఎయిర్ కండిషన్లు సూటేమిటండీ!" అన్నాడు రంగారావు.

"ఇంత ఎండలో ఈ పవర్ కట్ రోజుల్లో - మీరు సూట్ వేసుకువచ్చారంటే ఆ క్లాత్‌లో ఏదో స్పెషాలిటీ వుండి వుండాలి. ఈ మధ్య ఏదో ఎయిర్ కండిషన్డు క్లాత్ వచ్చిందని విన్నాను"

రంగారావుకు బాగా ఎక్కువగా నవ్వు వచ్చింది—"ఎంత అమాయకులండీ మీరు?" అని మళ్ళీ కాసేపు నవ్వాడు—"ఎయిర్ కండిషన్డు క్లాతంటూ వున్నమాట నిజమే కానీ అది ఊరికే ఫ్యాషన్‌కు పెట్టినపేరు. నిజంగా ఎయిర్ కండిషన్ చేసే క్లాతేదీ ప్రపంచంలో కనిపెట్టబడలేదు అయినానేను సూటెందుకు వేసుకొచ్చేనంటారా? ఆఫీసరన్నాక సూటువేసుకోలండీ—లేకపోతే బయటవాళ్ళకు మన పొజిషన్ తెలియదు. ఆఫీసులో కిందవాళ్ళు మనలను గౌరవించరు"

ఈ ధర్మ సూక్ష్మం వివరించిన రంగారావు నన్నమాయకుడిగా జమచేసిన క్షణం గ్రహించిన వారెవరికైనా అతనితో నేను త్వరత్వరగా పరిచయం పెంపొందించుకోవడానికి గల కారణం సులభంగా అర్ధమయుంటుంది.

మా పరిచయం వృద్దిపొందిన కొద్ది రోజుల్లోనే రంగారావు నన్ను లోకజ్ఞానం లేనివాడుగా గుర్తించి జాలిపడ్డాడు. "ఎలా బ్రతుకుతారండీ మీరు—బొత్తిగా లోకజ్ఞానం లేదు—" అని నాతో ఎన్నోసార్లు అన్నాడు. తను మానవ మన స్తత్వాన్ని కాచి వడబోశాననీ—మానవ మన స్తత్వ పరిశీలన తనకు హాబీ అనీ ఎన్నోమార్లు నాకు చెప్పాడతను.


ఈ మధ్య ఇలాగనడం చాలామందికి ఫ్యాషనైపోయింది—"నీకు తెలియదోయ్—నేను ప్రతిపాదిస్తా [illegible]—వాడి మన స్తత్వమేలాంటిదో తెలుసుకుంటావు" అనే స్నేహితులు కనీసం నాకో పాతిక మంది దాకా ఉన్నారు. వాళ్ళలో నేను విశ్వసించేది ఒక్క కామరాజుని మాత్రమే.

కామరాజు సామర్ధ్యంమీద నాకు చాలా నమ్మకముంది. అతని ఎనాలిసిస్ చాలా చక్కగా ఉంటుంది. అతను మాట్లాడేటప్పుడు వింటూంటే—అతను చెప్పేదంతా ఉపుగునిజమనిపిస్తుంది. ముఖ్యంగా అతను నాగురించి తన అభిప్రాయం చెప్పాడు—"నువ్వు చాలా తెలివైన వాడి ననుకుంటావు. అది నిజమే. అయినా అలా అనుకోవడం అంతమంచిది కాదు. మనసులో దురుద్దేశ్యమున్నా పైకి అమాయకంగా కనిపించడానికి ప్రయత్నించి సఫలీకృతుడవౌతావు. ఎవరితో మాట్లాడితే

వారి మాటలకు తందానతాన అంటూ అందరినీ మెప్పించి మంచిపేరు తెచ్చుకుంటావు. వాదించే శక్తి ఉన్నా ఎదుటివాడితో వాదనకు దిగవు. ఔననటంలోనే సుఖముందనీ, నష్టంలేదనీ అనుకుంటావు " అంటూ ఎన్నో చెప్పాడు. అన్నీ కరెక్టే! నాకు తెలిసిన ఎంతోమంది గురించి కామరాజూ నేనూ చర్చించే వాళ్ళం- అనేక విషయాల్లో నా మనస్తత్వంవల్లకాక, నిజంగానే నేను కామరాజుతో ఏకీభవించడం జరిగేది.

- ఒకరోజు మా చర్చలలో ఇతరుల భార్యల ప్రసక్తి వచ్చింది.

"సుబ్బారావు భార్య—మనిషి మంచిదే. మనసూ మంచిదే—కానీ పరాయి మగవాడు కనబడేసరికి ఆకర్షణీయంగా కనబడాలని ప్రయత్నిస్తుంది. ఇలాగన్నానని మరోలా అనుకోకు. ఇది డెలికేట్ విషయమే అయినా హాబీ అవడం మూలాన నాకు వాళ్ళూ వీళ్ళూ, ఆ విషయం ఈ విషయం అంటూ లేకుండా అన్ని సందర్భాల్లోనూ మనుషులను పరిశీలించడం అలవాటు. రేపొద్దున్న నా భార్యను కూడా రకరకాల దృష్టిలో చూస్తాడా ఏమిటి- అని ఆలోచిస్తున్నావా? నాక్యూరియాసిటీ మనస్తత్వాలమీదనే కానీ మనుషులమీద కాదని నీకు తెలుసుగదా—ఇన్నెందుకు? నా అర్ధశరీరంగా ఎంచబడే నా శ్రీమతిని కూడా నేను జాగ్రత్తగా పరిశీలిస్తూంటాను. ఆమె చేష్టలను ప్రేమ దృక్కులతో కాక—మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడం కోసం గమనిస్తాను. ఈ విధంగా నేను కొంత ఆనందానికి దూరమవుతున్నానని కూడా చెప్పవచ్చు. నా భార్యకు కూడా కాస్త ఇబ్బంది కలిగిస్తున్నాను. అయితే ఆమె అమాయకురాలు కావడంవల్ల ఏ ఇబ్బందీ లేకుండా పోయింది " కామరాజు ఆగడానికి కారణం నా ముఖంలో ఆసక్తిని వెదకడానికేనని గ్రహించాను. వేదవది—నేనూ సైకాలజిస్టునే కదా!



"నువ్వు నమ్ముతావో నమ్మవో కానీ—లక్ష్మి అంత అమాయకురాలు అసలు ఆడవాళ్ళలోనే ఉండరేమో ననిపిస్తూంటుంది. ఏ రహస్యమూ దాచలేదు. పట్టుమని ఒక్క-అబద్ధమైనా ఆడలేదు. చిన్న తప్పుచేస్తే భయపడిపోతుంది. నాకు కాస్త కోపంవస్తే హడిలిపోతుంది. నేనేం చెప్పినా ఆశ్చర్యంగా ఇంత కళ్ళు చేసుకుని వింటుంది. ఎప్పుడైనా తను రహస్యం దాచినా, అబద్ధమాడినా—నేనిట్టే

పట్టిస్తే—'ఎలా కనిపెట్టేశారండీ, మీ తెలివి తేటలు దేవుడు నాకిచ్చినా బాగుండును—" అంటుంది. ఆమెను చూస్తూంటే నాకు చాలా జాలికూడా కలుగుతూంటుంది. ఈ అమాయ కురాలు తన అదృష్టం కొద్దీ నా భార్య అయింది కానీ లేకపోతే అష్టకష్టాలూపడి ఉండేది—

కామరాజు ఆగి నా ముఖం పరిశీలించాడు— "స్వంత డబ్బా వాయిస్తున్నాననుకోకు.నిజంగానే నేను ఆదర్శభర్తను" అన్నాడు. అని మళ్ళీ వాసు దేవరావు భార్యగురించి చెప్పడం ప్రారంభించాడు. కేవలం హాబీకోసమే అయినా—స్నేహితుల భార్యల నింత క్షుణ్ణంగా పరిశీలించడం—ఎంతవరకూ ఆదర్శభర్తల లక్షణం—అని ఆలోచిస్తూంటే చిన్న విషయం నాకు స్ఫురించింది. కామరాజు భార్య గురించి నేను కూడా బోలెడు ఆలోచించాను. కామరాజు చెప్పినవన్నీ నిజం. ఆమె నిజంగానే చాలా చాలా అమాయకురాలు. వాళ్ళిద్దరి సంసారం చూస్తూంటే ఎన్నోసార్లు నాకూ అటువంటి భార్య దొరికితే బాగుండుననిపించేది. ఆడవాళ్ళ ముఖం అందంగా ఉంటే—అమాయకత్వం ఆ అందాన్ని రెట్టింపు చేస్తుంది. అందుకే నేను స్నేహలత గురించి తరచుగా ఆలోచించ వలసి వస్తోంది.

స్నేహలతని నేను లతా అని మాత్రమే పిలుస్తాను. ఆమె నాకు స్వయానా మరదలు. మనిషి చాలా అందంగా ఉంటుంది. చదువు కుంటోంది. పుట్టినప్పట్నించీ నా భార్యగా వ్యవ హరించబడుతోంది. అందువల్లనే కాస్త వయసు వచ్చినప్పట్నించీ నేనామెను ఆ దృష్టి తోనే వీక్షించేవాణ్ణి. స్నేహలత ఇప్పుడు బియ్యే ఫైనలియర్ చదువుతోంది. పరీక్షలు కాగానే మా ఇద్దరికీ ముడిపెట్టేయాలని స్నేహలత తలిదండ్రులు అనుకుంటున్నారు. అయితే మా అమ్మ దృష్టి వేరే ఉంది. లతా వాళ్ళు కట్నమివ్వలేరు. కట్నాల బజార్లో నాకు పదిహేనునించి ఇరవైవేల దాకా ధర ఉంది. ఇంత విలువైన వస్తువును లతకు కారుచవగ్గా అమ్మడం అమ్మ కిష్టంలేదు. కానీ ఈ విషయంలో నాన్నగారి పట్టుదల ఉంది. అందువల్ల తరచుగా మా ఇంట్లో చిన్న సైజు తుపానులాంటిది రేగుతోంది.

నాకు సంబంధించినంతవరకూ లత విష యంలో ఒక చిన్న ఇబ్బంది ఉంది. ఒకానొక ఉద్రిక్త పరిస్థితిలో—ఒక సంవత్సరం క్రితం లతా నేనూ ఏకమయ్యాం. ఇద్దరికీ వయసు ఉంది. వరస ఉంది. పెద్దల ఆశీర్వాదం త్వరలో రానున్నదన్న నమ్మడం లత కుంది. మొత్తంమీద ఆమెను నేను లోబర్చుకో గలి గాను. ఉద్రేకం చల్లారేక నాకు భయంవేసింది. ఆమె ఏడ్చింది. ఆ క్షణంలో కలిగిన జాలిలో ఆమెకు నేను వాగ్దానంచేశాను—ఆమెను తప్ప మరెవ్వరినీ వివాహమాడనని! ఆ తర్వాత లత నాకు అందలేదు. జరిగిన పొరబాటేదో జరిగి పోయింది. మరి వివాహమయ్యేవరకూ తనను తాకరాదని చెప్పింది. దేవుడు చల్లగా చూడడం వల్ల—నేను చేసిన పొరపాటు మరే విపత్కర పరిస్థితులకూ దారితీయలేదు.

ఇప్పుడింతకూ నా ఇబ్బంది ఏమిటంటే— ఇటీవలే నాకు డబ్బుమీద మోజు కలుగుతోంది. కట్నం తీసుకుని వేరే ఎవరినైనా అమ్మాయిని పెళ్ళి చేసుకోవడంలో తప్పులేదని నాకు అని పిస్తోంది. నాన్నగారికీ, అమ్మకూ జరుగుతున్న అంతర్యుద్ధంలో అమ్మనెగ్గితే పెళ్ళి మాత్రం డిలా ఊదుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను. కానీ—తొందరపడి నేను చేసిన పొరపాటువల్ల—లతపట్ల నాకూ కొంత బాధ్యత ఉన్నదని— నాలోని మనిషి చెబుతున్నాడు. అయితే ఆ పొరపాటులో లత బాధ్యతకూడా లేకపోలేదనీ, జరిగిన పొరపాటు దుష్ఫలితాలకు దారితీయ లేదు కాబట్టి ఎవరికీ నష్టం లేదనీ—ఈ కార ణంగా లతపట్ల నాకు బాధ్యత ఏమీలేదనీ— నాలోని మనిషి కానివాడు చెబుతున్నాడు. వీళ్ళి ద్దరి అంతర్యుద్ధ్యం నాలో కొనసాగుతూన్న క్షణంలో కామరాజు భార్య అమాయకత్వాన్ని నేను ఇష్టపడడం జరిగింది. నా భార్యకూడా అమాయకురాలైతే బాగుండు ననిపించింది.

రచయిత గురించి



పేరు జొన్నలగడ్డ రాజగోపాలరావు. చదువు కెమిస్ట్రీలో డాక్టరేట్ పట్టం. ఉద్యోగం భువనేశ్వర్లోని రీజినల్ రీసెర్చి లాబరేటరీలో సైంటిస్టు. భార్య జొన్నలగడ్డ రామలక్ష్మి. కలం పేరు మా భార్యాభర్తలిద్దరికీ చెందుతుంది. అన్ని ప్రముఖ వార, మాస పత్రికలలోనూ మా రచనలు ప్రచురింపబడి, బడుతున్నాయి. క్రైమ్ కథలు, పిల్లల కథలు కూడా వ్రాస్తూంటాము. నేను 1963లోనూ, శ్రీమతి 1974 లోనూ రచనలు చేయడం ఆరంభమయింది. రచనలు చేయడానికి మాకున్న అతి స్వల్ప వ్యవధి కారణంగా, ఎక్కువగా పోటీ సమయాల్లోనే రచనలు చేస్తూంటాము. పోటీలు పెట్టి రచయితలను ప్రోత్సహిస్తున్న పత్రికలన్నీ అభినందించ బడాలి. ఇంత వరకూ నా రచనలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక వారపత్రికలలో బహుమతులు పొందాయి. ఇటీవల "నీలిమ" పత్రికలో మా.దంపతుల వివరాలు ప్రచురించబడ్డాయి. మా రచనలను ఆదరించి వాటికి"గుర్తింపు" లభింపజేస్తున్న 'జ్యోతి' మాసపత్రికకు మేమెంతగానో ఋణపడి ఉన్నాము. పాఠకులందరకూ పత్రికాముఖంగా శుభాకాంక్షలందజేయడానికి ఈ అవకాశం తీసుకుంటున్నాము. శుభాకాంక్షలతో....

—"వసుంధర"

ఆయితే స్నేహలత అమాయకురాలు కాదు మరి!

ఎన్నో విషయాలు నేను కామరాజుతో చెప్పి ఉన్నాను కానీ స్నేహలత సంగతి మాత్రం చెప్పలేను. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే సామర్థ్యంగల అతని దగ్గర నేను కాస్త జాగ్రత్తగా ఉండడం—ఎంతో అవసరం.

కామరాజు వివాహం సరిగ్గా ఎనిమిది నెలల క్రితం జరిగింది. అతని పెళ్ళికి నేను వెళ్ళాను. ఆ పెళ్ళి వేడుకలూ అవీ చూస్తూంటే నిజం చెప్పొద్దు—నాకూ వివాహం చేసుకోవాలని పించింది. మంచి ఉద్యోగం, యౌవనం—రెండూ ఉన్నాయి. మరి వివాహానికి అడ్డేముంది? నాన్నగారి దృష్టిలో లత బియ్యే పూర్తి చేయాలి. అమ్మ దృష్టిలో—నాన్నగారి మనసు మార్చాలి. వీళ్ళిద్దరి అంతర్యుద్ధం అంతమయ్యే దాకా నేను వేచి ఉండాలి. ఇదీ నా ప్రస్తుత పరిస్థితి.

ఇటువంటి పరిస్థితులలోనే మనిషిని ఒంటరితనం దిగజారుస్తుంది. అందుకే నేను మంచి స్నేహితులకోసం అన్వేషణలో ఉన్నాను. ఏ అన్వేషణా లేకుండానే అనుకోకుండా రంగారావు నాకు తగిలాడు. ఇద్దరం మంచి స్నేహితులమయ్యాం.

తమ్ముడికి లేపెంటుహీటు గురించి చెబుతూంటే హఠాత్తుగా నాకు రంగారావు గుర్తుకు వచ్చాడు. లేపెంటుహీటు గురించీ, రంగారావు గురించీ చాలాసేపు ఆలోచించాను. ఆఖరికి మర్నాడు కామరాజుతో ఈ విషయం చర్చించాలనుకున్నాను కానీ అలా చేయలేదు. అసలు రంగారావుని కామరాజుకోసారి పరిచయంచేసి—అతని ఎనాలిసిస్ ఏమిటో తెలుసుకోవాలను

కున్నాను. అంతవరకూ అనేక పర్యాయాలు రంగారావు గురించి కామరాజుతోచెప్పి ఉన్నాను. కానీ ఇద్దరినీ ఒకరి కొకరిని పరిచయం చేయ లేదు. ఇప్పుడు కామరాజు భార్య పుట్టింట్లో ఉంది కాబట్టి—మేము కలుసుకోవడాని కింతకంటె మంచి సమయ మింకొకటుండదు.

మర్నాడు సాయంత్రం రంగారావుని తీసు కుని కామరాజు ఇంటికి వెళ్ళాను. రంగారావును పరిచయంచేయగానేకామరాజు ముఖం దివ్యంగా వెలిగిపోయింది. రంగారావు మన సత్వం గురించి ఇక్కణ్ణించి కనీసం కొన్ని రోజుల వరకునైనా నాకు బోరుకొట్టవచ్చునన్న ఆనం దమే ఆ వెలుగుకు కారణమని నాకు తెలుసు.

సంభాషణ చాలా మామూలుగా నడుస్తూన్న ప్పటికీ—కామరాజు ప్రశ్నల వెనుక ఉన్న గూఢార్థాన్నీ, కుతూహలాన్నీ నేను బాగా అర్థం చేసుకోగలను.

"మంచి ఉద్యోగంలో ఉన్నారు గదా—ఇంకా వివాహం చేసుకోలేదేం?" అన్నాడు కామరాజు యథాలాపంగా అడిగినట్లు.

"చిన్న ప్రేమ వ్యవహారముంది. అందుకే కొంచెం ఆలశ్యమవుతోంది—" అన్నాడు రంగారావు తాపీగా.

నాకు నిజంగానే ఆశ్చర్యం కలిగింది. రంగారావులాంటి భోళామనిషి ఇంతవరకూ నాకింత ముఖ్యమైన విషయం చెప్పకుండా ఎలా వుండగలిగాడు? అదే—అడిగేశానుకూడా—"మీరు నన్ను అడగలేదు. నేను చెప్పలేదు" అన్నాడు రంగారావు మామూలుగా.

తర్వాత సంభాషణ మారింది. ప్రేమలోంచి ప్రేమకథలమీదకీ, సినిమాల్లో ప్రేమగురించీ, ఆ తర్వాత సినిమాలగురించీ, సినిమా నిర్మాతల గురించీ, ఒకప్పుడు బ్రహ్మాండంగా వెలిగి ఇప్పుడు పేదరికంలోవున్న కొందరు నిర్మాతల గురించీ చర్చలు జరిగాక—పేదరికం, బిచ్చ గాళ్ళగురించి చర్చ జరిగింది. ఆ చర్చలో కామ రాజు ఇంచుమించు శ్రోత. రంగారావు తన అభిప్రాయాలు చెబుతూంటే అతను ఆశ్చర్యంగా వింటున్నాడు.


కామరాజు దగ్గర్నుంచి ఈ లక్షణమొక్కటీ నేను కోరి అలవర్చుకున్నాను. ఎదుటి వ్యక్తుల గురించి అర్థం చేసుకోవాలనుకున్నప్పుడతను - కొన్ని టాపిక్సు కదిపి ఊరుకుంటాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతుంటే అతని అభిప్రాయాల నభినందిస్తూ మాటలందిస్తాడు. ఎంతో గౌరవ భావంతో అతనివంక చూస్తాడు. ఆ మాటలూ, ఆ చూపులూ ఎదుటివాడి నాకాశానికెత్తేస్తాయి. తన అభిప్రాయాలను ఏకధాటిగ చెప్పేయడం ప్రారంభిస్తాడు. ఇప్పుడు రంగారావు అదే చేస్తున్నాడు. ఒకప్పుడు ఇదే పరిస్థితుల్లో నేన యితే—మధ్యలో అతన్ని ఖండిస్తూ నా అభి ప్రాయాలు చెప్పకుండా ఉండలేకపోయేవాడిని. ఈనా బలహీనతను కామరాజు ఎత్తి చెప్పే వరకూ నేను గ్రహించనేలేదు.

మేము తిరిగి వెళ్ళేటప్పుడు రంగారావు అన్నాడు—"మీ స్నేహితుడు నాకు బాగా నచ్చాడండీ—అతని ఉేస్టులన్నీకూడా చాలా మంచివి. ఈ రోజు మాట్లాడుతున్నంతసేపూ అతని టేస్టులు తెలుసుకోవడానికే ప్రయత్నిం చాను"

తనను కామరాజు స్టడీ చేస్తున్నాడన్న విషయం రంగారావుకు తెలియదు. కామరాజు తన్ను గురించి పూర్తిగా అర్థం చేసుకునే కొద్దీగా తను మాట్లాడుతున్న విషయం రంగారావుకు స్ఫురించనైనా లేదు. పైగా తన మాటలు కామ రాజుని అర్థంచేసుకుందుకు అలా మాటలాడు తున్నానని అనుకున్నాడు. ప్రతి వ్యక్తికీ ఎంత ఆత్మాభిమానం? ప్రతి వ్యక్తికీనూ ఎంత ఆత్మ వంచన?

నేను ఇంటికి వెళ్ళిపోయాను కానీ రంగా రావు గురించే ఆలోచిస్తున్నాను. అతనిప్పుడు కామరాజువీ తనవీ ఒకటే అభిప్రాయాలనే దృష్టిలో వున్నాడు. కామరాజుని తను బాగా స్టడీ చేశాననుకుంటున్నాడు. అయితే కామరాజు గురించి తను వేసుకున్న అంచనాలన్నీ తప్పని గ్రహించలేదు. దీనికీ లేటెంట్ హీట్‌కీ సంబంధం ఉంది. ఏమిటది?

తలకాయ నొప్పి వచ్చింది. తప్పితే ప్రయో



జనం లేకపోయింది. ఇంట్లో నాన్నగారికీ, అమ్మకూ మధ్య మళ్ళీ యుద్ధం జరిగింది. వాతావరణం బాగోలేదు. అమ్మ రహస్యంగా నా దగ్గరకు వచ్చి—నాన్నగారి మాటలు విన వద్దనీ—లతను పెళ్ళిచేసుకోనని ఆయనతో చెప్పేయమనీ చెప్పింది. కన్నతల్లికంటె నీ మేలు కోరేవారెవరుంటారు, ప్రాజ్ఞుడివయ్యావు-నిన్నుకాదని నాన్నగారు మాత్రం ఈ వివాహ మెలా చేస్తారని సవాల్ చేసింది. అయితే నేను ప్రాజ్ఞుడి నయ్యానని గుర్తించిన అమ్మ—నేను లతనుపెళ్ళి చేసుకోనంటే — ఏడిశావ్ కుర్ర కుంకవి అంటుంది—నన్నుకాదనడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తుంది.

నాలోని పరిశీలకుడు అనుక్షణం పనిచేస్తూనే వుంటాడు. ప్రతి మనిషిలోనూ వున్న ఆత్మాభిమానాన్నీ, స్వార్ధపరత్వాన్నీ ఎత్తి చూపిస్తూంటాడు. ఆ సందర్భంలోనే నాలో వున్న స్వార్ధం కూడా నేను గుర్తింపడం జరుగుతుంది. అప్పుడు లత నాకు రాసిన ఉత్తరం నా కళ్ళముందు మెదుల్తుంది. ఆ వుత్తరం కళ్ళముందు మెదలగానే ప్రక్కన లత ప్రత్యక్షమవుతుంది. ఆ ఉత్తరాన్నీ, లతనూ విడిగా ఇంతవరకూ నా ఆలోచనల్లోకి తీసుకు రాలేకపోయాను.

లత ఉత్తరంలో తన ప్రేమనంతా వ్యక్తం చేసింది. ఆ ప్రేమలోనే ఎంతో బాధ వుంది.

"బావా! బలహీన క్షణాల్లో నీకు లొంగిపోయాను. అందుకు నేను ఏమాత్రమూ విచారించడం లేదు. ఎందుకంటే మానసికంగా ఏనాడో నీ భార్యనైపోయాను. కానీ మనకింకా పెద్దల ఆశీర్వాదం లభించలేదు. అందుకే నీ హక్కును నీవు రహస్యంగా అనుభవించాల్సి వచ్చింది. నీమీద నాకెంత ప్రేమ వుందో తెలుసుకోవడానికి నీకు నేను కల్పించిన ఈ అవకాశమే సాక్షి! సాధారణంగా ఏ ఆడదీ ఇంత సాహసానికి ఒడిగట్టదు. ఎందుకంటే ఆడదాని దగ్గర ఏ రహస్యమూ దాగదు. ఎంత దారుణమైన రహస్యమైనా ఎవరికో ఒకరికి చెప్పకుండా ఆడది వుండలేదు. దానికి తగ్గట్టే ప్రకృతికూడా ఆడదానిదగ్గిర రహస్యం దాగనివ్వదు. మగవాడూ, ఆడదీ కలిసి చేసిన తప్పు—ఆడదాని పరంగా బయటపడుతుంది. ఇలా రెండు విధాలుగా రహస్యం దాచలేక ఆడది—నేను ఒడిగట్టిన సాహసానికి పూనుకోదు. కానీ నీమీద ప్రేమకొద్దీ నేనందుకు పూనుకొన్నాను. నీకు

నేను బలహీన క్షణంలో లొంగి వుండవచ్చు. కానీ నీకు కాబట్టే లొంగిపోయాను. అంతేకాదు- నా ప్రేమ నీకింకా వివరంగా అర్థమయేలా చేస్తాను — మన వివాహమయ్యేక: నన్ను వివాహం చేసుకున్న అదృష్టానికి నువ్వు అను క్షణం పులకించేలా చేస్తాను. నా ప్రేమ గురించి వర్ణించలేను. అనుభవంలో నువ్వే తెలుసు కుంటావు "

చాలా పెద్ద ఉత్తరం రాసింది లత. ఉత్తరం చదువుతూంటే లత నా కళ్ళముందు నిలబడి మాట్లాడుతున్నట్టే అనిపిస్తుంది. ఎన్నో వివ రాలు రాసిందందులో. ఆ ఉత్తరం చదువుకుని ఏ మగవాడైనా గర్వపడాలి. కానీ నేను గర్వ పడ్డంలేదు. భయపడుతున్నాను. నా దగ్గర అంత చొరవచేసిన, నాకు సులభంగా లొంగిపోయిన లతమీద ఏమూలో అనుమానముంది నాలో. దొరికేదాకా నానా అవస్థలూ పడి—చేతికి దొరి కాక అనుమానించడం మగబుద్ధిలోని విపరీత మేమో నేను చెప్పలేనుగానీ ఆ రోజునించీ క్రమక్రమంగా—లతనుతప్ప వేరొకరిని వివాహ మాడరాదన్న నా ఇదివరకటి నిర్ణయంలో బలం తగ్గసాగింది.

అయితే లత ఉత్తరం నేను మరువలేనిది. దాన్ని మరువలేనంతకాలం లతనుకూడా మరువ లేను. లత చాలా తెలివైనది. తన ఉత్తరం నామీద చూపగల ప్రభావం తెలిసుండే—ఈపని చేసింది.

అందుకే నా వివాహ సమస్య అమ్మా, నాన్నలకు వదిలేశాను. వాళ్ళెంత గుద్దుకున్నా నేను వహించేది మౌనమే.ఇద్దరి అభిప్రాయమూ ఒకటయ్యేవరకూ నా వివాహం ప్రసక్తిలేదు.

రోజులు గడిచిపోతున్నాయి. ఇప్పుడు కామరాజుకీ రంగారావుకీ చాలా మంచి స్నేహం కుదిరింది. రంగారావు ప్రతిరోజూ కామరాజు ఇంటికి వెడుతున్నాడు. ఇద్దరూ ఎన్నో విష యాలమీద చర్చలు జరిపేస్తున్నారు. ఒకరి మనస్తత్వాన్ని మరొకరు క్షుణ్ణంగా పరిశీలిస్తు న్నట్లుగా భావిస్తున్నారు: వీళ్ళిద్దరి సంభాషణలూ నాకు కలిగించే వినోదమింతా అంతా కాదు. అందుకే వాళ్ళిద్దరూ సంభాషిస్తున్నప్పుడు నేను శ్రోతగా మిగిలిపోతూ వచ్చాను.

ఇప్పుడు రంగారావుతో చర్చించే విధానం మార్చాడు కామరాజు. అతని అభిప్రాయాలతో ఏకీభవిస్తూనే తన అభిప్రాయాలనుకూడా కొద్ది కొద్దిగా చెబుతున్నాడు. రంగారావు సుముఖంగా కనబడితే మరికాస్త చెబుతున్నాడు. విముఖంగా కనబడితే టాపిక్ మారుస్తున్నాడు. ఈ విధంగా తను రంగారావుకి బోరుకొట్టకుండా వుండటమే కాక తనకు రంగారావు బోరుకొట్టకుండాకూడా చూసుకున్నాడు కామరాజు.

ఒకరోజు ఇద్దరూ ఆడవాళ్ళ మనస్తత్వాల గురించి చర్చిస్తున్నారు.

"స్వతహాగా ఆడదానికి తెలివి తేటలు తక్కువ. ఏ ఆడదాన్నయినా మంచి మాటలతో ఇట్టే మోసం చేయవచ్చు. తనకు జరిగే నష్టం తెలిసుండీ ఆడది మగవాడికి లొంగిపోతుంది. ఎందుకంటే ఆడదీ గుడ్డిగా కొన్ని విషయాలు నమ్ముతుంది. ఆ నమ్మకం వల్లనే ఆమె ప్రేమమూర్తిగా విలసిల్లగలుగుతోంది " అన్నాడు రంగారావు.

"మీ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభ విస్తున్నాను కానీ ఆమె ప్రేమమూర్తి కావటా నికి నమ్మకంకాదు కారణం. అమాయకత్వం. మీరు చెప్పే నమ్మకంకూడా అమాయకత్వం వల్ల కలిగినదే—అసలు ప్రేమ అన్న పదం అమాయకులకోసం సృష్టించబడింది చెప్పితే - దాని కర్థమేముంటుంది-" అన్నాడు కామరాజు.

"మీరు చెప్పిందీ నిజమే ననిపిస్తోంది "

"అనుభవంమీద చెబుతున్నానుగదా—ఉదా హరణకు నా భార్యను తీసుకోండి. అమాయ కత్వానికి ఆమెను చెప్పి వేరెవరినైనా చెప్పాలి. తన ప్రాణంమీదకు వచ్చే రహస్యాన్నికూడా దాచలేదు .. "

హఠాత్తుగా లత గుర్తుకువచ్చింది నాకు. ఆడవాళ్ళు రహస్యాలు దాచలేరంటారు. మే మిద్దరం కలుసుకున్న సంగతి రహస్యంగా వుంచడం తనకు ఇబ్బంది అన్నట్లుగా ఆమె ఉత్తరంలో రాయనే రాసింది.

"నిజంగానే ఆడవాళ్ళు రహస్యం దాచలే రంటావా?" అనడిగాను కామరాజుని.

"ఆహా-నా ఎరికలో కనీసం వందమందైనా వున్నారు. మా ఆవిడ వాళ్ళలో ఒకర్తి మాత్రమే!"

"ఉదాహరణకు-వివాహం చేసుకుంటావన్న నమ్మకంలో ఓ ఆడది నీకు లొంగిపోయిం దనుకో—వివాహమయ్యేవరకూ ఆమె పరిస్థితి ఎలాగుంటుంది? రహస్యం దాచగలదా?"

కామరాజు నావంక అనుమానంగా అదోలా చూసి — "రహస్యం దాచక ఏం చేస్తుంది? తప్పనిసరిగామరి-అందువల్ల విషయం రహస్యం గానేవుంచుతుంది. కానీ ఆమె—వివాహమయ్యే వరకూ భయం భయంగా నీరసంగా రోజులు గడుపుతుంది. మళ్ళీ తన నెవరనుమానిస్తున్నారో నన్న అనుమానంతో మేకపోతు గాంభీర్యాన్ని నటిస్తుంది. ఆ నరకం అనుభవించేవాళ్ళకేగానీ తెలియదు"

నాకు గట్టిదెబ్బే తగిలింది. ముఖంలోకి ఏ భావమూ రాకుండా ఉండేలా జాగ్రత్తపడ్డాను. కామరాజుకి నామీద ఈపాటికే ఏదో అనుమానం వచ్చి వుంటుంది. యథాలాపంగా అడిగినట్లు అడిగాను - "ఒక్కొంజాలక ఆమెకు మరొకరితో వివాహమైందనుకో ?"

"ఆ ఆడకూతురు అనుభవించే నరకయాతన మగవాడికికూడా రాకూడదు. భౌతిక సమస్యల కంటె—మానసిక వ్యథలే మనిషిని ఎక్కువగా బాధపెడతాయి" అన్నాడు కామరాజు.

"చాలా బాగా చెప్పారు. అందుకే మనసున్న మగవాడెవ్వడూ ఆడదాన్ని మోసం చెయ్యా కూడదన్నది నా అభిప్రాయం" అన్నాడు రంగారావు. అతనా మాటలను చాలా ఖచ్చితంగా అన్నాడు. నా మటుక్కు నాకు ఆ మాటలు నన్నుద్దేశించి అన్నట్లనిపించినా రంగారావుకి అతకు నాకూ గల సంబంధం గురించి తెలియదుగదా అని సరిపెట్టుకున్నాను.

ఇంటికి వెడుతున్నప్పుడు రంగారావు నాతో అన్నాడు—"నేను మిమ్మల్ని చాలా జాగ్రత్తగా పరిశీలిస్తున్నాను. ఇందాకా మీరు కామరాజుగారి నడిగిన ప్రశ్నల వెనుక ఏదో కథ ఉంది. అదేమిటో నేను తెలుసుకోవచ్చా?"


నేను ఇబ్బందిగా నవ్వి—"అబ్బే అలాంటి దేమీలేదు" అన్నాను.

"లేకపోతే ఫరవాలేదుకానీ ఎప్పుడూ ఆడదానికి అన్యాయం తలపెట్టకండి"

"నేనటువంటివాడిని కాదుకానీ మీరీ విషయంలో చాలా ఖచ్చితమైన అభిప్రాయంలో వున్నారు. అడుగుతున్నానని మరోలా అనుకోకండి—స్వానుభవమా?" నా మనసులో ఉన్న కసి ప్రశ్నలో చోటుచేసుకో గలిగింది.

అయితే నేను ఆశ్చర్యపోయేలా-"అవును!" అన్నాడు రంగారావు.

(వి)చిత్ర విజ్ఞానం



ఆఫ్రికాలోని "పాపిలో యాంటిమాకస్" అనబడే సీతాకోకచిలుక రెక్కల పొడవు సుమారు పది అంగుళాలు. ఇది సీతాకోకచిలుకల కల్లా చాలా పెద్దది. దీని వంటినిండా విషమే. ఈ విషంతో ఆరు పిల్లులను చంపవచ్చునని, సీతాకోకచిలుకల నిపుణుడు డా॥ గూడెన్ అంటున్నారు. ఇంగ్లాండులోని డార్సెట్‌లో వీరు ఒక పెద్ద సీతాకోక చిలుకల "ఫారమ్" నెలకొల్పారు!

"తెలుసుకోవచ్చా—అదేమిటో?"

"తెలుసుకోవడాని కిందులో ఏమీ లేదు. మగవాడికి తొందరెక్కువ. ఆడదానికి మగవాడి మీద విశ్వాస మెక్కువ. రెండూ నా జీవితంలో జరిగాయి ."

రంగారావుకూడా నాకులాగే తొందరపడ్డాడని అర్థమైంది — "ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నారా?"

"లేదు. కానీ ఆమె వివాహం జరిగిపోయింది " అంటూ అదోలా నవ్వాడు రంగారావు. ఆ నవ్వు చాలా విషాదంగా వుంది.

"కామరాజు ఎటువంటివాడినైనా గంటలో అర్థం చేసుకోగలడు. కానీ అతను మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకున్నాడనిపించదు " అన్నాను. అలాఅనడం ద్వారా అతనికథ అతని చేతనే మరికొంచెం చెప్పించగలననిపించింది.

కానీ అతనూ లొంగలేదు — "కామరాజు గారా? ఆయన కేవలం ధర్మామీటరులాంటి వారు" అన్నాడు రంగారావు.

"ఊఁ" అని ఉలిక్కిపడ్డాను—"అంటే?"

రంగారావు ముఖం బాధగా అయిపోయింది- "నేను ప్రేమించి పెళ్ళిచేసుకుందా మనుకున్న లక్ష్మి కొన్ని విచిత్ర పరిస్థితిల్లో నన్నపార్థం చేసుకుని నాకు దూరమై ఇప్పుడు శ్రీమతి కామరాజు అయింది. పవిత్రతకు మనపూర్వీకు లిచ్చిన తప్పు నిర్వచనాన్ని నమ్మి తానపవిత్రు రాలనని భావిస్తోందామె. లక్ష్మి జీవితంలో ఏ పనైనా చేయగలదుకానీ రహస్యాన్ని దాచలేదని నాకు తెలుసు. అందుకే ఇప్పుడామెలోనున్న ఏకైక రహస్యం ఉష్ణంలా ఆమెను కాలు స్తూంటే—ఆమె తెలివి తేటలు మరిగి ఆవిరైపోయాయి. ఎంతో తెలివైన లక్ష్మి ఒక చిన్న రహస్యం గురించి శుద్ధ అమాయకు రాలుగా మిగిలిపోయింది. కామరాజుగారు ఆమె అమాయకత్వాన్ని మాత్రమే కొలవ గలుగుతున్నారు. మరిగే నీటికి ఎంత ఉష్ణాన్ని సరఫరా చేసినా నీటి ఉష్ణోగ్రత పెరగదు. నా రాక, నా సమక్షం—లక్ష్మికి ఉష్ణంతో సమానం. ఆ వుష్ణాన్నామె భరించినా కామరాజది తెలుసుకోలేడు. అతను ధర్మామీటరు లాంటి మీ వాడు కాబట్టి! ఒకవిధంగా చెప్పాలంటే స్త్రీ నీటి వంటిది. ఆమెలో ఎన్నో రహస్యాలు దాగి వుంటాయి. మగవాడికొకటీ ఆడదానికొకటీ న్యాయమున్న ఈ సమాజంలో—పురుషుడు ధర్మామీటరులా వుండడమే స్త్రీకి వరం!"

రంగారావు మాటలకు ఆశ్చర్యపడ్డాననడం కంటె షాక్‌తిన్నాననడం మేలు! నా మనసులో చాలాకాలంగా పీడిస్తూన్న ప్రశ్నకు జవాబు దొరకడంతో పాటు రంగారావును తప్పు అంచనా వేసిన నా తెలివి తక్కువతనంకూడా తెలుసుకోగలిగి—"మీరు సామాన్యులు కారు రంగారావుగారూ—" అన్నాను అభినందన పూర్వకంగా.

రంగారావు ముఖం వెలిగింది—"ఇందులో పెద్ద విశేషమేమీలేదు. మానవమనస్తత్వాలను పరిశీలించడం నాకు హాబీ—" అన్నాడు.

ఇద్దరం విడిపోయాక బాగా ఆలోచించాను నేను. లక్ష్మికి వచ్చిన ఇబ్బంది లతకు రాకూడదు. నా పెళ్ళి విషయంలో నేనే నిర్ణయం తీసుకోవాలి.

మర్నాడు ధైర్యంగా తలిదండ్రులకు నా వివాహ విషయంలో నిర్ణయం చెప్పేసరికి వాళ్ళు ముందుగా ఆశ్చర్యపోయినా, తర్వాత కాసేపు గొడవ జరిగినా, చివరకు నామాట కంగీకరించారు.

నా అర్థాంగి అయినాక కూడా లతఅమాయకు రాలు కానవసరంలేకపోయింది. అందుకు నేను గర్వపడ్డప్పటికీ — కామరాజు భార్య లక్ష్మిని చూసినప్పుడల్లా నా మనసు కలుక్కుమంటూ ఉంటుంది.

పవిత్రతను కేవలం ఆడదానికే పరిమితం చేసిన ఈ సమాజంలో, నాలాంటి మగవాళ్ళెందరో వున్న ఈ సమాజంలో—ఆడది తన ఏ రహస్యాన్నయినా నిర్భయంగా బయటకు చెప్పుకునే రోజు ఎన్నటికైనా వస్తుందా?

ఆ రోజు వచ్చేవరకూ ఆడదానికి లేటెంట్ హీట్ బాధ తప్పదు. మగవాడు ధర్మామీటరుగా ఉండగలగడమొక్కటే ఆమెకు వరం! □

రొట్టెముక్క

డి. కామేశ్వరి

రైలు కీచుమంటూ ప్లాట్‌ఫారంమీద ఆగింది.

అంతవరకు నిద్రపోతున్నట్టున్న ప్లాట్‌ఫారం ఒక్కసారిగా మేల్కొంది. రైలు ఆగడం చూసి అంతవరకు చింతచెట్టు కింద గోటీబిళ్ల ఆడుతున్న పెంటిగాడు, సిన్నిగాడు ఒక్క పరుగునవచ్చి గద్దల్లా వ్రాలారు రైలు దగ్గిర. అక్కడనించి వాళ్ళ ఆకలిపాట మొదలు 'అమ్మా ఒక ముద్దపడేయి తల్లీ — బాబూ నిన్నకాడనించి గంజి నీళ్ళులేవు ఒక పైసయియ్యి బాబూ, సిన్న రొట్టెముక్క డెయ్యి తల్లీ మీకు పున్నెం వుంటది. అమ్మా-బాబూ మీ కాల్లకి దండం బాబూ-' అరిగి పోయిన గ్రామఫోను ప్లేటులా ప్రతి రైలు వచ్చేసరికి ఆ పాట మొదలు పెడ్తారు. యీగల్లా రైల్లో తింటున్న వాళ్ళమీద ముసురుతారు. జలగల్లా పట్టుకు పీకుతారు. తింటున్న వాళ్ళు వాళ్ళ కాకిగోల భరించలేక, వాళ్ళ గజ్జి చేతులు, చింపిరి తలలు, కళ్ళపుసులు, దిసమొలలు చూసి తింటున్న తిండి మింగుడు పడక వాళ్ళని వదిలించుకుంటే చాలని తింటున్న అన్నం ఓ ముద్దో — ఓ రొట్టె ముక్కో తిట్టుకుంటూ పడేస్తారు. యిచ్చేవరకు కంపార్టుమెంటు కిటికీపట్టుక వేలాడుతారు — రైలుకింద నించి పాముల్లా జరజరపాకి యీ ప్లాట్ ఫారం మీదనించి ఆ ప్లాట్‌ఫాంకి యీ రైలు పెట్టె నించి మరో రైలు పెట్టెకి ఎగబాకుతారు — ప్లాట్‌ఫారం అంతా కలతిరుగుతారు. టీ స్టాలు వాడిని బతిమిలాడుతారు — కాంటీను వాడిని దేబిరిస్తారు — బెంచీలమీద కూర్చున్న ప్రయాణీకుల ప్రాణాలు తోడ్తారు. ఓ ముద్ద అన్నం కోసం, ఓ రొట్టె ముక్కకోసం వాళ్ళు ఏమన్నా చేస్తారు. ఆ చిన్న కడుపులకోసం వాళ్ళ ఆరాటం అంతా యింతాగాదు!

పెంటిగాడు, సిన్నిగాడు కవలలు — ఎనిమిదేళ్ళ క్రితం అదే ప్లాట్‌ఫారంమీద, అదే చింతచెట్టు కింది ఓ గోనెపరదా చాటున, మరో గోనె పరదామీద ఓ ముష్టితల్లి వాళ్ళిద్దరిని కని పడేసింది. వాళ్ళిద్దరి తండ్రి ఎవడో ఆ తల్లికే తెలియదు. ముష్టి సింహాద్రికేపుట్టారో, లైసెన్సు కూలీల్లో ఎవడికి పుట్టారో, స్వీపర్ నర్సింలు, రంగడికే పుట్టారో ఆ దేముడికే తెలియాలి. ముష్టిదైతేనేం, శరీరం నిండా రోగాలుంటేనేం, వళ్ళంతా దుమ్ముకొట్టుకునుంటేనేం, తల నిండా పేలు కులకుల్లాడితేనేం, మైలుదూరానికి కంపుకొడితేనేం, అవసరానికి ఆడదన్న నిజం మరిచిపోలేని వాళ్ళలో ఏ పుణ్యాత్ముడో, ఆమెకి మాతృత్వం ప్రసాదించాడు — ఆ మాతృత్వం ఆమె పాలిట వరంగాదు, శాపం! ఒకరికి యిద్దరు భూమ్మీదపడ్డాక 'నా కడుపుకే లేదు. ఈ గుంటెదవల్ని ఏటిపెట్టి సావను,' అంటూ నెత్తిబాదుకుంది. 'నారు పోసినోడు నీరు పొయ్యడేటి, నీవు బతకడంలేదా, నాను బతకడంలేదా ఆల్లే పెరుగుతారు గాలికి ధూళికి' అంటూ ఓదార్చింది మరో ముష్టితల్లి.

అలాగే గాలికి ధూళికి పెరిగినట్టే — ఆ చెట్టు కిందే పెంటిగాడు, సిన్నిగాడు పెరిగారు. చింత

★ అబ్బ - ఎంత ఘోరం - ఇంత చిన్న రొట్టె ముక్కకి ప్రాణం 'కాపాడే శక్తేకాదు, తీసేశక్తీ వుందని యివాళే తెల్సింది ★

చెట్టు కింద ఎండలో వళ్లుకాచుకున్నారు, వర్షం నీళ్ళలో స్నానంచేశారు. చెట్టు కింద దుమ్ము పొడరు రాసుకున్నారు — పక్షుల కిలకిలా రావాలే జోలపాటలయాయి—చింత చెట్టుకిందే పొరాడడం నేర్చుకున్నారు—ప్లాట్ ఫారంమీద అడుగు లెయ్యడం నేర్చారు. రైళ్ళ కూతల మధ్య పలుకులు నేర్చారు. ముష్టితల్లి యిద్దర్నీ చెరోచంకని జోలెకట్టుకుని వచ్చేపోయే రైళ్ళ దగ్గిర అడుక్కునేది—దొరికినదేదో పిల్లల నోట్లో యింతపెట్టి తననోట్లో యింతపెట్టు కునేది—ఏం దొరకనినాడు తిని పారేసిన ఎంగి లాకులు నాకి, పంపులో నీళ్ళు కడుపుపట్టినన్ని తాగేవారు. చెట్టు కింద పిల్ల లిద్దరిని చెరో పక్కని పెట్టుకుని పడుకునేది ఆ తల్లి— పెంటిగాడు, సిన్నిగాడు నడక మాటలు నేర్చిం దగ్గిరనించి తల్లి వెంట అడుగులేసి, చిన్న చేతులు చాపి 'అమ్మా బువ్వ—ఒక ముద్ద తల్లీ—మీకు దండం తల్లీ—' అని అడు క్కోడం నేర్చారు.


పిల్లలకి అడుక్కోడం వచ్చేసింది, యింక తన అవసరం లేదన్నట్టు, రెక్కలొచ్చిన పక్షు లని వదిలిపోయిన పక్షిలా ఆ ముష్టి తల్లి కలరాసోకి ఆ చెట్టుకిందే కన్ను మూసింది— ఆ మూడేళ్ళ దిక్కుమొక్కులేని ఆ పిల్లలని చూసి తోటి ముష్టివాళ్ళు జాలిపడి అడుక్కు తెచ్చుకున్నది తలో ముద్దపడేసేవారు. టీస్టాల్ వాళ్ళు సీనా రేకు డబ్బాలో యింత టీ పోసి చెల్లని పాసిపోయిన రొట్టె ముక్కలు పడేసే వారు. కాంటీను దగ్గిర ఎంగిలాకులు ఏరుకుని నాకేవారు. రైలు ఆగగానే ప్రయాణీకుల ముందు చేతులు చాపేవారు. దొరికిందేదో తిని- చెట్టుకింద పగలల్లా మట్టిలో పొర్లి దొర్లి ఆడి రాత్రి కాగానే వళ్ళెరగకుండా ఒకరి నొకరు కౌగలించుకుని నిద్రపోయేవారు.

ఒక్క తిండి విషయంలో తప్ప వాళ్ళిద్దరూ ఆప్తమిత్రులు—తిండి దగ్గిరకి వచ్చేసరికి మాత్రం బద్ధ శత్రువుల్లా మారిపోతారు. ఒకడి చేతిలో ఏదన్న పడిందంటే రెండోవాడు ఎక్కడ అడుగుతాడోనని చేతిలోది చటుక్కున నోట్లో పెట్టేసుకుని గుటుక్కున మింగేస్తారు. అప్పు డప్పుడు ఒకడి చేతిలోది ఒకళ్ళు గద్దలా వాలి తన్నుకు పోతారు. దానికోసం యిద్దరూ కుమ్ము కుంటారు. కుళ్ళ బొడుచుకుంటారు. జుత్తు పీక్కుంటారు. బండబూతులు తిట్టుకుంటారు. కాసేపు ఏడ్చుకుని తరువాత మరచిపోయి మరో రైలు వచ్చేసరికి యిద్దరూ కలిసి పరిగెత్తి ఏక కంఠంతో ముష్టి పాట మొదలు పెడ్తారు.

* * *

పెంటిగాడు, సిన్నిగాడు అప్పటికి తిండి మొహంచూసి ముప్పై గంటలయింది—నిన్నటి నించి ఎంగిలాకులలో పచ్చళ్ళు—మిగిలిన కూర ముక్కలు అయినా తినడం కుదరలేదు. నిన్న ఉదయం జరిగిన ఒక ఉదంతం వాళ్ళి ద్దరి నోట దుమ్ముకొట్టింది. నిన్న ఉదయం మెయిలు వచ్చి ఆగగానే పెంటిగాడు, సిన్ని గాడు యధాప్రకారం ముష్టిపాట మొదలుపెట్టి ప్రయాణీకులని పీడించడం మొదలు పెట్టారు. ఒక ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో ఓ పెద్ద ప్రభుత్వాధికారి బ్రెక్ ఫాస్టు తింటున్నాడు— పెంటిగాడు కిటికీపట్టుకు వేలాడుతూ 'బాబూ చిన్న రొట్టె ముక్క పడేయండి, మీకాళ్ళకి దండంబాబు, కడుపు మండిపోతంది బాబూ-" అంటూ పో - పో అని కసిరినా, విసుక్కున్నా వదలకుండా జలగలా పట్టుకున్నాడు—ఆయన తింటున్న ఆమ్లెటు, ఆశగా, ఆబగా చూస్తూ వాసన ఆఘ్రాణిస్తూ నోట చొంగ కారుస్తూ ఆకలి చూపులతో, గజ్జి చేతులతో దేవిరిస్తున్న వాళ్ళిద్దరినీ చూడగానే తింటున్న ఆమ్లెట్టు గొంతు దిగనంది ఆయనకి. హాయిగా పేపరు చదువుకుంటూ బ్రెక్ ఫాస్టు ఎంజాయ్ చేయ నీకుండా, మూడు దవ్వ బిళ్ళల్లాంటి రూపాయ లిచ్చి ఆర్డరిచ్చిన యీ బ్రెక్ ఫాస్టు ఈ ముష్టి వెధవలకోసం అన్నట్టుఅడుగుతున్న వాళ్ళిద్దరిని చూసేసరికి దొరగారికి తిక్కరేగింది. ఆఫీసులో రెండువేలు తెచ్చుకునే అధికారయినా ఎదురుగా చేతులు కట్టుకు నిల్చుని చెప్పింది తుచ తప్ప కుండా పాటించడం మాత్రం అలవాటయిన ఆ అధికారిగారికి ఆఫ్ట్రాల్ ముష్టి వెధవలు

తన మాటకి గడ్డిపోతకన్నా విలువ యీయ కుండా, కేకలేస్తున్నా నిర్లక్ష్యంగా నిలబడిన వాళ్ళిద్దరిని చూసేసరికి ఆయన కోపం కంట్రో లవలేదు—చేతిలో ఆమ్లెట్ ప్లేటులో విసరి కొట్టి—చరచర కంపార్టుమెంటుదిగి, బిరబిర స్టేషన్ మాస్టర్ రూమ్‌వైపు నడిచాడు. అక్కడ అగ్ని పర్వతం బద్దలయినట్టు బరస్టు అయ్యాడు. ఆ స్టేషన్ మాస్టర్ని చెడామడా స్టేషను మాస్టర్నీ, రైల్వే సిబ్బందిని, ముష్టి వెధవల్ని, బీదరికాన్ని, దర్టీ ఇండియానీ తిట్టి తిట్టి ఆఖర్ని ముష్టి వెధవన్నవాడు ప్లాట్‌ఫాం మీద కనిపిస్తే నీ ఉద్యోగం ఊడబీకిస్తా, చిప్ప చేతికిప్పిస్తా—అంటూ రైలక్కడ యిరవై నిమిషాలు ఆగుతుంది కనక సావకాశంగా తిట్టి—ఆఖర్ని వార్నింగ్ యిచ్చి ఊపిరి పీల్చు కున్నాడు ఆ అధికారి.



తిట్టాడు- దేశంలో ముష్టి వెధవలందరిని శపిం చాడు. ముష్టి వెధవల్ని ప్లాట్‌ఫారంమీదకి అడుగు పెట్టనండా కంట్రోలు చేయలేని అతని అసమర్ధతని దుమ్మెత్తి పోశాడు. స్టేషన్లనీ

'ఎవడవయ్యా నీవు—నీ మోచేతి కింద నీళ్ళు తాగుతున్నానా, నీబాబుగాడి సొమ్మ జీతం యిస్తున్నావా పోవయ్యా నీలాంటి వాళ్ళని చాలామందిని చూశాను

ఆ హాహా - ఫ్లాట్‌ఫాంమీదకి ముష్టి వెధవని రాకుండా చెయ్యడమా ఇదేదో పెద్ద జోక్ సార్—ఎప్పుడూ వినలేదు. మీరేదో పిచ్చి వాళ్ళులావున్నారు సార్, వాళ్ళని ఆపడం, రానీకుండా చెయ్యడం అన్నది నాకేకాదు, నన్ను పుట్టించిన దేముడికైనా చేతకాదు—పైగ్రిం మినిస్టరొచ్చినా ఏం చెయ్యలేడు—వెళ్ళండి సార్—మీ కోపం యింట్లోపెళ్ళాం పడితే ఆవిడమీద చూపుకోండి, అంతేగాని నామీదకాదు చూపడం, ఆహాహా ఉద్యోగం ఊడబీకిస్తావూ—అసలింతకీ నీనెవడివయ్యా - ఏ బోడి అధికారంతో నన్ను నిలబెట్టి దులుపు తున్నావు—రైల్వే మినిస్టరువా, సెక్రటీవా- ఆ చెప్పు వింటాము-కావలిస్తే కంప్లయింటు రాసుకో - పో - పో ' అనేద్దామనుకున్నాడు స్టేషను మాస్టరుఅవేశంగా. అనేసేవాడే—ఖర్మ కొద్ది ఎమర్జన్సీ వుండబట్టి కోపం కంట్రోలు చేసుకున్నాడు - ఏ పుట్టలో ఏ పాముందో వీడె వడో ఇంత ఎత్తు ఎగురుతున్నాడంటే ఎంతెత్తా ఫీసరో అయేవుండచ్చు—వీడికోపం మండి పోనూ-నిజంగా కంప్లయింట్ రాశాడంటే—ఎమర్జన్సీ దెబ్బల్లో ఉద్యోగం ఊడినా ఊడచ్చు అని లోపల్నించి తన్నుకొచ్చిన కోపాన్ని పౌరుషాన్ని శివుడు గొంతులో గరళం యిముడ్చుకున్నట్టు యిముడ్చుకుని — మరీ భయపడినట్లు కనిపించడానికి నామోషీ అన్పించి కాస్త దర్పంగా తలెత్తి—' ఏం చెయ్య మంటార్ సార్, ఆ వెధవలు యిటు తన్నితే అటు వస్తారు—యీ ముష్టి వెధవల్ని తోల డమేనా మాకున్న డ్యూటీ ' అన్నాడు కాస్త దబాయిస్తున్నట్టు.

'అఫ్‌కోర్స్ - అది నీ డ్యూటీలో భాగమే- స్టేషనులోకి ప్రతి ముష్టి వెధవా జొరపడి ప్రయాణీకులని యిబ్బంది పెట్టకుండా కంట్రోలు చెయ్యడం నీ డ్యూటీ' అన్నాడు ఆఫీసరు మరింత ఫైరవుతూ—తనపై అధికారి కాకుండా మరెవరోవచ్చి చెడామడా నిలబెట్టి దులిపే స్తూంటే, చుట్టూ జనం మూగివింతచూస్తుంటే అవమానం ముంచుకు వచ్చింది. పౌరుషం తలెత్తింది. మొహంలో రక్తం పొంగి ఎర్ర బడింది. ఏదో అనేలోపలే యింకా పూరవలే దన్నట్టు ఆఫీసరు తోటి ప్రయాణీకులు సపోర్టు బలంతో మరింత పుంజుకుని విజృంభించి 'నీ డ్యూటీ కాదంటే—నీ డ్యూటీ నీవు చెయ్యలేనంటే చెప్పు—అది నీ డ్యూటీ కాదో అవునో పై వాళ్ళనే తేల్చమంటాను. ఏదీ కంప్లయింట్ బుక్ యిలాతే—నే నెవరో తెలుసా నే తల్చుకుంటే నీవు మరింక ఏ డ్యూటీ చెయ్యక్కర లేకుండా చేసేస్తా—' అంటూ యింగ్లీషులో అరిచాడు. చుట్టూ జనం—'అవునండీ. ఎవరో వకరు కలగ చేసుకోకపోతే లాభంలేదు—చా - ఛా - తిండి తిననీరు. కంపార్టుమెంటులో చొరబడి పోవడం. రామ-రామ-ప్రయాణం అంటే అసహ్యం .. కావల్సిందే - బొత్తిగా ఎవడికీ పట్టనట్టూరు కుంటే వాళ్ళు జలగల్లా పీక్కు తినకేంచేస్తారు. స్టేషను మాస్టర్ ఆ మాత్రం కంట్రోలుచెయ్యక పోతే మరింకెందుకు నాలుగు తగలనిస్తే మళ్ళీవస్తారా ' ప్రయాణీకులంతా ఆఫీసరుతో కలిసి పోగానే స్టేషను మాస్టరు మొహం మరింత ఎర్రబడి పోయింది.


'ఏం కంప్లయింట్ రాయమంటావా—మళ్ళీ ఫ్లాట్‌ఫాంమీద ముష్టి వెధవల్ని రాకుండా కంట్రోలు చేస్తావా—నీతో ఆర్గ్యూ చేసే టైమ్ నాకు టైములేదు—' అసహనంగా అరిచాడు ఆఫీసర్.

'మీరు వెళ్ళండి సార్. మీరెప్పుడూ యిలా జరగకుండా చూస్తాం లెండి. ట్రైను కదులుతుంది. పదండి సార్' యిద్దరు ముగ్గురు టికెట్ కలక్టర్లు, గార్డు అంతా రాజీ ధోరణిలో మాట్లాడారు.

'రైలు కదులుతుంది—ఎలా కదులుతుందో నేనూ చూస్తాను—ఈ అంతుతేలందే కదలను'

ఆఫీసరు మొండికెత్తాడు. స్టేషనుమాష్టరు తలదించక తప్పలేదు "మీరు వెళ్ళండి సార్, ఏక్షన్ తీసుకుంటాను'అన్నాడు గొంతు పెగుల్చుకుని ఆఖరికి.

నిజంగానే ఏక్షన్ తీసుకున్నాడు. ఆఫీసరు



జరిపిన అవమానం, నలుగురి ముందు జరిగిన పరాభవం—దాని కంతటికీ కారణం అయిన ఆ గుంట వెధవలమీద చాలా పెద్ద ఏకనే తీసుకున్నాడు. కాంటీను దగ్గిర ఎంగిలాకులు నాకుతున్న ముష్టికి వెధవని కాలితో తన్నాడు. బూటుతో కుళ్ళబొడిచాడు, చేతిలో లాఠీతో కొళ్ళు విరగ్గొట్టాడు—కడివీరా వెంపలు అదర గొట్టాడు. గడ్డాలు పాచినట్టు యిద్దర్నీ వాడి, ఇద్దర్నీ కలిపి పులిలి స్తరాపులు గోడమీదనించి విసిరేసినట్టు స్టేషను కిటకిటలమీదనించి రోడ్డు మీదకి విసిరేశాడు.

బండబూతులు తిట్టాడు, మళ్ళీ ఆ చాయల కనిపిస్తే పాతేస్తానన్నాడు. లోపలికి అడుగు పెడితే కాళ్ళిరగ కొడ్తానన్నాడు. నోరు మెదిపితే నాలుక తెగగోస్తానన్నాడు. అరగంటసేపు వాళ్ళని తన్ని, కుమ్మి, తిట్టి తనకోపం శాంతించాక, "రాస్కెల్స్, డర్టీ రాస్కెల్స్-లంజా కొడుకులు — ఏముండో కనిపారేయడం — ఈవెధవలు మా పీకలమీద ఎక్కికూచోడం గాడిదకొడుకులు యీసారి కనిపించండి " అంటూ అరుస్తూ లోపలికెళ్ళాడు. పెంటిగాడు, సిన్నిగాడు యీ జరిగిన గొడవ కంతటికీ తామే కారణం అన్న సంగతి అర్థంకాక, స్టేషను మాష్టరు ఎందుకు కొడుతున్నాడో, తిడుతున్నాడో తెలియక కళ్ళప్పగించి బిక్కచచ్చి వుండిపోయాడు. వాళ్ళిద్దరినీ కొట్టడంచూసి మిగతా ముష్టివాళ్ళంతా తాత్కాలికంగా ఆచెట్టు కిందనించి జారుకున్నారు.

వంటికి అంటుకున్న దుమ్ము - నోట్లోంచి కారిన రక్తం, చెక్కుకుపోయి మండుతున్న గాయాలు, కారే కన్నీళ్లు అన్నీతుడుచుకున్నాక తోటి ముష్టివాళ్ళు ఆదెబ్బలకి కారణం చెప్పాక మళ్ళీ ఆ స్టేషను లోపలికి అడుగు పెట్టడానికి ధైర్యం చాలలేదు. యిద్దరూ బితుకుబితుకు మంటూ ఆ గజాల దగ్గిరే ముడుచుకు కూర్చున్నారు. వాళ్ళిద్దరూ పుట్టి బుద్ధి ఎరిగిన ఈ ఎనిమిదేళ్ళల్లో ఆ స్టేషను తప్పబయట ఓ ప్రపంచంవున్నదన్న సంగతి ఎరగరు-ఆ స్టేషను ఆవరణ దాటి ఎరగని ఆ యిద్దరూ స్టేషనులోకి రావద్దంటే మరెక్కడన్నా వెళ్ళి అడుకోవచ్చని కూడా తెలియనంత అయోమయంలో, ఎక్కడి కన్నా వెడితే తల్లినించి తప్పడి జనంలో కలిసి పోతామని తల్లి కొంగు విడవని పసివాళ్ళలా ఆ స్టేషను గజం బద్దలు పట్టుకుని వచ్చేపోయే

రైళ్ళను చూస్తూ, అమ్మే తినుబండారాలుచూస్తూ కింద విసిరేసిన ఎంగిలాకులు చూస్తూ నోట చొంగ కార్చుకుంటూ, ఆశగా, ఆబగా, దీనంగా ఆరోజంతా ఆకలి కడుపులతో నకనకలాడి, రాత్రి కాంగానే ఆ మట్టిలోనే ఆ గజాల నానుకునే నిద్రపోయేరు.


తెల్లారగానే—నిన్న భయానికి అణిచి పెట్టిన ఆకలి మరి ఏమయినా ఆగనన్నట్టు విజృంభించింది. పెంటిగాడు, సిన్నిగాడు నకనకలాడుతున్న కడుపులని ఎలా నింపుకోవాలో తెలియక బిక్కమొహాలు వేసుకునిల్చున్నారు. ధైర్యంచేసి గజాల మధ్యనించి దూరి ప్లాట్ ఫారమ్మీదకి వెళ్ళాలన్న ఆరాటాన్ని అదుపులో పెట్టుకోవడం కష్టమయి పోసాగింది వాళ్ళకి - మరుక్షణం నిన్న కొట్టిన దెబ్బలు తాలూకు నల్లగా కమిలిపోయిన, రక్తం కారిన, చెక్కుడుపోయిన గుర్తులు కళ్ళముందు కనపడుతూంటే - ఆకలి ముందుకు లాగుతూంటే భయం వెనక్కి లాగుతూంటే ఏం చెయ్యాలో తెలియక గజాలు పట్టుకు నిలున్నారు.

అదే సమయంలో మెయిలువచ్చి ఆగింది. గజాల అవతల నిలబడ్డ వాళ్ళిద్దరి ఎదురుగా ఓ ఫస్టు క్లాస్ కంపార్టుమెంటు ఆగింది.

అక్కడ కిటికీ దగ్గిర ముద్దులు మూటకట్టే ఐదేళ్ళ పిల్లాడు కూర్చుని అటూయిటూ చూస్తున్నాడు. పిల్లాడికి యిరుపక్కలా అందం, యవ్వనం, ఐశ్వర్యం, ఆధునికత కలిసి మిసమిసలాడుతున్న తల్లితండ్రులు కూర్చున్నారు. రైలు ఆగగానే కంపార్టుమెంటులోకి బేరర్ బ్రెక్ ఫాస్టు ట్రే తీసుకు వెళ్ళాడు. ఆ ట్రేలోంచి ఓ సాండ్ విచ్ తీసి కుర్రాడికి యిచ్చి తినమని బ్రతిమిలాడుతుంది తల్లి. కుర్రాడు వద్దంటూ తల ఆడిస్తున్నాడు. కుర్రాడి చేతిలో బలవంతంగా సాండ్ విచ్ పెట్టి తల్లితండ్రి కాఫీ తాగసాగారు. కుర్రాడు చేతిలో రొట్టెపట్టుకుని తినకుండా ప్లాట్ ఫారమ్మీద సందడి కుతూహలంగా గమనిస్తున్నాడు.

ఆ కుర్రాడి చేతిలో రొట్టె చూసేసరికి

(వి)చిత్ర విజ్ఞానం



రష్యాలో "రిట్ మోసోన్" అనబడే ఒక విద్యుత్ పరికరం కనిపెట్టారు. దీనితో, నిద్ర రాకుండా బాధపడేవారు, హాయిగా నిద్రపోవచ్చు! ఈ పరికరం నుండి పుట్టే శబ్దతరంగాలు నిద్రను పుట్టిస్తాయి. దీనితో, దేహానికి పరోక్షంగా హానిని కలిగించే నిద్రమాత్రలకు స్వస్తి చెప్పవచ్చు!

పెంటిగాడికి సిన్నిగాడికి మరిచిపోయిన ఆకలి విజృంభించింది. ఆ రొట్టె చూడగానే యిద్దరి కళ్ళు మిలమిల్లాడాయి. నోట్లో నీరూరింది. యిద్దరి కళ్ళు కల్సుకున్నాయి. వెంటనే యిద్దరూ నిస్సహాయంగా, యిటు అటు తిరుగుతున్న టి. సి.ని గార్డుని చూశారు. అంతలో పెంటిగాడిబుర్రలో ఓ ఆలోచన తళుక్కుమంది. వాడి కళ్ళు మెరిశాయి, ఆ రహస్యం సిన్నిగాడి చెవిలో ఊదాడు. యిద్దరూ రాబందుల్లా అవకాశం కోసం చేశారు.

గార్డు విజిల్ వేశాడు. రైలు నెమ్మదిగా కదిలింది. వేగం అందుకుంటూంది. పెంటిగాడు యిరుక్కున్న జనాల మధ్యనించి దూరి మెరుపులా పరిగెత్తి కిటికీ దగ్గిర కూర్చున్న కుర్రాడి చేతిలో రొట్టె ముక్క లాగేశాడు. మరో సెకనులో వెనక్కి పరిగెత్తేవాడేకాని వాడి ఖర్మకాలి ఆ తండ్రి చూడడం ఏమిటి చటుక్కున 'చోర్ చోర్' అంటూ పెంటిగాడి చెయ్యి పట్టేశాడు. ఆ చేతిలోంచి తన చెయ్యి లాక్కోవాలని పెంటిగాడు ఎంత గింజుకున్నా ప్రయోజనం లేకపోయింది. భల్లూకంలాంటి ఆ పట్టునించి తప్పించుకోలేక, రైలు వేగం అందుకుంటూంటే దాంతో సరిగా పరిగెత్తలేక, కుక్క నోటకరిచిన కోడిపెట్టలా గాలిలో కాళ్ళు తన్నుకుంటూ గిలగిల కొట్టుకున్నాడు. 'చోర్ బద్మాష్ - పకడో - అంటూ తమ ధనధాన్యాలు కొల్లగొట్టినంత హడావిడిగా అరుస్తూ— 'పుల్ దట్ చైన్' అంటూ భార్యవంక తిరిగి అరిచాడు. పెంటిగాడు ఆఖరి ప్రయత్నంగా తన చెయ్యి పట్టుకున్న ఆ పెద్ద మనిషి చెయ్యి ఛటుక్కున కొరకడం, ఆ పెద్ద మనిషి ఓ కేకపెట్టి పట్టు విడవడం, రైలు వేగంతో బాలన్సు కుదరక ప్లాట్‌ఫారంకి రైలుకి మధ్య ఖాళీ స్థలంలో పెంటిగాడు పడడం, అంతవరకు తెల్లపోయి చూస్తున్న జనం హాహాకారాలు, సిన్నిగాడి కెవ్వుమన్న కేకతో - చైన్‌లాగబడిన రైలాగింది.

ఆగిన రైలు పెంటిగాడి కోసం మరి కాస్త ముందు కెళ్ళాకగాని పెంటిగాడు దొరకలేదు. దొరికిన పెంటిగాడు పెంటిగాడిలాలేడు. ఏ ముక్కకాముక్క తెగిపడి రక్తం ముద్దలా వున్నాడు. రక్తం ముద్దని చూసి అంతా నోట మాటరాక ఒక్క క్షణం నిలబడిపోయారు. జనాన్ని తోసుకు ముందుకు పరిగెత్తి వచ్చిన సిన్నిగాడు - పెంటిగాడిని .తనకున్న ఏకైక బంధువు, తోబుట్టువు, ఆప్తుడు, మిత్రుడిని చూసి కెవ్వుమనలేదు. నెత్తి కొట్టుకుని ఏడవలేదు. ఒక్క క్షణం దిగ్భ్రాంతితో నిలబడిపోయాడు. తరువాత వాడికళ్ళు చురుకుగా దేనికోసమో వెతికాయి. రక్తం ముద్దకి కాస్త దూరంగా సిన్నిగాడు వెతుకుతున్నది కనపడింది. అది దూరంగా తెగిపడిన పెంటిగాడి చెయ్యి. ఆ చేతిలో గుప్పెట్లో బిగించిన రొట్టె ముక్క!! సిన్నిగాడు ఒక్క ఉదుకున అక్కడికి దూకి ఆ చేతిలోంచి రొట్టె ముక్కతీసి చటుక్కున నోట్లో పెట్టేసుకున్నాడు. □

ముక్కుకోటుకు —చెప్పుదెబ్బ

కప్పగంతుల మల్లిఖార్జునరావు

అటూ యిటూ ఏవైపునుంచి చూచినా శకుంతల గొప్ప చరిత్రవున్న కుటుంబానికి చెందినటు వంటిది. ఉభయవంశాలకీ వొకేవొక వారసురాలు కావటంతో ఆ చరిత్రను చెరిగిపోకుండా కాపాడుకోవల్సిన బాధ్యత తనమీదే వుందని ఆమె అనుకొంటుంటుంది.

వస్తుతః ఆమె మంచిదే. కాకపోతే వంశ చరిత్రలవల్ల సంక్రమించిన అతిశయం మాత్రం ఆమెలో అణువణువునా పు ష్క లం గా కన్పిస్తుంటుంది.

సిరిసంపదల్ని, డాబు దర్జాలను గురించి చెప్పుకోవాల్సి వచ్చినప్పుడు తన పుట్టింటి చరిత్రను; దేశసేవను, త్యాగ నిరతిని వుగ్గడించాల్సి వచ్చినప్పుడు అత్తవారి వంశ చరిత్రను వల్లించటం ఆమెకు అలవాటైన రివాజు.

ఆమె మామగారు, ఆయన తండ్రిగారు స్వాతంత్ర్య సమరంలో సిరిసంపదల్ని, భోగ భాగ్యాలను తృణప్రాయంగా అర్పించారని ఆమె చెప్తుంటుంది. ఏం చెప్పినా వుదాహరణలను కోకొల్లలుగా దొర్లిస్తుంటుంది.

"మా వారు మాత్రం? ఆయన—నేతాజీ సుభాష్ చంద్రబోస్ పేరు విన్నావా నువ్వు? గొప్ప దేశభక్తుడులే. దేశానికి వీరోచితంగా స్వాతంత్ర్యం సంపాదించటానికి సైన్యాన్ని తయారుచేశాడు. అదుగో ఆ బోస్ బాబుగారి శిష్యుడు మా ఆయన. రంగూన్ నుంచి జపాన్ దాకా మావారూ బోస్ బాబుగారూ వొకే విమానంలో ప్రయాణించారుకూడా. మావాడు పుట్టేక ఆయన పేరే పెట్టుకొన్నాం—"

నలభై ఏళ్ళన్నా శకుంతలకు నిండకముందే భర్త చనిపోయాడు. అప్పటినుంచీ ఆమె పుస్తకాలతో స్నేహం చేసింది. యివాళ ఆమె అన్ని వార, మాసపత్రికలు, సీరియల్స్‌తోసహా చదువుతుంది. అచ్చయిన ప్రతి నవలా ఆమె కొని జాగ్రత్తగా భద్రపరుచుతుంది. అయినా వొక్కదాన్ని గురించి వొక్క మంచిముక్క ఆమె నోటినుంచి రాదు.

"ప్రేమ! ప్రేమ! యీ కాలపు పిల్లలకు ప్రేమనుగురించి ఏం తెల్సునండీ? ప్రేమను గురించి చెప్పుకోవాలంటే మా వారిని గురించే చెప్పుకోవాలి. అందాకా ఎందుకు? మాది ప్రేమ వివాహం. చిన్నప్పటినుంచి బంగారు పళ్ళేలలో తిని, తివాసీలమీది నడిచినదాన్ని. మావారి తండ్రిగారేమో ఆస్తంతా దేశంకోసం త్యాగం చేసేసేరు. అయినా వారి సంపదను, సుఖాలని గురించి వొక్కక్షణం ఆలోచించానా నేను? ప్రేమ-ప్రేమ. అంతే, మా నాన్నతో చెప్పేను. ఆయనమాత్రం? మొదట్లో ఆశ్చర్యపోయినా మామగారి వంశచరిత్ర తెల్సుగనుక వెంటనే అంగీకరించారు. పెళ్ళయ్యాక మాత్రం? మా నాన్నగారు మాకు వొక్క లోటు రానిచ్చారా? పెళ్లయిన తర్వాత నాలుగు సంవత్సరాలు హనీమూన్‌లకని తిరుగుతూనే వున్నాం—"


శకుంతలకు బోసుబాబు వొక్కడే కొడుకు.

* 'మన చేతిలో రొట్టెముక్క వుందని కుక్క విధిగా మన మాట వింటుందని భావించడం వెర్రితనం—అలాగే మనుష్యుల విషయంలో కూడా. మన పరమైన ఆలోచనలు విధిగా సరైనవని భావించడానికి వీలులేదు. *

ఆమె పెంచి పోషిస్తున్న ఆస్తికి, చరిత్రకు కూడా వారసుడు.

బోసుబాబుది ఎర్రతోలు. అయితేనేం? అతడిని చూడగానే అందరికీ నవ్వు వస్తుందికాని, ప్రేమ కలగదు. రూపం అలాగైతే ఆరోగ్యం మరీ అన్యాయం. గట్టిగా గాలికొస్తే ఎగిరి పోయేలాగుంటాడు. గట్టిగా గంట మాట్లాడితే గుండె ఆగిపోతుందేమో నన్నంత నీరసంగా వస్తుందతని మాట. అయినా లేనిదాన్ని వున్నట్లు, వున్నది లేనట్లు వూహించుకొని మెలగటం అతని కలవాటు.

అంచేత అతను తాను పెద్ద అందగాడి ననుకొంటాడు. అద్దం ముందు కూచొని గంటల తరబడి అలంకరణలు చేస్తుంటాడు. ఒకవైపు మందులుమింగుతూనే, మరోవైపు తను మహమ్మదాలీ అయినట్లు పోజులు వేస్తాడు.



తల్లి మాటిమాటికీ వల్లించే తన వంశ చరిత్రలు వంటబట్టినట్లుగా, అతనికి చదువు వంటబట్టలేదు. అంచేత చదువుకు పంగనామం చుట్టి యింట్లో తల్లితోపాటు నవలలు కథలు చదివి ఆమెతో సాహిత్య చర్చలు చేస్తుంటాడు.

"మా వాడు ఎంత పక్కాటి విమర్శకుడనీ? చూడబోతే ఆర్. ఎస్. సుదర్శనానికి వారసుడయ్యేలాగున్నాడు! ఆ సంయక్ దృష్టి, వ్యక్తీకరణలో వాడి — అబ్బో ." అంటూ కొడుకును తల్చుకొని మురిసిపోతుంటుంది శకుంతల.

కొడుక్కు చదువు అబ్బలేదన్న చింత ఆమెకు వున్నట్లే కనబడదు.

"ఏం చదువుల్లెద్దురూ? కూడు బెట్టేనా? గుడ్డ నిచ్చేనా యీ చదువులు? పోనీ యింత లోకజ్ఞానమన్నా వస్తుందా అంటే అదీలేదు. బుర్ర కరాబుచేసే యీ చదువులువద్దని నేనే మాన్పించేశా? డిగ్రీలు లేకపోతేనేం? మావాడితోపాటుగా యింగ్లీషు మాట్లాడే వాళ్ళెంత మంది వున్నారు? రోజూ 'హిందూ' పత్రిక చదవందే అన్నానికి లేవడు. యింగ్లీషులో తెలుగు సాహిత్యంమీద వ్యాసం వ్రాస్తున్నాడు. రాసేక 'టైమ్' పత్రికకు పంపటమా 'యిలస్ట్రేటెడ్ వీక్లీ'కి పంపటమా అన్న ఆలోచనలో వున్నాడు ప్రస్తుతం' అంటూ గొప్పలు చెప్పుకొంటుంది.

తెలివి తేటలు పైకి కన్పించేవికాదు కనుక

ఏమోలే అనుకోవచ్చు. కానీ అందరికీ స్పష్టంగా కన్పించే కొడుకు అందాన్ని, ఆరోగ్యాన్ని గురించి కూడా వొకరు అడగకుండానే వర్ణించి గొప్పలు చెప్తుందామె.

"మా వారిని నువ్వు చూడలేదు కాని చెల్లెలా బ్రతికుంటే, తప్పక నువ్వు ఆయన్ని ప్రేమించే దానివి. నన్ను పెళ్ళిచేసుకోక ముందు ఆయన్ని ఎంతమంది చేసుకోవాలని ప్రయత్నించారను కొన్నావ్? బోసుబాబుగారి సైన్యంలో వుండగా వో అమ్మాయి ఆయనంటే పడి చచ్చేదిట. పెళ్ళికూడా చేసుకొందామనుకొన్నాట్ట. కానీ నన్ను చూచాక అవన్నీ మర్చిపోయారనుకో. పెళ్ళయ్యాక మాత్రం? ఆయన్ని ఆడపిల్లల కళ్ళనుంచి కాపాడలేక నేను చచ్చేదాన్ననుకో. యిక నా సంగతి చెప్పుకోకూడదు కాని, మా బోసుబాబు పుట్టేక కూడా నాకు ఎవరెవరినుంచో 'లవ్ లెటర్స్' వచ్చేవి. కాని మా వంశాలు ఎలాంటివి? నిప్పులాంటివి. ఆయనకు ఆ వుత్తరాలు చూపిస్తే పకపకా నవ్వేవారు. 'అది వుత్తరాలు రాసిన వాళ్ళ తప్పుకాదే శకూ. నిన్ను యింత అందంగా పుట్టించిన ఆ బ్రహ్మదేవుడిది—' అని అనేవారు. చోద్యం కాని మా యిద్దరికీ పుట్టిన బిడ్డ కురూపి ఎలాగవుతాడమ్మా? అందులోనూ మా బోసుబాబు మా యిద్దరి ప్రేమ ఫలం. మా యిరువురిలోని మంచి అంశలన్నీ పుణికి పుచ్చుకొని పుట్టేడు. మా యిద్దరికీ వచ్చిన లవ్ లెటర్స్‌కు రెట్టింపు వుత్తరాలు యిప్పటికే వచ్చాయి వాడికి. బజార్లోకి వాడిని పంపించాలంటే నాకు భయమేస్తున్నదనుకో. ఏ పిల్ల తన్నుకుపోయి పెళ్ళి చేసుకొంటుందోనని హడలి చస్తున్నా. మా వంశానికి సరిపోయే సంబంధం వస్తే కాని వాడికి పెళ్ళిచేసే వీలు లేదాయె! ఏం చేయను చెప్పు?'

యిలా తన గొప్ప, తన వంశాల గొప్ప, కొడుకు గొప్ప వూహించుకొని వున్నవి లేనివీ కలిపి అస్తమానం చెప్పుకొన్నా, శకుంతలకు చీకులు, చింతలు, భయాలు, లేవను కోటానికి వీల్లేదు. అసలు ఆ చీకులూ చింతల్నీ, కొరతల్ని కప్పిపుచ్చుకోటానికే ఆమెకి యీ ధోరణి వుపయోగపడింది. అయితే యీ ధోరణి పెరిగే కొద్దీ అవీ పెరిగేయి.

అన్ని కొరతల్లోకి భయాల్లోకి ఆమెను ప్రముఖంగా వెంటాడుతున్న అంశం—బోసుబాబు పెళ్ళే!

అంత డబ్బున్నా ఆమె ఆశించినట్లు తన తాహతుకు తగ్గసంబంధం కొడుక్కు వొక్కటీ రాలేదు. మాటల మధ్యలో ఆమే కదిలించి సూచన లిచ్చినా తమ పిల్లల్ని కొడుక్కు యివ్వటానికి ఎవరూ ముందుకు రాలేదు.

తను వూహించుకొన్న తాహతును తగ్గించుకొని కోడలుకోసం ప్రయత్నించిందామె. మధ్యతరగతి వాళ్ళుకూడా ఆమె మాటలకిలొంగలేదు.

యిదిలా వుండగా బోసుబాబు ఆరోగ్యం రోజురోజుకీ క్షీణించసాగింది. ఆరోగ్యం క్షీణించే కొద్దీ అతనికి పెళ్ళిచేసుకోవాలన్న ఆరాటం కోరిక, తపన పెరిగిపోసాగింది.

ఆ సమయంలో అతనికో గొప్ప ఆలోచన వచ్చింది.

అమాంతం సరస్వతిని ప్రేమించి పారేశాడు!


* * *

చనిపోయిన తల్లికి వారసురాలుగా సరస్వతి తన పదో ఏట శకుంతల యింటికి పనిమనిషిగా వచ్చింది. వచ్చేనాడేకాదు—యిప్పటికీ ఆమెకు 'ఒ'కు ఎన్ని వంకరలో తెలియవు.

అయితే చిన్నతనంలోనే యింటి బాధ్యతలు నెత్తిన పడటంవల్ల, శకుంతల యింట్లో అంత చిన్నప్పటినుంచి పనిచేస్తుండటంవల్ల ఆమెకు ఏ చదువూ యివ్వనంత అనుభవం వచ్చింది. యిప్పుడామె మనుష్యుల్ని చదవగలదు. ఎంతటి వాళ్ళకీ జీవిత పాఠాలు చెప్పగలదు.

యివాళ సరస్వతి పద్దెనిమిదేళ్ళ యువతి. ఆమె అందం, చిరిగిన బట్టల్లోనుంచి చీల్చుకొని వచ్చి చూచేవారి కళ్ళను జిగేల్‌మనిపిస్తుంది. పొంగిపొర్లే యవ్వనపు వొంపులు ఆమె ధరించిన మాసిన బట్టల్ని అనుక్షణం యిస్త్రీ చేసి చూపిస్తుంటాయి.

ఆమె ఏనుగులా తినగలదు. ఒంటెలా పని



చేయగలదు. గుర్రంలా ఎప్పుడూ చలాకీగానే వుంటుంది.

ఆమె మాటల చాతుర్యం ఎంతటివారినీ ముగ్ధుల్ని చేస్తుంది. అవసరమైతే పూల బాణా ల్లాంటి ఆ మాటల్నే వాడైన చురకత్తులుగా మార్చి వేడివేడి చురకలు అంటించగలదు.

అంతటి సరస్వతి శకుంతలకు గొప్పశ్రోత. ఆమె దృష్టిలో 'నోరు లేని అమాయకపు గొడ్డు!'

"నువ్వెట్లా బతుకుతావే పిచ్చిదానా—యింత నోట్లో నాలుకలేని మూగదానివి!" తరచూ శకుంతల చేసే యీ వ్యాఖ్యనుబట్టి సరస్వతి శకుంతల సాన్నిధ్యంలో అనుసరించే ఆ విధా నాన్ని అర్థం చేసుకోవచ్చు. యీ విధానం సరస్వతికి అచ్చొచ్చింది. అన్నివిధాలా చాలా లాభాలు తెచ్చిపెట్టింది.

ఆ యింటి బయట, బొడ్డూడనికుంకలని, మూతిమీద మీసం రేని కుర్రలనికూడా సరస్వతి అందం పిచ్చెక్కిస్తున్నా, ఆ యింట్లోని యిరవై రెండేళ్ళ బోసుబాబు మాత్రం సరస్వతి అందాన్ని వయసును గుర్తించలేదెన్నడూ. అతని దృష్టిలో ఆమె పదేళ్ళ పనిమనిషి పిల్లే. ఆమె వేసుకొనే మురికి బట్టలు, చేసే పనీ అతని కళ్ళకు నల్లటి తెరల్ని వేసేయి.

'ఏమే పిల్లా? ఏమిటా పనిచేయటం? వొళ్లు పొగురెక్కుతున్నదా' అని అంటూ అ స్తమానం తన ఆధిక్యతను ఆ పిల్ల ముందు ప్రదర్శించు కోవటంతోటే సరిపోయిందతనికి. దానికితోడు సరస్వతికూడా అతడినెన్నడూ వయసువచ్చిన యువకుడిగా భావించినట్లు కన్పడదు. పైటపైకి సరుకోటం, కోరచూపులు చూడటం, చిరునవ్వు నవ్వుతూ తల వంచుకొని సిగ్గు నటింపటం లాంటి చర్యలను ఆమె ఎన్నడూ అతనిముందు ప్రదర్శించలేదు.

పదేళ్ళప్పుడు ఆ యింటికొచ్చిన కొత్తల్లో తనకన్న నాలుగైదేళ్ళు పెద్ద అయిన అతడి రూపాన్ని, ధోరణిని చూచి ఆమె అతడికి 'ఎర్రకోతి' అని మనసులో నామకరణం చేసింది. అతడిలో వయసు పెరుగుదలను ఆమె గుర్తించింది. అయినా అప్పటికీ యిప్పటికీ ఆమె దృష్టిలో అతడు ఎర్రకోతే!

'నా తండ్రీ. నీకే అన్నీ వుంటే పట్టపగ్గా లుండేవా? అందుకే భగవంతుడు నిన్నింత అష్టావక్రుడిగా పుట్టించాడు నుందులమీద బతికేలా చేశాడు' అని ఆమె అతడి ధోరణి మితి మీరినప్పుడు మనసులో అనుకొంటుంది

—హేళనగా!

అలాంటి సరస్వతిని ఆ రోజూ బోసుబాబు మామూలుగానే చూచాడు.

'యింత వెర్రిముండవైతే ఎలాగే? పండక్కి చీరె కొనుక్కోటానికి డబ్బు అడగటానికి ఇంత భయమా? రేపు నీ మొగుడిదగ్గరా యిలా భయపడ్తూ కూర్చుంటే దిగంబర రచయిత్రివి కావాల్సివస్తుంది. నాకు తెల్సులే—నిన్ను చేసుకొనేవాడెవడోకానీ, వెధవ—మహా అదృష్టవంతుడు. నీచేత గుంజీలు తీయిస్తాడు..

అలవాటుగానే సరస్వతి యజమానురాలి ముందు తిరిగి మంచితనాన్ని అమాయకత్వాన్ని అభినయించింది. యింకాస్సేపు ఆమె మాటల్ని భరిస్తే చీరెకు డబ్బు చేతిలో పడ్డట్లే!

అయితే తల్లిమాటలు వింటూనే బోసుబాబు వులిక్కిపడ్డాడు! 'యీ పనిముండ అప్పుడే పెళ్ళీడుకొచ్చిందా?' అన్నట్లు చూచాడు.

చూచేకొద్దీ చూడాలనిపించింది. అలా చూచి చూచి చివరికి మనసులో ఆమె మురికిబట్టల్ని విప్పి దిగంబరంగాకూడా చూచుకున్నాడు. అలా దిగంబరంగానే ఆమె చేత గుంజిళ్ళుకూడా తీయించాడు.

అతనిలో పురుషత్వం విజృంభించింది. అదోరకమైన ఆనందం!

'పెళ్ళి చేసుకొంటే యీపాటికి అరడజను మంచి పిల్లల్ని కనేలా ఎదిగేవు. ఏంలాభమే? నేనుగనుక గ్రహించి నిన్ను జాగ్రత్తగా ఇంట్లో పిల్లలా చూచుకొంటున్నాను. మరోదైతేనా 'నోరులేని మొద్దు నాకెందుక'ని ఎప్పుడో నీకు వుద్వాసన చెప్పేదే' సరే. వో యాభై చాలుతుందా చీరెకూ? చాల్లే. వంద రూపాయలవి పెళ్ళినాడు కడుదువులే' అంటూ బీరువా దగ్గరకు నడవబోతూ కొడుకును చూచింది శకుంతల.

'విన్నావుట్రా! యీ మూగముండ కోరిక'.

'విన్నానమ్మా. వొంద రూపాయలివ్వు. మంచి చీరె కొనుక్కొంటుంది' బోసుబాబు సరస్వతిని వందరూపాయల చీరెలో వూహించుకొంటూ దర్జాగా అన్నాడు.

'చూచావుటే! మా వంశమే అలాంటిది. వాడి తాత. తండ్రి ఎక్కడికి పోతాయి నా తండ్రికి ఆ గుణాలు! చేతికి ఎముకల్లేనట్లు దానధర్మాలు చేసేవారనుకో!' అంటూ కాస్సేపు వంశచరిత్రచెప్పి ఆమె చేతిలో వందరూపాయలు పెట్టి అంది గొప్పగా 'అసలు నీ తిక్క కుదరాలంటే మా బోసుబాబులాంటివాడు నీ మొగుడు కావాలే. వాడిదంతా మా ఆయన పోలికే. రాళ్ళనుకూడా మాట్లాడింప చేయగలరు. నువ్వో లెక్కా?'

సరిగ్గా ఆ సమయంలోనే అతనామెను ప్రేమించేసేడు!

* * *

బోసుబాబు మొదట్లో సరస్వతిపట్ల తన ప్రేమను చాలా సున్నితంగా ప్రదర్శించాడు. ఆ సమయంలో అతడిని నవలల్లో సినిమాల్లో ఉదాత్త నాయకులు ఆవహించేవారు. ఆమెను పొగడటం, బహుమతులు యివ్వటం ఆమె కష్టమైన పనులుచేయబోతే వారించటం లాంటి పనులుచేసి ఆమెను ఆకర్షించ ప్రయత్నించాడు.

సరస్వతి అతని పొగడ్తలు వింది. బహుమతులు యిస్తే పుచ్చుకొంది. పనుచేసే కొన్ని పనుల్ని వారిస్తే చేయటం మానేసింది. అయినా అతడి ప్రేమను గుర్తించినట్లు కనబడలేదు. అతడి గొప్పతనాన్ని గుర్తించలేదు.

అయినా బోసుబాబు బాధపడలేదు. మొద్దుముండ. దానికి అంత తెలివితేట లెక్కడినుంచి వస్తాయి? తనే పూనుకోవాలి. పనిమనిషిని పండితురాలుగా తీర్చిదిద్దాలి. దానికి ప్రేమస్వరూపం తెలియబర్చాలి.

పద్ధతి మార్చాడు. ఉదాత్త నాయకుడు కాస్తా చిలిపి హీరో అయ్యాడు. పుస్తకాల్లో, సినిమాల్లో కొన్ని డైలాగుల్ని వప్పజెప్పి ఆమె ముందు చెప్పేడు. క్రమంగా సరస్వతి కన్పిస్తే చాలు—వెకిలి వేషాలు, మాటలు, నవ్వులు!

సరస్వతి కొంతకాలం అతని వేషాల్ని సహించింది. కానీ క్రమంగా అతని ప్రేమ లాగానే, ఆమె చిరాకుకూడా బాహాటంగా బట్టలిప్పుకోసాగింది.

తను ప్రేమించాను అనగానే సరస్వతి వచ్చి

తన వళ్ళో వాలుతుందని ఆశించిన బోసుబాబుకు యిది ఆశాభంగమే అయింది. అయినా బాధ పడలేదు. సహనం తెచ్చిపెట్టుకొని ఆలోచించాడు. సత్యం గోచరించింది.

ప్రేమించా నంటున్నాడేకాని తను పెళ్ళి చేసుకొంటానని ఎన్నడూ అనలేదు. ధనవంతులు పేదల్ని ప్రేమించేది సాధారణంగా కామతృప్తి కోసం. అది తీరగానే పేదపిల్లల్ని తిరస్కరించిన ఘట్టాలు నవలల్లో సినిమాల్లో కోకొల్లలు. తన ప్రేమా అలాంటిదేనని సరస్వతి అనుకొంటూ వుండవచ్చు.

అలా జ్ఞానోదయ మయ్యాక అతను మళ్ళీ ఉదాత్త నాయకుడయ్యాడు. వీరేశలింగం పంతులులా పోజుపెట్టి, వర్గ కుల రాహిత్య అవసరం గురించీ, నిమ్నజాతుల ఉద్ధరణ అవశ్యకత గురించి ఎంగిలి వుపన్యాసా లివ్వ సాగేడు.

సరస్వతికూడా మళ్ళీ మౌనాన్ని ఆశ్రయించింది. అతనెన్ని వుపన్యాసాలిచ్చినా ఓపిగ్గా వినేది. కాని అతడిని ప్రేమిస్తున్న జాడమాత్రం కన్పించలేదు.

యీ దాగుడు మూతల ఆటతో విసిగిపోయాడు బోసుబాబు. వోరోజు సరస్వతిని నిలేసేడు.

'సరూ. నిన్ను ప్రేమిస్తున్నాను. గుర్తించ లేదా యింకా?'


సరస్వతి అలవాటయిన రీతిలోనే మాట్లాడ లేదు.

"నా వంశ చరిత్రలు నీకు తెల్సు. మా గొప్పతనం తెల్సు. మాకున్న సిరిసంపదలు, హోదా కూడా తెల్సు. యిన్ని తెల్సికూడా నేను నిన్ను-మా యింట్లో పనిపిల్లవైన నిన్ను ఎందుకు ప్రేమించాననుకొంటున్నావ్?"

సరస్వతి మౌనాన్ని కాస్త సడలించి సన్నగా నవ్వింది.

'నీకు తెలియదు. నువ్వు వూహించలేవు. నీ అందాన్ని చూచి అని నువ్వు అనుకొంటున్నావ్? అవునా? కానీ కాదు. అలా నువ్వనుకోటం నీ అజ్ఞానానికి, మూర్ఖత్వానికి నిదర్శనం. నీకన్నా అందగత్తెలు-ఆ మాటకొస్తే నేను కావాలనుకొంటే సినీతారలే నన్ను పెళ్ళి చేసుకొంటారు. మా అంతస్తు, తాహతుకు

(వి)చిత్ర విజ్ఞానం



రాక్షస ఏనుగులు(Mammoths) మన భూమి మీద సంచరించాయి ఈజాతి సుమారు 20 వేల సంవత్సరాల క్రితం విలుప్తం చెందింది. ఈ ఏనుగుల అవశేషాలు ఇప్పటికీ పది ప్రదేశాలలోమాత్రం దొరికాయి. ఈ మధ్య రష్యాలోని షాంగ్రీన్ నదీ తీరంలో యీ ఏనుగు అస్థిపంజరాన్ని పురావస్తుశాఖవారు వెలికి తీశారు. ఇంతవరకు దొరికిన వాటిల్లోకెల్లా యిది చాలా పెద్దది. వంకర తిరిగిన దీని దంతాల మొదలు—కొసల మధ్య దూరం మూడు మీటర్లు!

తగ్గ అందగత్తెల అప్లికేషన్లు నా దగ్గర బోలెడున్నాయి. వాళ్ళందర్నీ కాదని అంట్లు తోముకొనే నిన్ను ప్రేమించానంటే-అది నా గొప్పతనానికి నిదర్శనం. నా వంశచరిత్ర యొక్క గొప్పతనానికి నిదర్శనం.' అన్ని మాటలు కాస్తంత ఉద్రేకంగా మాట్లాడేసరికి బోసుబాబుకు అలుపు వచ్చింది. రొప్పసాగేడు. ఆ స్థితివస్తే అతను వేసుకోవాల్సిన మందు తీసుకొచ్చి సరస్వతి అతనికిచ్చింది.

'థేంక్స్' అంటూ పుచ్చుకొని తాగేక కాస్త వోపిక వచ్చింది.

'కొన్ని సినిమాల్లో ధనిక హీరోల్లాగా నిన్ను సమయానికి మోసం చేస్తానని భయపడ్తున్నావు కదూ? అలా ఎన్నడూ జరగదని అభయమిస్తున్నాను సరూ. నిన్ను ప్రేమిస్తోంది పెళ్ళిచేసుకోటానికి. నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను సరూ—' ఉద్వేగంగా అంటూ ఆమెవైపు చూచాడు. అతనాశించినట్లు ఆమె నివ్వెరపోయి అతనివైపు చూడలేదు. ఆమె మొహం కోటిసూర్యుల కాంతితో వెలగలేదు. 'బాబుగారూ నేనెంత అదృష్టవంతురాలిని. మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకొన్నాను. నన్ను క్షమించండి బాబుగారూ' అంటూ అతని కాళ్ళమీద వాలలేదు.

మామూలుగానే వింటోంది: అయినా అతని వూపు ఆగలేదు.

'నన్ను నువ్వు అర్థం చేసుకోలేవు సరూ. నీకాశక్తిలేదు. నువ్వు నా మాటల్ని నమ్మలేవు. కానీ యిది నిజం. నా తండ్రి, తాత, ఆయనతండ్రి, గొప్పదేశభక్తులు. దానమూర్తులు, త్యాగశీలురు. నా తల్లి, తార, ఆమె తండ్రి భోగభాగ్యాలలో పుట్టి పెరిగేరు. దానధర్మాలకు పెట్టింది పేరు. నేను వారందరికీ వారసుడిని. నాలో వారి ఆ యా గుణాలన్నీ వున్నాయి. కానీ వారిలో లేని గుణాలు కూడా కొన్ని వున్నాయి. వాటిని చరిత్ర గుర్తించి తీరాలి. నాకు పేదలపట్ల ప్రేమ, జాలి, కరుణ. నేనో గొప్ప సంస్కర్తను కావాలి. హెచ్చు తగ్గుల తారతమ్యాలను తుడిచివేయాలి. కులాలను రూపుమాపాలి. అందుకు మన పెళ్ళి మొదటిమెట్టు సరూ. ఏమంటావ్?' అంటూ అతను అంతులేని ఆవేశంతో ఆమె చేతుల్ని పట్టుకొని తన గుండెల మీదకు లాక్కోబోయాడు.

ఆమె చేతులు కదలనన్నా కదలలేదు. అతను మాత్రం ఆ వూపుకు వొరిగి పడబోయాడు.

సరస్వతి నవ్వుతూ అతడిని పడకుండా పట్టుకొంది. మరో డోసు మందు నిచ్చింది. కూర్చొపెట్టింది.

'ఏమంటావు సరూ?' అతనీతడవ రొప్పుతూ నీరసంగా అడిగేడు.

'సెప్తే యింటారా బాబూ? తవరు నన్ను మోసం సెత్తారని నాకు బయంలేదు. నన్ను పెళ్ళి సేసుకుంటారు. ఎందుకంటే దానివల్ల మీకు మంసిపేరొస్తుంది. గొప్పోర్రై పోతారు-'

'అంతే కాదు సరూ. నా ప్రేమ—'

'అవును బాబూ. పేమ సంగతి మర్సేపోయా. తవరు నన్ను పేమిస్తన్నామన్నారు. దేన్ని పేమిత్తన్నారో ఎందుకు పేమిత్తన్నారో నాకు తెల్సు. కానీ నేను ఎవర్ని, ఎందుకు పేమిత్తన్నానో కూడా యిసంటి బాటూ'

'సెప్పు సరూ.'

'యిప్పుడు కాదు. రేపు సందేకొస్తా. అప్పుడు సెప్తా'

* * *

బోసుబాబుకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. కళ్ళు మూసుకోకుండానే కలలు:

దేశంలో పెద్దలంతా తనని అభినందిస్తున్నట్లు, తన ఫోటో పేపర్లో వడ్డట్లు, తనని గురించి వ్యాసాలు వ్రాసినట్లు ప్రభుత్వం వారు తను చేసిన పనిని మెచ్చి ఏదో బిరుదు నిచ్చి సత్కరించినట్లు—ఏదో పదవి కూడా యివ్వబోతే తను తిరస్కరించినట్లు—

ఇదంతా, తాను సరస్వతిని పెళ్ళిచేసుకొన్నందుకు: పేదరాలు, విద్యావిహీనురాలు, పనిమనిషి అయిన తక్కువ కులం పిల్లని— యింత కుటుంబ చరిత్ర, ధనవంతుడు,

ఇంగ్లీషులో వ్యాసాలు రాయగల విద్యా వంతుడు, హెచ్చుకులంలో పుట్టిన తను పెళ్ళి చేసుకోటం మరి మాటలా?

'కొంపతీసి సరస్వతి పెళ్ళికి అంగీక రించకపోతే?'

కలల మధ్య యీ వూహ వచ్చినప్పుడల్లా అతని గుండె వేగంగా కొట్టుకొంది.

ఆశ—అనుమానం?

భరించలేక తల్లి దగ్గరికెళ్ళేడు.

విషయం వింటూనే శకుంతల ముందు కంగారు పడింది. కొడుకు వూహలు తెల్సు కొని తనూ ఆలోచించింది.

కొడుకు ఆరోగ్యం రోజురోజుకీ క్షీణి స్తోంది. చూస్తూ చూస్తూ కేవలం డబ్బుకెవరు పిల్లనిచ్చి పెళ్ళిచేస్తారు? ఒకవేళ ఎవరైనా ఆశపడి వచ్చినా వాడికి సేవలు చేస్తారా? సరస్వతి అవుతే కోడలైనా పనిమనిషిలాగే పడివుంటుంది.

ఆ మాటకొస్తే సరస్వతికేం తక్కువ? కాస్త నలుపనే కాని, మంచి చీరకట్టి అలం కరణ చేస్తే రవివర్మ సీతబొమ్మలా వుంటుంది..

కట్నాలు రాకపోవచ్చు. కానీ యీ పెళ్ళివల్ల తన వంశప్రతిష్ఠ ఎంత పెరుగుతుంది? తన కొడుకుతోపాటు తనుమాత్రం సంస్కర్తల జాబితాలోకి వెళ్ళదూ.

తను విధవల్ని పెళ్లి చేసుకోకపోయినా, ఎవరికో చేయించినందుకే వీరేశలింగం పంతులుగారికి చరిత్రలో అంత స్థానంవుందే? మరి స్వయంగా తనే కులాంతర వివాహం చేసుకొని యువతకు మార్గదర్శి అయిన బోసుబాబుకు, వాడిని ప్రోత్సహించినందుకు తనకు, చరిత్రలో ఎంత స్థానం వుండాలి?

'నాకు తెల్సురా బోసూ. నువ్వు నా కొడుకువి కదూ? ఎప్పుడో యిలాంటి చరిత్ర పురుషుడి వవుతావని అనుకొంటూనే వున్నా. ఇవాళిటి మన యింటి పనిపిల్ల రేపటి నా కోడలు. నీ భార్య. ఎంతటి విప్లవాత్మకమైన మార్పు! నువ్వు సరస్వతినే చేసుకోవాలి. అంతే'

'కానీ సరస్వతి వొప్పుకొంటుందో లేదో నని భయంగా వుందే' అంటూ ఆమె అన్న మాటలు చెప్పేడు.

'ఒప్పుకోదూ? ఏం చేదుమేస్తోందా? నీకు తెలీదులే. సందేశకొస్తానంది కదా? చూస్తుండు. కొత్త పెళ్ళికూతురిలా తయారై వస్తుంది—'

'నాకూ అలాగే అన్పిస్తోందనుకో. కాని రేపటిదాకా, ఎందుకు గడువుపెట్టినట్టు? పైగా ఎవర్నో ఎందుకు ప్రేమిస్తున్నానో చెప్తానందే'

శకుంతల కాసేపు ఆలోచించి గర్వంగా నవ్వింది.

'ఇంత అమాయకుడివేరా? మీ నాన్నా అంతే. అంతలోనే హీరో—అంతలోనే పసి పిల్లాడు! మొద్దుముండ, మూగముండ అని అనుకొన్నాను కాని సరస్వతి పొట్టలో చాలా ఆలోచనలున్నట్లున్నాయ్. భారతంలో యిలాం టిదే వో కథ వుందిలే. శంతన మహారాజు సత్యవతి అన్న బెస్తపిల్లను ప్రేమిస్తాడు. ఆ పిల్లతండ్రి దాశరాజు కూతుర్ని మహారాణిని చేయటానికి కండిషన్లు పెట్టాడు, తన కూతురుకు పుట్టిన బిడ్డలే రాజుకు వారసులు అయి రాజ్యం ఏలాలని! అలాగే రేపు సరస్వతి స్వయంగానో, లేకపోతే దానితండ్రి ద్వారానో అడగబోయేదదే. ఈ ఆస్తిలో సగం రాసియ్యమనో, లేకపోతే పూర్తిగా దానిపేర పెట్టమనో. ఒరేయ్ నువ్వు తొందరపడి మాట జారేవ్? యీ పేదోళ్ళున్నారే—వాళ్ళ ఆశకు అంతుండదు. డబ్బు రుచి మరిగితే వదలరు. పెళ్ళంటే చేసుకొంటాం కాని, ఆస్తి విష యంలో పూచికపుల్ల యివ్వకూడదు. పాచిపని చేసుకొనేదాన్ని ఎంతలో వుంచాలో అంత లోనే వుంచాలి. ఇది నా పుట్టింటి ఆస్తి. ఆ లిటిగేషన్లన్నీ నేను చూసుకొంటాలే. నేను ఎవరి కూతురిననుకొన్నావ్? అంతగా కాదూ కూడ దంటే రాక్షసవివాహం చేయిస్తాలే'

ఆ తర్వాత పెళ్ళయి సరస్వతి పక్కలో వెచ్చగా పడుకొన్నట్లు కలలుగంటూ హాయిగా నిద్రపోయాడు బోసుబాబు!

*　　*　　*

మర్నాటి వుదయం సరస్వతి పనిలోకి చెల్లెల్ని పంపించింది.


'ఈ బీదోళ్ళతో వచ్చిన తంటానే యిది. కాస్త అలుసిస్తే నెత్తినే ఎక్కుతామంటారు. జాలి తల్చినవాళ్ళనే భయపెడ్తారు. రూపాయ కంటపడ్తే ఇక వొళ్ళే తెలీదనుకో. ఇక అది శకుంతలమ్మ కోడలయిపోయినట్టే కులుకు తుంది. గుడిసెలోవున్నా మనపోకిళ్ళేపోతుంది. చూడొరేయ్. పిల్ల—పెళ్ళి— సంస్కర్తగా పేరుప్రఖ్యాతులు—చరిత్రలో స్థానం—యింత వరకూ బాగానేవుంది. కాని ప్రేమంటూ పెళ్ళాన్ని నెత్తికెక్కించుకోకు. అసలే ఆడది—అందులోనూ చరిత్ర లేనిది-కరుచుకు తిరిగితే అంట్లు తోమినట్లు నిన్ను నన్నూ తోమిపారేస్తుంది. ఇది చరిత్ర చెప్పే సత్యం. గుర్తుంచుకో?'

తల్లి మాటలకు ఎప్పుడూ తాళంవేసే బోసుబాబుకు యిప్పుడామె మాటలు రుచించ లేదు. 'సిగ్గుపడి వుంటుందిలే—' అన్నాడు కాస్త చిరాగ్గా.

శకుంతలకు కొడుకు మాటల్లో సత్యం కన్పించింది. 'నా కొడుకెంత రసికుడు?' అని అనుకొంటుండగా మొగుడు గుర్తుకొచ్చి ముడుచుకుపోయింది.

బోసుబాబు ఎదురుచూస్తున్న సాయంకాలం రానేవచ్చింది. వందరూపాయాల తెల్లచీరలో వెన్నెల్లా మెరిసిపోతూ వచ్చింది సరస్వతి. సినిమాలో శోభనంనాటి పెళ్ళికూతురిలా కాక పోయినా బాగా అలంకరించుకొంది. తన వక్షస్థలాలంత ఎత్తున సిగలో మల్లెపూల దండ తురిమింది.

శకుంతల కొడుకువైపు గర్వంగా చూసింది. అతడు సరస్వతిని దాహపు కళ్ళతో తాగే



స్తున్నాడు. 'దాని అవయవాలు ఎంత బలంగా వున్నాయి? నల్లటి చర్మంవెనుక నున్న కండరాల వంపుసొంపులు ఎంత అందంగా వున్నాయి? వాటిని వొక్కసారి స్పృశిస్తే?' అతని వయసు ఆవేశపడింది. అయితే ఆ ఆలోచన మాత్రంగానే అతనికి అలా పొచ్చేసింది.

'మా పాపుడే. మా బోసుబాబుదంతా వాడి తండ్రిపోలికన్నానా? ఎంతటి ఆడదాన్నీ యిట్టే లొంగదీసుకొనే వాడాయన. ఇప్పటికే ఆయన్ని తల్చుకొంటేనే చాలు నా శరీరం పులకించిపోతుంది. మనసు ఎక్కడికో తేలి పోతుంది. అప్పుడే ఏమయిందిలే. వాడి తడాఖా రేపు పెళ్ళయితే చూస్తావుగా?' అంటూ కొడుకుగొప్ప, తనగొప్ప, తన వంశపుగొప్ప వర్ణించుకొని చివరికి అంది. "పాచిపని చేసు కొనే పనిముండవి—క్షణంలో నీ అదృష్టం ఎంత పుచ్చిందే?"

'అవునండి నేనదురుట్టవంతురాలినే' అంది సరస్వతి సన్నగా నవ్వుతూ.

'అదృష్టవంతురాలినని గర్వపడిపోకు. నీ చరిత్ర గుర్తుంచుకో. మా చరిత్ర మంత్రంలాగా ఎప్పుడూ వల్లిస్తుండు. అతిశయాలు పెంచు కోకు. అణుకువుగా పనిమనిషిలాగే మెసలుకో. బాగుపడ్తావ్? తెల్సిందా?'

సరస్వతి యీసారి గంట వాయించినట్లు గలగల నవ్వింది. వాకిట్లోకి వెళ్ళి ఓ వ్యక్తిని వెంటబెట్టుకొని వచ్చింది.

ఆరడుగుల ఎత్తు మనిషి అతడు. ఎవరో పనిగట్టుకొని అతని శరీరానికి తారును పెయింట్ చేసినట్లుంది. సముద్రంలో చిన్నిచిన్ని కొండల్లా అతని శరీరంలోని కండలు మాసిన బట్టల్లో నుంచి పైకి పొడుచుకువచ్చి గర్వంగా కన్పి స్తున్నాయి. నల్లతుమ్మచెట్టు ముళ్ళలా నెత్తి మీద జుట్టు నిక్కబొడుచుకొనివుంది. మూతి మీద మీసాలు నల్లటిత్రాచు పాముల్లా మెలి దిరిగి వున్నాయి. తుమ్మల్లో పొద్దుకూతున్నట్లు మొహం జిడ్డోడుతూ వుంది. అరచేతులు ఆకు రాళ్ళలా, పాదాలు ఆంబోతు గిట్టల్లా వున్నాయి.

అతడిని చూస్తూనే యముడిని చూచినట్లు బెదిరిపోయాడు బోసుబాబు. ఏదో అసహ్యమైన పదార్థాన్ని చూచినట్లు అతడిని చూస్తూ 'ఎవడే వీడు?' అంది శకుంతల తిరస్కార ధోరణిలో.

"నేను మనవు సేసుకోబోతున్న మగాడు యీ దేనండి"

"ఏంటీ?!"

"ఆడికి డబ్బులేదు. జబ్బులేదు. సదువులేదు సెరిత్రంటారా తవరు అది అసలులేదు"

"ఓసిముండా? ఎన్ని కొమ్ములొచ్చాయే నీకు? పిల్చి పెళ్ళిచేసుకుంటానంటే తీపరమ యిందా నీకు? నీల్గుతున్నావ్? అన్నీవున్న మావాడికన్నా ఏమీలేని ఆ తుమ్మమొద్దు నచ్చాడా నీకు? అవున్లే? పంది మురికి గుంటలో పొర్లాడుతుంది కాని పన్నీటి స్నానాలకు యిష్ట పడుతుందా? పుల్లిస్తరాకులు నాకే వూరి కుక్కలకు పంచభక్ష్య పరమాన్నాలతో పనేమిటి?'' కోపంతో అని యిక మాటలు రాక ఆగిపోయింది శకుంతల.

ఓ క్షణం నిశ్శబ్దం!

"మీ రిట్టా మాట్టాడ్తారని నాకు తెల్సునం డమ్మగోరూ. అది మీ తప్పుకాదు. మీ డబ్బు తప్పు. మీ సెరిత్ర తప్పు. మీకు సెరిత్ర డబ్బుతో వచ్చింది. అంసేత తళుకుజాస్తి. మా సెరిత్ర కష్టంతో కట్టుకొంటున్నది. అంసేత ఎప్పుడూ కన్నీళ్ళతో నానుతుంటుంది.

"అమ్మగోరూ. వో యిసయం సెప్పిపోదా మని వచ్చా. డబ్బు-డబ్బు యిచ్చే గొప్పతనం శాశ్వతం కావు. అట్టా వొచ్చిన సెరిత్రను నిల బెట్టుకోటానికి ఎప్పుడూ డబ్బు కరసుసేత్తానే వుండాలి. కానీ అడి కండల్లో వున్న ఆస్తి శాశ్వతం. కష్ట పడగలిగినోడే నిజమైన గొప్పోడు. ఆడి సెరిత్రే గొప్పది."

"ఛీ! నాకు ధర్మపన్నాలు చెప్పేటంత జాణ వయ్యావా? అయినా పేదదానివని జాలిపడి, నిన్నుద్ధరించాలని గొప్పకుపోయి నిన్ను ప్రేమిం చిన మా వాడిననాలి. యింకా నయంకదూ? ఆ పెళ్ళికూడా చేసుకొని మా పరువుప్రతిష్టను గంగలో కలిపేడుకాదు. మా వంశ చరిత్రను కలుషితం చేసేడుకాదు."

"పేమా! అపునండమ్మగోరూ. ఆ సంగతి మర్సేపోయా. ఏటి మీరు పేమింసేది? మీ డబ్బును, గొప్పని, సెరిత్రను! నా సేకిరీని, నల్లిలా పడివుండే నా గుణాన్ని పేమించటం డబ్బున్న వోళ్ళకేం తెల్సమ్మా? పేర్లెన్ని పెట్టు కొన్నా ఆళ్ళు ఎప్పుడూ పేమించేది—ఆళ్ళ నాళ్ళే! పేదోళ్ళని పేమించటం కల్లోనిమాట! పేమను సూడాలంటే ఆడి గుండెల్లోకి తొంగి సూడాలి. వో నిముసం ఆడి గుండెలమీద వోలితే పేమసేసే శబ్దాలు యినొచ్చు. అందుకే

మినీకథ

పిట్టపోరు ...పిట్టపోరు

నా ఎరియర్ బిల్లుని (బకాయిపడ్డ జీతం బిల్లుని) ప్రత్యేకంగా దగ్గరుండి పాస్ చేయించుకోవాలనే సదుద్దేశ్యంతో ఆడిట్ ఆఫీ సర్‌కి ఫుల్ నమస్కారం కొట్టి వినయాన్ని వదనానికి అతికించి సర్కస్‌లో సీసాపై నించున్న ఏనుగులా నించున్నాను. ఆయన నాతో మాట్లాడకుండా నా బిల్లుని కుడివైపు నుంచి ఎడమకి, ఎడమనుంచి కుడికి, చూసి చూసి, ఏమీ పాలుబోక, ఫాన్ తిరుగుతున్నా వుక్కబోసి, ఆ బిల్లుని బోర్లేసి తిరగేసి మర గేసి, చికాకేసి, తల గోక్కుని రెండు వేలు కుక్కుకుని 'అరేయ్ అకౌంట్స్ ఆఫీసర్ చిక్కావురా-' అని అర్జంట్‌గా ఆనందపడి గబగబా ఏదో బిల్లుమీద బరికేసి ట్రేలో పడే శాడు. ఆయనతో మాట్లాడే [illegible] ఆయన బిల్లుపై గీకిన పదాల్ని [illegible] సంటూ మా సెక్షన్‌కి వెళ్ళాను.

'ఈ బిల్లులో రెండూ ప్లస్ రెండు నాలుగు అని వేశారు. కాని ఈ బిల్లుదారునకి సప్ల మెంటరీ అలవెన్సు (అనుబంధ భృత్యం) నెలకి రెండు రూపాయలు చొప్పున రెండు నెలలకి రావాలి. అంటే రెండూ యింటూ రెండు అని వేయాలి. కాబట్టి ఎకౌంట్స్ ఆఫీ సర్ ఈ బిల్లులో కూడిక బదులు గుణకారం

చూపించవలెను. తప్పు సరిచేసి బిల్లుని పంపగలరు

ఆ బిల్లుని చూడగానే అకౌంట్స్ ఆఫీసర్ ఆకాశమంత ఎత్తు ఎగరబోయి గదిలో సీలింగ్ ఫాన్ వుందని తల తెగుతుందని, భయపడి నా మీద విరుచుకుపడ్డాడు. "ఆ ఆడిట్ ఆఫీసర్ నాకు లెక్కలు చెప్తాడా? నేను జవాబు రాస్తాతే వెళ్ళు—" అని రెండు నెలలు ఆయన నా బిల్లుని టేబిల్ మీద పడుకోబెట్టి చివరికిలా రాశాడు.

"రెండు అంకెల్ని కూడినా, హెచ్చవేసినా ఫలితం వొకటే కాబట్టి ఈ బిల్లు పాస్ చేయగలరు...."

బిల్లుని చూడగానే 'లో బి.పి.' అడ్డురాగా ఆడిట్ ఆఫీసర్ వో నెలరోజులు తరువాత ఈ విధంగా రాశాడు.

"రెండు అంకెల్ని కూడినా; గుణించినా వొకే ఫలితం రాదు. ఉదాహరణకి మూడూ యింటూ మూడు తొమ్మిది. మూడూ ప్లస్ మూడు ఆరు. కాబట్టి బిల్లు సరిచేసి పంపగలరు."

తిరిగి వచ్చిన బిల్లుని చూడగానే ముందు కోపం తెచ్చుకొని ఆ తరువాత నవ్వుకుని అకౌంట్స్ ఆఫీసర్ యిలా రాశాడు. "ఏ అంకెనైనా రెండుచే గుణించినా, ఆ అంకెని రెండుసార్లు వేసుకుని కూడినా ఫలితం వొకటే కాబట్టి ఈ బిల్లుని పాస్ చేయగలరు."

నాకే దగ్గులు నేర్పుతావా? ఈ ఆడిట్ ఆఫీసర్ ముందా నీ కుప్పిగెంతులు అని అనుకుని బిల్లుమీద ఈ విధంగా బరికేశాడు ఆడిట్ ఆఫీసర్. "సున్నాని రెండు పెట్టి హెచ్చేస్తే సున్నా. కాని సున్నాకి రెండు కూడితే రెండూ. కాబట్టి బిల్లులో తప్పు సరిచేసి పంపగలరు."

"సున్నా అంకె కాదు. దానికి విలువలేదు. బిల్లుని పాస్ చేయగలరు."

"సున్నా అంకె కాని పక్షంలో దానికి విలువ లేని పక్షంలో వొకటి ప్రక్కన సున్నా వేస్తే పది ఎందుకవుతుంది? కాబట్టి బిల్లులో తప్పు సరిదిద్ది పంపగలరు."

"సున్నాకి వొంటరిగా విలువలేదు. అంకెలతో కలిస్తే విలువ వస్తుంది. ఎలాగంటే అకౌంట్స్ డిపార్టుమెంట్ లేకపోతే ఆడిట్ డిపార్టుమెంట్ వుండదు. దాని తాలూకు ఆఫీసర్లు వుండరు. కాబట్టి బిల్ పాస్ చేయగలరు."

"హద్దుమీది రాసిన అకౌంట్స్ ఆఫీసర్ గారి రిమార్క్సు జనరల్ మేనేజరుగారికి పంపుతున్నాను. దయచేసి పరిశీలించగలరు." అని ఆడిట్ ఆఫీసర్ నా బిల్లుని మేనేజరుగారికి పంపాడు.

మేనేజరు ఆ బిల్లుని, అకౌంట్స్ ఆడిట్ ఆఫీసర్ల విసుర్లని చదివి బిగ్గరగా నవ్వాడు. ఎక్కిళ్ళు వచ్చేవరకు నవ్వి చివరకిలా రాశాడు "సప్లమెంటరీ అలవెన్సు (అనుబంధ అలవెన్సు—) తాత్కాలికంగా రద్దుచేయబడి చాల కాలమయింది. దాని తాలూకు బాకీలు కూడా చెల్లించడానికి వీలులేదు. అకౌంట్స్ ఆఫీసర్ ఆడిట్ ఆఫీసర్ గమనించగలరు. వో సారి యిద్దరూ రూల్స్ చదువుకోగలరు." □

—'హరా'

ఆడిని పేమించి పెళ్ళి నేసుకొంటున్నానమ్మా. లచ్చలిచ్చినా ఆడిని వదులుకోను. వస్తానండమ్మ గోరూ."

చెట్టాపట్టా లేసుకొని జంటగా వెళ్తున్న వాళ్ళిద్దర్నీచూస్తుంటే శకుంతల కన్ను కుట్టింది. గుండెల్లో మంట మరోసారి ఎగదన్నింది.

"చెప్పు తినే కుక్కలు! ఛీ" అంది.

అతడు ఛర్రున వెనక్కి తిరిగేడు. వురిమినట్లు అన్నాడు.

"మరోమాటగూడా వుందమ్మోవ్? కుక్కకాటుకి చెప్పుదెబ్బ! అది గురుతుంసుకోండి."

సరస్వతి నవ్వింది. అతడి చేయి పట్టుకొని తీసుకెళ్ళింది.

శకుంతల వంశచరిత్ర మౌనంగాఏడ్చింది! □

పాఠశాలలు, కళాశాలలకు పిలుపు

మీ ఆవరణలను సుందరతరంగా తీర్చిదిద్దుకోవడానికి పైసా ఖర్చు పెట్టాల్సిన పని లేదు.

ఈ రుతువులో చెట్లు నాటండి (జులై, ఆగస్టు)

మీకు భూమి ఉంది, ఉరకలువేసే యువక శక్తి ఉంది.

చెట్లు మీ ఆవరణలను అందంగానూ ఆకర్షణీయంగానూ కళకళ లాడే విధంగానూ చేస్తాయి.

ఆహ్లాదకరమైన నీడను కల్పిస్తాయి.

వివిధ రకాల మొక్కలు సలహాలు

ఉచితం : ఉచితం

సంప్రదించండి

జంటనగరాల్లో :

డివిజనల్ అటవీశాఖాధికారి

విస్తరణ విభాగం,

హైదరాబాదు-500 004.

ఫోన్ నెం: 30531 (ఎక్స్-45)

జిల్లాల్లో :

డివిజనల్ అటవీశాఖాధికారి,

ఆయా జిల్లా హెడ్‌క్వార్టర్స్.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధశాఖ డైరెక్టరుచే ప్రకటితము.

12/78-79.

సీరియల్

పడమటి సంధ్యారాగం



మల్లాది వెంకటకృష్ణమూర్తి

జరిగిన కథ

ఎవరి మాటలు వినో తన భార్య ప్రియంవద శీలాన్ని శంకించి విపరీతమైన వేదనకు గురి అయాడు సత్యమూర్తి. ఆ ఆలోచనలలోనే తన మొదటి భార్య శ్రీవల్లి జ్ఞాపకాలతో సతమత మవుతున్నాడు. సత్యమూర్తీ, శ్రీవల్లీ రాజమండ్రి బయలుదేరారు. దారిలో సత్యమూర్తి పొరపాటున మరో బస్సు ఎక్కాడు. ఎంత వెదికినా శ్రీవల్లి కన్పించలేదు. సత్యమూర్తిని మాణిక్యశాస్త్రిగారి దగ్గరకు దీసుకెళ్ళాడు అతని బావ. 'ద్వితీయ కళత్రం ఉంది నీ జాతకంలో ఇక ఆ అమ్మాయిని గురించి మరచిపోవచ్చు' అని చెప్పాడాయన. మాణిక్యశాస్త్రిగారితో జరిపిన సుదీర్ఘ చర్చ, సత్యమూర్తిని 'డిటాచ్‌మెంట్' వైపు ఆకర్షింపజేస్తుంది. ఆ భావాలతో ఉండగానే అక్క చేసిన వత్తిడికి లొంగి రెండో పెళ్ళికి ఒప్పుకుంటాడు.

అతని అక్కయ్యకి క్షణకాలం అనుమానం వేసింది, బలవంతంగా మళ్ళీ పెళ్ళి చేసినా రెండో భార్యని సరిగా చూసుకోగలడా అని.

"ప్రియంవద వాళ్ళు బీదవాళ్ళు. పెళ్ళి ఖర్చులు మాత్రం పెట్టుకోగలరు. ముహూర్తం నిర్ణయించి వ్రాస్తాను. రెండు నెలల్లో పెళ్ళి జరిగిపోతుంది."

"అలాగే."

మళ్ళీ పెళ్ళికి రెండు రోజుల ముందు వెళ్ళాడు సత్యమూర్తి. కొత్త బట్టలు కుట్టించుకోకపోవడం చూసి నొచ్చుకుంది అక్కయ్య. తనే బట్టలు కొనుక్కొచ్చి టైలర్‌తో అవసరం చెప్పి కుట్టించింది

పెళ్ళిరోజుకు అందేలాగా.

చాలా నిరాడంబరంగా జరిగిపోయింది పెళ్ళి. ప్రియంవదని చూసి అందరూ సత్యమూర్తి చాలా అదృష్టవంతుడు అని పొగిడారు. పెళ్ళి జరిగేటప్పుడు ప్రియంవదతో మాట్లాడలేదు సత్యమూర్తి. చాలా యాంత్రికంగా తన కార్యక్రమం సాగించాడు.

శోభనం రోజు రాత్రి సత్యమూర్తితో చెప్పింది అతని అక్కయ్య కొద్దిగా కఠినంగా.

"ఆ పిల్లతో అలా అంటీ అంటనట్లుగా ప్రవర్తిస్తావేః పెళ్ళి చేసుకున్నాక నీ భార్య అన్న గౌరవం కొద్దిగానయినా చూపించాలి. ప్రేమగా వుండటం నేర్చుకో."

"తప్పకుండా."

"ఆపిల్ల ఏం నేరం చేసిందని మొగుడి దగ్గర ప్రేమ, ఆప్యాయత పోగొట్టుకోడానికి. శ్రీవల్లే అనుకో ఆ అమ్మాయి."

"దయచేసి శ్రీవల్లి ప్రసక్తి తీసుకురాకు ఇంకెప్పుడూ" అన్నాడు సత్యమూర్తి.

* * *

తల వంచుకుని మంచంమీద కూర్చున్న ప్రియంవదని చూసాడు సత్యమూర్తి.

"నా పేరు సత్యమూర్తి. హైదరాబాద్‌లో లోకల్ లైబ్రరీలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పని చేస్తున్నాను" చెప్పాడు.

"విన్నాను" అన్నది.

కాసేపాగి చెప్పింది.

"ప్రియంవద నా పేరు. మెట్రిక్ పోవడంతో చదువు ఆపేసాను. కాని బి. ఏ. పాస్ అయానని చెప్పండి అందరికీ. అలాగే చెప్తున్నాను ఇక్కడ."

"రెండో పెళ్ళాంగా వచ్చినందుకు నీకు బాధగా వుందాః" అడిగాడు అకస్మాత్తుగా.

జవాబు చెప్పలేదు ప్రియంవద.

ప్రియంవద కుడిచేతిని సంశయిస్తూనే పట్టుకున్నాడు. ప్రియంవద సిగ్గుపడ్డట్టుగా తల పక్కకు తిప్పుకుంది.

దగ్గరగా జరిగాడు సత్యమూర్తి

ప్రియంవద కూడా దగ్గరగా జరిగింది.

సత్యమూర్తి మొహంలోకి చూసి అడిగింది.

"మీ మొదటి భార్యను మీరు అమితంగా ప్రేమించేవారటగాః"

"ఎవరు చెప్పారుః"

"మీ మొహంలో బాధ."

సత్యమూర్తి నవ్వడానికి ప్రయత్నించాడు.

"చెప్పుకోగా విన్నాను కూడా."

"అవును."

"శ్రీవల్లి తిరిగి వస్తే ఏం చేస్తారుః"

సత్యమూర్తి కొద్దిగా ఆశ్చర్యంగా అన్నాడు.


"ఇంతదాకా ఆ ప్రశ్న ఎవరూ అడగలేదు నన్ను."

"ఇంతదాకా మీకు మళ్ళీ పెళ్ళి కాలేదు కాబట్టి ఆ ప్రశ్న ఎవరూ అడగలేదు. చెప్పండి ఏం చేస్తారుః"

"రాదు."

"వస్తేః"

"వచ్చేదయితే ఈ పాటికే వచ్చి వుండాలి. అసలు బ్రతికివుందనే నమ్మకం వదులుకున్నాను. అందుకే మళ్ళీ పెళ్ళి



చేసుకున్నాను."

"బ్రతికి వుండి వస్తే?"

"బ్రతికి వున్నా రాదు. ఇంతకాలం నన్ను చూడకుండా బ్రతకగలిగితే ఇక మీదట కూడా అలాగే బ్రతకగలదు."

"ఒకవేళ వచ్చిందే అనుకోండి. అప్పుడు?"

"నా అదృష్టం బావుండి వస్తే దేవుడు నా బాధని అర్థం చేసుకున్నాడను కుంటాను."

"నేను?"

"నువ్వా?"

"అప్పుడు నేను?"

"అంటే?"

"నేనేం చేయాలి?"

"అంటే?"

"పుట్టింటికి పంపేస్తారా?"

"ఉహు."

"ఆవిడ వూరుకోకపోతే?"

"నీకు ఆవిడ గురించేమీ తెలియదు. ఊహాగానాలు చేయకు."

ప్రియంవద సత్యమూర్తి మెడ చుట్టూ రెండు చేతులూ వేసి అన్నది గోముగా.

"మీరు బావుంటారు."

సత్యమూర్తి కనీ కనబడనట్లుగా నవ్వాడు.

"ఎవరూ నానుంచి మిమ్మల్ని దూరం చేయలేరు. నేనంటే మీకు ఇష్టం ఏర్ప దేలా చేస్తాను."

"'ఇష్టం' అనుకున్నాడు సత్యమూర్తి మనసులో.

"మీకు నేను నచ్చానా?" అడిగింది.

"నచ్చడం అంటే?" అడిగాడు.

"నా అందం మీకు నచ్చిందా?"

సత్యమూర్తి జవాబు చెప్పలేదు.

"నచ్చలేదు కదా?"

సత్యమూర్తి చిన్నగా నవ్వాడు.

"నచ్చితే మరి ఇలా ఈ గదిలో ఈ రాత్రి మాట్లాడుతూ గడిపేస్తారేమిటి?" అన్నది కొంటెగా.

మళ్ళీ నవ్వాడు సత్యమూర్తి.

ప్రియంవద సత్యమూర్తికి అల్లుకు పోయింది తనంతట తానే.

11

మాణిక్యశాస్త్రులు సత్యమూర్తి ద్వితీయ వివాహానికి రాలేదు. పెళ్ళయాక హైద్రాబాద్ వెళుతూ భార్యతో ఆయ నింటికి వెళ్ళాడు సత్యమూర్తి. కాని ఇంట్లోలేడు. పన్ను నొప్పిగా వుంటే డాక్టర్ దగ్గరికి వెళ్ళాడు. ఓ గంట దాకా వేచివున్నాడు సత్యమూర్తి. తర్వాత భార్యతో రైలుస్టేషన్‌కి వెళ్ళిపోయాడు రైలుకు టైం అవడంతో. క్లోక్‌రూం లోని సామాను తీసుకుని రైలు ఎక్కాడు.

ప్రియంవద హైద్రాబాద్ చేరుకోగానే, ఇంట్లోని సామానంతా శుభ్రంగా తోమి తుడిచి ఆరబెట్టి వాటిని అందంగా అమ ర్చింది వంటగదిలో. ఇంటి బూజు దులిపి, ఇంటిని కడిగి ముగ్గులు పెట్టింది.

సాయంత్రం భర్తతో బజారెళ్ళి కావల సిన సరుకులు కొని తీసుకువచ్చింది. ప్రియంవద వచ్చిన మర్నాటినుంచి ఇంట్లో సత్యమూర్తి ప్రియంవద చేతి వంట తిన సాగాడు.

వారం రోజులు గడిచాయి.

పగలంతా ఇంటిపని చూసుకోవడం, సాయంత్రం భర్తకోసం ఎదురు చూడ టంతో ప్రియంవదకి ఆ వారం రోజులూ గడిచిపోయాయి. రాత్రి భోజనం అయాక సత్యమూర్తికి వాకింగ్‌కి వెళ్ళటం అల వాటు. ప్రియంవదని కూడా రమ్మనేవాడు.

ప్రియంవద తను వెళ్ళకపోగా భర్తని కూడా వెళ్ళకుండా ఆపేసేది.

రాత్రి ఇద్దరూ ఒకే మంచంమీద పడుకునేవారు. చాలాసేపు సత్యమూర్తి ఇంగ్లీష్‌లోకి అనువదింపబడ్డ ఉపనిష త్తులు చదువుతూండి పోయేవాడు. ప్రియం వదకి అది నచ్చదు. పుస్తకం లాగేసి అనేది చిరుకోపంగా.

"ఇంతకాలం మీ ఇష్టం వచ్చినన్ని పుస్తకాలు చదివారు. ఇప్పుడు కూడానా?" లైటార్పేసేది.

సత్యమూర్తి తనంతట తానుగా ప్రియంవదమీద చెయ్యివేసేవాడు కాదు. కాని ప్రియంవద వూరుకునేదికాదు. భర్తని తనవైపు తిప్పుకుని కబుర్లు చెప్తూ నెమ్మ దిగా సత్యమూర్తిలో చలనం కలిగించేది.

పదిరోజుల తర్వాత అడిగింది ప్రియం వద ఓ రాత్రి.

"మీకు నేనంటే ఇష్టంలేదా?"

"ఏమో?"

"లేకపోతే ఏమిటి? ప్రతి రాత్రి సిగ్గు విడిచి నేనే మిమ్మల్ని ప్రోత్సహించాలి. మీ బాధ్యత మీకు తెలియకపోతే ఎలా? జీవితాంతం కలిసి బ్రతకాల్సిన వాళ్ళం మనం. ఒకరినొకరు అర్థంచేసుకుని కలి విడిగా బ్రతకాలి కాని ఇలా అయితే ముందుముందు ఇద్దరికీ బావుండదు."

"నిజమే."

"చెప్పండి. మీకు శ్రీవల్లి తాలూకు జ్ఞాపకాలు ఇంకా వదలటంలేదా? నేనేం చేస్తే మీరామెని మరిచిపోగలరు?" అడి గింది మృదువుగా.

చాలాసేపు సమాధానం చెప్పలేదు సత్యమూర్తి. తర్వాత ప్రియంవదని దగ్గరకి తీసుకుని ముద్దు పెట్టకున్నాడు.

ఆ రాత్రంతా మేలుకొనే వున్నారు ఇద్దరూ.

తెల్లవారుఝామున మూడున్నరకి చెప్పింది ప్రియంవద.

"ఇదే మన తొలిరాత్రిలా వుంది నాకు. మీలో ఇంత ప్రేమవుందని, వుంటుందని తెలియదు నాకు."

"ఇదేనా నీవుద్దేశంలో ప్రేమంటే?" అడిగాడు సత్యమూర్తి.

"ప్రేముంటేకాని ఇది సాధ్యపడదు."


"కోరికవుంటే సాధ్యపడుతుంది ఇది. ప్రేమకీ కోరికకీ సంబంధంలేదు."

"కోరికే అనుకుందాం. ప్రేమంటే ఏమిటి?"

"శ్రీవల్లి అనుక్షణం నా అవసరాలు చూసేది. నాకెప్పుడు ఏంకావాలో గుర్తుంచుకోవడం కూడా మర్చిపోయాను. అన్నీ తనే చూసేది. నాకు తలనొప్పివస్తే బాధపడేది. నా పుట్టినరోజువస్తే ఎంతో సంతోషంగా అది జరిపేది. ఆరోజు నన్ను అప్పుడే పుట్టిన చంటిపిల్లాడిలా చూసేది. నన్ను 'రాజూ' అని పిలిచేది. ఇలాంటి సమయాల్లో 'నవ్వు' అనేది. భోజనం అయి చెయ్యి కడుక్కుంటే కొంగుతో తనే చేతిని తుడిచేది ఒకసారి తనే చేయి కడిగేది. ఓసారి జ్వరంవచ్చి లేవలేక పోతే ఎన్ని సపర్యలు చేసిందో. కేవలం నాకోసం బ్రతికేది. శ్రీవల్లి నన్ను గాఢంగా ప్రేమించింది. లేదా నేనే ప్రేమించాను. మాటల్లో చెప్పటం చేత కాదు. నాజుట్టుని చేత్తో దువ్వుతుంటే ఎంతో హాయిగావుండేది. శ్రీవల్లి ప్రేమ అనేక విధాలుగా వ్యక్తంచేసేది అలా. నాకు చేతకాదు చెప్పటం. శ్రీవల్లిలేని లోటు నీవు తీర్చలేవు. కాని చీకటి కమ్మిన నా జీవితంలోకి వెలుగురేఖలా వచ్చావ్ నీవు. నీవల్ల నాకు మనసు ప్రశాంతంగా వుంటోంది. నీవు లేనప్పటి బ్రతుకు ఇప్పటి బ్రతుకు పోల్చి చూసు

పరిసరాలను రంగుల్లో చూడగలిగే శక్తి మనిషికీ, కోతులకూ, కీటకాలకు మాత్రమే వుంది. ఇతర జంతువులకు యీ శక్తి లేదు. పచ్చగడ్డి మేసే జంతువులకు ఆ గడ్డి రంగు పచ్చ అన్న సంగతి తెలీదు; వాటి కది "సిమెంటు రంగు"లో కనిపిస్తుంది! జంతుకోటిలో మానవుడి దృష్టికున్న ప్రత్యేకతలు మరే ప్రాణికిలేదు. రంగుల వైవిధ్యాలు సుమారు కోటి దాకా మనిషి కంటికి కనిపిస్తాయి!

(వి) చిత్ర విజ్ఞానం



కుంటే ఇదే బావుందనిపిస్తోంది."

ప్రియంవద అరగంటదాకా ఆలో చిస్తూండిపోయింది. నిద్రపోయిందను కున్నాడు సత్యమూర్తి.

తర్వాత ప్రియంవద శ్రీవల్లి గురించి అనేక ప్రశ్నలు వేసింది. సత్యమూర్తి అన్నిటికీ జవాబులు చెప్పాడు. ప్రియం వదకి శ్రీవల్లి మనస్థత్వంగురించి, వాళ్ళ దినచర్యనుగురించి, దినచర్యలోని అతి సామాన్యమయిన చిన్న చిన్న విషయాలు గురించి ఓ అవగాహన ఏర్పడ్డాక అప్పుడు అడిగింది

"ఇప్పుడు చెప్పండి. రాత్రిపూట శ్రీవల్లి ఏంచేసేది?"

"అంటే?"

"శ్రీవల్లిని మీరు మరిచిపోయేలా చేయగలను ఇక. నేనడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పండి ."

ప్రియంవద రకరకాలుగా ప్రశ్నిం చింది తన భర్తని. ఆ ప్రశ్నలకి ఆశ్చర్యం కలిగినా అన్నిటికీ సమాధానాలు చెప్పాడు సత్యమూర్తి.

"రేపటినుంచి చూడండి" అన్నది ప్రియంవద తెల్లవారాక, భర్త గుండెల మీద తలపెట్టి పడుక్కుని.

* * *

సత్యమూర్తి శ్రీవల్లిని మరిచిపోలేదు. కాని ఇదివరకు శ్రీవల్లిమీదవున్న ప్రేమలో చాలాభాగం ప్రియంవదమీదకి మళ్ళింది.

ఇదివరలో వున్నంత అంటీ అంట నట్లుగా వుండటంలేదు ఇప్పుడు. రాత్రి పూట పుస్తకాలు చదివేటప్పుడు ప్రియం వద గొడవచేయటంతో ఓ ఒప్పందానికి వచ్చారు. ప్రియంవద పక్కనే కూర్చుని ఓ చేయి ప్రియంవదమీదవేసి చదువుకో వాలి సత్యమూర్తి. అలాచేస్తే ప్రియం వద వంటరితనం ఫీల్ అవదు. తన భర్త తనని నిర్లక్ష్యంచేసి పుస్తకాల్లో మునిగి పోయాడన్న భావన కలగదు.

క్రమంగా పుస్తకాలు చదవడం కూడా తగ్గించేసాడు సత్యమూర్తి.

తన భర్త అందరిలాంటి మనిషి కాదన్న సంగతి ప్రియంవదకు స్పష్టంగా అర్థమయింది. ఒకోసారి ఆలోచనలలో పడిపోయి ఎంతో పరధ్యాన్నంగా, ముభా వంగా వుండిపోతాడు రోజులతరబడి. ప్రతీదానికి చిరాకుబడి విసుక్కుంటాడు.

తర్వాత మామూలుగా అయిపోతాడు. అలాంటి సమయాల్లో ప్రియంవద శాయ శక్తులా ప్రయత్నించేది మామూలు ధోరణి లోకి తీసుకురావాలని.

అందుకు ఒకే ఆయుధం ప్రియంవద వుపయోగించింది.

తన శరీరం.

తన భర్తని పక్కమీదనుంచి కదల నివ్వకుండా, వేరే ఆలోచనలు మనసు లోకి రానివ్వకుండా

క్రమంగా అలా పరధ్యాన్నంలోకి వెళ్ళటం కూడా మర్చిపోయాడు సత్య మూర్తి

పెళ్ళయిన అయిదారు నెలలకే సత్య మూర్తిని ప్రియంవద తనకిష్టమయిన రీతిలో మార్చుకుంది. అందుకు తనలో తనకే ఎంతో గర్వంగా వుండేది.

"నన్నెందుకిలా బంధిస్తావ్?" ఒకో సారి దీనంగా అడిగేవాడు సత్యమూర్తి.

"దేంతో?" అడుగుతుంది నవ్వుతూ.

"ఏమో?"

"నా ప్రేమతో. అవునా?"

"అవును."

"నా రాజు నానుంచి పారిపోకుండా."

"అంటే?"

"శ్రీవల్లి గుర్తువస్తే నేను దూర మవుతాను."

"లేదు."

"నాకు తెలుసు. మీరు శ్రీవల్లి గురించి అప్పుడప్పుడూ ఆలోచిస్తూనే వున్నారు."

"శ్రీవల్లి గురించి కాదు."

"ఇంకెవరిగురించి? సత్యవల్లా?"

"ఉహూ."

"మరి?"

"చాలావాటిగురించి"

"వాళ్ళలో శ్రీవల్లి, సత్యవల్లి లేరా?"

"లేరు"

"నేను?"

"ఉహూ"

"మరయితే వేటిగురించి?"

"సుఖం గురించి"

"సుఖం? మీరిప్పుడు సుఖంగాలేరా?"

"ఉన్నాను. ఇదికాదు మరో సుఖం."

"ఏమిటా మరో సుఖం?"

"నీ కర్థంకాదు చెప్పినా. నన్ను మమకారంతో, అనురాగంతో శ్రీవల్లిలా కట్టేసుకోవాలని ప్రయత్నించక. నా కిష్టం లేదా పాశం. నన్ను స్వతంత్రుడిగా జీవించనీ."

"అంటే?"

"శ్రీవల్లిలా నీవూ మాయమయినా నేను ఇదివరకు పడ్డ వ్యథని మళ్ళీ పొంద కుండా నా మనసుని నేను కంట్రోల్‌లో వుంచుకోడానికే నా ప్రయత్నం, ఆలో చన."

ప్రియంవద తెల్లబోతూ చూసింది భర్తవంక.

"నన్నంత తక్కువ అంచనా వేస్తు న్నారా? మిమ్మల్నొదిలి వెళ్ళిపోతానా నేను?"

"వెళ్ళవు. మృత్యువే తీసుకెళ్ళిం దనుకో."

"మీ తర్వాతే నా మరణం."

చిన్నగా నవ్వి చెప్పాడు.

"శ్రీవల్లికీ నీకు ఈ ఒక్క విషయం లోనే తేడా."

"మీకు నేనంటే ఇష్టంలేదా?"

"ఇన్ని నెలలు కాపురంచేసాక నీకే మనిపిస్తోంది?"

"నేలేకుండా వుండలేరని."

"నిజమే కాని అలా మళ్ళీ పంజ రంలో చిక్కుకోవడం నాకిష్టంలేదు."

"ఏమిటో మీ వెర్రిమాటలు నాకర్థం కావటంలేదు. పంజరం ఏమిటి?"

"నీ కర్థంకాదు."

"నేనంటే మీకు ప్రేమ. అదిమాత్రం అర్థమయింది నాకు. అ కాస్త అర్థ మయితే చాలు నాకు."

ఒకోసారి చెప్తుంది ప్రియంవద

"శ్రీవల్లి తిరిగివచ్చినా నన్నొదిలి వుండలేరు మీరు. ఉండగలరా?"

"ఉండలేను బహుశ. కాలం మా ఇద్దరి ప్రేమనీ తక్కువ చేసేసిందను కుంటాను. కాని శ్రీవల్లి గుర్తువస్తే ఆ బాధ ఇంకా తగ్గటంలేదు."

లాలనగా భర్త తలని తన గుండెల మీదకి లాక్కుని, తలనిమురుతూ అంటుంది

"ఎందుకు రాజూ నీకు నీ రాణి వుందిగా."

క్రమంగా సత్యమూర్తి ప్రియంవదల మధ్య శ్రీవల్లికి సంబంధించిన ప్రసక్తి రావటం తగ్గిపోయి పూర్తిగా ఆగి పోయింది.

"మీకో శుభవార్త" చెప్పింది ఓ రోజు.

"ఏమిటి?" అడిగాడు.

"నాలుగోనెల నాకు" సిగ్గుపడుతూ చెప్పింది.

సత్యమూర్తి చాలాసేపు నిశ్శబ్దంగా వుండిపోయాడు.

"మీకు సంతోషంగా లేదా?" అడిగింది.

ప్రియంవద కళ్ళలోకి చాలాసేపు చూసి చెప్పాడు

"నాకు తెలియదు."

"మీకు పిల్లలంటే ఇష్టంలేదా?"

"ఏమో!"

"చెప్పండి. మీ కిష్టంలేదా?"

"ఆ రహస్యం ఒక్క శ్రీవల్లికే తెలుసు. నీకు కాని ఇంకెవరికికానీ చెప్పను."

"ఏమిటా రహస్యం?"

"అదికూడా చెప్పేస్తే నేను నీకు పూర్తిగా బంధితుడయిపోతానేమో? చెప్పను."

ఆ తర్వాత అనేకసార్లు అడిగింది సత్యమూర్తిని ప్రియంవద ఆ రహస్యం ఏమిటో చెప్పమని.

సత్యమూర్తి చెప్పలేదు.

ప్రియంవద రాజమండ్రి సత్యమూర్తి అక్కయ్య ఇంటికి వెళ్ళింది ఏడోనెల రాగానే.

ప్రియంవద లేని ఇంట్లో సత్యమూర్తి ఆరునెలలు గడిపాడు. కొత్తల్లో ప్రియంవదలేని లోటు బాగా ఫీల్ అయేవాడు.

మళ్ళా ఆలోచనలు మొదలయ్యాయి సత్యమూర్తిలో. తను మళ్ళా మమకారమనే పాశంలోకి లాగబడుతున్నాడు.

కొడుకు పుట్టాడని టెలిగ్రాంవస్తే చూడటానికి వెళ్ళాడు రాజమండ్రి.

"ఎలావున్నాడు?" అడిగింది సత్యమూర్తిని ప్రియంవద బాబుని చూపించి.

"తెల్లగా వున్నాడు నీలాగా"

"నాకు పిల్లలంటే ఎంతో ఇష్టం. మొగపిల్లాడు పుడితే తిరుపతి వస్తానని మొక్కుకున్నాను."

"వీడు వచ్చాక నేను గుర్తుండనేమో?"

"అంటే?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఏంలేదు."

"ఇదేనా ఆ రహస్యం?" అడిగింది నవ్వుతూ.

సత్యమూర్తి తల అడ్డంగా తిప్పాడు.


"కాదు."

"సత్యవద అని పేరు పెడతానంటే మాత్రం వూరుకోను" నవ్వుతూ చెప్పింది.

"నీ కొడుకు. నీ ఇష్టం" అని ఆగి చెప్పాడు. "సత్యవల్లి నేపెట్టిన పేరు కాదు. శ్రీవల్లి ఎన్నికచేసిందా పేరు."

"మంచిపేరు మీరే ఆలోచించండి. అప్పటిదాకా డుంబుగాడని పిలుద్దాం" అన్నది ఆప్యాయంగా వాడి సన్నటి చేతులని పట్టుకుంటూ.

ప్రియంవద మొహంలోని సంతోషాన్ని, సంతృప్తిని చూసి సత్యమూర్తి



బయటికి వచ్చేసాడు ప్రియంవద పిలుస్తున్నా వినిపించుకోకుండా.

"నేను ప్రియంవదకి మానసికంగా దూరం అవగలను" అనుకున్నాడు సత్యమూర్తి రైల్లో హైద్రాబాద్ తిరిగి వెళుతూ.

*   *   *

ప్రియంవద కొడుకుతో హైద్రాబాద్ తిరిగి వచ్చింది. వారం రోజుల్లోనే గమనించింది భర్తకి తన కొడుకంటే ఇష్టం లేదని. తనకి దూరం అవుతున్నాడని.

ఓరోజు స్నానానికి నీళ్ళు తోడింది బక్కెట్లో.

సత్యమూర్తి ప్రియంవద చూస్తూండగానే ఆ నీళ్ళని విసురుగా కుమ్మరించి తనే తోడి తెచ్చుకున్నాడు నీళ్లు.

"ఎవరిమీదా ఈ కోపం?" అడిగింది నవ్వుతూ.

బాత్‌రూం తలుపు వేసుకున్నాడు సత్యమూర్తి.

"ఇంద. సబ్బు తెచ్చాను. తలుపు తీయండి" అన్నది ప్రియంవద బయట నుంచి.

సత్యమూర్తి సబ్బుకోసం తలుపు తీయగానే లోపలకివచ్చి మూలనున్న సబ్బుబిళ్ళతీసి పట్టుకుని చెప్పింది

"దేనికి అంతకోపం?"

"ఏంలేదు"

"నే పోస్తాను ఈ రోజు"

"అవసరంలేదు"

"అదేమిటి? కూర్చోండి"

"అక్కరలేదు"

"మరింతకాలం ఎందుకు అవసరం వచ్చింది? తిరగండి" అన్నది చెంబుతో నీళ్ళుముంచి.

"ప్లీజ్. వద్దు. వెళ్లు"

కఠినంగా వున్నాయా మాటలు మృదువుగా చెప్పినా.

"ఎందుకు?"

"నీ కొడుక్కి చేయించు స్నానం."

భార్యని బయటకి గెంటి తలుపేసుకున్నాడు.

ప్రియంవదకి చూచాయగా బోధపడింది భర్త మనస్తత్వం.

ఇలాంటి తత్వంగల వ్యక్తి భార్య సమర్థవంతురాలు కాకపోతే ఇబ్బంది అనుకుంది.

ప్రియంవదకి తెలుసు తన సామర్థ్యం. ఎలాగయినా భర్తచేత ఆ రహస్యం చెప్పించాలనుకుంది.

12

"మీకు టెలీఫోన్."

సత్యమూర్తి దగ్గరకి వచ్చి చెప్పాడు ప్యూన్.

కొత్త పుస్తకాలకి కేటలాగ్ నంబర్లిచ్చి రిజిష్టర్‌లోకి వాటి వివరాలని రాస్తున్న సత్యమూర్తి వెంటనే లేచి నిలబడ్డాడు తన పనిని మధ్యలో ఆపి.

టెలీఫోన్!

మళ్ళీ తనకి టెలీఫోన్!!

గుండెల్లో రాయి పడ్డట్లుగా అనిపించింది.

ఫోన్ దగ్గరికి వెళ్ళి చెప్పాడు.

"సత్యమూర్తి స్పీకింగ్."

"అసిస్టెంట్ లైబ్రేరియన్ సత్యమూర్తేనా?"

"అవును."

ఎవరిదా కంఠం?

"సారీ బ్రదర్."

సత్యమూర్తి మౌనంగా వుండిపోయాడు.

"మీ ఇంటికి అతి సమీపంలోవున్న సినిమా థియేటర్‌కి వెళ్తే మీ భార్య, సుగుణరావు కనబడతారు."

ఫోన్ క్లిక్‌మంది.

సత్యమూర్తి గుండెలో రైళ్ళు పరిగెడుతున్నాయి.

ఒకే ఒక థియేటర్ వుంది. ఇంటినుంచి అయిదునిముషాల నడక అక్కడికి.

సత్యమూర్తి మళ్ళీ వచ్చి తన సీట్‌లో కూర్చున్నాడు. ఆ విషయం మర్చిపోవడానికి పనిలో లీనమయే ప్రయత్నం చేసాడు. కాని కాన్‌సన్‌ట్రేషన్ పోతోంది.

లేచివెళ్ళి టీ తాగివచ్చి కూర్చున్నాడు.

మనసునిండా బాధ.

సత్యమూర్తి లేచి వెళ్ళి భగవద్గీత రేక్‌లోంచి తీసుకువచ్చి దాన్ని చదివే ప్రయత్నం చేసాడు. కాని మనసు దానిమీద లగ్నం కాలేదు.

. ప్రియంవద సుగుణరావుతో సినిమాకి వెళ్ళిందా?

ఎవరతను?

ఎందుకు తనకి చెప్తున్నాడు?

అసలతనికి ఎలా తెలుసు?

ప్రియంవదని వాచ్‌చేసి తనకి చెప్పాల్సిన అవసరం ఎందుకు ఏర్పడింది?

అరగంటదాకా పరిపరి విధాల ఆలోచనలతో గడిపాడు సత్యమూర్తి.

ప్రియంవద ఎందుకు తిరుగుతుంది ఆ సుగుణరావుతో? అసలు ఎలా పరిచయం అయాడు అతను? ప్రియంవదకి ఆ అవసరం ఎందుకు కలిగింది అసలు? తను ఇదివరలోలా కాక ప్రేమగానే వుంటున్నాడు కదా?

ప్రియంవద ఎందుకిలా దిగజారిపోయింది?

ఈ రహస్యం తనకి తెలుస్తే తట్టుకో గలనని ఎలా అనుకుంది? తెలియకుండా దాచగల ననుకుందా?

సత్యమూర్తి ఎంతో ప్రయత్నం మీద తన మనసుని కంట్రోల్ చేసుకుని ఆ సినిమా థియేటర్‌కి వెళ్ళకుండా ఆగ గలిగాడు.

సాయంత్రం ఇంటికి వెళ్ళాడు మామూలు టైంకి. ప్రియంవద ఇంట్లోనే వుంది.

కాఫీ కలిపి తీసుకువచ్చి యిచ్చింది.

"మధ్యాహ్నం వస్తే తలుపు తాళం వేసివుంది" అన్నాడు సత్యమూర్తి.

"బజారు కెళ్ళాను...ఎప్పుడొచ్చారు!"

" . . "

"సారీ. మీ రొస్తారని తెలియదు."

"సినిమాకి వెళ్ళావా?"

ప్రియంవద వంక చూసాడు. ఏ మాత్రం తొట్రుపాటు లేకుండా చెప్పింది

"అవును."

"బావుందా?"

"ఫర్వాలేదు."

"ఇదివరకు చూసిందేగా?"

"దేని కెళ్ళానో తెలుసా?"

"తెలుసు."

ఈసారికూడా ప్రియంవద మొహంలో తొట్రుపాటు, భయం కనపడలేదు సత్యమూర్తికి.

"చక్కెర చాలిందా?" అడిగింది.

సత్యమూర్తి మనసంతా గజిబిజిగా వుంది. ఓ పుస్తకం అందుకుని చదవ సాగాడు. ప్రియంవదలోని మార్పుని గుర్తించాడు సత్యమూర్తి. ఆమెలోని గిల్టీ కాన్షస్ పనిచేస్తోంది. ఎప్పటిలా పలకరించి మాట్లాడటం లేదు సత్యమూర్తితో.

ఆ రాత్రి సత్యమూర్తి తన పక్కని పడక గదిలోంచి తీసి ముందుగదిలో వేసుకున్నాడు.

"అదేం?" అడిగింది ప్రియంవద భయంగా.

"ఇవాళ ఇక్కడ పడుకుంటాను."

"వద్దు రండి."

పక్క తీయబోయింది.

"నా మీద నీకు ప్రేమలేదా!" అడిగాడు.

"లేదని ఎందుకనుకుంటున్నారు?"

"నా మీద నీకు ప్రేమ వుందా లేదా?"

"మీకు తెలియదా?"

"తెలుసు. నీకు తెలుసో తెలియదో తెలుసు కుందామని."

"ఉంది."

ప్రియంవద కళ్ళలోకి వెదుకుతున్నట్లుగా చూసాడు కాసేపు.

పక్క తీసుకెళ్ళి మళ్ళీ పడక గదిలో వేసింది ప్రియంవద.

సత్యమూర్తి పుస్తకం చదువుతూ పడుకున్నాడు. ప్రియంవద సత్యమూర్తి చేతిని తన తలమీద వేసింది.

ఒంటి గంటకి పుస్తకం మూసాడు సత్యమూర్తి.

లేచి లైటుఆర్పేయబోతూ ప్రియంవద వంక చూసాడు. నిద్రపోతోంది. లైటు ఆర్పకుండా అలా నిలబడి చూస్తుండి పోయాడు.

దాదాపు అర్థ నగ్నంగావుంది శరీరం నిద్రలో చీర చెదిరి పోవటంవల్ల. తెల్లటి శరీరం నున్నగా మెరుస్తోంది చర్మం మీద లైటు కాంతిపడి. బుగ్గలు, పెదవులు,

మూసుకొన్న కనురెప్పలు, అరిపాదలు, పిక్కలు, నడుము, పొట్ట... తన భార్య శరీరంలోని చాలా భాగాలు చూస్తుండి పోయాడు సత్యమూర్తి అలాగే నిలబడి.

ఎంతసేపు చూసాడో తనకే తెలియదు.

నిద్రలో కదిలి వత్తిగిలి పడుకుంది.

లైటు ఆర్పి, తన పక్క దూరంగా జరుపుకుని పడుకున్నాడు సత్యమూర్తి.

సత్యమూర్తి బుర్ర ఆలోచనలతో వేడెక్కిపోయింది. చాలాసేపు నిద్ర పట్ట లేదు.

మర్నాడు పుదయం నిద్ర లేచింది ప్రియంవద.

"దూరంగా పడుక్కున్నారే?" అడి గింది మామూలుగా. సత్యమూర్తి జవాబు చెప్పలేదు.

"అలిగారా?"

"చిన్నప్పుడే నేను తప్పిపోయివుంటే బావుండేది" బాధగా అన్నాడు.

"తప్పిపోవటమా? నాకర్థం కాలేదు."

"చిన్నప్పుడు మా అక్క, బావలు ఓసారి రైల్లో పెళ్ళికివెళ్తూ నన్నూ తీసుకు వెళ్ళారు. విజయవాడలో రైలు ఆగితే నేను రైలు దిగాను. నా కప్పుడు అయి దేళ్ళు. వాళ్ళు చూసుకోలేదు. రైలు మళ్ళీ బయలుదేరాక చూసుకున్నారు. మంగళ గిరిలో దిగి బస్సులో విజయవాడ వచ్చి మళ్ళీ రైల్వేస్టేషన్‌కి వచ్చారు కంగారుగా. నే నింకా స్టేషన్‌లో ఆడుకుంటున్నాను. ఎందుకనో ఆగివున్న రెండు రైళ్ళలో ఒక్క దాంట్లోకూడా ఎక్కలేదు నేను. ఎక్కివుంటే ఎటో వెళ్ళిపోయేవాణ్ని ఆ రైల్లో వాళ్ళొచ్చేసరికి. నన్ను ఎత్తుకుని మళ్ళీ తరువాతి రైల్లో బయలుదేరారు. అప్పుడు తప్పిపోయి వుంటే ఎంతో బావుండేది."

"ఇప్పుడెందుకు గుర్తొచ్చిందీ ఆ సంఘటన?"

"ఏమో?"

"ఏమో అనడం ఒక్కటి తెలుసు. శ్రీవల్లిని పోగొట్టుకున్నప్పుడు కూడా అనలేదుగా చిన్నప్పుడే తప్పిపోయివుంటే బాగుండే దని?"

"శ్రీవల్లి నాలో ఆ ఫీలింగ్ కలిగించ లేదు. నిజానికి అప్పుడు తప్పిపోయి వుంటే శ్రీవల్లి నాకు తటస్థ పడేదే కాదు."

"మీ కెందుకా ఆలోచన యిప్పుడు వచ్చింది అకస్మాత్తుగా. ఏమో అని మాత్రం అనకండి. నాకు వళ్ళు మండు తుంది."

సత్యమూర్తి మళ్ళీ అన్నాడు

"నిజంగా అప్పుడు తప్పిపోయివుంటే బావుండేది."

ప్రియంవద వంట గదిలోకి వెళ్ళి పోయింది పనిచేసుకోడానికి. సత్యమూర్తిని లేపమని చెప్పడానికి మళ్ళీ వచ్చింది ప్రియంవద అరగంట తర్వాత.

సత్యమూర్తి మళ్ళీ నిద్రలోకి జారి పోవడం గమనించి లేపదలచుకో లేదు ప్రియంవద.

సత్యమూర్తి మధ్యాహ్నం లేచాడు నిద్ర.

"వడ్డించనా?" అడిగింది ప్రియంవద.

"కాఫీ చాలు."

గబగబా మొహం కడుక్కున్నాడు.

"కాఫీ ఏమిటి? భోజనం చెయ్యరా?" అడిగింది.

"వద్దు."

"ఆ వండిందంతా ఏం చేయను? దిబ్బలో కొట్టనా?"

ప్రియంవద కోపంగా అడిగింది భర్తని.

"నీ యిష్టం."

"కాఫీ లేదు భోజనం చేయండి."

సత్యమూర్తి బట్టలు తొడుక్కుని బయటకి వెళ్ళిపోయాడు. గుమ్మంలో బాబు కాళ్ళకి అడ్డుపడితే విసుగ్గా వాడిని పక్కకి నెట్టేసాడు.

"ఇలా చేస్తే శ్రీవల్లిలా నేనూ మీ కళ్ళ బడకుండా ఎటో వెళ్ళిపోతాను." అన్నది ప్రియంవద.

గుమ్మంలోంచి మళ్ళీ లోపలకివచ్చి ప్రియంవద వంక నిశ్శబ్దంగా చూసాడు సత్యమూర్తి అతని మొహంలో, కళ్ళలో కనబడ్డ అసహ్యానికి,కోపానికి ప్రియంవద బెదిరిపోయింది మనసులో.

సత్యమూర్తి మళ్ళీ బయటకి వెళ్ళి పోయాడు.

లైబ్రరీకి వెళ్ళ బుద్ధికాలేదు. ఓ స్నేహితుడి ఆఫీసుకి వెళ్ళి అయిదున్నర దాక అక్కడ గడిపేసాడు.

తర్వాత నడపటం ఆరంభించాడు.

కాళ్ళు ఎటు లాక్కెడితే అటు నడవ సాగాడు. నడుస్తూనే వున్నాడు ఆగ కుండా. సాయింత్రం అయిదున్నరనుంచి రాత్రి పదిన్నరదాకా ఆయిదు గంటలసేపు హైద్రాబాద్ నగరం అంతా యిష్టం వచ్చి నట్లు కాళ్ళు పడిపోయేలా నడుస్తూండి పోయాడు మంచి నీళ్ళయినా తాగకుండా.

పదకుండింటికి ఇంటికి చేరుకున్నాడు. గుమ్మంలో కూర్చునివుంది ప్రియంవద వళ్ళో నిద్రపోతున్న బాబుతో.

"అలస్యం అయిందే?" అడిగింది భర్తని.

జవాబు చెప్పలేదు. లోపలికివెళ్ళాడు. వంటగదిలోని మంచినీళ్ళ బిందెలో ఓ చెంబుడు నీళ్ళు ముంచుకుని ఆ నీళ్ళని గట గటా తాగేసి పడక గదిలోకి వెళ్ళి పడుకున్నాడు.

"ఎందుకు కోపం?" అడిగింది ప్రియంవద లాలనగా భర్త జుట్టులోకి వేళ్ళని పోనించి.

సత్యమూర్తి కళ్ళు మూసుకున్నాడు సమాధానం చెప్పకుండా.

"అన్నం తిన్నారా బయట యెక్క డయినా?"

సత్యమూర్తి మౌనంగా వుండి పోయాడు.

"లెండి, లేచి తిందాం రండి."

"వద్దు" పొడిగా అన్నాడు.

"ఏం?"

"మనసు బాగాలేదు."

"పొట్టేం చేసింది? రండి."

"వద్దు."

శరీరాన్ని కావాలని అయిదు గంటల సేపు శ్రమకి గురిచేసిన సత్యమూర్తికి తను కోరుకున్నట్లుగానే వెంటనే నిద్ర పట్టేసింది.

ఒళ్ళు మరిచి నిద్రపోయాడు ఆ రాత్రి.

13

మర్నాడు ఉదయం పెట్టెలో బట్టలు సర్దుకుంటున్న భర్తని అడిగింది ప్రియం వద ఆశ్చర్యంగా.

"ఎక్కడికి?"

"విజయవాడ."

"ఎందుకు?"

"పని వుంది."

"ఆఫీస్ పనా?"

"సొంతం."

"నేనూ రానా?"

"వద్దు."

"రహస్యమా?"

"కాదు."

"ఎందుకింత హఠాత్తుగా?"

"రెండు మూడు రోజుల్లో వచ్చేస్తాను."

"ఎందుకలా వున్నారు రెండు రోజుల నుంచి?"

"....   "

"మీ యిష్టం."

సత్యమూర్తి సరాసరి బస్ డిపోకి వెళ్ళాడు.

బస్‌లో సాయంత్రం అయిదింటికి విజయవాడ చేరుకున్నాడు. బ్రీఫ్ కేస్‌తో కనకదుర్గ గుడివైపు నడవ సాగాడు చకచకా.

అరగంటలో మాణిక్య శాస్త్రిలు ఇంటికి చేరుకున్నాడు సత్యమూర్తి.

ఆయన ఇంట్లో లేరు. పదిమంది విద్యార్థులు సంస్కృత పాఠాలు వల్లె వేస్తున్నారు. కొందరు చెట్లకి నీళ్ళు పోస్తున్నారు బావిలోంచి తోడి. పచ్చటి చెట్లతో వున్న ఆ వాతావరణం యెంతో ఆహ్లాదంగా వుందనిపించింది సత్యమూర్తికి.

సూర్యుడు అస్తమిస్తుండగా వచ్చారు మాణిక్యశాస్త్రిలు. కొన్ని క్షణాలు సత్యమూర్తి వంక తేరిపార చూసి అడిగాడు—

"నువు సత్యమూర్తి కదూ?"

లేచి నమస్కారంచేసి చెప్పాడు సత్యమూర్తి

"గుర్తున్నానే. మిమ్మల్ని చూసి దాదాపు అయిదేళ్ళు కావస్తోంది. నన్ను నేను పరిచయం చేసుకోవాలనుకుంటున్నాను."

"ఒకసారి చూస్తే మర్చిపోను."

ఓ శిష్యుడు చెప్పాడు నవ్వుతూ

"మా గురువుగారికి జ్ఞాపక శక్తి మెండు. కొన్నివేల సంస్కృతపద్యాలు, మంత్రాలు, స్తోత్రాలు ఆయనకి వచ్చు."

"రెండుసార్లు మీ దర్శనం కోసం వచ్చాను కాని మీరు లేరు."

"అవును. ఓసారి పంటి డాక్టర్ దగ్గరకి వెళ్ళాను. మరోసారి నవరాత్రులప్పుడు వచ్చారు మీ దంపతులు. నవరాత్రులప్పుడు తీరికవుండదు నాకు."

సత్యమూర్తిని పరీక్షగా చూసి అడిగాడు

"ఒంట్లో బాగా లేదా నీరసంగా కనిపిస్తున్నావు?"

"మనసే బాగాలేదు."

"అనుకున్నాను."

"మీతో మాట్లాడాలి. అందు కోసమే వచ్చాను."

"ముందర స్నానంచెయ్యి తర్వాత మాట్లాడు కుందాం. కాసేపు విశ్రాంతి తీసుకో. సంధ్య వార్చి నేను పురాణానికి వెళ్ళాలి. ఎదురుచూస్తుంటారు."

ఆ రాత్రి మాణిక్యశాస్త్రిలు వచ్చేదాక ఆగక్కరలేదని శిష్యులే వంటచేసి అన్నం వడ్డించారు సత్యమూర్తికి.

(ఇంకా వుంది)

సీతాలు గుడిసె మారింది

కె. కె. మీనన్

నగరం నడిబొడ్డు మీద, చీకట్లో, ఆ అందమైన భవంతి శ్రీ మహావిష్ణువు గుండెల మీద లక్ష్మీదేవి ముఖంలా వుంది.

ఛ! అదేం వుపమానం మరీ పాతది, అందులోనూ వూహాకందని వుపమానం.

సరే, పోనీ, అమ్మాయి అందమైన జుట్టులో తెల్లని మల్లెపూవులా వుందని అందాం.

ఆ అందాల భవంతి ముందు

'ఆర్కిటెక్ట్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ లిమిటెడ్, ఇంజనీర్స్ అండ్ కాంట్రాక్టర్స్—'అని పెద్ద సైను బోర్డువుంది. ఆ కంపెనీ యజమాని సాంబమూర్తిగారికి ఆ భవనం మూడో అంతస్తులో అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది.

సాంబమూర్తిగారికి మెలుకువ వొచ్చింది కాబట్టి తెల్లవారిందని అర్థం కాదు, కాలం గతి తప్పి నడుస్తోందనీ కాదు. ఆ మాటకొస్తే ఆయన కాలాన్నే కళ్ళెంపట్టి నిలిపేయగల్డు (హెయిల్ అయిన్‌స్టీన్!) అంటే తెల్లవారినా కళ్ళు తెరవడన్నమాట!

సాంబమూర్తిగారు పగలంతా చాలా బిజీగా వుంటారు. పార్టీలతో వ్యాపార విషయాలు ముచ్చటించటం, బేంకు బేలన్సులు బేరీజు వేసుకుని ఏ కాంట్రాక్టులో ఏ అధికారికి ఎంత పెర్సెంటేజ్ సమర్పించుకుంటే ఎంత కాజెయ్యొచ్చు—ఇలాంటి ప్రణాళికలతోటే ఆయన కాలం అంతా హరించి పోతుంది. అలా ఆర్జించిన సొమ్ము—తన్మూలంగా సంక్రమించిన హోదా, సంఘంలో పరువు, ప్రతిష్ఠ, ఉన్నత వర్గాలలో పలుకుబడీ—ఏటిని నిలుపుకోటానికీ మరింత పెంచుకోటానికీ, నాగరికుల విలాస కేంద్రం క్లబ్ కెళ్ళాలి—తప్పదు మరి''

సాంబమూర్తిగారు క్లబ్‌కు వెళ్తున్నారంటే ఆయన అనాయాసంగా ఆర్జించిన సొమ్మును ఎగరేసు కోటానిక్కాదు. అలా ఎవరైనా అనుకుంటే వాళ్ళని టక్కీ పసిపిల్లల్లో జమకట్టవచ్చు. అసలు వారి కాంట్రాక్టుల్లో రొంభై శాతం అక్కడే సెటిలైపోతూవుంటాయని ఎంత మందికి తెల్సు!

సరే క్లబ్బుకి వెళతాడు

అక్కడి మాత్రం ఆయన వూరికే కూర్చుంటాడని అనుకుంటున్నారా! ఉహూ!' అక్కడా ఆయనకి బోలెడంత పని. చెయి ఖాళీ అయిపోయిన ఏ ఇంజనీరుగారికో, లేక ఓ పెద్ద అధికారికో కాస్త చెయి సాయం చెయ్యాలి, లేదా; నిన్న సమర్పించుకున్న దాంట్లో ఎంతో కొంత భాగం ఒడుపుగా రాబట్టుకోవాలి. అవసరం అయితే పోగొట్టుకుని (నష్టంమీద కాదు) అయినా సరే రేపు కావల్సిన పనికి నాందిగా

★ గుడిసెలకూ, మేడలకూ విలువల్లో ఎంతో తేడావుంది! మరి గుడిసెల్లో మనుషులకు, మేడల్లో మనుషులకూ మధ్య ఎంత తేడా ఉంటుంది? ★

ఇవాళే అవుననిపించుకుని బయటపడాలి. అలా బైటపడి ఇంటికి చేరుకునేప్పటికి ఎంత లేదనుకున్నా రాత్రి పన్నెండు దాటుతుంది. అప్పటికే ఒళ్ళంతా అలిసిపోయి మనసంతా విసిగిపోయి వుంటుంది. అలాంటప్పుడు క్లబ్‌లో పెద్దమనుషులు అలా బార్ వైపు చెయి చూపించి మొహమాటపెడితే సరేసరి, లేకపోతే ఇంటికొచ్చాకయినా ఓ పెగ్గు బిగించకపోతే ఆరోగ్యం చెడిపోదూ!

అలా ఆరోగ్యం గురించి జాగ్రత్త తీసుకుని మెత్తని తల్పంమీద మేను వాల్చేటప్పటికి 'టైం'ఎంతో తెల్సుకోవల్సిన స్థితి దాటిపోతుంది. మళ్ళీ తెల్లారి పొద్దెక్కేవరకూ ఆయన్ని ఎవరూ, ఎందుకూ లేపరాదు. ఇది ఎమెర్జన్సీని మించిన క్రూరశాసనం.

కాని....కాని....అవాళ అఘాయిత్యం జరిగిపోయింది....

....వేకువ వెలుగు ధూళి రేపకముందే.... వెలుగు రేఖలు చీకట్ని రేప్ చెయ్యకముందే అప్రాచ్యు లెవరో ఆయన నిద్రని చెరిచేరు.

ఆయన నిద్రకి అలా నిలువునా మానభంగం జరిగేక ఆ రోజు ఆయనకు జరగబోయే నష్టం అంకెల వారీగా ప్రత్యక్షమై అలవోకగా ఆయన నేత్రకక్ష్యముందు నిలబడి పెద్ద చికాకు కలిగించింది. విసుగ్గా లేచి, వెలుగును శాసించటానికి వేలుతో మీట నొక్కేరు. అది వెలిగి వారి అద్దాల కిటికీల్లోంచి బయటికూడా చేతులు చాచి వినయంగా ప్రకాశించింది.

ఆయన నిద్రా భంగానికి కారణాలు అర్థమైనాయి సాంబమూర్తిగారికి. అయినా కాని అసహనంగా కిటికీ తలుపులు తెరిచి కిందికి చూశారు, కింద పిగ్మీల్లా నేలబారు భారత పౌరులూ, వాళ్ళ నేపథ్యంలో గుజ్జెన గూళ్ళలా గుడిసెలూ కన్పించేయి. (ఇరవై సూత్రాల ప్రచారానికే ఇంత ముమ్మరంగా ఖర్చుపెట్టేరే ఇంకా ఆ గుడిసె లేవిటని ఆయనేం చింత పడలేదు. ఆ విషయంలో ఆయన సంతోషిస్తూనే వుంటాడు. ఆయనకి ఇరవై సూత్రాలూ కావాలి, గుడిసెలూ వుండాలి. ప్రభుత్వ కాంట్రాక్టులూ రావాలి, పన్జేయటానికి గుడిసెల మనుషులూ వుండాలి.)

అక్కడో గుడిసె ముందు అనేకమంది

రచయిత గురించి



నన్ను రచయితగా చేసింది మా హెడ్మాస్టరు శ్రీ కందుకూరి రామభద్రరావుగారు. నాలుగో ఫారం చదువుతున్నప్పుడు నాచేత కథ రాయించి దాశరధీ శతకమూ, చిన్న బెడ్ లేంపూ బహుమతిగా ఇచ్చేరు. ఆ తర్వాత ఏదో చిల్లర మల్లర ప్రేమ కథలు రాసినా అసలైన కథా రచన పదేళ్ల మౌనం తర్వాత 1973 ఉగాదికే. ఆ సంవత్సరం నా కథకు మొదటి బహుమతి యిచ్చి మళ్ళీ నాచేత రాయించింది 'రంజని' సాహితీ సంస్థ. ఆ సంస్థకీ, అప్పటి అధ్యక్షులు శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తిగారికీ కృతజ్ఞతలు.

గర్వించదగ్గ కథలు ఇంతవరకూ ఏం రాయలేదు.

—కె. కె. మీనన్.

గుమిగూడి సజీవాంధ్ర భాషలో సంభాషణ సాగిస్తున్నారు. (వ్యవహారిక పదజాలం గురించి తలలు బద్దలు కొట్టుకునే పడక్కుర్చీ పండితులంతా ఓ క్షణం ఇక్కడ నిలబడితే అధికార భాషకి అవసరమైన టెర్మినాలజీ బోలెడంత దొరికిపోదూ!) ఆ భాషలోని పదాలూ వాటి తాలూకు క్రియలూ అంటే సాంబమూర్తి గారికి చాల ప్రీతి. అయినా వినటానికి అసహ్యించుకుంటున్న వాళ్ళా ముఖం పెట్టి— (ఎవరూ అప్పుడు ఆయన్ని చూసే అవకాశం, అవసరం లేకపోయినా)

—పీకలదాకా గుడుంబా పట్టించినా యీ వెధవలకి నిద్రపట్టి చావదేం—అనుకున్నారు.

—పీకలదాకా తాగినా వాళ్ళకి నిద్రపట్టదు.

—ఓ పెగ్గే అయినా తను ఒళ్ళుమరిచి నిద్రపోగలడు—

—రాత్రంతా నిద్రపోకపోయినా తెల్లవారేక వాళ్ళు గునపం పారా చేతపట్టుకుని పన్లోకెళ్ళిపోగల్రు—

—ఓ గంట (మామూలు టైం కంటె) ముందు లేస్తేనే తనకు ఆ రోజంతా బుర్ర పనేయనే చేయదు—

ఈ వెధవ మెరిట్సూ, డి మెరిట్సూ ఎవడి క్కావాలి? ఆ రోజు తన పనంతా పాడై పోతున్నందుకే ఆయనకోపం.

కోపంవచ్చి, అక్కడ వాళ్ళనలా ఓ గౌరవ నీయుడి ఇంటి ముందు వుండనిచ్చినందుకు ప్రభుత్వాన్నీ మున్సిపాలిటీనీ నోరారా తిట్టాలని పెదాలు విప్పేడు. కాని అందుకు బాధ్యత తనదేనని గుర్తుకువచ్చి ఆగిపోయేడు.

వాళ్ళు కూలీలు—

తన ఆర్జనకు నిత్యం అవసరం అయ్యే ఇంధనం వాళ్ళ శక్తిలో దొరుకుతుంది.

—మార్క్స్ అఖండుడివోయ్! లేబర్, సర్‌ప్లస్ వాల్యూ-ఎక్స్‌ప్లాయిటేషన్—ఓహ్.

—తత్ ఇవన్నీ పద్దెనిమిదో శతాబ్దపు పాత సిద్ధాంతాలు—

ఇప్పుడు సూత్రాలమీద సూత్రాలు—వదులూ, పాతికెలూ సూత్రాలు—అన్ని సూత్రాలూ వాళ్ళకోసంవే—యస్. వాళ్ళ గురించేగా తను పడే యాతన. కూలి పుట్టిస్తున్నాడు. భృతి కల్పిస్తున్నాడు అవును. అందుకేగా అందుబాటులో వుండేందుకు ఉభయ తారకంగా యింటి ముందు ఖాళీ స్థలంలో గుడిసెలు వేయించేడు.

—ఎదురుగా వుంటారు. ఎంత పొద్దున్నే అయినా లేపి, అదిలించి; పన్లోకి తోలెయ్యవచ్చు—

—దగ్గర్లో వుంటారు. అవసరం పడితే అర్ధరాత్రీ, అపరాత్రీ పిల్చి చిన్నా పెద్ద పనులు వూరికే చేయించుకోవచ్చు—

కాని, వెధవ పీడ. తెల్లవార్లూ ఒకటే గోల

కింద

పిగ్మీల్లో ఓ మరు పిగ్మీ అలా ఆకాశం వైపు చూసినట్టు కిటికీ వైపు చూసేప్పటికి దొర దేవుళ్ళా రూపు కట్టేడు.

ఆ క్లిష్ట పరిస్థితిని దొర మాత్రంవే పరిష్కరించగలడనే పేరాశ కలిగింది ఆ సోషల్ పిగ్మీకి.

చేతులెత్తి దణ్ణం పెట్టేడు.

"దొరగారూ, కొట్టుకు సచ్చి పోతన్నారు. ఓ సెనం వినిపండి బాబూ" అని ఓ వరం కోరేడు.

కోరించే తడవుగా, 'కోరిన వరమీని వేల్పు' మేడ దిగి గేటుతీసి బైటకొచ్చేడు.

అయ్యగారు గేటు ముందు ప్రత్యక్షం కాగానే ఆశ్రిత జనం అంతా ఆయన ముందు కొచ్చి నిలబడ్డారు.

"ఏవిటీ గందరగోళం?" ముఖం చిట్లించి అడిగేరు సాంబమూర్తిగారు.

"దాని ఒల్లు కావరం సూడండి దొరా నిచ్చేపంలాంటి మొగుడుండగా సెందురిడిగాడి గుడిసెలో దూరింది."

ఫస్టురేట్ ఇన్ఫర్మేషన్ కాని సమగ్రం కాదు.

"ఎవరు?" అడిగేరు ఆసక్తిగా.

అంతలో జనం మధ్యలోంచి బాణంలా

దూసుకొచ్చి ముందు నిలబడ్డాడు వీరన్న. అతడు చాల ఆందోళనగా కన్పిస్తున్నాడు.

"సూడండి దొరా అది యిన్నాళ్లనించి తమరి లోగిల్లో పజ్జేత్తన్నది గందా, ఎప్పుడైనా యెకిలియేసాలు ఏసిందా సెప్పండి. సీతాలు అట్టాంటిదిగాదు. ఒక్కనాటికీగాదు. ఆడే ఆ గుడిసేటి ఆడే ఏమత్తు మందో జల్లి యెత్తుకుపోయాడు"

సీతాలు అచ్చం సీతమ్మ వారైనట్టూ, రావణ బ్రహ్మ సెందురిడి అవతారం ఎత్తి ఆమెను ఎత్తుకుపోయి గుడిసెలో దాచుకున్నట్టూ వాపోయేడు వీరన్న.

వీరన్న మాంచి పోతరించి వున్నాడు. సీతాలుకు కావల్సింది వీరన్నలో వీసమెత్తయినా తక్కువగా కన్పించలేదు సాంబమూర్తిగారికి. ఇన్నేళ్ళనించి ఎప్పుడూ సీతాలు కళ్ళలో వాంఛ కన్పించలేదు. మనిషి కొంచెం నలుపే ఐనా మంచి ఒడ్డూ పొడుగూ అందమైన ఒంపులూ, మగవాణ్ని సూదంటు రాయిలా లాగ్గలిగే సొంపులూ చాలా వున్నాయి. సీతాలు తలంటుకుని, పదిపైసల బిళ్ళంత కుంకుమ బొట్టు పెట్టుకుని ఎండలో తలార్చుకుంటుంటే ఆ వయసులో ఆయనకే అప్పుడప్పుడూ మనస్సు చలిస్తో వుంటుంది.

దొరవారు అలా ఆలోచనల్తో తేలిపోతూ వుంటే, ఇవతల వీరన్నకి యీ సమస్య బొత్తిగా ఆయన తలకెక్కనట్టు అనుమానం పొడకట్టింది.

"తమరు కొంచెం యీతలికి రండి దొరా మీకే తెలుత్తది" అని ఆయన చెయి పుచ్చుకోబోయి, తన అర్హతను మర్చిపోయినందుకు చిన్న బుచ్చుకుని, ఒక టార్చిలైటు మాత్రమే లాక్కుని ముందుకు నడిచేడు. అతని వెంట వెళ్లేరు సాంబమూర్తిగారు.

చంద్రన్న గుడిసె వీరన్నకి నాలుగైదు గుడిసెల అవతలవుంది. అక్కడ ఆగి టార్చి తలుపులేని గుడిసె లోపలికి ఫోకస్ చేసి—



"సూడండి దొరా.. ఉప్పుడు సూడండి " అన్నాడు.

లోపల సీతాలు బొంతెన కాళ్ళమీదు కూర్చొని ముఖం మోకాళ్ళలో దాచుకుంది. చంద్రన్న చాపమీద పడుకుని తనకేం సంబంధం లేనట్టు పైకి చూస్తున్నాడు.

"సూడు దొరా ఆ లంజకొడుకు ఏమీ ఎరగ నట్టు గుడిసెలో దూరి తొంగున్నాడు."

దొరగారి వెనకే మళ్ళీ అందరూ వచ్చేరు.

"దొరగా రొచ్చారు బైటికి రండిరా సెంద్రుడూ."

పిల్చేడో పెద్దమనిషి.

సాంబమూర్తిగారికి పరిస్థితి కూలంకషంగా అర్థమైపోయింది. ఆ వ్యవహారంతో తనకెట్టి సంబంధమూ లేదు. కలుగజేసుకోవల్సిన అవ సరంకూడా కన్పించదు. కాని సీతాలు, తన యింట్లో పన్జేసేపిల్ల ఇంత ఇమ్మోరల్‌గా బిహేవ్ చేస్తే తన ప్రిస్టేజికి మాత్రం భంగంకాదా!

"బయటికి రావే సీతాలూ" అన్నాడు అధి కారికంగా.

కొంతసేపు సీతాల్లో ఏమీ చలనంలేదు.

ఏమనుకుందో ఏమో కొంతసేపటికి లేచి గుడిసె గుమ్మందూరి బయటకొచ్చి తలొంచు కుని నిలబడింది.

"అర్ధరాత్రి వాడి గుడిసెలో నీకేం పనే."

సీతాలు వులకలేదు పలకలేదు.

"నిన్నే. ఎందుకెళ్ళావూ అనడుగుతున్నా" గద్దించేడు.

"అద్దరేతిరి ఆడది మొగోడి దగ్గిరి కెందు కల్దో తెలవదేటి?" ఎదురుప్రశ్న వేసింది సీతాలు.

"ఏంటే ఆ రల పొగురూ! ఎవరిముందు నుంచున్నావో తెల్టం లేదేంటె?" కసురు కున్నాడో కూలీ.

సాంబమూర్తిగారికి తిక్కరేగింది.

"సరిగా చెబుతావా తన్నమంటావా?" అన్నాడు.

ఈ కేకలికి మిగిలిన యిళ్ళల్లో జనంకూడా లేచి బయటికొచ్చేరు. మామూలు కూలీల గొడవలు వాళ్ళకు మామూలే. అంతగా పట్టించు కోరు. కాని కొత్త కంఠం విన్నాక వాళ్ళకి వుత్కంఠ పెరిగినట్టుంది.

వాళ్ళని చూశాక సాంబమూర్తి గారికి పౌరుషం మరింత పెరిగి చేతికర్ర పైకెత్తి ముందుకెళ్ళేడు.

వీరన్న సాంబమూర్తిగారికి అడ్డం వెళ్ళి. "కొట్టకండి బాబూ దానికేఁ తెలవదు" అని వేడుకున్నాడు.

జీసస్ అచ్చం ఇలానే అని వుంటాడు.

"చెప్పు " కర్ర నేలకికొట్టి గద్దించేడు సాంబమూర్తిగారు.

"సెప్పానుగదండి" అంది తలొంచుకునే.

"ఇలాంటి మొగుడుండగా వాడి దగ్గిరికెందు కెళ్ళేవు?"

మాట్లాళ్ళేదు సీతాలు. ఒట్టి పిచ్చిప్రశ్న అనుకుంది.

"చెప్పాలి?"

ఈసారి మెల్లిగా ముఖంఎత్తి సాంబమూర్తి గార్ని చూసింది. కాస్సేపాగి

"అనూరాదమ్మగారికి పండంటి డాట్టరుబాబు నిచ్చి పెళ్ళిసేసారుగందా, మరాయిన్నొదిలేసి ఎందు కెళ్ళిపోయింది?"

కొంచెం వెనక్కు తగ్గేడు సాంబమూర్తి గారు. అయినా ఏదో చెప్పాలి.

"దానికి యిష్టం లేకపోయింది. యిష్టమున్న వాణ్ని పెళ్ళాడించి" అన్నాడు.


"మీకేనా ఇష్టా యిష్టాలు మాకు లేవేంటి? యీరన్నంటే నా కిట్టంలేదు. ఇట్టమున్నోడి దగ్గిరి కెళ్ళిపోయాను. మీ కూతురు సేసుకున్నదీ పెళ్లే అయితే నాదీ పెళ్లే" అంది తెగేసి.

సాంబమూర్తిగారికి నోట మాటరాలేదు.

——తనకున్న ధనమూ, పలుకుబడీ ఒక సామాన్య స్త్రీముందు ఎందుకూ పనికిరాకుండా పోయేయి——

పక్కనెవ్వరో నవ్వినట్టు అనిపించి మరింత కృంగిపోయేడు.

"పెద్దోళ్ళ గొడవలు నీకెందుకే సీతాలూ" అన్నాడో ముసలికూలీ. సాంబమూర్తిగారే తగ్గటం చూసేప్పటికి సీతాలంటే అతనికి భయం పుట్టుకొచ్చింది.



"యేం పెద్దోళ్ళు లేసిపోతే పేమా, పేదోళ్ళు లేసిపోతే రంకూనా" అని మళ్ళీ ఓ బాంబు పేల్చింది.

ఎవరికీ నోట మాటరాలేదు.

సాంబమూర్తిగార్ని ఎవరూ ఎప్పుడూ ఎదిరించి ఎరగరు. ఆయనింట్లో పనిచేస్తూ వుండి కూడా సీతాలు అంత నిర్భయంగా దులిపేసేప్పటికి, అంతా మూగివాళ్ళయిపోయేరు. సాంబమూర్తిగారి పరిస్థితికూడా అదే. ఏమన్నా, ఏం చేసినా పరువు నిలిచేట్టు లేదు.

"ఛీ, వెధవ అలగా జనం" అనుకుంటూనే వెళ్ళిపోయేరు.

వెళ్ళిపోయి మంచంమీద ఒరిగేరు.

జరిగిందంతా ఏదో పీడకలలా అనిపించింది. గతం పగబట్టిన తాచులా పడగవిప్పి బుస గొట్టింది.

—ఒకే ఒక్క కూతురు అనూరాధ. ఆమె కోసమే తను అన్ని అవతారాలూ ఎత్తి సంపాదించేరు. డాక్టరు చదివించేరు. ఆస్తి బైటికి పోకుండా విదేశాల్లో డాక్టరై తిరిగొచ్చిన మేనల్లుడికిచ్చి పెళ్ళి చేసేరు. అతనికి అందం, ఐశ్వర్యం చదువూ—అన్నీ వున్నాయి. అన్నిటికంటె అతను అనూరాధని అమితంగా ప్రేమించేడు. ఆరాధించేడు. అయితేనేం ఆమెకు నచ్చలేదు. అతన్నెప్పుడూ కన్నెత్తి చూళ్ళేదు. తాకితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది.

—పై చదువు పేరుతో ఇంగ్లండు వెళ్ళిపోయింది అనూ. అక్కడే ఎవర్నో పెళ్ళిచేసుకుంది. చాలాకాలం వరకు అది వ్రణంలా తన్ను బాధపెట్టింది. తర్వాత అంతా మర్చిపోయేరు. మర్చిపోడానికి మరింతగా పనిలో మగ్నమై రెట్టింపు సంపాయించేరు—

సీతాలు రెండ్రోజులు యింట్లో పనికి రాకపోయేప్పటికి మున్సిపాల్టీవాళ్ళు సమ్మె చేసినంతగా బాధపడిపోయేరు వాళ్ళు. సీతాలు అంటే యింట్లో అందరికీ తగని యిష్టం. ఏ పనైనా చెప్పనక్కర్లేకుండా చక్కబెట్టుకు పోతుంది. ఆమె రాకపోయేప్పటికి ఎవరికీ కరచరణాలు ఆడలేదు. మరో పనిమనిషిని పెట్టుకోవాలంటే ఆ యింటావిడకి మనస్కరించనూలేదు. అంత జరిగేకకూడా ఆ యిల్లాలు సీతాలును వదులుకోలేకపోతోంది. మూడోరోజు పనికుర్రాణ్ణి పిల్చి,

"సెందిరిగాడి గుడిసె దగ్గరకెళ్ళి సీతాల్ని పిల్చుకురారా" అని పంపించింది.

వాడు వెంటనే తిరిగొచ్చి,

"అక్కడెవల్లూ పలకడం లేదండమ్మా" అని చెప్పేడు.

ఆమే స్వయంగా పిల్చింది.

"ఇక్కడండమ్మగారూ . ." అంటూ వీరన్న గుడిసెలోంచి బైటకొచ్చింది సీతాలు.

"పనికి రావటం లేదేమే" అనడిగింది.

"మొన్న అయ్యగార్ని ఏమేమో అన్నానండమ్మగారూ! మొకం సెల్లటంలేదు" అంది.

"ఏడిశావ్‌లే రా " అని తీసికెళ్ళింది యజమానురాలు.

ఇదంతా గమనిస్తూనే వున్నాడు సాంబమూర్తిగారు.

"మళ్ళీ మొగుడి దగ్గరి కెళ్ళిపోయావేంటే సీతాలూ" అనడిగింది ఇంటావిడ.

అవునని చెప్పింది సిగ్గుపడుతో.

"రొండు రోజుల్నుంచీ కూడూ-కూమ్మూ లేకండా గుడిసెలో తొంగుని ఏడుత్తుంటే తెలిసి యెల్లకుండ వుండలేకపోయానండమ్మగారూ! నన్ను సూడగానే బావురుమన్నాడండి. నువు లేకపోతే బతకలేనే సీతాలూ అని యేడ్చినాడండమ్మా నానూ ఆడదాన్నే. సెట్టంత మొగోడు నా కోసం యేడిసాడంటే ఆడికెంత పేముండాలి సెప్పండి"

"మరెందుకెళ్ళేవే?"

"యీరన్నకి నానంటే ఇంత మనసని యెరక్కపోయానమ్మా యెదవ పిచ్చమ్మా... యీడికాడ పిల్లలు పుట్టడం లేదనీ. " అని ఆగిపోయింది.

కాస్సేపుండి

"యెదవ పిల్లలెందుకు లెండమ్మగారూ మనసున్న మొగోడు...మల్లీ దొరుకుతాదేంటి!" అంది.

కూతురూ, మేనల్లుడూ మనసులో మెదిలేరు సాంబమూర్తిగార్కి. కూతుర్ని బతిమాలుతోన్న అల్లుడి రూపం కళ్ళముందు కట్టి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

అంకితం

నా కథపడ్డ ప్రతి పత్రికా కొని చదివి. ఎంతో శ్రద్ధగా తమ అభిప్రాయాలు వ్రాసే ఆప్తమిత్రులు శ్రీ వై. ఎస్. టి. సాయి గారికీ వారి కుటుంబ సభ్యులకీ——

——కె. కె. మీనన్ □

అమ్మ

వీరభద్రరావ్ పమ్మి

బీరు సీసా ఖాళీ అయిపోయింది.

కార్లోంచి బైటికి విసిరాను. కాలవలో పడింది.

వీరేంద్రనాథ్ ఓసారి కాలవకేసి చూసి, మళ్ళీ రోడ్డుకేసి చూశాడు.

'ఖాళీ సీసా నీట్లో మునుగుతుందా?—తేలుతుందా?'

'జీవితంకూడా అంతే—ఎప్పుడు ఎక్కడ మునుగుతుందో, ఎందుకు తేలుతుందో మనకి తెలియదు.

'ఏమిటీ ఆలోచనలు'

నాకే అర్థం కావడంలేదు. మనసు ఉల్లాసంగా వుంది. చల్లగాలి హాయిగా వుంది. వీరేంద్ర కార్ డ్రైవింగ్‌లో నిపుణుడు. స్పీడుగా పోనిస్తున్నాడు.

"భీమవరం ఎన్ని మైళ్ళుంది?"

నిశ్శబ్దాన్ని నేనే ఛేదించాను.

" వచ్చేది పిప్పర—అక్కడికి పన్నెండు మైళ్ళు."

స్టీరింగ్ వదిలి సిగరెట్ అంటించుకున్నాడు వీరేంద్ర.

"ఇంతకీ పెళ్ళెవరిది?" వీరేంద్ర అడిగాడు.

"అన్నపూర్ణని "

అంతకుమించి ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తెలియలేదు.

నాకు వెంటనే అన్నపూర్ణ మనస్సులో మెదిలింది—మనస్సు ఆర్ద్రమైంది.

నాకు వెనకటి రోజులు గుర్తొచ్చాయి. దారిద్ర్యం మమ్మల్ని పులిలాగా వెంటాడుతుంటే నేను, నాన్న, అమ్మ చెల్లి మేకపిల్లల్లాగ వణికిపోతూ పరుగెత్తిన రోజులు. పరుగెత్తి పరుగెత్తి అలసిపోయిన రోజులు—

నాకు శంకరం మామయ్య గుర్తుకొచ్చాడు. మనసు జుగుప్సతో నిండిపోయింది. క్షుద్ర దేవతను తల్చుకున్నట్టు ఉలిక్కిపడ్డాను.

గతమంతా బాధామయంగా, పీడకలలాగ అలిసిపోయిన ఆటలాగ అనిపించింది—కనిపించింది.

* * *

నాన్న స్కూల్ టీచర్. ..

నాన్న చిన్న ఉద్యోగి..

నాన్నకు నేనంటే ఇష్టం.

నాన్నకు నన్ను పెద్ద పొజిషన్‌లో చూడాలని వుంటుంది.

ఈ విషయాలు నేను చిన్నప్పుడే అంటే పదేళ్ళు రాకుండానే అర్థం చేసుకున్నాను.

నేను స్కూల్ ఫైనల్ స్కూల్ ఫస్టులో పాసైనప్పుడు నాన్న ఎంత ఆనందించాడో అంత ఆందోళన పడ్డాడు. నన్ను చదివించడం నాన్నకు ఆర్థికంగా సమస్య. నేనూ ఏ గుమాస్తాయో స్కూల్ టీచరో ఐపోయి జీవితాన్ని ఎక్కడికక్కడే కత్తిరించుకుంటూ బతుకుతానని ఆయన భయం—

★ యవ్వనంలో ఉన్న స్త్రీ పురుషులకు మధ్య కలిగేది కేవలం శారీరకవాంఛతో కూడిన ఆకర్షణే అయి ఉండాలన్నది రూలు కాదు. అంతకుమించిన అనుబంధం ఇద్దరి మధ్య నెలకొన్నప్పుడు—ఆ అనుబంధం అందించే అద్భుతానుభూతిని ఎలా వర్ణించగలం? ★

వెనక, ముందు, కుడి, ఎడమ బాగా ఆలోచించాడు. అప్పుచెయ్యడం ఆయనకు పెద్ద కష్టం కాదు. మంచి టీచర్‌గా సంపాయించుకున్న పలుకుబడిని, పేరుని పణంగా పెట్టి అప్పు పుట్టించగలడు—కాని తీర్చడం .ఎలా?

వారంపదిరోజులు తనలో తనే మధనపడ్డాడు. చివరికో రోజు నన్ను పిల్చి

"నేను చాలా ఆలోచించిన మీదట ఓ నిర్ణయానికొచ్చాను నాన్నా!"

నాన్న మాటల్లో నిస్సహాయత వుంది. తనేదో చెయ్యలేక పోతున్నాడని గిల్టీగా ఫీలవుతున్నాడు. ఆయన నా భవిష్యత్తు విషయం మాట్లాడుతున్నాడని నాకు అర్థమైంది.

"తెలివైన కుర్రాడివి చదివిస్తే జీవితంలో పై అంతస్థులు చూడగలవని నా నమ్మకం—అంతేకాదు నీకు సరైన దారిచూపించడం నా బాధ్యతకూడా."

నాన్న మాటలకి వెతుక్కుంటున్నాడు.

"మీరెలా చెప్పినా వింటా నాన్నా!" నేను ధైర్యం చెప్పాను.

"నాకు తెలుసురా—అందుకే నీ భవిష్యత్తు విషయం ఇంతగా ఆలోచిస్తుంట."

ఐదునిమిషాలు ఇద్దరం మాట్లాడలేదు.

"నేను వెళ్ళి రేపు మీ శంకరం మామయ్యతో మాట్లాడివస్తాను. నువ్వు వాళ్ళింట్లో వుండి చదువుకో—"

నాన్న మాటలు నాకు చాలా ఉత్సాహాన్నిచ్చాయి.

శంకరం మామయ్య, మా అమ్మస్వయానా అప్ప చెల్లెళ్ళ బిడ్డలు. అయిన భీమవరంలో ఉంటాడు. ఇల్లరికం వెళ్ళినందువల్ల ఆయనకు అత్తవారి ఆస్థి బాగా కల్సింది. ఆస్థి తెచ్చింది కనుక కనకం అత్తయ్యంటే మామయ్యకు గౌరవాభిమానాలేగాక, భయభక్తులు కూడా వున్నాయి. వాళ్ళింట్లో అన్ని విషయాల్లోను అత్తయ్యమాటే నెగ్గుతుంది. సాగుతుంది.

నాన్న నా విషయం, అత్తయ్యతో మాట్లాడాడో మామయ్యతో మాట్లాడాడో నాకు తెలియదు. భీమవరం నుంచి చాలా సంతోషంగా తిరిగొచ్చాడు.

"శంకరం మామయ్య దేముడురా—నిన్ను వాళ్ళింట్లో పెట్టుకోడానికి ఒప్పుకున్నాడు"

నాన్న ఆనందంగా చెప్పాడు.

వివరాలన్నీ ఆయనే చెప్పాడు.

నేను శంకరం మామయ్యగారింట్లో ఉండి పి. యు. సి చదువుకోవాలి. నన్ను వాళ్ళింట్లో అట్టేపెట్టుకున్నందుగ్గాను నాన్న ప్రతినెల వాళ్ళకి డెభై రూపాయలివ్వాలి—పేయింగ్ గెస్టు పద్ధతి—

అదిగాక నాన్న నా ఖర్చులకి మరో ఇరవై రూపాయలిస్తానన్నాడు.

అంటే మొత్తంమీద నాన్నకు నావల్ల నెలకు తొంభై రూపాయల ఖర్చు. అక్క పెళ్లి కోసం నాన్న చేసిన అప్పు తీర్చలేక ఇప్పటికీ వడ్డీలు కడుతూనే ఉన్నాడు. నన్ను పెద్ద పొజిషన్‌లో చూడాలంటే నాన్న, అమ్మ, చెల్లి కొన్నేళ్ళపాటు ఓ పూట భోజనం త్యాగం చెయ్యాలి.

నా అభ్యంతరాల్ని నాన్న వెనక్కి నెట్టేశాడు.

నేను భీమవరం ప్రయాణమయ్యాను.

శంకరం మామయ్య నాన్న చెప్పినట్టు దేవుళ్లా కనబడ్డేదు—కనీసం ఆయన్ను కట్టుకుందనైనా అత్తయ్య దేవతలా కనబడ్లేదు.

వాళ్ళకు బోలెడంత డబ్బు, ఆస్థి వున్నాయి.

కాబట్టి ఉందన్న గర్వం బాగావుంది.

మాకు ఆస్థిలేదు—డబ్బులేదు.

అందుచేత మేమంటే వాళ్ళకి నిరసన భావం వుంది.

ఈ రెండూ వాళ్ళ మాటల్లో అడుగడుగునా ధ్వనిస్తాయి.

అటువంటి వాతావరణంలో పుట్టి పెరిగారు కనుక వాళ్ళ పిల్లలక్కూడా అంతులేని అతిశయంవుంది. వాళ్ళంతా నన్ను ఓ బ్రూట్ కింద పల్లెటూరి వాడి కింద, వాళ్ళ పంచన బతుకుతున్న వాడికింద జమకట్టి మాట్లాడేవారు. ఆ ఇంట్లో నేను మెచ్చిన నాకునచ్చిన వ్యక్తి అన్నపూర్ణ

అన్నపూర్ణకి ఆ ఇంట్లో చద్దన్నం కోసం పనిచేసే పని పిల్లకున్న హోదావుంది. ఆమె నిజంగా పనిపిల్లలాగే పనిచేసేది. ఆమె సాధారణంగా చద్దన్నమే తినేది.

ఆమెకు పద్నాలుగేళ్ళుంటాయి.

ఆమె కనకం అత్తయ్యకు చాలా దూరపు చుట్టాలమ్మాయి. రెండో ఏట తండ్రిని పదో ఏట వంటలుచేసి బ్రతికే తల్లిని పోగొట్టుకుంది. ఆమె దిక్కులేనిది. "దిక్కులేని పిల్లకదాని" కనకం అత్తయ్య చేరదీసింది. ఆమె దినచర్య చూస్తే నాకు జాలి, ఆశ్చర్యం ఒక్కసారే కలిగేవి.


ఉదయమే లేచి గిన్నెలు తోమడం, కాఫీలు పెట్టడం, వంట చెయ్యడం, వడ్డించడం— మళ్ళీ సాయంత్రం. ఇంట్లో వంట మనిషి గాను, పనిపిల్లగాను అన్ని పనులూ తనే చేసేది. ఎంతచేసినా ఆమెక్కావల్సిన ఆదరణ, అభిమానం ఆ ఇంట్లో శూన్యం. ఏ రోజూ అత్తయ్యచేత తిట్లు చివాట్లు దెబ్బలు తినేది.

ఆమంటే నాకు జాలితో కూడిన ఇష్టం ఏర్పడింది. ఇంత చేసినా ఆమె తినేసరికి అన్నం వుంటుందో, లేదో అనుమానమే — అత్తయ్య బియ్యం దగ్గర్నుంచి అన్నీ కొల్చి ఇచ్చేది. అంత డబ్బున్నా అత్తయ్యా, మామయ్యా చూపించే పిసినారితనం, లేకితనం చూసి నాకు అసహ్యం ఏర్పడింది.

మామయ్యగారింటికి కాలేజీ దూరం కాబట్టి తొమ్మిదింటికల్లా పచ్చడి, మజ్జిగ వేసుకుని తిని కాలేజీకి వెళ్ళిపోయేవాణ్ని. మధ్యాహ్నం కర కర ఆకలేసేది. హోటల్లో పడి తినేంతటి తాహతు నాకు లేదు. డబ్బులుంటే మొక్కజొన్న పొత్తులు, జాంకాయలు తిని కడుపు నింపుకునే వాణ్ని. సాయంత్రం ఇంటికివచ్చి ముఖం కడుక్కుని మళ్ళీ సుదర్శనంగారింటికి ట్యూషన్‌కి వెళ్ళేవాణ్ని.

సుదర్శనంగారు మా లెక్చరర్. ఆయన నన్ను, నా తెలివితేటల్ని మెచ్చుకొనేవారు. డబ్బు తీసుకోకుండా నాకు ట్యూషన్ చెప్పేవారు. అది ముగించుకుని ఇంటికొచ్చేసరికి రాత్రి పది.

అన్నం తిందామని వంటింట్లోకి వెడితే ఎలా గ్రహించేదో — అన్నపూర్ణ వచ్చేది. తనే వడ్డించి నేను తినే వరకూ ఎదురుగా కూర్చునేది.



తన కష్టం చెప్పుకోడానికి నేనే దిక్కు. ఆమెను ఊరడించి, ధైర్యం చెప్పి పంపేవాణ్ని. ఆమె నా కళ్ళముందు కన్నీళ్ళెట్టుకుంటే నాకే మిటో గుండెలో కెలుకుతున్నట్టనిపించేది.

ఆమెకు ఎంత ధైర్యం చెప్పినా, ఆమె పరిస్థితి నాకే బాధకలిగించేది. నేనక్కడ మహా వుంటే కొన్నేళ్ళు. కాని ఆమె

ఆ ముళ్ళ కంచెలమధ్య, ఆ పాషాణ హృద యాల మధ్య ఈ సెల్లాంటి వాళ్ళ మాటలు భరిస్తూ, వాళ్ళ నిరసన సహిస్తూ—అనాదరణను శిరసావహిస్తూ .లేని సహనాన్ని తెచ్చుకుని-జీవించడంకోసం-కేవలం తిండికోసం ఎన్నాళ్లు? ఎన్నాళ్ళు? ఎన్నాళ్ళు?

భగవాన్! మనిషికి ప్రాణంపోసి పుట్టించి, అది నిలబెట్టుకోడానికి ఎంతబాధ, ఎంత యాతన, ఎంత పోరాటం, కల్పించావ్—

ప్రతి రాత్రి నేను అన్నపూర్ణ గురించి ఆలోచించేవాణ్ని.

సమస్య పెద్దది ..ఓ మనిషి జీవితం—

పరిష్కారం ...శూన్యం.

ఆమెకు ధైర్యం చెప్పడం తప్ప ఏమీ చేయలేను.

నాకే వాళ్ళింట్లో పొందే ట్రీట్‌మెంట్ చూస్తే అసహ్యం వేసేది. అంతలోనే "ఎల్లాగో అల్లా కాలక్షేపం చెయ్యి నాన్నా!" అని నాన్న చెప్పే హిత వచనాలు జ్ఞాపకం వచ్చేవి. ఆయన నాకోసం, నా భవిష్యత్తు కోసం పడేబాధ, ఆరాటం గుర్తుకొచ్చేవి. ఐదునెలలు గడిచాయి—

నాకు అస్తమానం రాత్రిళ్ళు దగ్గువచ్చేది. అందుకని కాఫ్‌సిరప్ కొని అట్టిపెట్టుకునే వాణ్ని. ఓ రాత్రి నన్ను మామయ్య నిద్రలేపి తనకి దగ్గొస్తూందని మందు కావాలని అడిగాడు. గూట్లో వుంది తీసుకొమ్మన్నాను. ఓ వారం తర్వాత నాకు మళ్ళీ దగ్గు ప్రారంభమయ్యింది. తీరా చూస్తే సీసాలో సిరప్ అంతా అయి పోయింది. కొనుక్కోడానికి డబ్బులేదు. రాత్రిళ్లు ఊపిరి అందనంతగా దగ్గు వచ్చేది. మామయ్య దగ్గరకెళ్ళి మందు కొనమని అడిగాను.

ఆయన కొనలేదు.

రెండో రోజు అడిగాను.

"నువ్వు ఇంట్లో పడి తినడం లేదురా— నాలుగు చెంచాల మందు వాడుకుంటే కొని మ్మని నిలదీస్తున్నావ్—" అన్నాడు.

ఎంత దరిద్రం అనుభవించినా ఫరవాలేదు. వ్యక్తిత్వం చంపుకుని బతకూడదు—అని పించింది.

నెలకి డభై రూపాయలు తీసుకుంటూనే ఎంత నిరసనగా మాట్లాడాడు.

వాళ్ళింట్లోంచి బైటకువెళ్ళి పోవాలని నిర్ణ యించుకున్నాను. వేరే రూంలో ఫ్రెండ్‌తోపాటు ఉండి వండుకు తినాలని నిశ్చయించుకున్నాను.

అన్నపూర్ణను ఒక్కదాన్నిఆ చిరుతపులుల మధ్య వదిలిపెడుతున్నానన్న బాధ తప్ప నాకు వేరే బాధనిపించలేదు. నేను వుండీ ఆమెకు చెయ్యగల్గిందేం లేదు——మాట సాయం తప్ప.

మర్నాడే ఆ ఇంట్లోంచి వెళ్ళిపోయాను.

తర్వాత కాలం చకచక సాగిపోయింది.

మెరిట్ స్కాలర్‌షిప్పులతోటి, మా వూళ్లో ఇద్దరి ముగ్గురి సాయంతోటి ఎం. ఎ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. బాంక్‌లో ఆఫీస ర్‌గా ఉద్యోగం వచ్చింది. సంవత్సరం తిర గ్గానే ఛీఫ్ ఆఫీసరయ్యాను.

వారం క్రితం అన్నపూర్ణ పెళ్ళంటూ మామయ్య రాసిన ఉత్తరం అందుకుని వెంటనే తాడేపల్లి గూడెంలో మా బాంక్ మానేజర్ వీరేంద్రకు ఫోన్‌చేసాను.

అతన్నాకు మంచి స్నేహితుడు కూడా.


వాళ్ళింట్లో ఓ రోజు వుండి అతని కారులోనే భీమవరం బైల్దేరాను.

* * *

"ఎక్కడ పెళ్ళి—" వీరేంద్ర అడిగాడు.

చెప్పాను.

మరో పది నిముషాల్లో మా కారు ఆ గుడి ముందు ఆగింది. శంకరం మామయ్య నన్ను చాలా ఆదరంగా ఆహ్వానించాడు. నా కోసం



అక్కడికి వచ్చిన మా బాంక్ మానేజర్స్ నా ఫ్రెండ్స్ అంతా నన్ను చుట్టుముట్టేశారు.

"వీడు మా ఇంట్లోవుండి చదువుకున్నాడు, ఇంత పెద్ద వాడయ్యాడు—ఇప్పుడు రెండు వేలు జీతం" మామయ్య అందరికీ గర్వంగా చెప్పుకుంటున్నాడు.

పెళ్ళి మంటపంలో పెద్దగా జనంలేరు.

కొద్దిసేపు పోయాక నన్ను ఒంటరిగా కూర్చోపెట్టి తన బాధలన్నీ చెప్పుకున్నాడు మామయ్య.

తనకూతురు జలజను పెళ్ళి చేసాట్ట. అల్లుడు కట్నం సొమ్మంతా తాగేశాట్ట. డబ్బు పట్ర మ్మని పెళ్ళాన్ని తన్ని అస్తమానం పుట్టింటికి పంపేస్తూంటాడట. కొడుకు లెవ్వరికీ చదువులు అబ్బలేదట.

మామయ్యమీద జాలేసింది.

స్వతహాగా ఆయన మంచివాడే—

ఆస్థి, అత్తయ్య కలిసి ఆయన్ను పాడు చేసారు.

అల్లుడికి బాంక్‌లో ఉద్యోగం ఇప్పించమని అడిగాడు.

పెళ్ళిపీటలమీద కూర్చున్న అన్నపూర్ణను సుమారు ఏడేళ్ళ తర్వాత చూశాను. గుర్తుబట్టలేనట్టుగా వుంది. వెయ్యి నూటపదహార్లు కట్నమిచ్చి మామయ్యే ఆ పెళ్ళి చేస్తున్నాడు. కుర్రాడు ఇంటర్ పాసయ్యాడు.

. అన్నపూర్ణ పెళ్ళి బట్టల్లో నిండుగా అందంగా వుంది. అత్తయ్య, మామయ్య నాకు తెగ మర్యాదలు చేస్తున్నారు.

పెళ్ళి పూర్తయింది.

పెద్దలందరికీ దణ్ణాలు పెట్టిస్తూ పురోహితుడు దంపతుల్ని నా దగ్గరకు తీసుకొచ్చాడు.

"జ్ఞాపకమున్నానా?" ఆప్యాయంగా అడిగాను.

"భలేవాడివి-ఎలా మర్చిపోతాను" నవ్వుతూ అంది అన్నపూర్ణ.

కుశలప్రశ్న లయ్యాక ..

"అన్నట్టు మామయ్యగారింట్లో వున్నప్పుడు నిన్నో ప్రశ్న అడగాలనుకునేవాణ్ని. అప్పట్లో అడగలేదు—తర్వాత ఎన్నోసార్లు నువ్వు జ్ఞాపకంవచ్చినప్పుడల్లా ఆ ప్రశ్నకూడా జ్ఞాపకం వచ్చేది. ఇప్పుడడగనా?"

"అడుగు—"

"నేను రోజూ రాత్రి ట్యూషన్ పూర్తయి యింటికొచ్చాక నువ్వు అన్నం పెట్టేదానివి—గుర్తుందా?"

"ఉంది."

"అప్పుడు నాకు చిన్న పళ్ళెంలో అన్నం పెట్టేదానివి. అది నాకు సరిపోయేది కాదు— ఒకవేళ మామయ్యగారింట్లో వాళ్ళకి ఎవరికేనా ఎక్కువ ఆకలేసి ఇంకా స్త ఎక్కువ అన్నం తింటే నాకు అదికూడా మిగిలేదికాదు— అవునా?"

ఆమె మొహంలోకి ఆత్రంగా చూశాను.

అన్నపూర్ణ చిరునవ్వు నవ్వి — తలొంచు కుంది.

"ఫరవాలేదు చెప్పు పూర్ణా!" - రెట్టించాను.

"ఆ పళ్ళెంలో అన్నం నీకు వేరే తీసిపెట్టి ఏమన్నా మిగిత్తే నేను తినేదాన్ని."

ఎవరో నా గుండెను రంపంతో కోస్తున్నట్టని పించింది. వెంటనే నాకు మా అమ్మ గుర్తు కొచ్చింది.

నా చిన్నతనంలో మేం దరిద్రం అనుభవిస్తు న్నప్పుడు మా అమ్మ పస్తులుండి నాకూ, చెల్లాయికి అన్నం పెట్టేది. కాని—అమ్మకు సాంఘికంగానో, నైతికంగానో ఓ బాధ్యత వుంది. ఆమె నన్ను మోసి, కని పెంచింది - రక్తం పంచుకు పుట్టేను.

కాని—అన్నపూర్ణకు

ఆమెలో నాకు అమ్మలాంటి దేవత కనిపిం చింది. జేబులోంచి చెక్‌బుక్ తీసి అంకె వేసి సంతకం చేసి ఆమె చేతిలో పెట్టాను.

ఆమె నా కాళ్ళకు దణ్ణం పెట్టింది.

అసలు నేనే ఆమెకు దణ్ణం పెట్టడం సమంజసమేమో ననిపించింది.

"మీ పేరు ఏమిటి బాబూ!"

పురోహితు డడిగాడు.

చెప్పాను.

"రామచంద్రగారు పెండ్లి కుమార్తెను ఆశీర్వదించి ఇచ్చినవి రెండువేల రూపాయలు."

మంటపం దగ్గర కూర్చుని ఎవరితోనో మాటలాడుతున్న మామయ్య నాకేసి ఆశ్చ ర్యంగా చూశాడు.

"పదిహేనురోజులు పోయాక నాకు ఉత్తరం రాయండి. ఈ వూళ్ళో మా బాంక్‌లో అటెం డర్‌గా ఉద్యోగం వేయిస్తాను."

అన్నపూర్ణ భర్తకి నా విజిటింగ్ కార్డందిం చాను.

అక్కడికి వస్తూ నా మాటలు విన్న అత్తయ్య నా ముఖంలోకి చూసింది—ఆమె చూపుల్లో అసూయ, జుగుప్స వున్నాయి.

నేను అన్నపూర్ణ ముఖంలోకి చూశాను. ఆమె ముఖంలో ఆప్యాయత, ఆనందం, కృత జ్ఞత వున్నాయి.

నా గుండెల్లో ఏదో సంతృప్తి నిండుకుంది.

□

ఈ కథకు సిగ్గే లేదు!

పాలకోడేటి సత్యనారాయణరావు

చందు సోంబాబు

అలంకార్ టాకీసు దగ్గర రిక్షాదిగి చేతి గడియారంలో టైమ్ చూసుకొన్నాను.

ఎనిమిది దాటింది.

పన్నెండున్నరకిగానీ మద్రాసునుంచి హైదరాబాద్ పోయే రైలురాదు. అంటే సుమారు నాలుగు గంటల పైగా నేను బెజవాడలో కాలక్షేపం చేయాలి.

సిగరెట్ వెలిగించి ఆ సందు మొదట్లో నించున్నాను.

రెండు పెగ్గులు బిగించి చికన్ బిర్యానీ కొట్టడంతో వళ్ళు తిమ్మిరి తిమ్మిరిగా ఉంది. ఇప్పుడు నా మనసూ, మనసులోని కోరికా ఆ సందులో ఉన్నాయి.

మెల్లగా కదిలాను.

కాలవగట్టు పక్కగా అన్నీ గుడిసెలు.

"ఏయ్. ఇదుగో నిన్నే ....అమ్మాయి కావాలా?" ఓ గుడిసె ముందునుంచి ఆహ్వానంతో పాడిన పిలుపు వినబడింది. కానీ నేను తలెత్తి చూడలేదు.

"కొత్తమ్మాయి ఉంది. రా నిన్నే."

"పిలిచేది నిన్నుకాదూ? ఓసారి చూసెళ్ళు"

ఆహ్వానాలని అందుకొంటూ ముందుకు నడుస్తున్నాను. నాకు కొత్త. ఆగి మాట్లాడాలని ఉన్నా మాట్లాడలేకపోతున్నాను.

కాలవగట్టు కెదురుగా ఓ డాబా ఇంటిపైన నా చూపు పడింది. దీపం వెలుగులో తలుపు చాటుగా ఓ మెరుపు మెరిసి మాయమైంది.

"ఏమిటి దిక్కులు చూస్తున్నావు.కావాలా?" ఎవడో పక్కగా వస్తూ అడిగాడు. వాడి దగ్గర గుప్పుమని సారా కంపు కొట్టింది. వాడికి ఏ విధమైన సమాధానం చెప్పలేదు.

మనసులో కోరిక కాలిపోతోంది. గుండె అదురుతోంది. రోడ్డుమీద జనం ఎక్కువగా ఉన్నారు. ప్రతి గుడిసె ముందు, ప్రతి ఇంటి ముందునించి జనాన్ని పిలుస్తున్న వ్యభిచారిణుల గొంతులు వినబడుతున్నాయి.

అంతమంది చూస్తుండగా ఏదో ఒక ఇంట్లోకి వెళ్ళాలంటే నాకు సాధ్యంలా అనిపించలేదు.

రోడ్డు చివరిదాకా పోయి వెనక్కి తిరిగాను. సిగరెట్ కాలుస్తూ నడుస్తున్నాను.

"రోడ్డుమీదనుంచి పచార్లు చేయకపోతే రారాదూ? చిన్నమ్మాయి ఉంది బాగానే ఉంటుంది" పిలిచిందో మనిషి.

మనసు దిటవు చేసుకొని ఓ క్షణం ఆగాను. ఆ మనిషికేసి చూశాను. నల్లగా జీబిరి జుట్టుతో దెయ్యంలా ఉంది. వయసు నలభై పైగా ఉంటుంది. అదో చిన్న గుడిసె ముందు నించునుంది. నాలాంటివాడు అందులోకి దూరడం చాలా కష్టం. అందునా నేను ఆరడుగుల మనిషిని. నేను నించోడానికిగానీ, పడుకోడానికిగానీ ఏ విధంగానూ పనికిరాదు. కాలవ ఒడ్డునే కాలవలోకి ఒరిగిపోతున్నట్టుగా ఉంది ఆ గుడిసె. గొంతు పెగుల్చుకొని

"ఏదీ?" అన్నాను.

"ఉంది. లోపలికి రా" అంది దెయ్యం.

★ ఆ పిల్లని రహస్యంగా ఇంట్లోంచి గదిలోకి తీసుకురావాలి. ఇంట్లో వాళ్ళకి తెలీకుండా ఏదో బిజినెస్ రహస్యంగా మీలాంటి వాళ్ళతో చేసుకుంటోంది.నలుగురికీ తెలిస్తే ఎలా? చదువుకొంటున్న పిల్లకదా మరి? ఈ కథకు సిగ్గేలేదు. ★

"లోపల ఎవరూ ఉన్నట్టులేరు" అనుమానంగా అడిగాను.

"ఏం, నేను మనిషిని కాదా?" అంది దెయ్యం.

"నువ్వా!" అన్నాను.

"రెండు రూపాయలివ్వు. శుభ్రంగా ఉంటాను" అంది.

"అక్కర్లేదు" అన్నాను.

"ఆరడుగులున్నావే ఎందుకూ ఏడవటానికి. ఆడది పిలుస్తుంటే పోడానికి సిగ్గేయడం లేదూ?" అంది.

దాంతో మాట్లాడిన రెండు మాటల్తో నాలోని కోరిక సహం చచ్చిపోయింది.

"పోనీ రూపాయివ్వు పద" అంది నాచేతిని పట్టి గుంజుతూ.

కంగారుగా నడవబోయాను. నా చేతిలోని సిగరెట్ పెట్టె లాక్కుని పకపక నవ్వుతోంది. దాని పీక పిసికి చంపేసి కాలవలో పడేయాలనిపించింది నాకు.

నడుస్తున్నాను నేను. చేతి గడియారంకేసి చూశాను. తొమ్మిది దాటుతోంది.

డాబా ఇంటి ముందు కొచ్చాను. తలుపు చాటుగా నించున్న భామ వయ్యారంగా చూస్తూ నన్ను లోపలకి రమ్మన్నట్టుగా సైగచేసి తప్పుకొంది.

ఆ డాబా పక్కనే చిన్న బడ్డీకొట్టు ఉంది. దానిపైన ఓ అమ్మడు కూర్చొని బేరాలు చేస్తోంది. కొట్టుముందు ఓ నలుగురైదుగురున్నారు. ఆ ఇబ్బందికి తోడుగా ఇంటిముందు అరుబైట మంచంపైన ఓ ముసలిది కూర్చొనుంది. ఎవడో బాగా తాగి దానితో ఏదో తెగ వాదిస్తున్నాడు. నేను బయలుదేరిన వేళా విశేషం మంచిది కాదనిపించింది.

హైదరాబాద్‌లో ఇలాంటి అవకాశాలు చాలా తక్కువ. అదీకాక నా కిలాంటి విషయాల్లో బొత్తిగా అనుభవంలేదు. పైగా నేనింకా పెళ్ళి కాని కుర్రాడ్ని. వయసుని అదుపులో పెట్టుకోలేక ఆ సందులో అడుగు పెట్టాను. అడుగు లేస్తున్నాను? నాకు తెలీదు, సత్యం చెప్పాడు

"ఎలాగూ బెజవాడ వెళ్తున్నావు కనక ఓసారి అలంకార్ టాకీసు సందులోకి వెళ్ళిరా" అని.

"ఎలాగైనా ఆ డాబాలోకి వెళ్ళాలి" నిశ్చయించుకొన్నాను.

దీపం వెలుగులో క్షణకాలం నా కళ్ళ ముందు మెరిసి మాయమైన ఆ పిల్ల అంద చందాలు నన్ను కట్టేస్తున్నాయి. అలాటి వాడలో అంత అందమైన పిల్ల దొరుకుతుందని నేను కలలో కూడా అనుకోలేదు.

న్యూ ఇండియా హోటల్‌వరకూ పోయి టీ తాగివస్తే అరగంట గడుస్తుంది. ఈ లోగా ఆ ఇంటి ముందు రద్దీతగ్గితే రావచ్చని ముందుకి కదిలాను.

న్యూ ఇండియా హోటల్లో టీ తాగుతూ కూర్చున్నాను.

—నాకు నీలమణి గుర్తుకొచ్చింది.

నీలా, నేనూ ఒకేచోట పనిచేస్తున్నాము. నీల నాతో చాలా చనువుగా ఉంటుంది. ఇద్దరం కలిసి పార్కులకీ, సినిమాలకీ వెళ్తుంటాము. ఆఫీసులో నీలా, నేనూ పెళ్ళిచేసుకొంటామని చాలామంది ఓ అభిప్రాయాని కొచ్చేశారు. అఫ్‌కోర్స్ నాకున్న అభిప్రాయం అదేను. అయితే నీలతో ఆ సంగతి నేనెప్పుడూ చెప్పలేదు. నీలకి నేనంటే చాలా ఇష్టం అని నాకు తెలుసు. తన మాటలవలన, చేతలవలన నాకు తెలుసు 'నీల నన్ను ప్రేమిస్తూంది.'

లంచవర్లో కలిసి టిఫిన్, కాఫీ తీసుకోడం, సాయంత్రం అయిదు తర్వాత కలిసి కోఠీ వరకూ వెళ్ళి కామత్‌లోనో, తాజ్‌లోనో కాఫీ తాగి ఏ సినిమాకో, పార్కుకో వెళ్ళి కబుర్లు చెప్పుకోడం మాకు అలవాటు. ఎవరో ఏదో అనుకొంటారని నీల భయపడదు. చేసే పనిని నిర్భయంగా చేయాలంటుంది. నీల వ్యక్తిత్వం అంటే పడిఛస్తుంది. తను మాటపడదు. ఒకళ్ళని లెక్కచేయదు. స్వతహాగా నేను చిలిపివాడిని. అడదపాడపా నేను ఏదన్నా చిలిపి పని చేయబోతే చిరునవ్వుతోనే వారిస్తుంది. ఓసారి

సినిమా హాల్లో చొరవచేసి నీలని ముద్దుపెట్టుకొన్నాను.

"పిచ్చి వేషాలువేస్తే నేను వెళ్ళిపోతాను ఏమిటిది?" అంది తీక్షణంగా.

చేసిందేమిటో తెలిసీ ఏమిటని అడిగితే ఏం చెప్పగలను? అయినా నేను చేసింది తప్పని నాకు తెలుసు. కానీ నాలో అహంభావం అడ్డురాగా నీలమణికేసి అదోలా చూసి సినిమా హాల్లోంచి బయటి కొచ్చేసాను. ఆ తర్వాత రెండ్రోజులు నేను నీలతో మాట్లాడలేదు. తనని కలవలేదు. నాలుగోరోజు తనే కబురుచేసింది.

లంచవర్లో వెళ్ళాను.


రౌడీ. తర్వాత నీ ఇష్టం" అంది.

"నీలమణితో వీడికి స్నేహం అవుతుంది. పాపం ఆ పిల్లకేమో ఓ రౌడీ తమ్ముడున్నాడు. అంచేత వీడ్ని వీడు రక్షించుకోవాలి కాబట్టి కనీసం ఆరడుగుల శరీరం అయినా వీడికుండాలనే దేవుడు నాకింత పర్సనాలిటీ నిచ్చాడు" అన్నాను.

"చాల్లే బడాయి నీ కిష్టమని పులిహోర తెచ్చాను, ముందు దీని సంగతేదో చూడు" అంది రెండు ప్లేట్లలో సర్దుతూ.

కాఫీ తాగుతుండగా అడిగింది.

"ఊరెళుతున్నావటగా?"



"ఏం, మొహాన్ని చాటేశావు?" అడిగింది.

నేను మాట్లాడలేదు.

"తప్పు చేయడం దేనికి మొహం చాటేయడం దేనికి?" అంది.

"అది తప్పుగా నేననుకోలేదు. నా హక్కుగా భావించాను" అన్నాను.

నీల నా కళ్ళలోకి అదోలా చూస్తూ నవ్వేసింది.

"అయితే నువ్వేం చేసినా తప్పు మాత్రం కాదంటావు" అంది.

"అవును."

"నీకు తెలీదేమో, మా తమ్ముడు పెద్ద

"అవును."

"తిరిగి రాక ఎప్పుడో?"

"ఎప్పుడు రమ్మంటే అప్పుడే వస్తాను."

"అసలెందుకు వెళ్తున్నట్టు!"

"పెళ్లి చూపులకి" అన్నాను కొంటెగా.

"నీమొహం నిన్నే ఆడపిల్ల చేసుకోదు".

"ఏం నేను అందంగా ఉండనా?" అన్నాను.

"అలాని అన్లేదే?"

"మరి?"

"మరో ఆడపిల్ల నిన్ను చేరడానికి ప్రయ

శ్ని స్తే నీలమణి ఊరుకొంటుందా?"

"ఏం చేస్తుందేమిటి?" అన్నాను.

"నా సంగతి నీకు తెలీదు. యు ఆర్ ఆల్ రెడీ కన్ఫైన్డు ఇన్ మై హార్ట్" అంది.

నేను తేలిగ్గా ఊపిరి పీల్చుకొన్నాను.

"విడుదల అయ్యే అవకాశం లేదా?" అన్నాను.

"లేదు" అంది మనోహరంగా నవ్వేస్తూ.

నీలమణి మనసు నాకు తెలిసింది. నాకు అదిచాలు. నా ఆలోచనలు నా సర్వస్వమూ అన్నీ తనే అని నాకు తెలుసు.

చేతిలో సిగరెట్ చురుక్కుమంది. తిరిగీ లోకంలో పడ్డాను.

టీ తాగి బయటికొచ్చాను.

అయిదు నిముషాల్లో సందు చేరుకొన్నాను. ఆ డాబా ఇంటిముందు నుంచి మనుషులు ఇంకా పోలేదు. ధైర్యంచేసి లోపలికి వెళ్ళవచ్చు. కానీ నేను ఊరికి కొత్త. మనసులో సంకోచంగా వుంది. నా ప్రయత్నం సాగదనిపించి నిరుత్సాహ పడ్డాను.

అంతలో ఓ రిక్షావాడు నా పక్కగా వచ్చి

"వస్తారా?" అడిగాడు.

"ఎక్కడికి?" అన్నాను.

"మీ రెక్కండి" అన్నాడు నవ్వుతూ.

నేను మాట్లాడకుండా రిక్షా ఎక్కేశాను. రిక్షా కదిలింది. కొంతదూరం పోయాక "ఎక్కడికి తీసుకెళ్తున్నావు" అని అడిగాను.

రిక్షా రోడ్డు పక్కగా మసకచీకట్లో ఆపాడు వాడు.

"హనుమాన్ పేటలో వుంది ఇల్లు. అమ్మాయి చదువుకుంటోంది. ఇంగ్లీషుకూడా మాట్లాడుతుంది" చెప్పాడు వాడు.

"ఎంత కావాలి?"

"యాభై తీసుకొంటుంది"

"సరే, పద" అన్నాను.

రిక్షా కదిలింది.

"ఏ ఊరు మనది?" అడిగాడు వాడు.

"హైదరావాడు"

"ఈ ఊరికి కొత్తని అనుకొన్నాను లెండి" అన్నాడు.

"ఎలా అనుకొన్నావు?"

"సందు మొదట్లో తారట్లాడుతుంటే అనుకొన్నాను. అయినా ఆ ఇళ్ళల్లోకి వెళ్ళక పోవడం మంచిదయింది."

"ఏం?" వాడినించి వివరాలు తెలుసుకోవాలని అడిగాను.

"అవన్నీ గుడిసేటి ముండలు. ఒట్టి రౌడీ మేళం బాబూ. మీలాంటోళ్ళు దొరికితే నిలువు దోపిడీ చేసేస్తారు. ఎదురు తిరిగితే నాలుగు తన్ని కాలవలోకి తోసేస్తారు."

వాడు చెప్పే మాటలు వింటుంటే నాగుండె దడదడలాడింది. అయినా దిటవుగా కూర్చొని అన్నాను.

"ఆఁ. వాళ్ళ మొహం. నన్నేం చేయలేరులే"

"మీకు పెళ్ళికాలేదా బాబూ?"

"లేదు" చెప్పాను.

"ఆ సందులో లంజలదగ్గరన్నీ రోగాలే. రెండు మూడు రూపాయలేకదా అని కక్కుర్తి పడితే రెండోరోజే డాక్టరు దగ్గరికి ఛావాలి."

రిక్షావాడికి చాలా అనుభవం వుందన్న సంగతి అర్థం అయింది నాకు.

"ఇంకా ఎంతదూరం?" అడిగాను.

"అదే సందు" అంటూ రిక్షా హనుమాన్ పేట దగ్గర పాతబ్రిడ్జి దగ్గర ఆపాడు. నేను సిగరెట్ ముట్టించి రిక్షా దిగాను.

"మీ రిక్కడే వుండండి" అని నన్ను సందు మొదట్లో నించోబెట్టి వాడు సందులోకి వెళ్ళాడు.

నేను టైం చూసుకొన్నాను. పది దాటుతోంది. ఓ పక్క విసుగూ, మరోపక్క ఆడదాని పొందుకోసం తహతహా. సిగరెట్ పొగని దట్టంగా పీలుస్తూ నించున్నాను ఎదురుచూస్తూ.

పది నిముషాల తర్వాత వాడు మరో మనిషితో కలిసి వచ్చాడు.

"వస్తాదు వచ్చాడు సార్" అన్నాడు రిక్షా వాడు.

రిక్షావాడితో పాటు కలిసి వచ్చినవాడి పేరు వస్తాదు అని గ్రహించాను.

వస్తాదు నాకేసి ఎగాదిగా చూశాడు. రాల్చి

పైజామా, మెళ్ళో స్కార్ఫ్ వుంది. చూడగానే బ్రోకర్‌గాడు అని తెలుస్తోంది.

"తెల్లవార్లు వుంటావా, గంట వుంటావా?" అడిగాడు.

"గంటకూడా అవసరం లేదు. అరగంట చాలు" అన్నాను మెల్లగా.

"సరే. డబ్బివ్వు" అన్నాడు.

"ఎంత?"

"యాభై తెల్లార్లు అయితే వంద" అన్నాడు.

నేను రిక్షావాడికేసి చూశాను. వాడు ఇవ్వమన్నట్లుగా చూశాడు.

పర్సుతీసి అయిదు పది కాగితాలు లెక్కపెట్టి వాడి చేతిలో పెట్టాను.

"ఇక్కడే వుండు. దాన్ని గదిలోకి తీసుకొచ్చి పిలుస్తాను" అని వెళ్ళాడు.

"ఓ సిగరెట్ పడేయండి" అన్నాడు రిక్షావాడు. సిగరెట్ తీసి ఇచ్చాను. అది ముట్టించి పాత గుడ్డతో రిక్షాని తుడవడంలో మునిగిపోయాడు వాడు.

మరో పది నిముషాలు గడిచినై. వస్తాదు రాలేదు.

"ఏమ్, వాడేడి?" అసహనంగా అడిగాను.

"ఆ పిల్లని రహస్యంగా ఇంట్లోంచి గదిలోకి తీసుకురావాలి. ఇంట్లో వాళ్ళకి తెలీకుండా ఏదో బిజినెస్ రహస్యంగా మీలాంటి వాళ్ళతో చేసుకుంటోంది. నలుగురికీ తెలిస్తే ఎలా?" అన్నాడు రిక్షావాడు. నా పక్కకి వచ్చి సందులోకి తొంగిచూసి

"అదుగో పిలుస్తున్నాడు వెళ్ళండి" అన్నాడు.

నేను కదలబోతుంటే


"మరి నాకు డబ్బియ్యలేదండీ" అన్నాడు.

"త్వరగానే వచ్చేస్తాను. లాడ్జికెళ్ళి అక్కడ్నించి స్టేషన్‌కెళదాం" అన్నాడు.

వాడు "సరే" అన్నాను.

నేను సందులోకి నడిచాను.

సందు చీకటిగా ఉంది. సన్నగా వున్న ఆ



మట్టి రోడ్డులో వందగజాలు నడిచాను. ఆ సందు ఎడంవేపుకి తిరిగింది. అక్కడున్న గుడిసెలు వెనకగా కాలువ. వస్తాదు జాడలేదు. మరి కొంచెం జాగ్రత్తగా చూస్తూ నడిచాను.

కానీ వాడు లేడు. ఆ వీధిలో వున్న కుక్క భౌ మని మొరుగుతూ నా పైకి దాడిచేయడానికి రెడీ అవుతోంది. నాకు అనుమానమొచ్చింది. గబగబ వెనక్కి తిరిగి వచ్చాను.

అక్కడ రిక్షావాడుకూడా లేడు.

జరిగిన మోసం నాకు అర్థమైంది. రిక్షావాడు పారిపోయాడు. డబ్బు తీసుకెళ్ళిన వస్తాదుగాడు మాయమైపోయాడు. ఊరు తెలీని నాలాంటి వెర్రివాళ్ళు వస్తే ఈ విధంగా దోపిడీ చేస్తారని గ్రహించాను. నాకు బాధకంటే కోపం ఎక్కువొచ్చింది. కానీ ఓ విధంగా చూస్తే గుడ్డిలో మెల్ల అన్నట్టు వాళ్లు మంచివాళ్ళే అనిపించింది. చేతికి వున్న రెండు ఉంగరాలు, గడియారం, మిగిలిన డబ్బు వదిలేశారు. గబగబ నడవడం మొదలుపెట్టాను.


నాకు నీలమణి గుర్తుకొచ్చింది. నేను చేసిందానికి సిగ్గుపడ్డాను. కాస్తలో తప్పిపోయింది. లేకపోతే నీలకి నేను తీవ్రమయిన ద్రోహం చేసినవాడ్నయిపోయేవాడిని. నీల నా ప్రాణం. నా ఊపిరి. నా సర్వస్వం. చాలా త్వరలోనే నీలతో నా జీవితాన్ని పంచుకోబోతున్నాను. నీల నా మనసులో ఉండటంతో అడుగులు ఉత్సాహంగా పడుతున్నాయి. ఎదురుగా రిక్షా వస్తోంది. నన్నుచూసి వెనక్కి తిప్పాడు. అనుమానంగా చూశాను. వాడు కాడు. ఆ పక్కగా రిక్షా తీసుకొస్తూ "వస్తారా?" అని అడిగాడు.

ఇది రాత్రుళ్ళు ఈ ఊళ్ళో జరిగే కొత్త రకం వ్యాపారం అన్న విషయాన్ని పూర్తిగా తెలుసుకున్నాను.

"అవసరం లేదు" అంటూ గబగబా అడుగులు వేశాను.

రిక్షావాడు నా వెనకే వస్తున్నాడు. నేను నవ్వుకొంటూ మెయిన్‌రోడ్డెక్కేశాను. □

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు   సెప్టెంబరు '78

అడ్డం

1. కోతి?
4. అసమగ్రాంధ్ర సాహిత్య చరిత్రంలో ఆరుద్ర దూడ.
7. సంక్రాంతి సందేశం.
8. స: తగ్గు: నవ్వు
10. శ్రీపాద వారి భారతం (పొడి అక్షరాలు)
11. తామరసాక్షి
13. లక్ష్మి
14. మానవ విపరిణామం. అరణ్యామా?
15. జాకీకి వేధించే చెట్టు
16. మిశ్రం ప్రాణ గొడ్డం
18. రాజుల సరదా
21. ముక్కాలు తెగిన ఉపశాఖ
22. రఘువంశం (రామాయణంకాదు)
24. ప్రహేళికకు విరుగుడు?
25. ఇది పెట్టేది ఇదే'

నిలువు

1. తరుచుకాదు
2. చేమిరి

3. ఆకాశవాణి చెప్పేది
4. దంచినమ్మకు బుక్కిందే.
5. కాపు మానిన పుస్తకాలు
6. తిరిగింది వెన్నెల రేయి
9. ఎక్కడ బృహదీశ్వరుడు? ఎక్కడ సరస్వతీ మహల్?
10. నటీమణినదికి ప్రమాదం
12. వేదాల్లో ఒక చెట్టు
15. ఉపనిషన్మధువు లొలికిన చోటు
17. శతపత్ర పత్రం
19. జింక
20. ఉజ్జయిని అక్క
22. పాముదయితే జాగ్రత్త!
23. దౌ ఉహం అన్నాడు భ.కా.రా.

ఆగస్టు పదబంధ ప్రహేళికకు సమాధానం :

అడ్డం. 1. వినాలని, 4. అనురాధ, 7. బడిపంతులు, 8. రకా, 10. అల్ల, 11. దమనం, 13. రకము, 14. కల్యాణి, 15. పానుపు, 16. కుత్తుక, 18. రావు, 21. గాలి, 22. రామాయణంలో, 24. తంబురాలు, 25. గిలగిలం.

నిలువు: 1. విశారద, 2. లబ, 3. నిడివి, 4. అతుకు, 5. నూలు, 6. ధమ్మిల్లము, 9. కామధేనువు, 10. అకస్మాత్తుగా, 12. శల్యాలు. 15. పారావతం, 17. కలికాలం, 19. కామాలు, 20. కోణంగి, 22. రారా, 23. లోల.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి సెప్టెంబరు 1వ తేదిలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్ల కాగితంమీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీ వొచ్చినపుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పైనెల బహుమతి సొమ్ముకు కలిపి అందిజేయబడుతుంది.

ఆగస్టు '78 పదబంధ ప్రహేళిక విజేతలు :

1. వి. రంగాచార్యులు, నల్గొండ. 2. ఎన్. కె. రామారావు, నల్గొండ. 3. ఎన్.సి.హెచ్. జగన్నాథాచార్యులు, కొత్తగూడెం, 4. ఆర్. శ్రీమన్నారాయణశర్మ, నల్గొండ. 5. కె. ముత్యాలు, ఏలూరు. 6. కె. జె. ఎమ్. కృష్ణారావు, ఏలూరు. 7. కె. విష్ణువర్ధనరావు, కూచిపూడి. 8. వి.బి.ఆర్. కృష్ణమూర్తి, శ్రీకాకుళం.9. వి. కార్తికేయి, శ్రీకాకుళం. 10. టి. వేణుగోపాల్, బరంపురం. 11. ఎ. వి. జి. కుమార్, శ్రీకాకుళం, 12. ఎమ్. నరసింహమూర్తి, వైజాగ్. 13. కె. ఎ. ఉషాకల్యాణి, ఏలూరు. 14. కే. జి. జయరామరెడ్డి, ఈ. తాండ్రపాడు. 15. ఎల్. ఎస్. ఎన్. శర్మ, రాయగడ. 16. ఇ. ఎన్. ఆచార్యులు, ఖర్గపూర్. 17. ఆర్. ఏ. పి. స్వామి, ఖర్గపూర్.—వీరందరికి బహుమతి మొత్తాన్ని పంచి పంపిస్తున్నాము.

పలురంగాలలో ఆంధ్ర ప్రముఖులు



శ్రీ మల్లాది హనుమంత అవధాని

సదరన్ పెట్రోకెమికల్స్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (SPIC) ఎరువులూ, రసాయనాల తయారీలో భారతదేశంలోకెల్లా పెద్ద సంస్థగా పేరొందింది. ఆ సంస్థకు ఎక్సిక్యూటివ్ డైరక్టర్ (టెక్నికల్)గా వున్నారు శ్రీ మల్లాది హనుమంత అవధాని.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో నాయకులుగానే గాక, మంచి రంగస్థల కళాకారుడిగాకూడా పేరొందిన కీ॥శే॥ మల్లాది దేవేంద్రుడుగారి కుమారుడు శ్రీ అవధాని. తెనాలి వీరిది.

ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో 11 సంవత్సరాలు పనిచేశాక, SPIC ప్రారంభ దశలో వుండగానే అందులో చేరి ఇప్పటి వున్నత స్థానానికి చేరుకొన్నారు శ్రీ అవధాని.

'జీవితంలో తాము సాధించేందుకు ఒక లక్ష్యం ఏర్పరచుకొని, ఆ లక్ష్య సాధనలో కృషిచేస్తూనే, అవకాశమున్న మేరకు ఇతరులకు చేయగలిగినది చేయడం ప్రతి మనిషి కర్తవ్యం' అనిభావిస్తున్న శ్రీ అవధాని చాలా చిన్నవయసులోనే, కోనసీమలో కలరా నిర్మూలనకు వెళ్ళిన 'మెడికల్ రిలీఫ్ యూనిట్'లో సభ్యుడిగా వెళ్ళారు. 'ఆ సంఘటన నాపై విపరీతమైన ప్రభావాన్ని కలుగజేసింది. సంఘసేవలో లభించే ఆనందం అప్పుడే తెలిసింది' అన్నారు ఆయన. SPIC నగర్ లైన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నో సంఘసేవా కార్యక్రమాలు చేపట్టి నిర్వహించారు శ్రీ అవధాని.

ఆర్థికంగా నేను వెనుకబడినవారికీ, ప్రకృతి భీభత్సాలకులోనై దెబ్బతిన్నవారికీ చేయవలసిన సాయం 'డబ్బురూపేణా'వుండకూడదని భావిస్తున్నారీయన. 'కేవలం తాత్కాలికంగా సహాయం అందించడంకాక ఆయా ప్రజలు స్వయంశక్తితో జీవనం కొనసాగించేలా వారికి మార్గాలు కల్పించాలి. వారి రిలీఫ్‌కోసం చేసే ప్రయత్నాల్లో వారినికూడా పాల్గొనేలాచెయ్యాలి' అంటారీయన. యువతరంకి తమ సందేశంగా ఇలా అన్నారాయన "సరైన గోల్ ఎన్నుకోవాలి. ఆ గోల్ చేరుకొనే ప్రయత్నంలో ఎదురయ్యే చిక్కులను ధైర్యంగా అధిగమించి ముందుకు సాగాలి. అవకాశాలు రాలేదని ఒకర్ని నిందించి లాభంలేదు. ఒకర్ని నిందించి తృప్తిపొందే ప్రయత్నంకన్నా, మనం సాధించేందుకు ప్రయత్నం చేయడమే మంచిది."

శ్రీ అవధాని, జపాన్, యు.కె., జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం, ఇంకా మరికొన్ని దేశాలు పర్యటించారు.

విపరీతమైన పని వత్తిడిలో వుంటూకూడా, ఎన్నో సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటూ, ఆ పరంగాకూడా కృషిచేస్తున్న శ్రీ అవధాని కేవలం ఆశయాలు కలిగి వుండటమేగాక, ఆ ఆశయాలకు ఆచరణరూపం కల్పిస్తున్న వ్యక్తిగా నిలుస్తున్నారు.

—పి. సరళా సూర్యారావు

సినిమా

దాసరి స్వంత చిత్రం

దర్శకుడు దాసరి నారాయణరావు తారక ప్రభు పతాకం క్రింద నిర్మిస్తున్న 'శివ రంజని' చిత్రంలో జయసుధతో పాటు, జయసుధ సోదరి సుభాషిణి ఒక ముఖ్య పాత్రలో నటిస్తోంది. సుభాషిణికి జంటగా హరి ప్రసాద్ నటిస్తున్నాడు. మోహన్‌బాబు, నిర్మల, గోకిన రామారావు, మాడా, కె. వి. చలంకూడా నటిస్తున్నారీ చిత్రంలో. కృష్ణం రాజు, మురళీమోహన్, అల్లు రామలింగయ్య అతిధులుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం దాసరి నారాయణరావు నిర్వహిస్తున్నారు. నిర్వహణ: కె. బసవయ్య.

'కటకటాల రుద్రయ్య'లో జయచిత్ర, రామకృష్ణ





'రాముడు-రంగడు'లో కృష్ణంరాజు, ప్రభ, సంగీత

మృణాల్ సేన్ రావు!

కాకపోతే మృణాల్ సేన్ రెడ్డి....అదీ కాక పోతే మృణాల్ సేన్ చౌదరి....ఎలా అయినా అనవచ్చు. ఇంతకీ అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఆ దర్శకుడు తెలుగు వారికి అంత దగ్గరయ్యాడు. తెలుగు నిర్మాతలు హిందీలో నిర్మించిన చిత్రం మృగయా ఈయన దర్శకత్వంలోనే తయారై అంతర్జాతీయ ప్రశంసలన్నందుకొంది లోగడ. ఇప్పుడు నిర్మాత పరంధామ రెడ్డి, మృణాల్ సేన్ దర్శకత్వంలో నిర్మించిన 'ఒక ఊరి కథ'—మన ఊళ్ళో రాకుండానే దేశం దాటిపోయి అక్కడెక్కడో కార్లోవాయి వారి ఫిలిం ఫెస్టివల్‌లో జ్యూరీచేత ప్రశంసపొంది 'తెలుగు చిత్రాన్ని' ఇంటర్నేషనల్ సీన్‌లో ప్రవేశ పెట్టింది. కంగ్రాచ్యులేషన్స్ టు ది డైరెక్టర్ అండ్ ప్రొడ్యూసర్.

ప్రేమ - పగ

బి. వి. ప్రసాద్ దర్శకత్వంలో నటుడు బాలయ్య కథ సమకూర్చి, సమర్పిస్తున్న [illegible]

మోహన్, సత్యనారాయణ, ప్రభాకర రెడ్డి, అల్లు రామలింగయ్య, మాడా, మిక్కిలినేని, సత్యేంద్రకుమార్, సారథి, సావిత్రి, లత, రూప మొదలగువారు నటిస్తున్నారు. సంగీతం: ఎస్.రాజేశ్వరరావు. అలపర్తి సూర్యనారాయణ, మన్నవ వెంకట్రావు ఈ చిత్రనిర్మాతలు.

అయ్యబాబోయ్!

ఇటీవల చిత్ర నిర్మాణం చూస్తూంటే అలాగే అన్పిస్తోంది. మల్టీస్టారర్స్ పెరిగిపోతున్నాయి. ఒక హీరో, ఒక హీరోయినూ కాదు....హీరోలూ, హీరోయిన్లూ వుంటున్నారు చిత్రాల్లో. ఈ రకమైన చిత్రాలు హిందీలో ఎక్కువగా తయారవుతున్నాయి. ఇటీవలనే ఒక ఆంగ్ల వార పత్రికలో (సినిమా పత్రిక) ఆరు పేజీల ప్రకటనతో ఒక చిత్రం ఎనౌన్స్ చెయ్యబడింది. ఆ ప్రకటనచూసి నిజంగానే అయ్యబాబోయ్ అన్పించింది—ఆచిత్రం ఏక్ దో తీన్ చార్....దర్శకుడు విజయానంద్....నటీనటులు దేవానంద్, ధర్మేంద్ర, వినోద్ ఖన్నా, రిషికపూర్, రాఖీ, హేమామాలిని, పర్వీన్ బాబి, టీనా [illegible]

శాంతిశ్రీ పిక్చర్స్ చిత్రం

జూలై 16 నుంచి ఆగస్టు 20 లోపు చిత్రీకరణ పూర్తిచేసుకోబడేలా షెడ్యూలు చేయబడ్డ శాంతిశ్రీ పిక్చర్స్‌వారి చిత్రంలో శ్రీధర్, నారాయణరావు, కాకరాల, నిర్మల, మొదలగువారు నటిస్తున్నారు. నాయకిగా కొత్తతారను పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు-పాటలు ఆత్రేయ సమకూర్చారు. కె. ఎన్. ప్రకాశరావు, డి. ప్రసాదరావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే—దర్శకత్వం: ఏ. మధుసూదనరావు.

'తుఫాన్ మెయిల్'లో మంజుల



కేవలం రంగులు చాలవు!

చిత్ర నిర్మాణంలో పూర్తిగా మార్పొచ్చిందనీ రంగుల చిత్రాలు చూడటానికి అలవాటుపడ్డ ప్రేక్షకులు నలుపు-తెలుపు చిత్రాలను చూడలేరనీ ఒక వాదన వుంది. నిజానికి ఇటీవలగా విజయవంతమైన చిత్రాల జాబితా పరిశీలిస్తే ఈ వాదన నిలవదని తోస్తోంది. సీతామాలక్ష్మి, పొట్టేలు పున్నమ్మ, బొమ్మరిల్లు, మరోచరిత్ర, చలిచీమలు ఇవన్నీ నలుపు తెలుపు చిత్రాలే. ప్రేక్షకులు అధికంగా ఆదరించిన చిత్రాలే-రంగుల్లోనే కాదు, ఆయా చిత్రాల కథలో వుంటుంది బలం, ఆ కథను ఆసక్తికరంగా తెరపై దర్శకుడు చెప్పే తీరులో వుంటుంది బలం. నలుపు తెలుపులోనైనా నటీనటుల ప్రతిభా, ప్రేక్షక శ్రీయన్ను ప్రతిభా తోడై చక్కని చిత్రం తయారైన నాడు, ఆ చిత్రాన్ని ప్రేక్షకులు విధిగా అభిమానిస్తారు, ఆదరిస్తారు.

సింహబలుడు

ఈ చిత్రం విశేషాలు విలేఖరుల కంటే దూరాన వున్న ప్రేక్షకులకే ఎక్కువగా తెలుస్తున్నాయా అన్నంత ఆసక్తి చూపిస్తున్నారు ప్రేక్షకులు. ఈ చిత్రానికి బాక్సాఫీసు దగ్గర విజయానికి గ్యారంటీ చేస్తున్న కే. రాఘవేంద్రరావు దర్శకత్వం వుంది. ఇందులో ఎన్. టి. రామారావు, వాణిశ్రీ, సత్యనారాయణ, అంజలీదేవి, మాడా, జయమాలిని నటిస్తున్నారు. త్వరలో విడుదల కాబోతున్న ఈ చిత్రానికి డి.వి. నరసరాజు రచన, ఎం.ఎస్. విశ్వనాథన్ సంగీతం, సమకూర్చారు. దాట్ల శ్రీరంగరాజు తిరుపతి ప్రొడక్షన్స్ పేరిట నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని డా॥ డి.వి.ఎస్.రాజు సమర్పిస్తున్నారు.

నేపాల్‌లో తెలుగు చిత్రం!

తిరుపతి పిక్చర్స్‌వారు నిర్మిస్తున్న సాహసవంతుడు చిత్రంలో ఎన్. టి. రామారావు

వాణిశ్రీ నాయకానాయికలు. కె. విద్యాసాగర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కె. బాపయ్య దర్శకుడు. నేపాల్ తార లక్ష్మీశ్రేష్ఠకూడా నటిస్తున్న ఈ చిత్రంలో కొంతభాగం నేపాల్‌లోనే చిత్రీకరించబడింది. అక్కడి డ్యాన్సర్స్‌తోనే ఒక నేపాలీ నృత్యం ఇంద్ర జాత్రకూడా ఈ చిత్రంకోసం చిత్రీకరించబడింది.

పదహారేళ్ళ వయసు!


స్వీట్ సిక్స్‌టీన్ అంటారు ఆంగ్లంలో. తీయని అనుభూతులకు ఆలవాలమయిన వయసది. పదహారేళ్ళ ప్రాయం. చిన్నతనాన్ని వీడి యవ్వనపు తొలిదశలో ప్రవేశించే సరిహద్దు. ఆ హద్దు దాటుతూండగానే లోకం చిత్రంగా ఎంతో మారిపోయినట్లనిపిస్తుంది ప్రతి ఒక్కరికీ. ఆడా, మగా ఆకర్షణలకు నాంది (ఎక్కువ మందిలో) ఆ వయసు, ఉత్సాహం, ఉద్రేకం పరవళ్ళు త్రొక్కే వయసు. ఆ వయసులో ప్రవేశించిన ఓ ఆడపిల్ల ఈ చిత్రకథకు కథానాయకి. ఆ పాత్ర పోషిస్తున్నది శ్రీదేవి. ఒక విలక్షణమైన పాత్రలో కన్పిస్తాడు చంద్రమోహన్ మనకు. మోహన్‌బాబు, రవికాంత్, జి. నిర్మల, అప్పారావు, సూర్యచంద్రరావు, హలం, తక్కిన ముఖ్యపాత్రధారులు. దర్శకుడు రాఘవేంద్రరావు చేతిలో రూపు దిద్దుకొంటున్న ఈ చిత్రం రాజలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ వారిచే నిర్మించబడుతోంది. సత్యానంద్ మాటలూ, వేటూరి పాటలూ, చక్రవర్తి సంగీతం వున్నాయి యీ చిత్రంలో. కె. యస్. ప్రకాష్ ఫోటోగ్రఫీ నిర్వహించారు. దామిసెట్టి నళినీ రంజనరావు సమర్పించే ఈ చిత్రానికి నిర్మాతలు: అంగర సత్యం, మిద్దె రామారావు. అంగర లక్ష్మణరావు.

225 వ రోజు పండుగ!

దర్శకుడు దాసరి నారాయణరావు చిత్రాలలో వైవిధ్యమేకాదు, చిత్ర విజయోత్సవంలో కూడా వైవిధ్యం కనపడుతోంది. 'చిల్లర కొట్టు చిట్టెమ్మ'—ఆంధ్రదేశంలో బహుళ ప్రచారం పొందిన నాటకం. అదే పేరుతో దాసరి దర్శకత్వంలో నిర్మించబడ్డ చిత్రం విజయవంతమై శతదినోత్సవాలు చేసుకోవటమే కాక, హైదరాబాదు నగరంలో 225 రోజులు ప్రదర్శించబడింది. ఆ సందర్భంలో ఏర్పాటుచేసిన విజయోత్సవానికి దాసరే దర్శకుడు (కంపేరర్). దర్శకుడు పి. పుల్లయ్య అధ్యక్షుడిగా, ఎన్.టి. రామారావు ముఖ్య అతిథిగా ఈ సభలో పాల్గొన్నారు. అక్కినేని నాగేశ్వరరావు బహుమతీ ప్రదానం చేశారు. అధ్యక్షుడు ఉపన్యాసమిస్తూ

'కుమార రాజా' జయప్రద





భారతంలోని ముఖ్యమైన దృశ్యాలను బొమ్మలుగా ప్రదర్శించి విమర్శకుల ప్రశంస పొందిన కళాకారిణి ఎన్. శారదాదేవి. ఆమె నిర్వహిస్తున్న డాల్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆగస్టు చివరి రెండు వారాలలో 'శ్రీనివాసకల్యాణం'లోని దృశ్యాలను బొమ్మల ద్వారా ప్రదర్శించబోతున్నారు. పై చిత్రం డాల్స్ఆఫ్ ఇండియా ప్రదర్శించిన బొమ్మల దృశ్యాలలో ఒకటి.

ఈ చిత్రంలో కొట్టొచ్చినట్లు కన్పించిన తెలుగు తనం తనని ముగ్ధుణ్ని చేసిందన్నారు. (చాలా తెలుగు చిత్రాలలో ఆ తెలుగుతనం కన్పించక పోవడం నిజంగా బాధ కలిగించే విషయమే.) నటుడేకాక మంచి దర్శకుడుకూడా అయిన ఎన్. టి. రామారావు చిల్లరకొట్టు చిట్టెమ్మ చిత్రాన్ని దర్శకుని దృష్టితో విశ్లేషించి ప్రసంగించారు. అక్కినేని నాగేశ్వరరావు ఈ చిత్రాన్ని ప్రశంసించి, ఆ సందర్భంలోనే తెలుగు పరిశ్రమ ప్రగతి పథంలోనే ఉందని అభిప్రాయపడుతూ, 'ఒక ఊరి కథ'కు ఇంటర్నేషనల్ రికగ్నిషన్ రావడాన్ని ప్రస్తావించి 'తెలుగు సినిమా అంత ర్జాతీయ చిత్రరంగంలో కాలిడింది' అన్నారు. పరిశ్రమతో చిరకాలం సంబంధం వున్నవాటిగా పరిశ్రమకు లభించే ప్రతి విజయమూ తమకు సంతోషం కల్గిస్తాయన్నారు. నిర్మాత ఆర్.ఎస్. రాజు వందన సమర్పణ చేశారు.

మంచి చిత్రాలు కావాలంటే....?

....ప్రేక్షకులే పూనుకోవాలంటున్నారు ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు. అసభ్యకరమైన చిత్రాలు రాకుండా వుండా లంటే తెలుగు మహిళలు నడుంకట్టి అలజడి చెయ్యాలి అంటున్నారు నటి జమున. తెలుగులో ఎక్కువగా మంచి చిత్రాలు రాకపోవడానికి కారణం ప్రేక్షకులే నంటే మేం అంగీకరించ లేము. ప్రేక్షకుల బలహీనతలపై ఎక్స్ప్లాయి టేషన్ జరుగుతోంది. ఇది చాలా సున్నితమైన

'కాదుసుమా కథ'
శరత్‌బాబు, కన్నడ మంజుల





బ్రాంచీలు హైదరాబాద్, సికింద్రాబాద్, ఏలూరు, కాకినాడ, గుడివాడ, విజయవాడ

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024, & Printed by D. Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001